
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 144
గురువారం 14-8-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'




ఓట్ ఫైట్

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలంటున్న జర్నలిస్ట్ పూనమ్ -13లో



భారత్ వృద్ధిని ఆపలేవు..

అమెరికా టారిఫ్‌లపై ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అభిప్రాయం -15లో



సమగ్ర సవరణ సబబే

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు చేపట్టడం సరైన ప్రక్రియేనని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది.

వివరాలు 6లో ▸



నా ప్రాణాలకు ముప్పు

సావర్కర్‌పై చేసిన వ్యాఖ్యల కేసులో తన ప్రాణాలకు ముప్పు ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు.


వివరాలు 6లో ▸



ట్రంప్, పుతిన్ ఏకాంత చర్చలే!

ట్రంప్, పుతిన్ ఈ నెల 15న అలస్కాలో భేటీ కాబోతున్నారు. ఈ భేటీ అత్యంత గోప్యంగా జరగబోతోందని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి.

వివరాలు 6లో ▸



వచ్చే నెలలో అమెరికాకు మోదీ!

ప్రధాని మోదీ సెప్టెంబర్‌లో అమెరికాలో పర్యటించే అవకాశం ఉంది. యూఎన్‌జీఏ సమావేశంలో ప్రసంగిస్తారని సమాచారం.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

'నీట్' తొలి విడతలో 30,608 మందికి సీట్లు



నీట్ యూజీ–2025లో ఆలిండియా కోటా తొలి విడత కౌన్సెలింగ్‌లో వివిధ కోర్సుల్లో 30,608 మంది విద్యార్థులకు ఎంసీసీ సీట్లను కేటాయించింది. ఈ వివరాలను కేంద్రం బుధవారం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.

- వివరాలు 12లో▶


ఒక్కరోజులోనే వీసా జారీ



ఇకపై అన్ని పత్రాలు సమర్పిస్తే ఒక్క రోజులోనే వీసాను పొందేందుకు వీలుగా కేంద్రం నిబంధనలను సరళతరం చేసింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ బుధవారం విదేశీ విభాగ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో దీనిపై చర్చించారు.

- వివరాలు 3లో▶

తెరపైకి 4 ఇంట్రాలింక్ ప్రాజెక్టులు



సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ విషయమై ఏపీ 4 కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెచ్చింది. చింతలపూడి ఎత్తిపోతలు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వైఎస్సార్ పల్నాడు కరువు నిర్మూలన ప్రాజెక్టు, గుండ్రేవుల రిజర్వాయర్.. ఈ 4 కొత్త ఇంట్రా స్టేట్‌లింక్ ప్రాజెక్టులను ఎన్‌డబ్ల్యూడీఏకి ప్రతిపాదించింది.

- వివరాలు 12లో▶

ఎందుకంత దూకుడు?



రంగారెడ్డి జిల్లా ఖానామెట్ సర్వే నంబర్ 37, 38/1లో 1.07 ఎకరాల భూమిపై ఎందుకంత దూకుడుగా వెళ్తున్నారని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను హైకోర్టు ప్రశ్నించింది. సరిహద్దుల్లో యుద్ధానికి వెళ్తున్నట్లు వాహనాలకు ఆ రంగులేంటని అడిగింది.

- వివరాలు 16లో▶

వారి సభ్యత్వాలు రద్దు!

ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల నియామకంపై సుప్రీం సంచలనాత్మక తీర్పు

- గవర్నర్ కోటా నామినేషన్లపై మధ్యంతర ఉత్తర్వు సవరణ
- మధ్యంతర ఉత్తర్వు మేరకు తీసుకున్న చర్యలన్నీ రద్దయినట్టేనన్న ధర్మాసనం
- భవిష్యత్ నామినేషన్లు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టీకరణ
- తదుపరి విచారణ సెప్టెంబర్ 17కు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: గవర్నర్ కోటాలో తెలంగాణ శాసనమండలికి ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల సభ్యత్వాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. గతేడాది ఆగస్టు 14న సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వును ధర్మాసనం తాజాగా సవరించింది. మధ్యంతర ఉత్తర్వు మేరకు తీసుకున్న చర్యలు ఏవైనా రద్దయినట్టేనని పేర్కొంది. మధ్యంతర ఉత్తర్వులోని.. 'తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధిస్తున్నాం..' అనే వాక్యాన్ని తొలగిస్తున్నట్లు తెలిపింది. దీంతో 2024 ఆగస్టు 16న ప్రొఫెసర్ కోదండరాం, అమేర్ అలీఖాన్‌లు ఎమ్మెల్సీలుగా చేసిన ప్రమాణ స్వీకారాలు రద్దయినట్టయ్యింది. గవర్నర్ కోటాకు సంబంధించి భవిష్యత్తులో జరిగే నామినేషన్లు సుప్రీంకోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల నామినేషన్‌ను సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌పై తాజాగా విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం మధ్యంతర తీర్పు ఇచ్చింది. వారు ఎమ్మెల్సీలుగా మండలిలో తిరిగి ప్రవేశించాలంటే మళ్లీ సిఫారసు చేయబడాలని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉండకూడదనే వాదనను తిరస్కరిస్తూ, 'అప్పట్లో పిటిషనర్ల పేర్లు తిరస్కరించినప్పుడు కూడా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగానే ఉన్నాయి..' అని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది.

సిఫారసులు.. తిరస్కరణ.. సిఫారసులు

2023 జూలైలో అప్పటి సీఎం కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం, దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణల పేర్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు సిఫారసు చేసింది. అయితే సెప్టెంబర్‌లో అప్పటి గవర్నర్

మిగతా 3వ పేజీలో ▶

సుప్రీం తీర్పు బీజేపీ, కాంగ్రెస్‌కు చెంపపెట్టు
బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వ్యక్తుల పోరాటం కాదు.. రాజ్యాంగ పోరాటం
బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శ్రవణ్

సభ్యత్వం రద్దయినట్లు ప్రచారం చేస్తున్నారు
కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

3లో



మీరు ప్రజలను మోసం చేశారు కాబట్టే, ప్రజలు మీకు ఓటు వేయరు కాబట్టే, విచ్చలవిడిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ప్రతి బూత్‌కు సంబంధించిన వెబ్ కాస్టింగ్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఇచ్చే ధైర్యం మీకుందా? పోలింగ్ బూత్ ఆవరణల్లో సీసీ ఫుటేజ్ బయట పెడతారా? ఆ ధైర్యం ఉందా చంద్రబాబూ?

- మాజీ సీఎం వైఎస్ జగన్

ఏజెంట్లే లేకుండా ఎన్నికలా?

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ

ఏపీలో టీడీపీ దుర్మార్గాలను సాక్ష్యాధారాలతో కడిగిపారేసిన వైఎస్ జగన్


- ఈ ఉప ఎన్నికలను రద్దు చేసి.. కేంద్ర బలగాల పర్యవేక్షణలో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని డిమాండ్.. దీనిపై న్యాయ పోరాటం చేస్తాం
- చంబల్ లోయ బందిపోట్లను మరిపించే రీతిలో దొంగ ఓట్లు వేసుకున్నారు
- ఏజెంట్లే లేకుండా ఎన్నికలు నిర్వహించడం చరిత్రలో ఇదే తొలిసారి
- పోలీసులే దగ్గరుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలను ప్రోత్సహించారు
- జిల్లా కలెక్టర్ సైతం దగ్గరుండి దొంగ ఓట్లు వేయించారు
- ఏపీలో ప్రజాస్వామ్యం పూర్తిగా లేదనడానికి ఈ ఉప ఎన్నికలే నిదర్శనం
- విచక్షణాధికారాలున్నా.. అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో ఎస్‌ఈసీ విఫలం

12లో

అప్పుల కోసమే కొత్త డిస్కం

2030కి రూ.32 వేల కోట్లు అవసరం

- కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు, బలోపేతానికి నిధుల కొరత
- విద్యుత్ పంపిణీ సంస్థల భవిష్యత్ ప్రణాళిక వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) ఏర్పాటుపై ఆ శాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఆధునీకరణ, పంపిణీ వ్యవస్థ బలోపేతమే ప్రధాన లక్ష్యాలుగా ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఉచిత విద్యుత్‌ను ఉద్దేశించి డిస్కం ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని ఇటీవల ప్రభుత్వం వెల్లడించింది. అయితే..ఇదెలా సాధ్యమని డిస్కం అధికారులు అంటున్నారు. ఉచితాలు ప్రతీ డిస్కం పరిధిలో ఉంటాయని, వీటిని ఒకే డిస్కం పరిధిలోకి తేవడం ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ వద్దకు తీసుకెళ్లినట్టు అధికారులు తెలిపారు. ఉచితాల విషయాన్ని తర్వాత పరిశీలిద్దామని, ముందుగా డిస్కం ఏర్పాటుపై ఆర్థిక పరమైన నివేదిక రూపొందించాలన్నారు. నిధుల సమీకరణపై దృష్టి పెట్టాలని సూచించారు. దీనిని బట్టి

మిగతా 5వ పేజీలో ▶

లైఫ్ ట్యాక్స్ శ్లాబుల పెంపు

అదనపు ఆదాయం లక్ష్యంగా సర్కారు నిర్ణయం

వాహనాల ఫ్యాన్సీ నంబర్ల ధరలు కూడా భారీగా పెంపు!



సాక్షి, హైదరాబాద్: కొత్త వాహనాల కొనుగోలు సమయంలో చెల్లించే జీవితకాల పన్ను (లైఫ్ ట్యాక్స్) మొత్తాన్ని ప్రభుత్వం సవరించింది. వాహన ధరల ఆధారంగా ఇప్పటివరకు అమలులో ఉన్న శ్లాబులను పెంచటం ద్వారా వీలైనంత మేర పన్ను ఆదాయం పెరిగేలా నిర్ణయం తీసుకుంది. ఆ సవరింపునకు సంబంధించి నోటిఫికేషన్ ఉత్తర్వు జారీ చేసింది. ఇది గురువారం నుంచి అమలులోకి రానుంది. దీంతో పాటు వాహనాల ఫ్యాన్సీ నంబర్ల ధరలను కూడా భారీగా పెంచాలని నిర్ణయించింది. ఆ పెంపు మొత్తాన్ని వెల్లడిస్తూ అభ్యంతరాలుంటే 30 రోజుల్లోగా తెలపాల్సిందిగా నోటిఫికేషన్ జారీ చేయటం విశేషం. రవాణా శాఖ ద్వారా ఆదాయాన్ని పెంచుకునే యత్నంలో ఉన్న ప్రభుత్వం.. ఇటీవలే రిజిస్ట్రేషన్ చార్జీలను సవరించిన విషయం తెలిసిందే.

గతంలో 2..ఇప్పుడు 4

వాహనాల ధరల ఆధారంగా పన్ను మొత్తాన్ని నిర్ధారించే శ్లాబులు అమలులో ఉంటాయి. ఉదాహరణకు ద్విచక్రవాహనాలకు సంబంధించి పరిశీలిస్తే.. ప్రస్తుతం వాహనం ధర రూ. 50 వేల లోపు, వాహనం ధర రూ.50 వేల కంటే ఎక్కువ.. ఇలా రెండు శ్లాబులు మాత్రమే అమలులో ఉన్నాయి. ఆ రెండు శ్లాబులకు నిర్ధారిత జీవితకాల పన్ను (వాహనం విలువలో నిర్ధారిత శాతం) కూడా ఖరారై ఉంది. తాజాగా వాహన ధర శ్లాబులను పెంచారు. వాహన విలువ రూ.50 వేల లోపు, రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు , రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు, రూ.2 లక్షల కంటే ఎక్కువ.. ఇలా శ్లాబుల సంఖ్యను నాలుగుకు పెంచారు.

శ్లాబుల వివరాలు 16లో

నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

- ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- సౌకర్యవంతంగా ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- భూధార్ నంబర్ల కేటాయింపునకు ప్రణాళికలు రూపొందించాలి
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సమీక్షలో సీఎం వెల్లడి

3లో



నా రిటైర్మెంట్‌లోపు పరిష్కారం చూపాలి

కంచ గచ్చిబౌలి భూముల కేసు విచారణలో సీజేఐ జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలు

- భూముల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామన్న ప్రభుత్వం
- పర్యావరణాన్ని కాపాడే చర్యలు చేపడితే.. అన్ని ఫిర్యాదులు ఉపసంహరిస్తామన్న ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: పర్యావరణ పరిరక్షణ చర్యల విషయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను స్వాగతిస్తున్నామని దేశ సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం చేసే అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని.. పర్యావరణ పరిరక్షణను పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పింది. 'ఏది ఏమైనా నా రిటైర్మెంట్‌లోపు కంచ గచ్చిబౌలి కేసులో పరిష్కారం చూపాలి'అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తేల్చిచెప్పారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బుధవారం జస్టిస్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, మేనక గురుస్వామి, కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, మరో పిటిషనర్

మిగతా 3వ పేజీలో ▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates
12 Eggs Retail Rate ₹ 70
Ex Farm Live Bird 100 kg
Dressed with Skin 177 kg
Retail Live Bird 122 kg
Skin Less 201 kg
Issued in the interest of consumers

ఇదండీ వరస



మామూలు సమయంలోనే కనపడరు.. ఇక ఇప్పుడొచ్చి ఎలా ఆదుకుంటారనుకుంటున్నావ్!

వాన జోరు.. వరద హోరు



మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం వీగాంలో చెరువును తలపిస్తున్న పత్తి చేను

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు

- అలుగు పోస్తున్న చెరువులు.. పొంగి పొర్లుతున్న వాగులు
- వంతెనలు, రహదారుల పైనుంచి ప్రవహిస్తున్న వరద
- రాకపోకలకు అంతరాయం.. నీట మునిగిన పంటలు
- నిండుకుండలా రిజర్వాయర్లు.. పలు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత

సాక్షి, నెట్‌వర్క్: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం, ఉపరితల ఆవర్తనం, రుతుపవనాలు చురుకుగా మారడంతో రాష్ట్రంలో వానలు ఊపందుకున్నాయి. రెండు, మూడ్రోజులుగా హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే పలు రిజర్వాయర్లు నిండిపోయాయి. ప్రాజెక్టుల గేట్లు ఎత్తారు. మరోవైపు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగు పారుతున్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలపై వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. పంట చేలు ముంపునకు గురయ్యాయి.

ఉమ్మడి ఆదిలాబాద్‌లో భారీ వర్షం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగాయి. మంచిర్యాల జిల్లా భీమిని మండలంలో బుధవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురిసాయి. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు రెండు గేట్లు, స్వర్ణ ప్రాజెక్టు ఒక గేటు, కుమురంభీం ప్రాజెక్టు ఏడు, వట్టివాగు ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తి దిగువకు అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం మత్తడివాగు గేటు ఎత్తారు. ఆసిఫాబాద్ మండలం తూంపెల్లి వాగు, నంబాల వాగు పొంగడంతో 13 గ్రామాలకు రాకపోకల్లో అంతరాయం కలిగింది. అలాగే కెరమెరి మండలం అనార్‌పల్లి వాగు, బూరుగూడ పెంచికల్‌పేట ఎర్రవాగు లోలెవల్ వంతెనపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. నెన్నెల మండలం లంబాడి తండా ఎర్రవాగుపై ఉన్న తాత్కాలిక వంతెన తెగిపోయింది. భీమిని మండలం రాజారాం, కర్జి భీంపూర్‌లో రోడ్డు కొట్టుకుపోయింది. కోటపల్లి మండలాల్లో వరద నీరు పంట చేన్లకు చేరింది. మంచిర్యాల, బెల్లంపల్లి పట్టణాల్లో

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

తెలంగాణకు అదనపు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి హోంమంత్రి అమిత్‌షా భరోసా



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు తెలంగాణలో మరిన్ని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులోకి తీసుకొస్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో బుధవారం అమిత్‌షాతో ఫోన్‌లో మాట్లాడినట్లు కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పార్టీ ఆస్తుల వివరాలు వెంటనే పంపండి

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఆస్తుల వివరాలను వెంటనే రాష్ట్ర కార్యాలయానికి పంపాలని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ నేతలను కోరారు. గాంధీభవన్ నుంచి వచ్చే ప్రత్యేక ఫార్మాట్‌లో ఈ వివరాలను నమోదు చేసి పంపించాలని సూచించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, జనహిత పాదయాత్ర, రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు తదితర అంశాలపై బుధవారం డీసీసీ అధ్యక్షులు, ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జులతో ఆయన జూమ్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్న ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మహేశ్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వెంటనే పార్టీ కమిటీలు వేయాలని నేతలను ఆదేశించారు. మండల పార్టీ కమిటీలను నెలా ఖరులోగా పూర్తిచేయాలని, గ్రామ కమిటీలను సెప్టెంబర్ 15 లోగా నియమించి పంపాలన్నారు. ఈనెల 24 నుంచి రెండో విడత జనహిత పాదయాత్ర ప్రారంభమవుతున్నందున ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములయ్యేలా ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నాయకత్వం ఏర్పాట్లు చేయాలని కోరారు.

'ఓట్ల దొంగలు.. గద్దె దిగండి'

ఏఐసీసీ పిలుపు మేరకు మూడు దశల్లో టీపీసీసీ ఆధ్వర్యంలో ఉద్యమం

సాక్షి, హైదరాబాద్: ఓట్ల చోరీ వ్యవహారాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఏఐసీసీ రూపొందించిన కార్యాచరణ మేరకు తెలంగాణలో మూడుదశల ఉద్యమానికి టీపీసీసీ పిలుపునిచ్చింది. 'ఓట్ల దొంగలు..గద్దె దిగండి' అనే నినాదంతో నిర్వహించనున్న ఈ ఉద్యమం తొలిదశలో భాగంగా గురువారం రాత్రి 8 గంటలకు అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తామని గాంధీభవన్ బుధవారం వెల్లడించింది. రెండోదశలో ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 7వరకు రాష్ట్ర స్థాయి ప్రదర్శనలు చేయనున్నారు. బీజేపీ–ఈసీ కుమ్మక్కు గురించి వివరించనున్నారు. చివరిదశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు నెలరోజుల పాటు గడప గడపకూ తిరిగి సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపట్టనున్నారు.

దొంగ ఓట్లపై సీఈవోకు రఘునందన్‌రావు ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: ఐలాపూర్ అనే ఒక చిన్న గ్రామంలో 700కు పైగా ఓట్లు పెరగడంపై (దొంగ ఓట్ల నమోదుపై) రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డికి మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు, ఐలాపూర్ మాజీ సర్పంచ్ కూర్మ మల్లేశ్ ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలోని పోలింగ్ స్టేషన్లు 126, 126 ఏలలోని బోగస్, నకిలీఓట్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం ఈ మేరకు సీఈవోకు వారు వినతిపత్రం అందించారు.

సాక్షి
మీకు సాక్షి
దినపత్రిక అందడంలో
ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి
బదులుగా ఇతర దినపత్రికలు
వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు
ఉ. 7.00 గం.ల నుండి
రా. 8.00 గం.ల లోపు
తెలుపగలరు. వెంటనే తగిన
చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం
1800 425 9899

మనువాడేందుకు..

గన్నేరువరం: వరుణుడు కన్నెర్ర చేసినా కల్యాణం మాత్రం నిర్విఘ్నంగా జరిగింది. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలో భారీ వర్షాలు కురిశాయి. గన్నేరువరం పెద్ద చెరువు ఉధృతంగా అలుగు పారుతోంది. పోలీసులు గన్నేరువరం మండలం నుంచి కరీంనగర్‌కు రాకపోకలు నిలిపివేశారు. కాగా.. గన్నేరువరానికి చెందిన టీకు భాగ్యతో.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన కొమరమల్లుకు బుధవారం వివాహం జరగాల్సి ఉంది. పెళ్లికొడుకు, కుటుంబ సభ్యులు జగిత్యాల నుంచి వాహనాల్లో రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి మీదుగా వచ్చారు. గన్నేరువరం పెద్ద చెరువు మత్తడి వద్ద రాకపోకలను నిలిపివేశారు. ముహూర్తానికి ఆలస్యం అవుతుండడంతో, పెళ్లి బట్టలు, చెప్పులు తడవకుండా.. కాళ్లకు పెట్టిన పారాణి పోకూడదని వరుడిని గ్రామస్తులు భుజాలపై ఎత్తుకుని అలుగు దాటించి మండపానికి చేర్చారు.



పెళ్లి కొడుకు కొమరమల్లును భుజాలపై తీసుకొస్తున్న గ్రామస్తులు

మరో జన్మ ఇచ్చేందుకు..

బెల్లంపల్లి (తాండూర్): మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన నిండు గర్భిణి కొడిపె యమునకు వరద కష్టాలు ఎదురయ్యాయి. భారీ వర్షానికి గ్రామ శివారులోని చెక్‌పోస్టు వద్ద ఉన్న కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి. బుధవారం ఆమెకు పురిటి నొప్పులు రావటంతో కుటుంబ సభ్యులు వాగు దాటించడానికి ప్రయత్నించినా పరిస్థితులు అనుకూలించలేదు. 108 అంబులెన్స్ వచ్చినా కల్వర్టు మీదుగా గ్రామంలోకి వెళ్లడానికి వీల్లేకుండా పోయింది. దీంతో విషయం తెలుసుకున్న తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తమ సిబ్బందితో ఘటనా స్థలికి వచ్చారు. కల్వర్టు మీదుగా తాడు కట్టి యమునను ఇవతలి వైపు తీసుకొచ్చారు. దాదాపు మూడు గంటలపాటు శ్రమించాల్సి వచ్చింది. చివరకు అంబులెన్స్‌లో ఎక్కించి బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా, యమున మగశిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు.



గర్భిణిని తాడు సాయంతో వరద నీటి నుంచి దాటిస్తున్న పోలీసులు, గ్రామస్తులు



నాగార్జునసాగర్ 26 గేట్ల ద్వారా నీటి విడుదల



సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రం సమీపంలో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వాగు

వాన జోరు.. వరద హోరు

▶ మొదటి పేజీ తరువాయి

రోడ్లపై వరద చేరింది. కలెక్టర్ ముంపు ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మంచిర్యాల జిల్లాలో భారీ వర్షానికి మూడు వేల ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బుధవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. పరిగి, వికారాబాద్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బుధవారం రాత్రి వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కుండపోతగా వర్షం కురిసింది. సరళాసాగర్, రామన్‌పాడు, పోపల్‌దిన్నె రిజర్వాయర్లకు భారీగా వరద కొనసాగింది. ఉమ్మడి జిల్లాలో 350 చెరువులు అలుగు పారుతున్నాయి. వనపర్తి జిల్లా ఊకచెట్టు వాగులో నీటి ఉధృతి పెరిగి ఆత్మకూర్–మదనాపురం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

సంగారెడ్డి అతలాకుతలం

సంగారెడ్డి జిల్లాలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. న్యాల్‌కల్ మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో వరద బ్రిడ్జిపై నుంచి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పంట పొలాలు వరదనీటితో నిండిపోయాయి. ప్రధానంగా పత్తి పంటతోపాటు చెరుకు, మినుము, సోయా, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి.



వనపర్తి జిల్లా మదనాపురం వద్ద ఊకచెట్టువాగు ప్రవహించడంతో నిలిచిన రాకపోకలు

సూర్యాపేట జిల్లాలో..

సూర్యాపేట జిల్లాలోనూ భారీ వర్షపాతం నమోదైంది. పలుచోట్ల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మునగాల మండలంలోని మొద్దులచెరువు, కలకోవ ఊరచెరువు, రేపాల, నర్సింహులగూడెం, ముకుందాపురం తిప్పాయికుంట, ఆకుపాముల నాగులకుంట చెరువులు అలుగు పోస్తున్నాయి. పాలేరు రిజర్వాయర్ నిండు కుండలా మారింది. ఆయకట్టు పరిధిలో భారీ వర్షాలు కురుస్తుండటంతో సాగర్ ఎడమ కాల్వకు బుధవారం నీటి విడుదలను నిలిపివేశారు. కోదాడలో బుధవారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షానికి పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం రాత్రి గుడిబండ రోడ్డులో ఉన్న తులసీనగర్ టౌన్‌షిప్‌లోకి వర్షపునీరు చేరడంతో ఇళ్లలోని వారిని మున్సిపాలిటీ సిబ్బంది జేసీబీతో బయటకు తీసుకొచ్చారు. షిర్డీసాయినగర్‌కు వరద ముప్పు దృష్ట్యా అక్కడ ఉన్న ముస్లిం మైనార్టీ బాలికల పాఠశాల విద్యార్థులను మధ్యాహ్నమే ఖాళీ చేయించి ఇంటికి పంపారు. పలు కాలనీల్లో ఇళ్లు, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి.

మూసీ వంతెనలను పరిశీలించిన అధికారులు

హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాలకు యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో మూసీ పరవళ్లు తొక్కుతోంది. వలిగొండ మండలం బీమలింగం, భూదాన్ పోచంపల్లి మండలం జూలరు–రుద్రవెల్లి వద్ద లో లెవల్ బ్రిడ్జిల పైనుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి ఇతర అధికారులు మూసీ వంతెనలను పరిశీలించారు. భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, బీబీనగర్ మండలాల్లో మూసీ ఆధారిత చెరువులు అలుగులు పోస్తున్నాయి.

వరంగల్ లోతట్టు కాలనీల్లో వరద

వరంగల్‌లో వర్షం తగ్గుముఖం పట్టినా పలు లోతట్టు కాలనీల్లో ప్రవహిస్తున్న వరదనీటి ఉధృతి బుధవారం కూడా తగ్గలేదు. ఎస్‌ఆర్‌ఆర్ తోట, శివనగర్, మైసయ్య నగర్, శాకరాశికుంట, నాగేంద్రనగర్, కాశికుంట కాలనీలు నీటిలో ఉన్నా యి. 12 మోరీల నుంచి బొందివాగు వరకు రహదారిపై నీళ్లు ప్రవహిస్తున్నాయి. శివనగర్‌లో బల్దియా పునరావాస కేంద్రంలో నిర్వాసితులు తలదాచుకుంటున్నారు.




శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 7 గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రాజెక్టులు.. పరవళ్లు

దోమలపెంట/నాగార్జునసాగర్/కేతేపల్లి/ధర్మారం/మదనాపురం: భారీ వర్షాలతో ప్రాజెక్టులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఎగువ నుంచి కృష్ణానదికి వరద పోటెత్తుతుంది.

- శ్రీశైలం ప్రాజెక్టు ఏడు గేట్లు పది అడుగుల మేర పైకి ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.7 అడుగుల నీటిమట్టం వద్ద 202.050 టీఎంసీల నీటి నిల్వ ఉంది.
- ఎగువన శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి 2,30,540 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు మొత్తం 26 గేట్లలో 22 గేట్లను 5 అడుగులు, 4 గేట్లను 10 అడుగులు ఎత్తారు. 2,63,189 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు). ప్రస్తుతం నీటిమట్టం 588.90 అడుగులు (308.7614 టీఎంసీలు)గా ఉంది.
- పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని నంది పంపుహౌస్ నుంచి గోదావరి నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరగడంతో గ్రావిటీ ద్వారా నంది పంపుహౌస్‌లోకి గోదావరి నీళ్లు వస్తున్నాయి. దీంతో పంపుహౌస్‌లోని మూడు భారీ విద్యుత్ మోటార్లను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోస్తున్నట్టు ఏఈ వెంకట్ తెలిపారు.



నంది పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యం



సాగర్ సమీపంలో కనువిందు చేస్తున్న ఎత్తిపోతల

- ఆంధ్రప్రదేశ్–తెలంగాణ సరిహద్దులో నాగార్జునసాగర్ సమీపంలోని కృష్ణానది తీరంలో గల చంద్రవంక వాగుపై ఎత్తిపోతలకు వరద పోటెత్తింది. నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద పెరిగింది. దీంతో అధికారులు ఐదు క్రస్టు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.
- ఎగువ నుంచి సరళాసాగర్ ప్రాజెక్టుకు వరద రావడంతో సైఫన్లు తెరుచుకున్నాయి. మానవ ప్రమేయం లేకుండా ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీరు చేరగానే ఆటోమేటిక్ సైఫన్ల ద్వారా నీటిని కిందకు వదలటం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. ఈ ఏడాదిలో సైఫన్లు తెరుచుకోవడం ఇదే మొదటిసారి.

మరో రెండురోజులు వర్షాలు

10 జిల్లాలకు రెడ్ అలర్ట్..12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జోరు వానలు కురుస్తున్నాయి. దీంతో రెండ్రోజుల క్రితం వరకు సాధారణ వర్షపాతం లోటులోనే ఉండగా.. ఇప్పుడిప్పుడే గణాంకాలు గాడినపడుతున్నాయి. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాని సమీపంలోని వాయవ్య బంగాళాఖాతంలో బుధవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. ఇది గురువారం ఉదయం కల్లా మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. 48 గంటల తర్వాత ఉత్తర కోస్తా ఆంధ్ర తీరం, దక్షిణ ఒడిశా తీరం ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉన్నట్లు వివరించింది. దీనికి అనుబంధంగా పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో మరో అల్పపీడనం కొనసాగుతున్నట్లు తెలిపింది. వీటి ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని చాలాప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని సూచించింది.

ఉరుములు..ఈదురుగాలులు

పది జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో గురువారం ఉదయం వరకు పలు చోట్ల భారీ నుంచి అతిభారీ, కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని సూచించింది. గురు, శుక్రవారాల్లో మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు నమోదు కావొచ్చని తెలిపింది. ఆదిలాబాద్, హనుమకొండ, హైదరాబాద్, జనగామ, కామారెడ్డి, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్లగొండ, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది.

4 శాతం అధికంగా..

మంగళవారం వరకు లోటులో ఉన్న సగటు వర్షపాతం... ప్రస్తుతం 4 శాతం అధికానికి చేరింది. నైరుతి సీజన్‌లో ఈనెల 13వ తేదీ నాటికి రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 45.25 సెంటీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా.. 47.17 సెంటీమీటర్ల వర్షం కురిసింది. బుధవారం ఒక్కరోజు రాష్ట్రవ్యాప్తంగా 2.80 సెంటీమీటర్ల సగటు వర్షం కురిసింది. మంచిర్యాల, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో మాత్రం లోటు వర్షపాతం ఉంది. 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 12 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. 24 గంటల వ్యవధిలో అత్యధికంగా మంచిర్యాల జిల్లాలో సగటున 9.32 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఆసిఫాబాద్ జిల్లాలో 9.31 సెం.మీ, జయశంకర్ భూపాలపల్లిలో 7.90 సెం.మీ, పెద్దపల్లిలో 7.15 సెం.మీ, కరీంనగర్‌లో 6.14 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

ఏపీలో కుంభవృష్టి

భారీ వర్షాలకు విజయవాడలో ముగ్గురు బలి



వరద నీటిలో మునిగిపోయిన ఏపీ రాజధాని ప్రాంతంలోని నీరుకొండ పరిసరాలు

సాక్షి నెట్‌వర్క్: భారీ వర్షాలకు విజయవాడతోపాటు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో డ్రైయిన్లు పొంగడంతో రోడ్ల మీద నాలుగు అడుగుల మేర నీరు చేరాయి. వందల సంఖ్యలో ఇళ్లలోకి నీరుచేరింది. భారీ వర్షాలకు నగరంలో ముగ్గురు బలయ్యారు. పమిడి ముక్కల మండలం ఐనంపూడిలో పిడుగుపడి పశువులపాక దగ్ధం కావటంతో రెండు గేదెలు, ఒక ఎద్దు మృతిచెందాయి. మంగళగిరి నగర పరిధిలోని కాజా టోల్‌గేటు వద్ద రోడ్డుపై భారీగా నీరు నిలిచిపోవడంతో ఎక్కడికక్కడ వాహనాలు ఆగిపోయాయి. టోల్‌ప్లాజా వద్ద మూడడుగుల మేర నీరు ఉండడంతో గుంటూరు నుంచి విజయవాడ వైపు పలు లైన్లలో రాకపోకలు నిలిపివేశారు.

సాగర్ వరద నిర్వహణలో లోపాలు

తెలంగాణకు ఏపీ జలవనరుల శాఖ లేఖ

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ జలాశయానికి వస్తున్న భారీ వరదను తగిన రీతిలో నిర్వహించడం లేదని తెలంగాణపై ఏపీ ప్రభుత్వం ఆరోపించింది. జలాశయంలో బుధవారం ఉదయం 11 గంటలకు నీటిమట్టం 589.2 అడుగులు, నిల్వలు 309.65 టీఎంసీలకు చేరగా, కేవలం 2.4 టీఎంసీల మేర జలాశయాన్ని ఖాళీ (ఫ్లడ్ కుషియన్)గా ఉం చారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ జలవనరులశాఖ ఈఎన్సీ కె.నరసింహమూర్తి తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీకి లేఖ రాశారు. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో రానున్న రోజుల్లో భారీవర్షాలు కురుస్తాయని హెచ్చరికలున్న నేపథ్యంలో సాగర్‌కు వచ్చే వరద మరింతగా పెరుగుతుందని స్పష్టం చేసింది. ఎగువ నుంచి వచ్చే వరదను సమీక్షిస్తూ.. దానికి తగ్గట్టు క్రస్ట్‌గేట్లను ఎత్తకపోతే దిగువన ఏపీలోని ప్రాజెక్టులకు ముప్పు ఏర్పడనుందని తెలిపింది. ఈ నేపథ్యంలో సాగర్‌ను పూర్తిగా నిండకుండా సమర్థవంతంగా వరదల నిర్వహణకు అవసరమైన మేరకు ఖాళీగా ఉంచాలని విజ్ఞప్తి చేసింది.వరదను ప్రణాళికా బద్ధంగా ఎప్పటికప్పుడు కిందకు విడుదల చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది. సాగర్ నుంచి దిగువన ఏపీలోని ప్రాజెక్టులకు విడుదల చేస్తున్న వరదను అకస్మాత్తుగా పెంచకుండా అవసరమైన చర్యలన్నీ తీసుకోవాలని తెలిపింది. సాగర్ పటిష్టతకు భంగం కలగకుండా వ్యవహరించాలని, లేకుంటే దిగువ ప్రాంతాల్లోని ప్రజలు, ప్రాజెక్టులకు నష్టం చేకూరు తుందని ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రాజెక్టుల వద్దే మకాం వేయండి

క్షేత్రస్థాయి ఇంజనీర్లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో నీటిపారుదల శాఖ ఇంజనీర్లందరూ డ్యామ్‌లు, జలాశయాలు, కాల్వలు, చెరువుల వద్దే వచ్చే 72 గంటల పాటు మకాం వేసి, రాత్రింబవళ్లు నిఘా ఉంచాలని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఉన్నత స్థాయి ఇంజనీర్లు కూడా సంబంధిత ప్రాజెక్టుల వద్ద నిరంతరం అందుబాటులో ఉండి, నిర్ణయాలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఈఎన్సీలు, సీఈలు, ఎస్‌ఈలు, ఈఈలు, డీఈఈలతో బుధవారం ఆయన సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరదల నిర్వహణకు సంబంధించిన అత్యవసర పనుల కోసం ఉన్నతాధికారుల నుంచి అనుమతుల కోసం నిరీక్షించకుండా జీవో 45 ద్వారా జారీ చేసిన నిధులను ఖర్చుచేసేందుకు క్షేత్ర స్థాయి ఇంజనీర్లకు విచక్షణాధికారాలను జారీ చేసినట్టు ప్రకటించారు.

జనజీవనానికి ఆటంకాల్లేకుండా చర్యలు చేపట్టాలి

భారీ వర్షాలపై పలు జిల్లాల కలెక్టర్ల సమీక్షలో మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో జనజీవనానికి ఆటంకం లేకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనలకనుగుణంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పలు జిల్లాల కలెక్టర్లతో బుధవారం పొంగులేటి సచివాలయం నుంచి సమీక్షించారు.

ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలి

వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. అటవీ, గిరిజన ప్రాంతాలతో పాటు మారుమూల ప్రాంతాల్లో ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు.

భారీ వర్షాలతో పలు విమానాల రద్దు

శంషాబాద్: వర్షాల కారణంగా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. హైదరాబాద్‌కు రావాల్సిన 9 విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించడంతోపాటు పలు విమానాలను పూర్తిగా రద్దు చేశారు. ఢిల్లీ, అగర్తల, కాన్పూర్, కోయంబత్తూరు, గోవా నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన విమానాలు విజయవాడ విమానాశ్రయానికి మళ్లించగా పట్నా, ముంబై నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన రెండు విమానాలు బెంగళూరు విమానాశ్రయానికి మళ్లించారు. బెంగళూరు నుంచి బయల్దేరిన మరో విమానం తిరిగి అదే విమానాశ్రయానికి చేరుకుంది. చెన్నై నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన విమానం తిరుపతి విమానాశ్రయానికి మళ్లించారు. కొచ్చి, చెన్నై, అహ్మదాబాద్ నుంచి రావాల్సిన విమానాలు రద్దు కావడంతో ఇక్కడి నుంచి అదే ప్రాంతాలకు బయల్దేరాల్సిన విమానాలు కూడా రద్దయ్యాయి.

కాంగ్రెస్ నేతలను తన్ని తరుముతారు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఆరు గ్యారంటీల హామీల్లో అన్నింటినీ అమలు చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే ఇవే మాటలను తెలంగాణలోని ఏదైనా గ్రామానికి వెళ్లి ప్రజలకు చెప్పాలని సవాలు చేశారు. ఆరు గ్యారంటీల అమలుపై మోసపూరిత ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలను గ్రామాల నుంచి ప్రజలు తన్ని తరుముతారన్నారు. ఒక వేళ ప్రజలు వారిని తన్ని తరమకుంటే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాలు చేశారు. ఈ మేరకు కేటీఆర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయండి

ప్యాకేజీ 6 మోటార్లను ఆన్‌చేస్తే 5 లక్షల ఎకరాలకు సాగునీరు

మంత్రి ఉత్తమ్‌కు మాజీ మంత్రి హరీశ్ లేఖ



లేఖ రాస్తున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్/సిద్దిపేటజోన్: రిజర్వాయర్లలో నీళ్లు నింపకపోవడంతో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మిడ్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్‌లను నింపి ఐదు లక్షల ఎకరాల ఆయకట్టును పరిరక్షించాలని కోరారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హరీశ్‌రావు బుధవారం లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న ప్యాకేజ్ 6 మోటార్లను ఆన్‌చేసి నీటిని పంపింగ్ చేయాలని కోరారు. కాళేశ్వరంలో అంతర్భాగమైన శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 20 టీఎంసీలకుగాను ప్రస్తుతం 14 టీఎంసీల నీరు మాత్రమే ఉండగా, కడెం వాగు నుంచి సుమారు 22,300 క్యూసెక్కుల వరద నీరు వస్తోందన్నారు. ఎగువన ఉన్న శ్రీరాం సాగర్ ప్రాజెక్టులో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకుగాను 45 టీఎంసీల నీటి లభ్యత ఉందని చెప్పారు.

క్లుప్తంగా...

20 నుంచి ఐసెట్ కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 20 నుంచి ఐసెట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 20 నుంచి 28 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఉంటుంది. 22 నుంచి 29 వరకూ ధ్రువపత్రాల పరిశీలన, 25 నుంచి 30వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉంటుంది. సెప్టెంబర్ 2వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. తుది విడత కౌన్సెలింగ్ సెప్టెంబర్ 8 నుంచి మొదలవుతుంది. స్పాట్ అడ్మిషన్లను సెప్టెంబర్ 15న చేపడతారు.

వ్యక్తుల పోరాటం కాదు.. రాజ్యాంగ పోరాటం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రవణ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో నడుస్తోంది అంబేడ్కర్ రాజ్యాంగం కాదని.. రేవంత్ రాజ్యాంగమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు. తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై బుధవారం సుప్రీంకోర్టు తీర్పు అనంతరం.. దాసోజు శ్రవణ్ విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగబద్ధ హక్కు కోసం రెండు సంవత్సరాలపాటు సాగిన పోరాటం ఫలించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇది వ్యక్తుల పోరాటం కాదని.. రాజ్యాంగ పోరాటమని స్పష్టం చేశారు. గతంలో గవర్నర్ తన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారని, సుప్రీంకోర్టు తీర్పుతో ధర్మం గెలిచిందని వ్యాఖ్యానించారు.

నా రిటైర్మెంట్‌లోపు పరిష్కారం చూపాలి

▶ మొదటి పేజీ తరువాయి

తరపున ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం

'అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలను రూపొందిస్తోంది. ఇందుకోసం మాకు మరికొంత సమయం కావాలి. వన్యప్రాణులు, అడవి, సరస్సు వంటి వాటిని రక్షించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. పర్యావరణం విషయంలో మేం మరింత పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం' అని అభిషేక్ సింఘ్వీ ధర్మాసనానికి చెప్పారు. 'ప్రభుత్వ ప్రతిపాదనలను మేం ఆహ్వానిస్తున్నాం. మీరు మంచి ప్రతిపాదనలతో వస్తే, మేము ఫిర్యాదులన్నింటినీ ఉపసంహరిస్తాం. ఆ అటవీ ప్రాంతాన్ని రక్షించే మంచి ప్రతిపాదనలతో రండి. అలా వస్తే మిమ్మల్ని (ప్రభుత్వాన్ని) ధర్మాసనం కచ్చితంగా అభినందిస్తుంది' అని జస్టిస్ గవాయ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ధర్మాసనాలు వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. కానీ, అభివృద్ధి అనేది సుస్థిరంగా ఉండాలని పదే పదే ప్రభుత్వానికి సూచించామని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పుడు పర్యావరణం, వన్యప్రాణుల ప్రయోజనాలను ధ్వంసం చేసే చర్యలకు ఎవరూ ఉపసంహరించకూడదని ధర్మాసనం సూచించింది. 'ఈసారి ధర్మాసనం ముందుకొచ్చే సమయానికి ప్రభుత్వ ప్రతిపాదనలు చాలా అద్భుతంగా ఉంటాయని, ఇందుకు మాకు 6-8 వారాల సమయం కావాలి' అని అభిషేక్ మనుసింఘ్వీ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ఈ కేసు విచారణను ఆరు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

- ఏర్పాటుచేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- సౌకర్యవంతంగా ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- భూధార్ నంబర్ల కేటాయింపునకు ప్రణాళికలు రూపొందించాలి
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సమీక్షలో సీఎం వెల్లడి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భూములకు భూధార్ నంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సీఎం బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వారసత్వ, మ్యుటేషన్‌కు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు సర్వే చేసిన అనంతరం రెగ్యులర్ సర్వేయర్లు వాటిని స్క్రూటినీ చేసేలా చూడాలని ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో నూతనంగా నిర్మించనున్న 10 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను సీఎం పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని, కార్యాలయాలు ప్రజలకు స్నేహపూర్వక వాతావరణంలో సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సూచించారు. హైదరాబాద్‌లో హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. సమీక్షలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, కేఎస్ శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ పాల్గొన్నారు.

వారి సభ్యత్వాలు రద్దు!

▶ మొదటి పేజీ తరువాయి

తమిళిసై సౌందరరాజన్.. వారికి రాజకీయ నేపథ్యం ఉండటాన్ని ప్రస్తావించడంతోపాటు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5)కు అనుగుణంగా వారి నియామకాలు లేవని పేర్కొంటూ వారి నామినేషన్లను తిరస్కరించారు. కాగా 2023 చివర్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరిలో ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిస్టు అమేర్ అలీ ఖాన్‌లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. ఈ నామినేషన్లతో పాటు, గవర్నర్ తమ నామినేషన్లను తిరస్కరించడాన్ని దాసోజు, కుర్ర హైకోర్టులో సవాలు చేశారు. ఈ నేపథ్యంలో 2024 మార్చిలో హైకోర్టు.. గవర్నర్ తిరస్కరణను రద్దు చేయడంతో పాటు కొత్త నామినేషన్లను కూడా కొట్టివేసింది. గవర్నర్ మంత్రివర్గ సలహా మేరకే వ్యవహరించాలని, సవరణలు కోరే హక్కు మాత్రమే ఉందని కోర్టు స్పష్టం చేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లగా, 2024 ఆగస్టు 14న ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వుపై స్టే ఇచ్చింది. కోదండరాం, అమేర్ అలీ ఖాన్‌లు ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేసుకోవడానికి అనుమతించింది. అయితే వారి నామినేషన్లు తుది తీర్పుకు లోబడి ఉంటాయని తెలిపింది. తాజాగా బుధవారం జరిగిన వాదనల అనంతరం మధ్యంతర ఉత్తర్వును సవరించింది. మధ్యంతర ఉత్తర్వు ఆధారంగా తీసుకున్న అన్ని చర్యలు, అందులో ప్రమాణ స్వీకారాలు కూడా రద్దు అవుతాయని స్పష్టం చేసింది. ఇకపై ఆ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం జరిగే ఏ కొత్త నామినేషన్లు అయినా, సెప్టెంబర్ 17న జరిగే విచారణ తర్వాత వచ్చే తుది తీర్పు పైనే ఆధారపడి ఉంటాయని తెలిపింది. కాగా గవర్నర్ తరపున వాదించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన సిఫారసు మేరకే గవర్నర్ ఆమోదం తెలిపారని వాదించారు. పిటిషనర్లు తమ నామినేషన్ల అమలును కాదు, గవర్నర్ తిరస్కరణను సవాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గవర్నర్ పూర్తిగా రాజ్యాంగపరమైన విధానాన్నే అనుసరించారని చెప్పారు. పిటిషనర్ల తరపున న్యాయవాది రంజిత్‌కుమార్ వాదించారు. గవర్నర్.. 'హైకోర్టుకు నేనుజవాబు చెప్పాల్సిన అవసరం లేదు..' అని చెప్పారని తెలియజేయగా, 'చాలా దురదృష్టకరం' అని జస్టిస్ విక్రమ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా శ్రావణ్‌కుమార్

ఓ వైపు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై కోర్టులో వివాదం కొనసాగుతున్న సమయంలోనే.. బీఆర్ఎస్ తరఫున దాసోజు శ్రావణ్ ఏప్రిల్ 16న ఎమ్మెల్యే కోటాలో శాసనమండలికి ఎన్నికై ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయడం గమనార్హం.

భవిష్యత్ పరిణామాలపై ఉత్కంఠ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేగుతోంది. గవర్నర్ కోటాలో శాసనమండలికి ఎన్నికైన ఇద్దరు ఎమ్మెల్సీలు కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల సభ్యత్వాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయడం సంచలనం సృష్టిస్తుండగా, పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై అక్టోబర్ 31లోగా నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు ఇప్పటికే గడువు విధించడంతో..భవిష్యత్ పరిణామాలు ఏ విధంగా ఉంటాయనే ఉత్కంఠ నెలకొంది. మరో వైపు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలపై కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది. ఇలావుండగా..గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం చెల్లదన్న సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్, బీజేపీలకు చెంపపెట్టు అని బీఆర్ఎస్ వ్యాఖ్యానించగా..తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్, బీజేపీ స్పందించే తీరుపై ఆసక్తి నెలకొంది.

సుప్రీం తీర్పు బీజేపీ, కాంగ్రెస్‌లకు చెంపపెట్టు

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం చెల్లదన్న సుప్రీంకోర్టుకు శిరస్సు వంచి సలాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలైన కోదండరాం, అమీర్ అలీఖాన్‌ల నియామకం చెల్లదని సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు అటు బీజేపీకి, ఇటు కాంగ్రెస్‌కు చెంపపెట్టు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అధికారం కోసం ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ వ్యవస్థలను తుంగలో తొక్కిన ఈ పార్టీల అప్రజాస్వామిక విధానాలు ఎంతమాత్రం సాగనివ్వమని సుప్రీంకోర్టు తన తీర్పుతో చాటిచెప్పిందని బుధవారం ఒక ప్రకటనలో కేటీఆర్ కొనియాడారు. రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడిన బీఆర్ఎస్ పక్షాన గౌరవ న్యాయవ్యవస్థకు శిరస్సు వంచి సలాం చేస్తున్నామని తెలిపారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన దాసోజు శ్రవణ్, సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ చేసిన సిఫారసును పట్టించుకోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నాటి గవర్నర్ చులకన చేశారని విమర్శించారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను అడ్డం పెట్టుకొని కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టిందని ఆరోపించారు. తమ ప్రభుత్వ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండగానే మరో ఇద్దరి పేర్లను సిఫారసు చేసి తన బీసీ వ్యతిరేక వైఖరిని రేవంత్‌రెడ్డి చాటుకున్నాడని మండిపడ్డారు. అయితే బీజేపీ, కాంగ్రెస్‌ల చర్యలు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పుతో స్పష్టమైందన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించకుంటే పరాభవం తప్పదు: కవిత

మహోన్నతమైన భారత రాజ్యాంగాన్ని గౌరవించకుంటే పరాభవం తప్పదని, బీజేపీ ఇకనైనా గుర్తించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం గవర్నర్ కోటాలో సిఫారసు చేసిన ఎమ్మెల్సీల నియామకాలను నాటి గవర్నర్‌ను అడ్డు పెట్టుకొని బీజేపీ కుట్ర పూరితంగా అడ్డుకుందని ఆరోపించారు.

మండలి సభ్యత్వం రద్దయినట్లు ప్రచారం చేస్తున్నారు

- సుప్రీంకోర్టు ఉత్తర్వులపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



సాక్షి, హైదరాబాద్: కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల శాసన మండలిసభ్యత్వం రద్దయినట్లు సగం సమాచారంతో ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. వాళ్లిద్దరి విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కాంగ్రెస్ ప్రభుత్వం గమనిస్తోందని బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన తెలిపారు. ఈ కేసు విషయంలో పూర్తి వాదనలకు సెప్టెంబర్ 17 తేదీన కోర్టు సమయం ఇచ్చిందని, ఆ రోజున తమకున్న సానుకూల అంశాలు సుప్రీంకోర్టుకు విన్నవిస్తామని చెప్పారు. గత గవర్నర్ తప్పుబట్టిన ఖాళీలను రెండు సంవత్సరాలు భర్తీ చేయకుండా తమ ప్రభుత్వం ఉండలేదని, గవర్నర్ కూడా ఉండలేరని తెలిపారు. కోదండరాం, అమేర్ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారని, సభలో కూడా పాల్గొన్నారని, వాటన్నింటినీ తాము కోర్టుకు వివరిస్తామన్నారు.

ఇకపై ఒక్కరోజులోనే వీసా జారీ

- నిబంధనలను సరళతరం చేసిన కేంద్రం
- విదేశీ విభాగ ఉన్నతాధికారులతో కేంద్రమంత్రి బండి సంజయ్ సమావేశం



సాక్షి, న్యూఢిల్లీ: వీసా జారీ చేయడానికి ప్రస్తుతం కొన్ని వారాల సమయం పడుతోంది. ఇకపై అన్ని పత్రాలు సమర్పిస్తే ఒక్క రోజులోనే వీసాను పొందేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనల్లో వెసులుబాటు తీసుకొచ్చింది. అక్రమ వలసదారులు, గడువుతీరినా దేశంలోనే ఉండే విదేశీయులపై పర్యవేక్షణను మరింత బలోపేతం చేసేందుకు డిస్ట్రిక్ట్ పోలీస్ మాడ్యూల్ (డీపీఎం), ఫారినర్స్ ఐడెంటిఫికేషన్ పోర్టల్ (ఎఫ్ఐపీ) అనే రెండు కొత్త పోర్టల్స్‌ను ప్రారంభించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బుధవారం ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో విదేశీ విభాగ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో వీసా విధానాల సరళతరం, ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టుల ఆధునీకరణ వంటి అంశాలపై చర్చించారు. 2024లో జారీ చేసిన మొత్తం వీసాలలో ఈ-వీసాల వాటా 65.15 శాతం. వీసా విధానాల సులభతరం వల్ల వీసా జారీ సగటు సమయం కొన్ని వారాల నుంచి ఒక రోజులోపు తగ్గినట్టు కేంద్రమంత్రికి అధికారులు తెలిపారు. అధికారుల పనితీరును అభినందించిన బండి సంజయ్.. వీసా, ఇమ్మిగ్రేషన్ విషయంలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో సాధారణ ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు. ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టు (ఐసీపీ)ల ఆధునీకరణలో భాగంగా ఆటోమేటెడ్ ట్రావెల్ డాక్యుమెంట్ స్కానింగ్, బయోమెట్రిక్ నమోదు సదుపాయాలను కల్పించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్, కొచ్చి, అహ్మదాబాద్‌లలో ఫాస్ట్-ట్రాక్ ఇమ్మిగ్రేషన్ ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రాం (ఎఫ్‌టీఐ-టీటీపీ) అమలు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు.

బిహార్ లేదా యూపీ!

- 'ఖజానా'లో దొంగతనం చేసింది ఈ రాష్ట్రాలకు చెందిన ముఠాలే అని అనుమానం
- ఎక్కడా హైవేపైకి రాకుండా తప్పించుకున్న గ్యాంగ్
- బాల్కి మీదుగా పారిపోయినట్టు గుర్తించిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్/చందానగర్: చందానగర్‌లోని గంగారం వద్ద ఉన్న ఖజానా జ్యువెలరీ షోరూంలో బందిపోటు దొంగతనానికి పాల్పడింది బిహార్ లేదా ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఠా అయ్యి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ప్రాంతంతోపాటు రాకపోకలకు వినియోగించే మార్గాలపైనా గ్యాంగ్ సభ్యులకు పూర్తి పట్టు ఉన్నట్టు భావిస్తున్నారు. నేరం చేసిన తర్వాత గంగారం నుంచి బాల్కి వరకు వీరు అనుసరించిన మార్గాన్ని గుర్తించిన అధికారులు.. అక్కడి నుంచి ఎటు వెళ్లారనే దానిపై ఆరా తీస్తున్నారు. ఈ ముఠా కోసం చందానగర్ పోలీసులతోపాటు సైబరాబాద్ ఎస్ఓటీ, సీసీఎస్‌లకు చెందిన బృందాలు మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్‌ల్లో గాలిస్తున్నాయి. సాధారణంగా ఇలాంటి నేరం చేయడానికి దుండగులు చోరీ చేసిన ద్విచక్ర వాహనాలనే వాడుతారు. మరో ప్రాంతంలో దొంగలించిన వాటిపై టార్గెట్ చేసిన ప్రాంతానికి చేరుకుంటారు. అక్కడ లాడ్జి లేదా అద్దె గదుల్లో షెల్టర్ తీసుకొని రెక్కీ నిర్వహించిన తర్వాతే పంజా విసురుతారు. కొన్ని ముఠాలు చోరీ బైక్స్‌ను లారీ వంటి పెద్ద వాహనంలో తీసుకొచ్చి పని పూర్తి చేస్తాయి. నేరం చేసిన తర్వాత మాత్రం ఎక్కడా ఆగకుండా వీలైనంత దూరం ఉడాయిస్తాయి. ఖజానా జ్యువెలరీలో నేరం చేసిన ముఠా సైతం అక్కడ నుంచి రెండు ద్విచక్ర వాహనాలపై పారిపోయింది. వీరు వెళ్లిన మార్గాల్లోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను అధ్యయనం చేస్తున్న పోలీసులు పారిపోయిన మార్గాన్ని గుర్తిస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు సేకరించిన ఆధారాల ప్రకారం కృష్ణారెడ్డిపల్లి-అత్తనూర్-వట్టిపల్లి మీదుగా బీదర్ చేరిన ఈ గ్యాంగ్ అక్కడ నుంచి బాల్కి వెళ్లినట్టు గుర్తించారు. ఈ మార్గంలో ఎక్కడా వీరు హైవేలను వినియోగించలేదు. సీసీ కెమెరాలు, నిఘా, తనిఖీలు తక్కువగా ఉండే, టోల్‌గేట్లు లేని మార్గాలు ఎంచుకున్నారు. దుండగులు వినియోగించిన రెండు ద్విచక్ర వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ నంబర్లు గుర్తించడానికి ప్రయత్నిస్తున్నారు. గంగారం నుంచి ఆయా మార్గాల్లోని సెల్ టవర్ల నుంచి ఫోన్ నంబర్లను సేకరించి విశ్లేషిస్తున్నారు. ఖజానా జ్యువెలరీ షోరూం నుంచి దుండగుల వేలిముద్రల్ని సేకరించిన పోలీసులు వాటిని రాష్ట్రంలో ఉన్న నేరగాళ్ల డేటాబేస్‌లో సరిచూస్తూ వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు, ప్రత్యేక విభాగాలకు పంపారు.

తెలంగాణలో త్వరలో టూరిస్ట్ పోలీస్

తెలంగాణ టూరిజం, పోలీస్ శాఖ సమన్వయ సమావేశంలో డీజీపీ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో టూరిస్టుల భద్రత కోసం త్వరలో టూరిస్ట్ పోలీసులను కేటాయించనున్నట్టు డీజీపీ జితేందర్ తెలిపారు. బుధవారం తెలంగాణ టూరిజం, పోలీస్ శాఖ సమన్వయ సమావేశం డీజీపీ కార్యాలయంలో జరిగింది. టూరిజం శాఖ స్పెషల్ సీఎస్ జయేశ్‌రంజన్, శాంతి భద్రతల అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్, టూరిజం శాఖ ఎండీ వి.క్రాంతి, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సీహెచ్ ప్రియాంక, ఇతర పోలీసు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ తొలి దశలో టూరిజం శాఖకు అవసరమైన 80 మంది పోలీసు సిబ్బందిని త్వరలో కేటాయిస్తామన్నారు. సెప్టెంబర్ 27న జరగనున్న వరల్డ్ టూరిజం డే సందర్భంగా టూరిస్ట్ పోలీసుల వ్యవస్థ సిద్ధం చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలైన అనంతగిరి, సోమశిల, రామప్ప, యాదగిరిగుట్ట, పోచంపల్లి, నాగార్జునసాగర్, బుద్ధవనం, భద్రాచలం, అమ్రాబాద్ తదితర ప్రాంతాల్లో టూరిస్ట్ పోలీసులు పని చేస్తారన్నారు. షూటింగ్ పర్మిషన్లు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం పర్యాటక శాఖ విధివిధానాలను రూపొందించాలని డీజీపీ సూచించారు. ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం సినీ నిర్మాతలు ముందుగా తెలియజేస్తే కార్యక్రమాలకు భద్రత కల్పించే సమయం దొరుకుతుందన్నారు. జయేశ్‌రంజన్ మాట్లాడుతూ తెలంగాణలో విదేశీ టూరిస్టులతో పాటు దేశంలో ఉన్న టూరిస్టులు విస్తృతంగా సందర్శిస్తారని వారికి భద్రత కల్పించేందుకు టూరిస్ట్ పోలీసు అవసరముందని తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ విక్రమ్ సింగ్‌మాన్, మల్టీ జోన్-2 ఐజీపీ తఫ్సీర్ ఇక్బాల్, సైబరాబాద్ జాయింట్ కమిషనర్ గజరావు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.



Authorised Dealers: Hyderabad: (L. B. Nagar): Mody India Cars: 77992 50000 / 95818 24365; (Attapur): Mody India Cars: 77992 50000 / 98852 20200; (Uppal): Mody India Cars: 77992 50000 / 95818 24365; (Jubilee Hills): Mahavir Auto: 83672 30004; (Somajiguda): Mahavir Auto: 83673 30004; (Bowenpally): Mahavir Auto: 95815 50004; (Sanath Nagar) Mahavir Auto: 96426 40005; (Kondapur): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Gachibowli): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Hyder Nagar): PPS Motors: 79934 64666; (AS Rao Nagar): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Bachupally): PPS Motors: 96424 33334; Secunderabad: Mahavir Auto: 83674 30004; Nizamabad: PPS Motors: 79934 64666 / 79939 69888; Vizag: Mahavir Auto: 83676 30004; Vijayawada: Mahavir Auto: 83675 30004; Tirupati: PPS Motors: 79934 64666 / 79959 09992; Warangal: Mahavir Auto: 90105 75959; Karimnagar: Mody India Cars: 77992 50000 / 98859 18412; Nellore: Mahavir Auto: 83670 30004; Kurnool: PPS Motors: 79934 64666; Ananthpur: PPS Motors: 79934 64666; Rajmundhry: Mahavir Auto: 79979 60437; Guntur: Mahavir Auto: 90109 70004



ఒక వ్యక్తి తనను తాను ఎంత అదుపు చేసుకోగలిగితే, అంత ఎక్కువ వనరుగా మారగలడు.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 14 ఆగస్టు 2025

ప్రజాస్వామ్యం ఖూనీ

కళ్లు మూసుకున్న రాష్ట్ర ఎన్నికల సంఘం సాక్షిగా, రౌడీమూకల్లా చెలరేగిన పోలీసుల సాక్షిగా మంగళవారం వైఎస్సార్ జిల్లా పులివెందుల, అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో పచ్చమందలు అక్షరాలా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాయి. నిజమైన ఓటర్లు పోలింగ్ కేంద్రాల సమీపానికి రాకుండా అధికార పక్షం దౌర్జన్యాలకు దిగితే.... వాటిని ఎదిరించి వచ్చినవారిని పోలీసులు తరిమికొట్టారు. ఓటు వేసేందుకు అనుమతించాలంటూ కాళ్లావేళ్లా పడినవారిని సైతం కనికరించలేదంటే... ఓటర్ల దగ్గర స్లిప్‌లు గుంజుకుని, మీ దగ్గర స్లిప్‌లు లేవుగనుక ఓటేయటం కుదరదని పోలీసులు దబాయించారంటే ఏపీలో పరిస్థితేమిటో అర్థం చేసుకోవచ్చు. ఏనాడూ సవ్యంగా అధికారంలోకి రావటం చేతగాని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ రెండు స్థానాల్లో అక్షరాలా ప్రజాస్వామ్యాన్ని పాడెక్కించారు. దీన్ని కప్పిపుచ్చటానికి బుధవారం రెండు కేంద్రాల్లో మాత్రం రీపోలింగ్ తంతు నిర్వహించి అయిందనిపించారు. తొలినాటి ఉదంతాలే మర్నాడూ పునరావృతమయ్యాయి. స్థానికేతర టీడీపీ నాయకులు ఎక్కడికక్కడ చెలరేగిపోతుంటే చోద్యం చూసిన పోలీసులు వైఎస్సార్ కాంగ్రెస్ స్థానిక నాయకుల్ని అరెస్టులతో, గృహనిర్బంధాలతో ఎటూ కదలనివ్వలేదు. అభ్యర్థులను తిరగనివ్వలేదు.

అసలు రాష్ట్ర ఎన్నికల సంఘం అక్రమంగా నాలుగు గ్రామాల పోలింగ్ కేంద్రాలను 2 నుంచి 4 కిలోమీటర్ల దూరాల్లోవున్న వేరే గ్రామాలకు తరలించటంతోనే ఈ ఉప ఎన్నికల ప్రహసనం మొదలైంది. అన్ని కిలోమీటర్ల దూరం వెళ్లి ఓటేయటం వృద్ధులకూ, అనారోగ్యం బారినపడిన వారికీ అసాధ్యమని లెక్కేసుకుని ఈ మార్పు చేశారు. మహిళలు, వృద్ధులతోసహా సాధారణ ఓటర్లంతా ఇలాంటి మాయోపాయాలను బేఖాతరు చేశారు. కానీ వారికి రక్షణగా నిలబడాల్సిన పోలీసులే వృత్తి ధర్మానికి ద్రోహం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రాలు మార్చటాన్ని హైకోర్టు తప్పుబట్టినా, చివరి నిమిషంలో సవరించటం అసాధ్యమని భావించింది. ఇదే అదునుగా జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు వంటి చోట్లనుంచి వచ్చిన రౌడీమూకలు ఎడాపెడా రిగ్గింగ్‌కు పాల్పడ్డాయి. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ పోలింగ్ కేంద్రంలో వుండగానే దొంగ ఓటర్లు బారులు తీరారంటే ఈ బరితెగింపు ఏ స్థాయిలో వున్నదో అర్థం చేసుకోవచ్చు. తెలిసో తెలియకో తమ 'ఘనత'ను చాటుకోవటానికి జిల్లా కలెక్టర్ ఈ ఫొటోలనే సామాజిక మాధ్యమాల్లో వుంచి నగుబాటుపాలై తిరిగి వాటిని తొలగించాల్సి వచ్చింది.

అధికారులకు వ్యక్తిగత స్థాయిలో ఇష్టాయిష్టాలుండొచ్చు. అధికార పార్టీకి పరిచారికలుగానో, పాలేళ్లుగానో మారాలని ప్రాణం కొట్టుమిట్టాడొచ్చు. అలాంటివారు రాజీనామా చేసి పోవాలితప్ప, జనం ఎంతో కష్టపడి పన్నుల రూపంలో చెల్లించే సొమ్మును నెలనెలా జీతాలుగా తీసుకుంటూ... కుటుంబాలను పోషించుకుంటూ కాలసర్పాల మాదిరిగా అదే జనాన్ని కాటేయాలని చూడకూడదు. సిగ్గూ లజ్జా, మానాభిమానాలు వున్నవారెవరైనా ఇలాంటి హీనస్థితికి దిగజారతారా? ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి తరమటం మాత్రమే కాదు... కనీసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోలింగ్ ఏజెంట్లను కూడా పోలింగ్ కేంద్రాల్లోకి రానీయకుండా నిర్వహించిన ఈ ఉప ఎన్నికలు 'ప్రశాంతంగా' జరిగాయని ప్రకటించటానికి అధికార యంత్రాంగానికి ఏమాత్రం సిగ్గనిపించకపోవటం విస్మయం కలిగిస్తుంది. పులివెందుల జెడ్పీటీసీ స్థానంలో 15 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకం అని సాక్షాత్తూ రాష్ట్ర ఎన్నికల సంఘమే ప్రకటించింది. మరి అక్కడుండే వైఎస్సార్ కాంగ్రెస్ ఏజెంట్లకు భద్రత కల్పించాల్సిన బాధ్యత లేదా? మంత్రి సమక్షంలోనే పోలింగ్ ఏజెంటును ఒక్కడిని చేసి అత్యంత దారుణంగా కొట్టారన్న సమాచారం ఆ సంఘానికి చేరిందా? అనేకచోట్ల ఏజెంట్లు లేకుండానే పోలింగ్ కొనసాగిన వైనం ఆ సంఘానికి తెలుసా? ఓటర్లెవరో, కానివారెవరో గుర్తించటానికి ఏజెంట్లుంటారు. పోలింగ్ పూర్తయ్యాక అంతా సవ్యంగా పూర్తయినట్టు వారినుంచి సంతకాలు తీసుకుంటారు. జరిగిన తంతు చూస్తుంటే ఆ సంతకాలను కూడా ఫోర్జరీ చేయదల్చుకున్నారా అనే సంశయం ఏర్పడుతోంది.

పోయే కాలానికి కుక్కమూతి పిందెలని నానుడి. సాధారణ ఎన్నికలైనా, ఉప ఎన్నికలైనా అక్రమాలకు పాల్పడటం ఆదినుంచీ అలవాటైన బాబుకు 'అతని కంటె ఘనుడ'న్నట్టు పుత్రరత్నం తోడయ్యాడు. అందుకే ఈసారి బరితెగింపు అవధులు దాటిన వైనం కనబడుతోంది. ఇలాంటి దుష్టపోకడల్ని చూస్తూ వూరుకుంటే ప్రజాస్వామ్యం బతికి బట్టగట్టదు. న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలి. ప్రహసన ప్రాయంగా మారిన ఈ ఉప ఎన్నికలను రద్దుచేయాలి. బాధ్యులైన అధికార్లను సాగనంపాలి. వైఎస్సార్ కాంగ్రెస్ డిమాండ్ చేసినట్టు కేంద్ర బలగాల ఆధ్వర్యంలో తిరిగి పోలింగ్ నిర్వహించాలి.


గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం; **తిథి:** బ.పంచమి ఉ.6.09 వరకు, తదుపరి షష్ఠి రా.3.51 వరకు; **నక్షత్రం:** రేవతి ప.11.44 వరకు, తదుపరి అశ్విని; **వర్జ్యం:** లేదు; **దుర్ముహూర్తం:** ఉ.9.59 నుండి 10.49 వరకు, తదుపరి ప.3.02 నుండి 3.52 వరకు; **అమృత ఘడియలు:** ఉ.9.26 నుండి 10.56 వరకు, తదుపరి రా.3.25 నుండి 4.55 వరకు.

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం: 6.24
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్


వీళ్లను సంప్రదించొచ్చు!



ఇళ్లు వదిలితే సురక్షితం కాదనే భావనకు ఎవరూ లోను కాకూడదు. ఇవ్వాళ్టి నుంచి, ఇంగ్లండ్, వేల్స్ అంతటా మన సమాజాల్లోని నేరాలను ఎదుర్కొనేందుకు ప్రతి ఇరుగుపొరుగుల్లోనూ సంప్రదించాల్సిన అధికారుల పేర్లను ఇస్తున్నాం.

– కీర్ స్టార్మర్, యూకే ప్రధాని

మూడు ఎంపికలు



తప్పు జరిగినప్పుడు మీకు మూడు ఎంపికలు ఉంటాయి. ఒకటి: తప్పు చేయలేదనటం, రెండు: తప్పుకు నలిగిపోవటం, మూడు: తప్పును అంగీకరించటం. ఎంపిక ఏదైనా, తప్పును త్వరగా సరిద్దుకోవాలి. దాన్నుంచి నేర్చుకోవాలి.

– కుమార మంగళం బిర్లా, పారిశ్రామికవేత్త

ముఖ్యమైన పాఠం



యూనివర్సిటీలో ఉండగా విద్యార్థిగా కాక, ఒక అథ్లెట్‌గా నేను నేర్చుకున్న ముఖ్యమైన పాఠాలలో ఒకటి... నా జట్టులోని వాళ్లపై విశ్వాసం ఉంచటం. జట్టు సామర్థ్యంపై నమ్మకం కోల్పోకుండా ఉండటం అన్నది విజయానికి కచ్చితమైన మార్గం.

– లిప్-బు టాన్, ఇంటెల్ సీఈవో

కఠినంగా ఉంటేనే!



కష్టపడే గుణం లేకుండా ఎంత ప్రతిభ ఉండీ ప్రయోజనం లేదు. కష్టపడి పని చేసేవాళ్లు ఇట్టే తెలిసిపోతారు. అనుకున్నది సాధించే విషయంలో వాళ్లు తమతో తాము కూడా కఠినంగానే ఉంటారు.

– క్రిస్టియానో రొనాల్డో, ఫుట్‌బాల్ ఆటగాడు

వందలో ఒకటే



వ్యాపారం ఎందుకు కష్టమైనదంటే – వంద పనులు చేయవలసి ఉంటుంది. వాటిల్లో ఐదు మాత్రమే ముఖ్యమైనవి అనుకుని, ఆ ముఖ్యమైన ఐదు పనుల్లో కూడా ఒకటి అత్యంత ముఖ్యమైనదనుకుని, దానిపై దృష్టి పెట్టటానికి, మిగతా వాటిని విస్మరించటానికి ఒక ముఖ్యమైన దారిని కనిపెట్టవలసి ఉంటుంది.

– సామ్ ఆల్ట్‌మాన్, ఓపెన్ ఏఐ సీఈఓ

పోటీ మొదలైంది!



నెట్ యూజర్లు అడిగే ప్రశ్నలన్నిటికీ సరైన సమాధానాలు చెప్పలేకపోతే, వారికి అవసరమైన అన్ని పనుల్లో సహాయం అందించలేకపోతే నేటి ఏఐ రంగంలో నిలదొక్కుకోవటం కష్టం. ఎందుకంటే, ఏఐల మధ్య అప్పుడే పోటీ మొదలైపోయింది!

– అరవింద్ శ్రీనివాస్, పెర్‌ప్లెక్సిటీ ఏఐ సీఈవో

భారత్ వైపు ప్రపంచం చూపు!

అభిప్రాయం



టంకశాల అశోక్

ఇప్పుడు ప్రపంచమంతా భారతదేశం వైపు చూస్తున్నదనటంలో అతిశయోక్తి లేదు. ఈ పరిణామం ఈ నెల 6వ తేదీన చోటుచేసుకుంది. ఆ రోజున అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై సుంకాలను మరొక 25 శాతం పెంచి, మొత్తం 50 శాతానికి చేర్చారు. దానితో మోదీ ప్రభుత్వం ఒత్తిడికి గురై రష్యన్ చమురు కొనుగోళ్ళను ఆపటంతో పాటు, వాణిజ్య ఒప్పందంపై జరుగుతున్న చర్చలో తమ ప్రతిపాదనలకు అంగీకరించగలదన్నది ట్రంప్ ఎత్తుగడ. అనూహ్యమైన రీతిలో ప్రధాని మోదీ అదేరోజు రాత్రి ఎదురుదాడి ప్రారంభించారు.

ప్రపంచం కోసం నిలబడగలమా?

ట్రంప్ చర్యలను చైనా, బ్రెజిల్, యూరోపియన్ యూనియన్, కెనడా, జపాన్, దక్షిణాఫ్రికా, రష్యా వంటివి మొదటి నుంచి పూర్తిగానో, పాక్షికంగానో వ్యతిరేకిస్తుండటంలో విశేషం లేదు. వీటన్నింటికి భిన్నంగా పెద్ద దేశాలలో ఇండియా ఒక్కటే మొదటి నుంచి అమెరికాతో మెత్తగా వ్యవహరిస్తూ వచ్చింది. ఒక పెద్ద వర్ధమాన దేశం అయి ఉండి, 'బ్రిక్స్'లో ప్రధాన పాత్ర వహిస్తూ, ట్రంప్ చర్యల కారణంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం కనిపిస్తున్నా, ప్రతిఘటించకపోవటంపై అంతటా విమర్శలు వినిపించాయి. అటువంటి స్థితిలో మోదీ చేసిన ప్రసంగం, అందులోని భాష, తనలో కనిపించిన దృఢమైన వైఖరి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాయి. ఇప్పుడిక ఆయన భారతదేశం కోసమే గాక, తక్కిన ప్రపంచంతో కూడా కలిసి నిలబడవచ్చుననే ఆశాభావాలు వినవస్తున్నాయి.

అదే సమయంలో, ఇల్లలకగానే పండుగ కాదనే పెద్దల హెచ్చరికను గుర్తుంచుకోవలసి ఉంటుంది. వీటికి స్వల్పకాలిక, మధ్యకాలిక ప్రభావాలు అనేకం ఉంటాయి. అవి వాస్తవంగా భూకంపానికి దారి తీయగలవు. స్లో మోషన్‌లో ఆర్థిక ప్రపంచ యుద్ధాన్ని సృష్టించగలవు. మన ప్రపంచం నిజమైన అర్థంలో రాజకీయంగా, ఆర్థికంగా, ప్రజాస్వామికంగా మారాలంటే, చిరకాలపు ఆధిపత్య శక్తుల భూమి కింద అటువంటి భూకంపం రావటం అవసరం.

కొండ చరియలలో కింది వైపున కేవలం ఒక రాయి కదలికలో మొత్తం చరియలే కూలినట్లు, చరిత్రలో ఒకోసారి చిన్న ఘటనలు పెనుమార్పులకు దారి తీస్తుంటాయి. క్రమంగా బలహీనపడుతున్న అమెరికా ఆర్థిక వ్యవస్థను, భౌగోళిక ఆధిపత్యాన్ని తిరిగి శక్తిమంతం చేయదలచిన ట్రంప్, అమెరికన్ కొండచరియలో ఒకొక్క రాయినే తనకు తెలియకుండానే తోసివేస్తున్నారు. ఇప్పుడు ఇండియా రూపంలో ఒక ముఖ్యమైన రాయి తొలగిపోతున్నదనుకోవాలా?



◆ఏమి చేసైనా సరే తన 'మాగా' లక్ష్యాలను సాధించాలనే ఒత్తిడుల మధ్య అమెరికా అధ్యక్షుడు– యూరప్, కెనడా, జపాన్, మెక్సికో వంటి ఇతర మిత్ర దేశాలకు వలెనే ఇండియానూ దారికి తెచ్చుకోగలనని నమ్మారు. వాటికీ, భారత్‌కూ మధ్య గల తేడాను గ్రహించలేక పోయారు.

ఇండియా దృఢ వైఖరి

నిజంగానా, లేక ఇది తొందరపాటు మాటా అన్నది ప్రశ్న. ఒక వైపు అమెరికా నాయకత్వాన ఒక శక్తిమంతమైన కూటమి ఉంది. అది బలహీనపడుతున్న మాట నిజమేగాని అవసాన దశకేమీ చేరలేదు. మరొకవైపు భారత్‌తో కూడిన 'బ్రిక్స్' దేశాలు నానాటికీ బలపడుతున్నాయి. ఇది తమ ఆధిపత్యానికి ఎంత ప్రమాదకరం కాగలదో అర్థమైనందువల్లనే ట్రంప్ 'బ్రిక్స్'పై కత్తిగట్టారు. ఆయన వేర్వేరు దేశాలపై వేర్వేరుగా ప్రకటిస్తున్న ట్యారిఫ్‌లను, వేర్వేరు పద్ధతులలో సాగిస్తున్న చర్చలను గమనిస్తే, 'బ్రిక్స్' దేశాల పట్ల 'విభజించి పాలించే' వ్యూహాన్ని అనుసరిస్తున్నటు స్పష్టమవుతుంది.

చర్చలోకి వెళితే, మోదీ నాయకత్వాన భారతదేశానికి అమెరికాతో అవసరాలున్నాయి, పేచీలు కూడా ఉన్నాయి. గతకాలపు చిన్న చిన్న పేచీలను అటుంచి ఇప్పుడు ట్యారిఫ్‌లతో, వాణిజ్య ఒప్పందంలోని ప్రతిపాదనలతో పెద్ద పేచీ తలెత్తింది. ఒకవైపు భారతదేశం స్వతంత్ర శక్తిగా గతం కన్నా బలపడుతూ తన భవిష్యత్తు పట్ల దృష్టి మారుతుండటం, మరొకవైపు అమెరికా క్రమంగా బలహీనపడుతూ ఏకధ్రువ ప్రపంచ స్థితి మారుతుండటం గమనించవలసిన కొత్త పరిణామాలు.

ఇటువంటిది ఏర్పడినపుడు, వ్యూహాత్మకంగా అగ్రరాజ్యం ఎంతో వివేకంగా, చతురతతో వ్యవహరించాలి. ట్రంప్ నాయకత్వాన అమెరికా అవివేకపు వ్యూహాన్ని అనుసరిస్తున్నందున, ఇండియా వంటి మిత్రదేశంతోనూ సంబంధాలు చెదిరిపోతున్నాయి. అట్లా జరగకుండా ఉండేందుకు మోదీ మొదట గట్టి ప్రయత్నమే చేశారు. కానీ, ఏమి చేసైనా సరే తన 'మాగా' లక్ష్యాలను సాధించాలనే ఒత్తిడుల మధ్య అమెరికా అధ్యక్షుడు– యూరప్, కెనడా, జపాన్, మెక్సికో వంటి ఇతర మిత్ర దేశాలకు వలెనే ఇండియాను కూడా దారికి తెచ్చుకోగలనని నమ్మారు. వాటికీ, భారత్‌కూ మధ్యగల వ్యత్యాసాలను గ్రహించలేకపోయారు. దానితో, ఇంధనం అయితేనేమి, వ్యవసాయ రంగం అయితేనేమి... దేశ ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం నిలబడక తప్పలేదు. వాస్తవానికి వ్యవసాయ రంగం విషయమై, గాట్ – డబ్ల్యూటీవో చర్చల దశలో ఇండియా ఇతర వర్ధమాన దేశాలతో కలిసి గట్టిగానే నిలబడింది. అదే ఇపుడు కూడా జరుగుతున్నది. పాఠాలు నేర్చుకోనిది అమెరికా కూటమే!

ఆర్థిక భూకంపం రానుందా?

ఇంతవరకు బాగున్నది. రాగల కాలపు పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. ట్రంప్ తన ధోరణిని మార్చుకుని అంతా సుఖాంతం కావచ్చునా? భారతదేశంతో తగినంత రాజీ పడవచ్చునా? ట్రంప్ స్వభావమేమిటో ఈ సరికి బోధపడింది గనుక ఆయనను నమ్మలేమని ప్రధాని మోదీ తన స్వతంత్ర వైఖరిని కొనసాగించగలరా? మొన్నటి 6వ తేదీ తర్వాత వడివడిగా రష్యా అధ్యక్షుడు పుతిన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలాతో సంప్రతింపులు జరిపి, పుతిన్‌ను ఆహ్వానించి, చైనాలో జరగనున్న షాంఘై సహకార సంస్థ సమావేశాలకు వెళ్ళనున్నట్లు ప్రకటించి, అక్కడ జిన్‌పింగ్‌తో సమావేశం జరగవచ్చుననే సంకేతాలు పంపినందున, ఇవన్నీ మునుముందు బ్రిక్స్ వేదికగా కొత్త మార్గాన్ని మరింత దృఢంగా అనుసరించగలమనే సూచనలు కావచ్చునా? అటువంటిది గనుక అయితే, ఆగస్టు 6 నాటి భూ ప్రకంపనలు రాగల కాలపు భూకంపానికి నాంది అవుతాయి. అట్లా జరగాలన్నదే వర్ధమాన ప్రపంచపు కోరిక కావచ్చు కూడా! కానీ అది తేలిక కాదు. ట్రంప్ ప్రతీకారాన్ని తట్టుకునేందుకు సైతం సిద్ధపడవలసి ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

దేశమంత మందికి ఓటుండదా?

కామెంట్



కరణ్ థాపర్

బిహార్ ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ఐఆర్–సర్)లో భాగంగా ఎంత మంది పేర్లు గల్లంతయ్యాయి? దానికంటే ముఖ్యంగా, ఎంతమంది పేర్లు ఈ తాజా జాబితాల్లో నమోదు కాలేదు? ఈ సంఖ్యలు చాలా ముఖ్యం. వీటిని బట్టే 'సర్' పట్ల నా అభిప్రాయం ఉంటుంది. నేననుకోవడం, మనకు చెప్పిన దానికంటే వాస్తవ సంఖ్యలు చాలా ఎక్కువగా ఉంటాయి. వివరాల్లోకి వెళ్దాం.

ఎన్నికల కమిషన్ ఒకటో తేదీన ముసాయిదా జాబితా విడుదల చేసింది. దీని ప్రకారం, 65.6 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారు. సవరణ ప్రక్రియ ప్రారంభించడానికి ముందున్న మొత్తం ఓటర్లలో వీరు దాదాపు 9 శాతం ఉంటారు. ఈ తాత్కాలిక సంఖ్య చిన్నదేం కాదు. ఇప్పటికే ఇది ఆందోళన కలిగిస్తోంది.

పెరగాల్సింది పోయి...

మరొక విషయం ఏమిటంటే – 2024 సాధారణ ఎన్నికలతో, 2020 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చినట్లయితే ఈ దఫా నమోదైన ఓటర్లు తక్కువగా ఉన్నారు. 2005లో రెండు సార్లు వచ్చిన అసెంబ్లీ ఎన్నికలు మినహా, 1977 నుంచి ఇప్పటి వరకు ప్రతి ఎన్నికలకూ మొత్తం ఓటర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అయితే, ఈ ఏడాది జరగనున్న ఎన్నికల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది.

బిహార్ రాష్ట్ర అధిక సంతానోత్పత్తి రేటు (ఫెర్టిలిటీ రేట్)ను దృష్టిలో పెట్టుకుంటే, ఇది మరింత కలవరపెడుతోంది. 2001, 2011 మధ్య కాలంలో వయోజనులు 28.5 శాతం పెరిగారు. అయినా 2025లో మొత్తం రిజిస్టర్డ్ ఓటర్ల సంఖ్య పెరగటానికి బదులు తగ్గటం వింతే!

కొద్ది రోజుల క్రితం ప్రకటించిన దానికంటే అంతిమంగా ప్రకటించే వాస్తవ తొలగింపులు పెరిగే అవకాశం ఉంది. 'భారత్ జోడో అభియాన్' నేషనల్ కన్వీనర్ యోగేంద్ర యాదవ్ ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 65.6 లక్షలు అనే సంఖ్య ఇంకా పెరుగుతుందన డానికి ఆయన మూడు కారణాలు చెబుతున్నారు. ఒకటి – బూత్ లెవెల్ ఆఫీసర్స్ ముసాయిదాలోని పలు పేర్లను తిరస్కరించే అవకాశం ఉంది. వారికా అధికారం ఉంది. రెండు – తమ దరఖాస్తు ఫారాలను అప్‌లోడ్ చేసిన అనేక మంది వాటిలో పొందుపరచిన వివరాలకు సరైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించి ఉండరు.

◆అధికారిక ప్రకటన ప్రకారం, 9 శాతం పేర్ల తొలగింపునే పరిగణనలోకి తీసుకున్నా సరే, ఇప్పటికిప్పుడు దేశ వ్యాప్తంగా 'సర్' నిర్వహిస్తే ఈ లెక్కన 9 కోట్ల మంది పేర్లు అదృశ్యమవుతాయి. వీరి సంఖ్య బ్రిటన్ లేదా ఫ్రాన్స్ జనాభాకు ఒకటిన్నర రెట్లు!

అలాంటి వారి పేర్లను మలి విడతలో తొలగిస్తారు. మూడు – ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు స్థానికంగా విచారణ చేసి మరికొన్ని పేర్లను కొట్టేసే వీలుంది. ఈ మూడు కారణాల ప్రకారం, 65.6 లక్షలు అనేది ఆరంభ సంఖ్య మాత్రమే. చివరి లెక్కల్లో ఇది తప్పనిసరిగా చాలా ఎక్కువ ఉంటుంది.

నమోదు కానివారి మాటో?

ఓటర్ల జాబితాలపై, అంతిమంగా బిహార్ ఎన్నికలపై ఈ పేర్ల తొలగింపు ప్రభావం గురించి మాత్రమే విశ్లేషణ జరిగింది. మరి, జాబితాల్లో కొత్త ఓటర్ల నమోదు మాటేమిటి? ఈ అంశానికి దక్కాల్సినంత ప్రాధాన్యం దక్కలేదు.

యోగేంద్ర యాదవ్ దీనిపై అధ్యయనం చేశారు. ప్రభుత్వ అధికారిక జనాభా అంచనాలనే ఆయన తన అధ్యయనానికి ఆధారంగా తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ సైతం ఓటరు జాబితాలను ఒకటికి రెండుసార్లు తనిఖీ చేయడానికి, ధ్రువీకరించుకోవడానికి వీటినే ప్రాతిపదికగా తీసుకుంటోంది.

బిహార్ ఓటర్ల జాబితాల్లో నమోదైన వయోజన జనాభా (18 ఏళ్ల లేదా అంతకు మించిన వయసు ఉన్నవారు) శాతం వారి వాస్తవ జనాభాలో ఎంత ఉందో యోగేంద్ర యాదవ్ లెక్కగట్టారు. 'సర్'కు ముందు, జూన్ 24న ఇది 97 శాతం. 'సర్' తర్వాత, ఇప్పుడు 88 శాతం! అంటే, 9 శాతం తగ్గింది. ఇది 94 లక్షలకు సమానం. జాబితాల నుంచి తొలగించిన 65.6 లక్షల పేర్ల కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువ. మరో విధంగా చెప్పాలంటే, 30 లక్షల మంది వయోజనులు అర్హత ఉండీ ఓటర్లుగా నమోదు కాలేదు.

యోగేంద్ర యాదవ్ తన అధ్యయన ఫలితాలు ప్రచురించి పది రోజులు దాటింది. ఎన్నికల కమిషన్ వీటిని ఖండించలేదు, ప్రశ్నించలేదు. ఈ నిశ్శబ్దాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?


దేశమే అదృశ్యం?

యోగేంద్ర యాదవ్ తన అధ్యయనంలో రెండు నిర్ధారణలకు వచ్చారు. బిహార్ ఓటర్ల జాబితాల్లో పేర్లు అదృశ్యమైన వారూ, పేర్లు నమోదు కాని వారూ కలిసి 1.5 కోట్ల మంది ఉంటారని ఆయన అంచనా. ఇది నిజం కాకపోతే బాగుండని అనుకోవడం తప్ప మనం చేయగలిగింది లేదు. ఇక రెండో నిర్ధారణ మనందరికీ ఆందోళన కలిగించక మానదు. అధికారిక ప్రకటన ప్రకారం, 9 శాతం పేర్ల తొలగింపునే పరిగణనలోకి తీసుకున్నా సరే, ఇప్పటికిప్పుడు దేశ వ్యాప్తంగా 'సర్' నిర్వహిస్తే ఈ లెక్కన 9 కోట్ల మంది పేర్లు అదృశ్యమవుతాయి. వీరి సంఖ్య బ్రిటన్ లేదా ఫ్రాన్స్ జనాభాకు ఒకటిన్నర రెట్లు! బిహార్ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ గురించి ఒక అభిప్రాయానికి వచ్చేందుకు ప్రధానంగా ఈ వివరాలు సరిపోతాయని అనుకుంటున్నాను. మీరేమంటారు?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

తరతరాల సంప్రదాయపు సందడి

ఇన్ బాక్స్



తరతరాల నుండి మౌఖికంగా వస్తున్న బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండగ. హిమాలయాలలో ఘోర తపస్సు చేస్తున్న శివుడి దృష్టిని ఆకర్షించడానికి పార్వతి దేవి కూడా తపస్సుకు ఉపక్రమించి శివుని భర్తగా పొందిన ఘట్టానికి గుర్తుగా లంబాడీలు 'తీజ్ దివస్' జరుపుకొంటారు.

శ్రావణ మాసంలో నిర్వహించుకుంటారీ ఈ తీజ్ పండుగను! పెళ్లి కావలసిన అమ్మాయిలు తండా నాయకుని ఇంటికి వెళ్లి తీజ్ పండుగ నిర్వహణకు అభ్యర్థిస్తూ నృత్యం చేస్తారు. తండా వాసుల సమాలోచనతో నాయక్ సమ్మతిస్తే, మంగళవారం 'శీత్ల భవానీ' పూజతో తీజ్ కార్యక్రమాలు మొదలవుతాయి. మంగళవారం వనభోజనం పద్ధతిలో తండా బయటికి వెళ్లి రాయిని ఒక చెట్టు మొదట్లో 'శీత్ల భవానీ'కి ప్రతిరూపంగా పెట్టి సంప్రదాయ బద్ధంగా పూజ నిర్వహిస్తారు. తర్వాత అదే మంగళవారం రోజు సాయంత్రం తండా నాయకుని ఇంటి ముందు ఒక బిందెలో గోధుమలను నానబెడతారు. మరుసటి రోజు బుధవారం సాయంత్రం వెదురుతో తయారు చేయించిన చిన్న కంకా బుట్టలలో కొంత ఎరువు వేసి, ఈ గోధుమలను చల్లుతారు. బుట్టలతో పాటు దండి మేరామా మాత, సద్గురు శ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ పేర్లతో టేకాకు దొప్పలలో గోధుమలను వేసి, బుట్టలన్నింటినీ నాయకుని ఇంటి ముందు పందిరి వేసి కర్రలకు వేలాడదీస్తారు లేదా పందిరి పైన పెడతారు. వరసలు కలిసిన ఇద్దరు పెళ్లీడు అమ్మాయిలు 9 రోజులు పూజారులుగా వ్యవహరిస్తారు. ఆ రోజు నుండి ప్రతీరోజు ఆడపడుచులు ఆడుతూ, పాడుతూ దగ్గరలో ఉన్న చెరువు లేదా బావి నుండి నీళ్ళను తెచ్చి తీజ్ నిమజ్జనం జరిగే వరకు మూడుసార్లు బుట్టలలో పోసి గోధుమలను పెంచుతారు. 8వ రోజు 'డమోళి' కార్యక్రమం ఉంటుంది. ఇంటి వద్ద రొట్టెలు, బెల్లం, నెయ్యిలతో తయారుచేసిన తీపి పదార్థాన్ని నెత్తిపై పెట్టుకొని తిరుగుతూ తండా వాసులకు పంచుతారు.

గురువారం చివరి (9వ) రోజు శ్రీ సేవాలాల్ మహారాజ్ హోమం, దండి మేరామాకు సంప్రదాయ పూజ తరువాత గోధుమ బుట్టలను దింపి, నాయక్ ఇంటి ముందు పెడతారు. సాయంత్రం బుట్టలను తీసుకొని గుంపుగా చెరువులో నిమజ్జనం చేయడానికి ఆటపాటలతో వెళతారు. నిమజ్జనం తర్వాత తెచ్చిన సద్ది రొట్టెలను తిని, తిరిగి తండాకు చేరుకుంటారు. తండా, పట్టణం అనే తేడా లేకుండా అన్ని చోట్లా ఉండే మన గిరిజన సోదరులు ఈ పండుగ జరుపుకొని సంప్రదాయాన్ని కొనసాగించాలి. ప్రభుత్వం అధికారికంగా దీన్ని జరపడానికి చర్యలు తీసుకోవాలి.

– ఆచార్య అజ్మీర సీతారాం నాయక్ I మాజీ పార్లమెంట్ సభ్యులు, మహబూబాబాద్

డేటా పాయింట్

రైలు టిక్కెట్లపై 45 శాతం సబ్సిడీ

మన దేశంలో అత్యంత చవకైన ప్రజారవాణా అంటే రైల్వేలే! సుదూర ప్రాంతాలకు కూడా చాలా తక్కువ ఖర్చుతో తీసుకెళ్తాయి. ప్రయాణికుల కోసం రైలు సర్వీసులను కూడా ఏటా పెంచుతూ వస్తోంది రైల్వే శాఖ. ఈ క్రమంలో ప్యాసింజర్ టిక్కెట్ల మీద ఏటా కొన్ని వేల కోట్ల రూపాయల సబ్సిడీని అందిస్తోంది. ఉదాహరణకు ప్యాసింజర్ రైళ్లు అందిస్తున్న సేవ విలువ రూ.100 అనుకుంటే, టిక్కెట్టు ధర రూ.55 మాత్రమే. మిగతా 45% సబ్సిడీ రైల్వే శాఖే భరిస్తోంది. మరోపక్క రైలు ప్రయాణాల్లో భద్రత విషయంలో కూడా ప్రభుత్వం చేసే ఖర్చు ఏటా పెరుగుతోంది.

ఆధారం: రైల్వే శాఖ

2019-20లో దేశంలో రోజుకు సగటున నడిచిన ప్యాసింజర్ రైళ్ల సంఖ్య 13,169

2024-25లో ఈ ప్యాసింజర్ రైళ్ల సంఖ్య 13,940

2025-26లో... 2025 జూలై వరకు ప్రారంభమైన కొత్త రైలు సర్వీసులు 86


దేశంలో 2025 ఆగస్ట్ 7 నాటికి నడుస్తున్న వందేభారత్ రైళ్లు 144

2023-24లో ప్యాసింజర్ టిక్కెట్ల మీద ఇచ్చిన మొత్తం సబ్సిడీ రూ. 60,466 కోట్లు

రైలు ప్రయాణాలు, స్టేషన్లలో భద్రతకు సంబంధించి 2023-24లో రైల్వే శాఖ చేసిన వ్యయం రూ. 1,14,022 కోట్లు

దర్శన యోగ్యత కలవారే...

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మన పురాణాల్లో మునులు, ఋషులకు సంబంధించి అనేక కథలు కనిపిస్తాయి. ఋషి ఎవరు? ముని ఎవరు? అనే విషయం మనలో చాలామందికి తెలియదు. ఇద్దరూ ఒక్కటే అనుకుంటాం. కానీ వారిద్దరి మధ్య తేడా ఉంది.

ధ్యానం చేయువారందరూ మునులే! కానీ ఎవరికి దర్శన యోగ్యత కలదో వారు ఋషులు. దర్శనం అంటే ఏమిటి? ఇది ఏదో ఒక దేవుని దర్శనమా? కాదు. అనాదిగా, అంతట నిండియున్న బీజాక్షరముల ప్రకంపనలను హృదయంలో అనుభవించుటయే 'దర్శనం'. దీనిని సాధించిన వారే 'మంత్ర ద్రష్టలు'. అటువంటి వారినే 'ఋషులు' అని పిలుస్తారు.

వేదం ఏనాటిది అని తెలుసుకోవడానికి కొందరు పరిశోధనలు చేయడానికి ప్రయత్నించారు. మరికొందరు ఆ ప్రయత్నంలో ఉన్నారు. వేద మంత్రాలు యోగ్యులైన వారి హృదయాల నుండి బహిర్గతమైనవి. అలాగే వారి దయను పొందడానికి యోగ్యత కలిగిన శిష్యులు ఉన్నంతకాలం అవి (వేద మంత్రాలు) ఈ భూమిపై ఉంటాయి. ఆ తర్వాత అవి ఆకాశంలో కలిసిపోయి యోగ్యులైన మహర్షులకు దర్శనమిస్తాయి. ఈ కారణం వలన వైదిక ఋషులెవ్వరూ కూడా వేదాలు తామే రచించామని చెప్పుకోలేదు.

పీసీబీ తీరుపై మంత్రి కొండా సురేఖ ఫైర్!

- జనావాసాల నుంచి బల్క్ డ్రగ్ కంపెనీలను మరో చోటకు తరలించాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఉన్నతాధికారుల తీరుపై అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. జనావాసాలున్న చోట ఉన్న ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీలను మరో చోటికి తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఔటర్ రింగు రోడ్డు అవతలనే ఫార్మా కంపెనీలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కూడా చెప్పారని.. ఆ మేరకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కంపెనీలకు అనుమతుల్లో ఉదా సీనత సరికాదని, ఎక్కడైనా ఇష్టారీతిన వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఫార్మా, బల్క్ డ్రగ్ పరిశ్రమల అనుమతుల విషయంలో అవకతవకలపై వస్తు న్న ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం మంత్రి సచివాలయంలో పీసీబీ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని.. అందుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు.

ఇంజనీరింగ్ ఫీజులపై స్పష్టతేది?

ప్రత్యేక కమిటీ భేటీకి అడ్డంకులు

- ఎవరికివారే ఉప కమిటీలతో మంతనాలు
- సమయం దగ్గర పడుతున్నా తేల్చని కమిటీ
- ఈ ఏడాది ఫీజుల పెంపు ఉంటుందా?
- ఆందోళనలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజులపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ ఒక్క అడుగు కూడా ముందుకేయలేదు. కమిటీలో ఉన్న సభ్యులు ఎవరికి వారు ఉప కమిటీలు ఏర్పాటు చేసుకొని విడివిడిగా సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రధాన కమిటీ సభ్యులు మాత్రం ఇంతవరకూ దీనిపై చర్చించలేదు. రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ వచ్చే మూడేళ్ల బ్లాక్ పీరియడ్‌కు ఇంజనీరింగ్ ఫీజులను ఖరారు చేసింది. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపింది. అయితే, ఫీజుల పునఃపరిశీలనకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీని వేసింది. ఆడిట్, టౌన్‌ప్లానింగ్, సంక్షేమ శాఖ, సాంకేతిక, ఉన్నతవిద్య విభాగాల అధిపతులను ఈ కమిటీలో సభ్యులుగా చేర్చింది. గతవారం ఈ కమిటీ తొలిసారిగా భేటీ అయ్యి ప్రైవేట్ కాలేజీల అభిప్రాయాలను తెలుసుకుంది. ఆ తర్వాత ప్రతీ సభ్యుడు ఉప కమిటీలు వేసుకున్నారు. రెండోసారి సమావేశం ఇంతవరకూ చేపట్టలేదు. ఉన్నత విద్య, సాంకేతిక విద్య విభాగాల మధ్య సమన్వయం కొరవడినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

ముందుకు... వెనక్కి

ఇంజనీరింగ్ కాలేజీల్లో మౌలిక వసతులు, ఫ్యాకల్టీ, న్యాక్, ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకులను పరిగణనలోనికి తీసుకోవాలని ఉన్నతవిద్య అధికారులు భావించారు. ఈ దిశగా కసరత్తు మొదలు పెట్టారు. ఏ కాలేజీకి ఏ స్థాయిలో ర్యాంకులు వస్తున్నాయని పరిశీలిస్తున్నారు. సాంకేతిక విద్య ఉన్నతాధికారి కూడా ఈ కమిటీలో ఉన్నారు. వాస్తవానికి ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్య అధికారులు కలిసి జాతీయ ర్యాంకులను పరిశీలించాలి. కానీ సాంకేతిక విద్య అధికారులు మాత్రం జాతీయ ర్యాంకులతో పనే లేదని చెబుతున్నారు. ప్రతీ ప్రైవేట్ కాలేజీ ఈ వ్యవహారంలో అనేక మార్గాల్లో వెళుతుందని, అలాంటప్పుడు వీటిని ప్రామాణికంగా తీసుకోవడం సరికాదంటోంది. సాంకేతిక విద్య అధికారులు అడ్డుపడుతున్న కారణంగా ఉన్నత విద్యామండలి అధికారులు ప్రతీ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. అంతర్గత కమిటీల సమావేశాలను కూడా మండలి కార్యాలయంలో నిర్వహించడం లేదు. అంతిమంగా మా నివేదిక మేం ఇస్తామని మండలి అధికారులు చెబుతున్నారు. సాంకేతిక విద్య అధికారులు కూడా తమ పరిశీలనను ప్రధాన కమిటీ ముందు వెల్లడించాల్సిన అవసరమే లేదంటున్నారు.

ఫీజుల సంగతేంటి?

ఇంజనీరింగ్ సీట్ల భర్తీ దాదాపు పూర్తికావొచ్చింది. కన్వీనర్ కోటా కింద ఇక స్పాట్ మాత్రమే మిగిలింది. ఇంత వరకూ ఫీజులపై తేల్చకపోవడంతో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫీజులు ఖరారు చేయకపోతే నష్టపోతామని కాలేజీ యాజమాన్యాలు అంటున్నాయి. ఇప్పుడు ఖరారయ్యే ఫీజు వచ్చే నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సుకు వర్తిస్తుంది. కౌన్సెలింగ్ సమయంలో పాత ఫీజులే తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. ఒకవేళ ఫీజులు పెంచితే అవి వర్తిస్తాయని కౌన్సెలింగ్‌లో పేర్కొనలేదు. ఇప్పుడు ఫీజులు పెంచినా విద్యార్థులకు ముందే చెప్పలేదు కాబట్టి వ్యతిరేకత వచ్చే వీలుందని యాజమాన్యాలు అంటున్నాయి. తాత్సారం చేయడంలో ఆంతర్యమేంటని యాజమాన్యాలు అధికారులను ప్రశ్నిస్తున్నాయి. దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నాయి.

యూరియాపై కేంద్ర మంత్రి తప్పుడు ప్రకటనలు

- ఈ నెలలోనూ సరఫరాలో 35 శాతం లోటు!
- మంత్రి తుమ్మల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి అవసరమైన యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రైతులతో కేంద్రం క్రూరమైన ఆటలాడుతోందని ఆయన విమర్శించారు. రాష్ట్రానికి కేటాయించిన యూరియాను సక్రమంగా సరఫరా చేయాలని కేంద్రానికి ఎన్ని లేఖలు రాసినా స్పందించడం లేదని బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నెలకోసారి రాష్ట్ర వ్యవసాయ అధికారులు కూడా కేంద్రంలోని ఉన్నతాధికారులను కలిసి విన్నవించినప్పటికీ కదలిక లేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు రాజకీయ ప్రకటనలు చేయడం తప్ప, యూరియా తెప్పించడం లేదని విమర్శించారు. పార్లమెంటు సాక్షిగా యూరియాపై కేంద్ర మంత్రి తప్పుడు ప్రకటనలు చేశారని ఈ సందర్భంగా ఆయన ఆక్షేపించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినా, ఏప్రిల్ నుంచి జూలై వరకు 32 శాతం కొరత ఏర్పడిందని తెలిపారు. జూలై వరకు ఉన్న లోటును ఆగస్టులో పూడుస్తూ పూర్తిస్థాయిలో కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల మేర సరఫరా చేయాలని కేంద్ర మంత్రి నడ్డాను కోరగా, ఈ నెల కోటాలోనూ 35 శాతం కోత విధించడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో రోజుకు 10 నుంచి 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరుగుతుంటే, ఆగస్టు నెలలో 3 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమవుతుందని తెలిపినప్పటికీ, కేంద్రం స్పందించకుండా రిక్తహస్తం చూపిందని తుమ్మల ఆవేదన వ్యక్తం చేశారు.

యూరియా కష్టాలు తీర్చండి

- మాజీ మంత్రి హరీశ్‌రావు


రైతులతో మాట్లాడుతున్న హరీశ్ రావు

సిద్దిపేట రూరల్: ఎన్నడూలేని విధంగా రైతులు యూరియా కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలో యూరియా కోసం బారులు తీరిన రైతులను చూసి తన కారును ఆపిన హరీశ్‌రావు రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు యూరియా ఇవ్వలేని చేతగాని, దద్దమ్మ ప్రభుత్వాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరిగోస పెడుతున్న కాంగ్రెస్, బీజేపీలకు రైతుల ఉసురు తగులుతుందన్నారు. నాలుగు రోజుల నుంచి వ్యవసాయ పనులు పక్కన పెట్టి రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 51సార్లు ఢిల్లీకి పోయినా ఎరువుల కొరత తీర్చలేదని హరీశ్‌రావు విమర్శించారు.

అప్పుల కోసమే కొత్త డిస్కం

▶ మొదటి పేజీ తరువాయి

కొత్త డిస్కం ఏర్పాటు ఆర్థిక సంస్థల వద్ద నిధులు పొందడానికేనని డిస్కం ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

రూ. 32 వేల కోట్లు టార్గెట్

ప్రస్తుతం రాష్ట్రంలో రెండు డిస్కంలున్నాయి. ఇవి అన్నివిధాలా ఆర్థిక రుణాలు పొందాయి. ఇవే డిస్కంలు తిరిగి పొందడానికి కొన్ని నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయి. అప్పులు చేస్తే తప్ప ఆర్థికంగా ముందుకెళ్లడం కష్టమని విద్యుత్ సంస్థలు భావిస్తున్నాయి. రాజధానితోపాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుత సంవత్సరంలో 96,596 ఎంయూల విద్యుత్ వినియోగం ఉంది. ఇది 2030 నాటికి 1.22 లక్షల ఎంయూలకు చేరొచ్చని అంచనా వేస్తున్నారు. 2033–24 నాటికి రాష్ట్రంలో 1.30 లక్షల మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం కావొచ్చు. కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి డిస్కంలు ఇటీవల దీనిపై ఈ తరహా నివేదికలే ఇచ్చాయి. డిమాండ్‌ను చేరుకోవడానికి విద్యుత్ సంస్థల పనితీరును గణనీయంగా పెంచాల్సి ఉంటుంది. తొమ్మిది 440 కేవీ సబ్‌స్టేషన్లు, 220 కేవీ సబ్‌స్టేషన్లు 34, 132 కేవీ సబ్‌స్టేషన్లు 75 ఏర్పాటు చేయాలని డిస్కంలు పేర్కొన్నాయి. ఈ ప్రక్రియకు ట్రాన్స్‌కో, డిస్కంలకు కలిపి రూ. 32 వేల కోట్లు అవసరం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని విద్యుత్ సంస్థలు సమకూర్చుకోవడానికి కొత్త డిస్కం ఏర్పాటు మార్గమని భావిస్తున్నారు. పీఎఫ్‌సీ, ఇతర ఆర్థిక సంస్థలు కొత్త డిస్కంలకు రుణాలు ఇస్తాయని కన్సల్టెన్సీ సంస్థలు అధికారులకు సలహాలిచ్చాయి. ఈ దిశగా భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

స్త్రీనిధిపై పూర్వ ఉద్యోగుల దుష్ప్రచారం

- సీతక్కకు స్త్రీనిధి ఉద్యోగుల సంఘం ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: స్త్రీనిధి సంస్థ కార్యకలాపాలపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు.. స్త్రీనిధి ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. సంస్థ పూర్వ ఉద్యోగులు చేస్తున్న దుష్ప్రచారంతో రుణ చెల్లింపులు తగ్గిపోయాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సంస్థ ప్రతిష్టను దిగజార్చేలా అసత్య ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంస్థ ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా మంత్రి సీతక్క హెచ్చరించారు. బుధవారం సచివాలయంలో మంత్రిని ఈ సంఘ ప్రతినిధులు కలిసి.. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న వడ్డీ లేని రుణాలలో.. మొదటి ప్రాధాన్యం స్త్రీ నిధి రుణాలకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ట్యాంక్‌బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, కుల వృత్తులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం గౌడ సంఘం నేతలతో శ్రీనివాస్‌గౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఈ నెల 18లోగానైనా ట్యాంక్ బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. లండన్‌లోని కేంబ్రిడ్జి వర్సిటీలో ఆయన చరిత్ర, విగ్రహంతో పాటు భద్రంగా ఉందన్నారు. ఆయనకు సర్దార్ అనే బిరుదును కూడా ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు అవుతున్నా.. విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నవోదయ విద్యాలయ సమితి
విద్యా మంత్రిత్వశాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తిగల సంస్థ
పాఠశాల విద్య మరియు అక్షరాస్యత శాఖ
భారత ప్రభుత్వం

తరగతి VI JNVST 2026 కొరకు
ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ పొడిగింపు కొరకు ప్రకటన

ఎంపిక పరీక్ష ద్వారా జవహర్ నవోదయ విద్యాలయాలలో తరగతి–VI (సెషన్ 2026–27)లో ప్రవేశం కొరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పురోగతిలో ఉన్నది. ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలుకు చివరి తేది 27 ఆగస్టు, 2025 వరకు పొడిగించబడినది. అర్హత గల అభ్యర్థులు లింక్ https://cbseitms.rcil.gov.in/nvs దర్శించి ఉచితంగా దరఖాస్తు చేసుకొనవచ్చును.
నవోదయ విద్యాలయ సమితి ద్వారా జారీచేయబడనది.

NFDC

56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా, గోవా
ఉత్తమ వెబ్‌సిరీస్ (ఓటీటీ) అవార్డ్, 2025 కొరకు ఎంట్రీల కోసం పిలుపు

అర్హత
01-08-2024 నుండి 31-07-2025 మధ్య వెబ్-సిరీస్ నిర్మించి మరియు ఓటీటీలో రిలీజ్ చేసి ఉండాలి
నిడివి : కనీసం 180 నిమిషాలు మొత్తం, 3+ ఎపిసోడ్లు (ప్రతిది 25+ నిమిషాలు)
భాష : ఏదైనా భారతీయ భాష (ఇఎస్‌టితో)
దరఖాస్తుదారులు : భారతీయ నిర్మాత, నిర్మాణ సంస్థ లేదా ఓటీటీ వేదిక
ఉత్తమ వెబ్-సిరీస్ (ఓటీటీ) అవార్డ్ : రూ. 10 లక్షలు + సర్టిఫికెట్

DEADLINE EXTENDED

ఆన్‌లైన్ దాఖలుకు గడువు తేది : ఆగస్టు 18, 2025 (సా. 6 గం. ఐఎస్‌టి వరకు)
హార్డ్-కాపీ దాఖలుకు గడువు తేది : ఆగస్టు 25, 2025 (సా. 6 గం. ఐఎస్‌టి వరకు)

నిబంధనలు మరియు ఎంట్రీ ఫారాల కొరకు, దర్శించండి :
www.iffigoa.org



FD-NFDC కాంప్లెక్స్, 24, డా. గోపాలరావు దేశ్‌ముఖ్ మార్గ్, ముంబయి – 400 026.
ఫో : +91-22-48251770
ఇ-మెయిల్ : webseriesaward@gmail.com

CBC 22202/11/0002/2526

CSIR-INDIAN INSTITUTE OF CHEMICAL TECHNOLOGY
Uppal Road, Tarnaka, Hyderabad – 500 007
Telangana State, India https://www.iict.res.in

Advertisement No. 03/2025 — Dated: 14.08.2025

Date of Commencement of Online Application : 14.08.2025 at 09.00AM onwards

Last date for receipt/ submission of Online Application : 12.09.2025 at 11.59 PM

CSIR-IICT is a Premier Research Institute under the aegis of CSIR, an autonomous body under Ministry of Science & Technology, Government of India, invites ONLINE APPLICATIONS from enthusiastic, young and dynamic Indian Nationals for the following posts as per details given below:

Post Code	Name of the post	Total No. of posts & Reservation Details	Pay Matrix (7th CPC)	Total Emoluments (As per 7th CPC)	** Upper Age Limit not exceeding (as on 12.09.2025)
JST01	JUNIOR STENOGRAPHER	01 post [ST]	Level-4	Rs.52,755/-*	27 years
MTS02	MULTI-TASKING STAFF	Total No. of posts - 08 UR-03, EWS - 01 OBC(NCL) -02 SC - 01 ST - 01	Level-4	Rs.35,393/-*	25 years

* Total Emoluments means approximate total emoluments on minimum pay of the level including House Rent Allowance in Class 'X' City.

** Please see S.No.3 of General Information & Conditions for age relaxation.

For further details please visit our website https://www.iict.res.in /CAREERS and apply through online by filling the application form available there. The detailed advertisement, terms & conditions and instructions to the candidates are available on the website.

Sd/-
Controller of Administration

OFFICE OF THE DIRECTOR GENERAL ASSAM RIFLES
SHILLONG - 793 010

ASSAM RIFLES MERITORIOUS SPORTSPERSONS RECRUITMENT RALLY 2025

Memo No. I.12016/A Branch (Rect Cell)/2025/631 — Dated : 31 Jul 2025

1. Online applications are invited from Indian Nationals Male & Female both as prescribed in detail advertisement to fill up **69 vacancies** in Rifleman/Riflewomen General Duty posts in the Assam Rifles against Meritorious Sportspersons Recruitment Rally 2025.
2. Last date of receipt of applications for all candidates is **15 Sep 2025.** Please login to official website of the Assam Rifles www.assamrifles.gov.in to access the online Application Form. The online SERVER will start functioning from **16 Aug 2025**.
3. Eligibility Criteria. Age Limit, Education Qualification, Qualitative Requirements, Relaxation in Age, Physical Standards etc and other instructions are furnished in detailed advertisement available at official website of the Assam Rifles www.assamrifles.gov.in and Employment News dated **16 Aug 2025.**
4. How to apply. Applications will be accepted through online mode only. To apply, fill up the online application by clicking on "**ONLINE APPLICATION**" option and follows the instructions given on the Online Application portal of the website. The online applications portal will remain functional till last date of submission of online Application Form.
5. Candidates to undergo Physical Standard Test (PST), Motor Ability Test (MAT), Field Trials in respective sports and Medical Examination at own risk and expense. Injuries including fatal due to the test during recruitment rally and transit will not be compensated in any matter by the Govt. or Assam Rifles.
6. Assam Rifles reserves the right to make any changes in the advertisement or cancel it without assigning any reasons.

Sd/- XX XX XX
(Keshav Sharma)
Dy. Comdt.
Staff Officer-2 (Recruitment)
for Director General Assam Rifles

అమీన్‌పూర్ మున్సిపల్ కౌన్సిల్ :: సంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండర్ ప్రకటన నం. Engg-MCA/E1/NIT/10/2025-26, తేదీ: 13.08.2025
సంక్షిప్త టెండర్ ప్రకటన
పనుల సంఖ్య: 18 నం.లు. అంచనా కాంట్రాక్ట్ విలువ: రూ.208.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ మరియు సమయం: 18.08.2025న సా.4.30 గం. నుండి. బిడ్ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 21.08.2025న సా.4.30 గం. వరకు. ధర బిడ్ తెరుచు తేదీ: 21.08.2025న సా.5.00 గం.కు. సంబంధిత అధికారి చిరునామా: కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ. తదుపరి వివరాలను www.tender.telangana.gov.inలో చూడవచ్చును. సం/- మున్సిపల్ కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ
DIPR RO No.6450-PP/CL/Advt/1/2025-26, Dt: 13.08.2025

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, PR డివిజన్, ఇబ్రహీంపట్నం
టెండరు ప్రకటన
టెండరు ప్రకటన నం. TO/03/2025-26 తేది: 12-08-2025
మొత్తం (40) పనులు: రూ.351.50 లక్షల మొత్తం అంచనా వ్యయంతో దిగువ సంతకందారు SDF 2023-24, DMFT & CRR(SCP) గ్రాంటుల క్రింద సిసి రోడ్లు మరియు భవనాల నిర్మాణం పనుల కొరకు టెండర్లు కోరుచున్నారు. టెండరులో పాల్గొనుట కొరకు దరఖాస్తు 19-08-2025 వరకు మరియు టెండరు షెడ్యూల్స్‌ను 20-08-2025న EE PR ఇబ్రహీంపట్నం నుండి పొందవచ్చు మరియు జారీ తేదీ నుండి 21-08-2025న పాల్గొనవచ్చు. ఇతర వివరాలను EE PR ఇబ్రహీంపట్నం RR జిల్లా కార్యాలయం నుండి పొందవచ్చు. ఇమెయిల్ ఐడి: eepribp@gmail.com
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, PR డివిజన్, ఇబ్రహీంపట్నం, RR జిల్లా.
DIPR RO No.6418-PP/CL/Advt/1/2025-26, Dt: 13-08-2025

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ & కొటేషన్ నోటీసు
Ref: 1.NIT No.: 1.777/DB/D1/TUFIDC/Shadnagar/Grave Yard/2025-26/2, Date: 13-08-2025 (3rd Call), (ఎస్సీ కొరకు కేటాయించబడినది) I. టెండరు ప్రకటన (1 నం.): మొత్తం అంచనా వ్యయం రూ.50.00 లక్షలతో TUFIDC లోన్ అసిస్టెన్స్ క్రింద షాద్‌నగర్ మున్సిపాలిటీలో స్మశాన వాటిక అభివృద్ధి (1 నం.) కొరకు దిగువ సంతకందారు టెండర్లు కోరుచున్నారు. టెండరు డాక్యుమెంట్లు 13-08-2025 నుండి 22-08-2025 తేదీల మధ్య ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో లభిస్తాయి మరియు అవి పై తేదీల మధ్య ప్రచురణ తేదీ నుండి (07) పని రోజుల పాటు లభిస్తాయి. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పి.హెచ్. డివిజన్, రంగారెడ్డి
DIPR RO No.6441-PP/CL/Advt/1/2025-26, Dt: 13-08-2025

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, సంగారెడ్డి (సంగారెడ్డి జిల్లా)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఇ-ప్రొక్యూర్‌మెంట్ NIT No: E1/847/2025, E1/97/2025-26, E1/1152/2025-26, E/1306/2025, E1/1307/1/2025, E1/1319/2025, E1/1201/2025-26 తేదీ: 12-08-2025.
మొత్తం పనుల సంఖ్య: మున్సిపల్ జనరల్ ఫండ్స్ 2025-26 క్రింద (06), మున్సిపల్ జనరల్ ఫండ్స్ 2025-26 లేదా ఏదైనా ఇతర గవర్నమెంట్ ఫండ్స్ క్రింద (01), బిడ్ దాఖలు ప్రారంభ తేది మరియు సమయం: 12-08-2025, సా.6.00 గం. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: 19-08-2025, సా.4.00 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ tender.telangana.gov.inలో చూడవచ్చును. ఫోన్ నం: Dy.E.E, సంగారెడ్డి మున్సిపాలిటీ: 9849907770
సం/- మున్సిపల్ కమిషనర్, సంగారెడ్డి మున్సిపాలిటీ
DIPR RO No.6415-PP/CL/Advt/1/2025-26, Dt.13-08-2025

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
జిల్లా (R&B) అధికారి, సంగారెడ్డి జిల్లా
CTN. NIT No.EE(R&B)/SRD/PA to EE/DB/T1/03/2025-26/ తేది: 11-08-2025
పని పేరు: సంగారెడ్డి జిల్లాలో 2025-26 సంవత్సరానికి (R&B) డివిజన్, సంగారెడ్డికు సంబంధించి (01) నం. కల్వర్టు పని మరియు (03) నం.ల ER BT ప్యాచ్ పనులు. అంచనా కాంట్రాక్ట్ విలువ మొత్తం రూ. లక్షలలో (ECV Rs.): 124.01, పైన తెలిపిన పని కొరకు బిడ్ దాఖలు ముగింపు తేది: 25.08.2025, సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B)పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), జిల్లా (R&B) అధికారి, సంగారెడ్డి జిల్లా. సెల్ నం. 9440818095 / 7032303377. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), జిల్లా R&B అధికారి, సంగారెడ్డి జిల్లా
DIPR RO No.6461-PP/CL/Advt/1/2025-26, Dt: 13.08.2025

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
"e" NIT No. 06/DCE(R)/EE(R)/DEE1/AEE1/2025-26 తేది : 13.08.2025
1. CE(R&B), SR, e-NIT No.06/DCE(R)/EE(R)/DEE-I/AEE-I/2025-26, తేది:13.08.2025 ప్రకారం రూ.82.92 కోట్ల వ్యయంతో ప్లాన్, నాన్-ప్లాన్ & STSDF క్రింద 6 రోడ్ల పనుల కొరకు దిగువ జిల్లాల్లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరుచున్నవి.

క్ర. సం.	జిల్లా	స్కీమ్	పనుల సంఖ్య	అంచనా వ్యయం రూ. కోట్లలో
1	సంగారెడ్డి	ప్లాన్	1	42
2	సంగారెడ్డి	STSDF	1	1.9
3	సిద్దిపేట	STSDF	1	5.0
4	కామారెడ్డి	నాన్-ప్లాన్	1	13.20
5	ఖమ్మం	ప్లాన్	1	20.0
6	పెద్దపల్లి	నాన్-ప్లాన్	1	0.82
		మొత్తం	6	82.92

2. టెండరుదారులు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా http://tender.telangana.gov.in నుండి టెండరు షెడ్యూలును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు మరియు తదుపరి వివరాలను చూడవచ్చు, టెండర్ల స్వీకరణకు చివరి తేది 25.08.2025న మ. 3.30 గం. వరకు.
సం/- చీఫ్ ఇంజనీర్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN తరపున
DIPR RO No. 6500-PP/CL/ADVT/1/2025-26, Dt: 13.08.2025

MIDHANI

మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్
(భారత ప్రభుత్వ సంస్థ) (CIN:L14292TG1973GOI001660)
నమోదిత & కార్పొరేట్ కార్యాలయం: PO కంచన్‌బాగ్, హైదరాబాద్ - 500058, ఫోన్: 040-24184515,
వెబ్‌సైట్: www.midhani-india.in, ఇ-మెయిల్ company.secretary@midhani-india.in

జూన్ 30, 2025న ముగిసిన త్రైమాసికానికి ఆర్థిక ఫలితాల సారాంశము

ఎ. స్టాండ్‌అలోన్ ఫలితాలు (ఇతర విధంగా తెలిపితే తప్ప ₹ లక్షలలో)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 30.06.2025 (ఆడిట్ చేయనిది)	ముగిసిన త్రైమాసికం 30.06.2024 (ఆడిట్ చేయనిది)	ముగిసిన వార్షికం 31.03.2025 (ఆడిట్ చేసినది)
1	కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం	17,049.50	16,345.31	1,07,410.15
2	ఈ కాలానికి నికర లాభం (పన్ను, మినహాయించిన అంశాలు మరియు/లేదా అసాధారణ అంశాలకు ముందు) #	1,899.63	896.06	15,603.90
3	పన్నుకు ముందు కాలానికి నికర లాభం (మినహాయించిన అంశాలు మరియు/ లేదా అసాధారణ అంశాల తర్వాత) #	1,899.63	896.06	15,603.90
4	పన్ను తర్వాతి కాలానికి నికర లాభం (మినహాయించిన అంశాలు మరియు/ లేదా అసాధారణ అంశాల తర్వాత) #	1,280.13	511.03	11,006.87
5	ఈ కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం [ఈ కాలానికి లాభం / (నష్టం) (పన్ను తర్వాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తర్వాత) కలిగి ఉంది]	1,296.48	590.37	10,908.97
6	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ఫేస్ వాల్యూ రూ.10/- ప్రతీది)	18,734.00	18,734.00	18,734.00
7	గత సంవత్సరానికి ఆడిట్ చేసిన బ్యాలన్స్ షీట్‌లో చూపిన విధంగా రిజర్వులు (రీవాల్యుయేషన్ రిజర్వు మినహా)	-	-	1,22,713.93
8	నికర విలువ	-	-	1,41,447.93
9	రుణ ఈక్విటీ నిష్పత్తి (టైమ్స్)	0.18	0.25	0.17
10	ప్రతీ వాటా ఆర్జనలు (బేసిక్ మరియు డైల్యూటెడ్) (₹) (వార్షికం కానిది)	0.68	0.27	5.88
11	రుణ సేవా కవరేజి నిష్పత్తి (టైమ్స్)	0.16	0.09	0.94
12	వడ్డీ సేవా కవరేజి నిష్పత్తి (టైమ్స్)	6.69	4.54	8.45

బి. కన్సాలిడేటెడ్ ఫలితాలు (ఇతర విధంగా తెలిపితే తప్ప ₹ లక్షలలో)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 30.06.2025 (ఆడిట్ చేయనిది)	ముగిసిన త్రైమాసికం 30.06.2024 (ఆడిట్ చేయనిది)	ముగిసిన వార్షికం 31.03.2025 (ఆడిట్ చేసినది)
1	కార్యకలాపాల నుండి మొత్తం రెవెన్యూ	17,049.50	16,345.31	1,07,410.15
2	ఈ కాలానికి నికర లాభం (పన్ను, మినహాయించిన అంశాలు మరియు/లేదా అసాధారణ అంశాలకు ముందు) #	1,899.63	896.06	15,603.90
3	జాయింట్ వెంచర్ యొక్క లాభం/(నష్టం) వాటా	16.55	18.20	76.87
4	పన్నుకు ముందు కాలానికి నికర లాభం (మినహాయించిన అంశాలు మరియు/ లేదా అసాధారణ అంశాల తర్వాత) #	1,916.18	914.26	15,680.77
5	పన్ను తర్వాతి కాలానికి నికర లాభం (మినహాయించిన అంశాలు మరియు/ లేదా అసాధారణ అంశాల తర్వాత) #	1,296.68	529.23	11,083.74
6	ఈ కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం [ఈ కాలానికి లాభం / (నష్టం) (పన్ను తర్వాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తర్వాత) కలిగి ఉంది]	1,313.03	608.57	10,985.84
7	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ఫేస్ వాల్యూ రూ.10/- ప్రతీది)	18,734.00	18,734.00	18,734.00
8	గత సంవత్సరానికి ఆడిట్ చేసిన బ్యాలన్స్ షీట్‌లో చూపిన విధంగా రిజర్వులు (రీవాల్యుయేషన్ రిజర్వు మినహా)	-	-	1,22,762.84
9	నికర విలువ	-	-	1,41,496.84
10	రుణ ఈక్విటీ నిష్పత్తి (టైమ్స్)	0.18	0.25	0.17
11	ప్రతీ వాటా ఆర్జనలు (బేసిక్ మరియు డైల్యూటెడ్) (₹) (వార్షికం కానిది)	0.69	0.28	5.92
12	రుణ సేవా కవరేజి నిష్పత్తి (టైమ్స్)	0.16	0.09	0.95
13	వడ్డీ సేవా కవరేజి నిష్పత్తి (టైమ్స్)	6.72	4.57	8.48

సూచనలు:
1. పైన తెలిపినది SEBI (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్), రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీలతో దాఖలు చేయబడిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల సవివరమైన ఫార్మాట్ యొక్క సారాంశం. 30 జూన్, 2025తో ముగిసిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల పూర్తి ఫార్మాట్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్స్ (www.bseindia.com మరియు www.nseindia.com)లో మరియు కంపెనీ వెబ్‌సైట్ (www.midhani-india.in)లో లభిస్తాయి.
2. ఈక్విటీ పద్ధతి మరియు అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ (డిఫెన్స్) టెస్టింగ్ ఫౌండేషన్, (కంపెనీల చట్టం, 2013 క్రింద సెక్షన్ 8 కంపెనీ)లో కన్సాలిడేట్ చేయబడిన ఉత్కర్ష అల్యూమినియం ధాతు నిగమ్ లిమిటెడ్ ఫలితాలు 30 జూన్, 2025న ముగిసిన త్రైమాసికానికి కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాలలో ఉన్నాయి.
3. # Ind-AS ప్రకారం లాభనష్టాల నివేదికలో మినహాయించిన మరియు/ లేదా అసాధారణ అంశాలు సర్దుబాటు చేయబడినవి.
4. ఆర్థిక ఫలితాల పై స్టేట్‌మెంట్ ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 13 ఆగస్టు, 2025న జరిగిన సమావేశంలో డైరెక్టర్ల బోర్డుచే ఆమోదించబడినవి. సవివరమైన ఆర్థిక ఫలితాలను దిగువ ఇవ్వబడిన QR కోడ్‌ను స్కానింగ్ చేయుట ద్వారా చూడవచ్చును.

ప్రదేశం : హైదరాబాద్
తేది : 13.08.2025

డైరెక్టర్ల బోర్డు తరఫున
సం/- డా॥ S.V.S. నారాయణ మూర్తి
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
DIN- 11065319

ట్రంప్, పుతిన్ ఏకాంత చర్చలే!

రేపు అలస్కాలో భేటీ కాబోతున్న ఇరువురు నేతలు

- చర్చల గదిలో ట్రంప్, పుతిన్ సహా మొత్తం నలుగురే
- 2018లో హెల్సింకీలో విఫలమైన గోప్య సమావేశం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ ఈ నెల 15న అలస్కాలో భేటీ కాబోతున్నారు. ఈ భేటీ అత్యంత గోప్యంగా జరుగబోతోందని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. సమావేశం జరిగే గదిలో ట్రంప్, పుతిన్‌తోపాటు ఇద్దరు అనువాదకులు మాత్రమే ఉంటారని తెలిపాయి. ఇంకెవరికీ ప్రవేశం ఉండదని పేర్కొన్నాయి. ఇరువురు నేతలు దాదాపు నాలుగేళ్ల తర్వాత ముఖాముఖి చర్చలు జరుపబోతున్నారు. ఈ చర్చలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. 2018 జూలై 16న ఫిన్‌లాండ్ రాజధాని హెల్సింకీలో ట్రంప్, పుతిన్ మధ్య రెండు గంటలపాటు గోప్యమైన భేటీ జరిగింది. అప్పటి చర్చల్లో పెద్దగా ఏదీ సాధించలేకపోయారు. ఫలవంతం కాలేదు. పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. భేటీ తర్వాత ఇరువురు నేతలు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పుడు కూడా అదే తరహాలో గోప్యంగా మాట్లాడుకోవాలని నిర్ణయించుకోవడం పట్ల భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అప్పటిలాగే విఫలమయ్యే అవకాశం లేకపోలేదని విమర్శకులు అంటున్నారు. ట్రంప్, పుతిన్‌తోపాటు ఇరుపక్షాల నుంచి ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొంటే ఏదైనా పెద్ద నిర్ణయం తీసుకోవడానికి ఆస్కారం ఉంటుందని సూచిస్తున్నారు.

కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం

పుతిన్‌తో ఏకాంత చర్చలకే ట్రంప్ మొగ్గు చూపడం వెనుక స్పష్టమైన కారణం ఉన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించేలా పుతిన్‌తో గట్టిగా వాదించి, ఒప్పించడానికి ఏకాంత భేటీ దోహదపడుతుందని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఎందుకంటే చర్చల గదిలో ఇతరులు కూడా ఉంటే వారు అప్పటికప్పుడు పుతిన్ మనసు మార్చేసి, వెనక్కి లాగే ప్రమాదం లేకపోలేదు. అలాంటి పరిస్థితి లేకుండా చేయాలన్న ఉద్దేశంతోనే ట్రంప్ ఈ ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. మధ్యవర్తులతో పని కాదన్న అంచనాతో స్వయంగా తానే రంగంలోకి దిగాలని ట్రంప్ నిర్ణయించుకున్నారు. ఉక్రెయిన్‌తో మొదట కాల్పుల విరమణకు, ఆ తర్వాత శాంతి ఒప్పందానికి రష్యా అధినేతను ఎలాగైనా ఒప్పించాలన్నదే ఆయన లక్ష్యంగా కనిపిస్తోంది.

పుతిన్ విజయమే: బోల్టన్

అలస్కాలో జరిగే భేటీని పుతిన్ విజయంగా డొనాల్డ్ ట్రంప్ మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ అభివర్ణించారు. సమావేశానికి ట్రంప్‌ను స్వయంగా రప్పిస్తుండడం ద్వారా పుతిన్ ఇప్పటికే పైచేయి సాధించారని అన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ఆపేస్తుందన్న నమ్మకం తనకు లేదని తేల్చిచెప్పారు. అయితే, జాన్ బోల్టన్ వ్యాఖ్యలను ట్రంప్ కొట్టిపారేశారు. అమెరికాకు అపజయం ఉండదని పేర్కొన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

యుద్ధం ఆపనంటే తీవ్ర పరిణామాలు

పుతిన్‌ను హెచ్చరించిన ట్రంప్

వాషింగ్టన్/బెర్లిన్: ఉక్రెయిన్‌పై పుతిన్ దండయాత్రను ఆపకపోతే రష్యా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. శుక్రవారం అమెరికా పరిధిలోని అలస్కాలో పుతిన్‌తో భేటీకి మరికొద్ది గంటలే మిగిలి ఉండగా ఆలోపే పుతిన్‌ను హెచ్చరిస్తూ ట్రంప్ వ్యాఖ్యానాలు చేయడం గమనార్హం. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సంయుక్తంగా యురోపియన్ యూనియన్ సభ్యదేశాల అగ్రనేతలతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో ట్రంప్ సైతం వర్చువల్‌గా భేటీ అయి రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రస్తావించారు. " శుక్రవారం అలస్కాలో పుతిన్‌తో భేటీ సవ్యంగా సాగుతుందని భావిస్తున్నా. యుద్ధాన్ని ఆపబోనని పుతిన్ గనక చెబితే రష్యా తీవ్ర పర్యావసానాలను ఎదుర్కోక తప్పదు. రెండో దఫా ఆంక్షలను విధించాల్సి ఉంటుంది. ఒకవేళ భేటీ సత్ఫలితాలనిస్తే వెంటనే పుతిన్, జెలెన్‌స్కీల మధ్య భేటీని నిర్వహించేందుకు సిద్ధపడతా. ఇరువురి భేటీలో నన్ను అనుమతిస్తే నేనూ భాగస్వామినవుతా" అని ట్రంప్ అన్నారు. వర్చువల్ భేటీలో జెలెన్‌స్కీసహా యురోపియన్ యూనియన్ సభ్యదేశాల అగ్రనేతలతోనూ ట్రంప్ మాట్లాడారు. జెలెన్‌స్కీతో వర్చువల్ భేటీ అద్భుతంగా సాగిందని ట్రంప్ అన్నారు.

సమగ్ర సవరణ సబబే

బిహార్ 'సర్'ను సమర్థించిన సుప్రీంకోర్టు

- ఓటరు జాబితా ఎప్పుడూ 'స్థిరం'గా ఉండకూడదు
- మార్పులు, చేర్పులు, సవరణలు అవసరమే
- 11 పత్రాలను అనుమతించడం ఓటరుకు ప్రయోజనకరమే



న్యూఢిల్లీ: విపక్ష పార్టీల విమర్శలు, అత్యంత అభ్యంతరాలతో వివాదాస్పదంగా మారిన బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–సర్)) సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలుచేసింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలు చేపట్టడం సరైన ప్రక్రియేనని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. "ఓటర్ల జాబితా ఎప్పుడూ స్థిర సంఖ్యతో కొనసాగడం సహేతుకం అనిపించుకోదు. కాలానుగుణంగా అందులో సవరణలు తప్పనిసరి. గతంలో ఓటరుగా నిరూపించుకోవడానికి ఏడు రకాల ధ్రువీకరణ పత్రాలను ఈసీ అనుమతించేది. ఇప్పుడు ఏకంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అనుమతిస్తున్నారు. గతంతో పోలిస్తే ఎక్కువ ధ్రువపత్రాలను అనుమతించడం చూస్తుంటే ఈ ప్రక్రియ మరింతగా ఓటరుకు అనుకూలంగా ఉందని చెప్పొచ్చు. ఓటర్లను జాబితా నుంచి తప్పించేలా ఇది కనిపించట్లేదు" అని ధర్మాసనం అభిప్రాయ పడింది. ఎస్ఐఆర్ తప్పులతడకగా ఉందని, దీన్ని వెంటనే ఆపాలంటూ విపక్షాలు ఆందోళన బాట పట్టిన వేళ సుప్రీంకోర్టు ఈసీ అనుకూల వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "అవసరమైనప్పుడు ఓటరు జాబితాకు సవరణలు చేసే సర్వాధికారం ఈసీకి ఉంది. చట్టానికి వ్యతిరేకంగా ఎస్ఐఆర్ చేపడుతున్నారని, దీనిని ఆపేయాలన్న పిటిషనర్ వాదనలను కోర్టు తోసి పుచ్చింది. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ రాష్ట్రీయలోక్‌దళ్, కాంగ్రెస్ నేతలు సహా రాజకీయ సంస్కరణ సంస్థ (ఏడీ ఆర్) సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెల్సిందే.

సవరణ లేకుండా ఎలా?

"బిహార్‌లో మొదలెట్టిన ఎస్ఐఆర్‌ను దేశవ్యాప్తంగా విస్తరించకుండా అడ్డుకోవాలి. ఎస్ఐఆర్‌లాంటి ప్రక్రియను ఈసీ గతంలో ఏనాడూ చేపట్టలేదు. అసలు ఇది ఎక్కడ ముగుస్తుందో దేవుడికే తెలియాలి" అని ఏడీఆర్ తరఫు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ అన్నారు. దీంతో కోర్టు స్పందించింది. " మీ తర్కం ప్రకారం ప్రత్యేకంగా ఓటరు సమగ్ర సవరణ చేపట్టకూడదు. మొట్టమొదటిసారిగా దశాబ్దాల క్రితం సేకరించిన వాస్తవిక ఓటర్ల జాబితాను మాత్రమే కొనసాగించాలంటున్నారు. మా అభిప్రాయం ప్రకారం ఓటరు జాబితా అనేది ఎలాంటి సవరణలు జరపకుండా అలాగే కొనసాగించడం సబబు కాదు. ఈ జాబితా ఎప్పటికప్పుడు సవరణకు బద్ధమై ఉండాల్సిందే. సవరణ చేయకుంటే చనిపోయిన వారి పేర్లను తొలగించేదెలా? వేరే రాష్ట్రానికి వలసవెళ్లిన ఓటర్లు, మరో నియోజకవర్గంలో స్థిర నివాసం ఏర్పర్చు కున్న వారి పేర్లను పాత నియోజక వర్గంలో తొలగించొద్దా?" అని ధర్మాసనం సూటి ప్రశ్నలు వేసింది. " దృవపత్రంగా ఆధార్‌ను అంగీకరించట్లేదని మాకు అర్థమవుతోంది. కానీ ఏకంగా 11 ఇతర రకాల దృవపత్రాలను అంగీకరిస్తున్నారుగా?" అని పిటిషనర్ల తరఫున హాజరైన మరో న్యాయవాది అభిషేక్ సింఘ్వీని కోర్టు ప్రశ్నించింది. దీనితో పిటిషనర్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విభేదించారు. "ధ్రువపత్రాల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో ఇప్పుడు అందరికీ అందుబాటులో లేవు. ధ్రువపత్రాల్లో ఒకటైన పాస్‌పోర్టు విషయానికే వస్తే రాష్ట్రంలో కేవలం ఒకటి, రెండు శాతం మంది దగ్గర మాత్రమే ఇవి ఉన్నాయి" అని వాదించారు. దీనిపై కోర్టు స్పందించింది. " రాష్ట్రంలో 36,00,000 మందికి పాస్‌పోర్టు ఉంది. ఇది మంచి సంఖ్య మాదిరిగానే కనిపిస్తోంది" అని కోర్టు గుర్తుచేసింది.

వాటి మధ్య యుద్ధంలా తయారైంది

"ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(3) ప్రకారం ఓటరు జాబితాలో ఇప్పుడు సవరణలు అవసరమని ఈసీ భావిస్తే అప్పుడు వెంటనే ప్రత్యేక సవరణ మొదలెట్టే సర్వాధికారం ఈసీకి దఖలుపడింది. వాస్తవానికి ఈ అంశం రాజ్యాంగబద్ధ హక్కుకు, రాజ్యాంగం ద్వారా దఖలుపడిన అధికారానికి మధ్య పోరాటంలా తయారైంది" అని కోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు అభిప్రాయంతో లాయర్ శంకరనారాయణన్ విబేధించారు. చట్టప్రకారం రాష్ట్రంలో ఏదైనా కేవలం ఒక నియోజకవర్గంలో లేదంటే ఒక నియోజకవర్గంలోని కొంత భాగంలో మాత్రమే జాబితా సవరణ చేపట్టాలి. అంతేగానీ ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సవరణ చేపట్టకూడదు" అని వాదించారు. దీనిపై జడ్జి మళ్లీ స్పందించారు. " రాజ్యాంగంలోని 324వ అధికరణం ద్వారా ఈసీకి సవరణ అధికారాలు దఖలుపడ్డాయి" అని జడ్జి వ్యాఖ్యానించారు.

వెతికే అవకాశం లేకుండా చేశారు

"ముసాయిదా జాబితాలో సెర్చ్ ఆప్షన్‌ను ఈసీ దురుద్దేశంతో తొలగించింది. దీంతో గత జాబితాతో పోలిస్తే ముసాయిదా లిస్ట్‌లో ఎవరి పేర్లను తొలగించారో తెలియకుండా పోయింది. తొలగించిన, మరణించిన, వలసవెళ్లిన వాళ్ల జాబితా తెలీకుండా దాచిపెట్టేందుకే ఈసీ ఇలాంటి చర్యలకు పాల్పడుతోంది. బెంగళూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో లక్ష నకిలీ ఓట్లను గుర్తించామని రాహుల్‌గాంధీ మీడియా సమావేశంలో ప్రకటించిన మరుసటి రోజే ఈ సెర్చ్ ఆప్షన్ తీసేశారు" అని ఎన్‌జీఓ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు.

వచ్చే నెలలో అమెరికాకు మోదీ

డొనాల్డ్ ట్రంప్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం



ఐక్యరాజ్యసమితి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెప్టెంబర్‌లో అమెరికాలో పర్యటించే అవకాశం ఉంది. సెప్టెంబర్ 9 నుంచి ఐక్యరాజ్యసమితి సాధారణ సభ(యూఎన్‌జీఏ) వార్షిక ఉన్నతస్థాయి సమావేశం ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 23 నుంచి 29 దాకా జనరల్ డిబేట్ జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారని సమాచారం. డిబేట్‌లో ప్రసంగించేవారి పేర్ల జాబితాను ఐక్యరాజ్యసమితి విడుదల చేసింది. ఇందులో మోదీ పేరును సైతం చేర్చారు. సంప్రదాయం ప్రకారం తొలుత బ్రెజిల్, తర్వాత అమెరికా అధినేత ప్రసంగిస్తారు. డొనాల్డ్ ట్రంప్ వచ్చే నెల 23న యూఎన్‌జీఏ పోడియం నుంచి ప్రసంగించబోతున్నారు. ఆయన రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఐక్యరాజ్యసమితిలో చేయబోతున్న తొలి ప్రసంగం ఇదే కావడం విశేషం. సెప్టెంబర్ 26న మోదీ ప్రసంగించే అవకాశం కనిపిస్తోంది. అదే రోజు ఇజ్రాయెల్, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ నేతలు కూడా మాట్లాడుతారు. మరోవైపు అమెరికా పర్యటన సందర్భంగా డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా భేటీ కాబోతున్నట్లు సమాచారం. భారత ఉత్పత్తులపై విధించిన 50 శాతం సుంకాలపై ట్రంప్‌తో ఆయన చర్చించనున్నట్లు తెలుస్తోంది. ప్రధానమంత్రి ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికాలో పర్యటించారు. వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

వచ్చేవారం జైశంకర్ రష్యా పర్యటన



న్యూఢిల్లీ: భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వచ్చేవారం రష్యాలో పర్యటించనున్నారు. ఆగస్టు 20, 21 తేదీల్లో మాస్కోకు వెళ్తున్న మంత్రి.. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో భేటీ కానున్నారు. రష్యాతో చమురు వాణిజ్యం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ దిగుమతులపై 25 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. సుంకాల విధింపు అనంతరం విదేశాంగ మంత్రి రష్యాలో పర్యటిస్తుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. సుంకాల ప్రకటన, వాణిజ్య అనిశ్చితి మధ్య ప్రధాని మోదీ ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సంభాషించారు. ఉక్రెయిన్ పరిణామాలపై ఇరువురు నాయకులు చర్చించారు. శాంతియుత పరిష్కారాన్ని కోరుతూ మోదీ భారత్ స్థిరమైన వైఖరిని మరోసారి పునరుద్ఘాటించారు.

అమెరికాలో హిందూ ఆలయం ధ్వంసం

ఈ ఏడాదిలో నాలుగో ఘటన

వాషింగ్టన్: అమెరికాలోని ఇండియానా నగరంలో మరో హిందూ దేవాలయాన్ని ధ్వంసం చేశారు. ఈ వారం ప్రారంభంలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆగస్టు 10న గ్రీన్‌వుడ్ నగరంలోని బీఏపీఎస్ స్వామినారాయణ ఆలయంలో ఈ ద్వేషపూరిత చర్య జరిగిందని ఆలయ అధికారులు తెలిపారు. షికాగోలోని భారత కాన్సులేట్ ఈ సంఘటనను తీవ్రంగా ఖండించింది. 'ఇండియానాలోని గ్రీన్‌వుడ్‌లోని బీఏపీఎస్ స్వామినారాయణ్ ఆలయం ప్రధాన సైన్‌బోర్డును అపవిత్రం చేశారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం' అని ఎక్స్‌లో ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ దుశ్చర్యకు వ్యతిరేకంగా 'ఐక్యత–సంఘీభావం' కార్యక్రమం నిర్వహించింది. గ్రీన్‌వుడ్ మేయర్ సహా భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కాన్సులర్ జనరల్ మాట్లాడారు. హిందూ సమాజం మరింత బలోపేతమవ్వాలన్న విషయాన్ని ఈ ఘటన గుర్తు చేసిందన్నారు. దుండగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు.

పంద్రాగస్టుకు 210 మంది పంచాయతీ ప్రతినిధులు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ పథకాలను లబ్దిదారులకు చేరవేస్తూ.. విజయాలు సాధిస్తున్న 210 మంది పంచాయతీ ప్రతినిధులు పంద్రాగస్టు వేడుకలకు హాజరుకానున్నారు. 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన వీరంతా ఆగస్టు 15న ఎర్రకోట వద్ద నిర్వహించే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విశిష్ట అతిథులుగా పాల్గొంటారని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ బుధవారం తెలిపింది. తమ జీవిత భాగస్వాములు, నోడల్ అధికారులు సహా మొత్తం 425 మంది ఈ సంబరాల్లో పాల్గొంటారని పేర్కొంది. ఈ ప్రత్యేక అతిథులను గురువారం (14న) ఢిల్లీలో సత్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, ఆ శాఖ సహాయమంత్రి ఎస్.పి.సింగ్ బఘేల్ కూడా హాజరు కానున్నారు. ఈ ఏడాది నిర్వహించే కార్యక్రమానికి "ఆత్మనిర్భర్ పంచాయతీ, వికసిత్ భారత్‌కు గుర్తింపు" అనే అంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా ఎంపిక చేశారు. పంచాయతీ ప్రతినిధుల సత్కారోత్సవంలో భాగంగా, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్(ఏఐ) చోదక శక్తిగా నిలిచే 'సభాసార్' అప్లికేషన్‌ను ప్రారంభించనున్నారు.

వీధికుక్కలపై నేడు సుప్రీం ప్రత్యేక ధర్మాసనం విచారణ

న్యూఢిల్లీ: ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో వీధి కుక్కల వ్యవహారం సంచలనాత్మకంగా మారింది. శునకాలన్నింటినీ బంధించి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని, తర్వాత షెల్టర్లకు తరలించాలని ప్రభుత్వానిఆదేశిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం ఇచ్చిన తీర్పు పట్ల జనం ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీంతో ఈ వ్యవహారాన్ని అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా స్వీకరించింది. ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనం గురువారం దీనిపై విచారణ చేపట్టనుంది. ఈ ధర్మాసనంలో జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాలను సభ్యులుగా నియమించారు. సోమవారం తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులను ఈ ప్రత్యేక ధర్మాసనంలో చేర్చలేదని సుప్రీంకోర్టు ఒక ప్రకటనలో వెల్లడించింది. వీధి కుక్కలకు సంబంధించి దాఖలైన వేర్వేరు పిటిషన్లను సైతం ప్రత్యేక ధర్మాసనం విచారిస్తుందని తెలియజేసింది.

పౌరసత్వానికి ముందే సోనియాకు ఓటు హక్కు

బీజేపీ ఆరోపణ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ 'ఓటు చౌర్యం' ఆరోపణలపై బీజేపీ ఎదురుదాడి మొదలుపెట్టింది. కాంగ్రెస్ 45 ఏళ్లకిందటే ఈ ఓటర్ల చౌర్యానికి పాల్పడిందని, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పేరును ఆమె భారత పౌరసత్వం పొందకముందే ఓటర్ల జాబితాలో చేర్చారని ఆరోపించింది. 1946లో ఇటలీలో సోనియా మైనోగా జన్మించిన సోనియా గాంధీ భారత పౌరురాలు కావడానికి ఒక సంవత్సరం ముందు 1980 నుండి 1982 వరకు జాబితాలో చేర్చారని మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు. అలాగే 1980 నాటి ఓటర్ల జాబితానుంచి తీసిన ఫొటోకాపీని బీజేపీ నేత అమిత్ మాలవీయ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. న్యూఢిల్లీ పార్లమెంటరీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అధికారిక నివాసంలో గాంధీ కుటుంబం నివసిస్తున్నప్పుడు చేర్చారని పేర్కొన్నారు. 'ఇది చట్టాన్ని ఉల్లంఘించడం కాదా? అని ఆయన ప్రశ్నించారు. 1982లో నిరసనల తరువాత ఆమె పేరు జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. 1983లో ఆమె భారత పౌరసత్వం పొందిన తరువాత చేర్చడం కూడా మోసపూరితంగానే జరిగిందని, కటాఫ్ తేదీ జనవరి 1 తరువాత ఆమె పేరును ఏప్రిల్‌లో జాబితాలో మళ్లీ చేర్చారని మాలవీయ వెల్లడించారు. రాహుల్ గాంధీపైనా ఠాకూర్ దాడి చేశారు. ఆయన అబద్ధాలు చెబుతున్నారని, తప్పుడు సంఖ్యలను ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. కాగా, బీజేపీ విమర్శలపై కాంగ్రెస్ సభ్యుడు తారిఖ్ అన్వర్ ప్రతిస్పందించారు. తన పేరును ఓటరు జాబితాలో చేర్చమని సోనియా గాంధీ అడగలేదని, ఆ సమయంలో ఎన్నికల సంఘం అధికారులే అలా చేశారని అన్నారు. ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థని, అది సొంత నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. కానీ.. ఇప్పుడు బీజేపీలో భాగమైంది కాబట్టి తాము వ్యతిరేకిస్తు న్నామన్నారు.

18న చైనా విదేశాంగ మంత్రి రాక

న్యూఢిల్లీ: చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ ఈ నెల 18వ తేదీన ఇండియాలో పర్యటించబోతున్నారు. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ఆయన సమావేశమవుతారు. భారత్–చైనా సరిహద్దు అంశంపై చర్చిస్తారని సమాచారం. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తోనూ వాంగ్ యీ భేటీ అవుతారు. ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో చైనాలో పర్యటించనున్న సంగతి తెలిసిందే. ఆగస్టు 31, సెప్టెంబర్ 1న చైనాలో జరిగే షాంఘై సహకార సంస్థ సదస్సులో ఆయన పాల్గొంటారు. మోదీ పర్యటన కంటే ముందు చైనా విదేశాంగ మంత్రి భారత్‌కు వస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

నా ప్రాణాలకు ముప్పు

- నాపై ఫిర్యాదు చేసింది గాడ్సే కుటుంబ సభ్యుడే
- ఓట్ల చోరీని బయటపెట్టినందుకు ఇద్దరు బీజేపీ నేతలు బెదిరించారు
- నాకు తగిన భద్రత కల్పించండి
- పుణే కోర్టుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విజ్ఞాపన

న్యూఢిల్లీ: హిందూ జాతీయవాది వినాయక్ దామోదర్ సావర్కర్‌పై చేసిన వ్యాఖ్యల కేసులో తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు. సావర్కర్ పరువుకు నష్టం వాటిల్లిందంటూ తనపై ఫిర్యాదు చేసిన వ్యక్తి నాథురామ్ గాడ్సే కుటుంబ సభ్యుడేనని తెలియజేశారు. మహాత్మా గాంధీని హత్య చేసిన నాథురామ్ గాడ్సే బంధువు తనపై ఫిర్యాదు చేయడం చూస్తే తనకు ప్రాణాపాయం ఉన్నట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ గాంధీ బుధవారం పుణే కోర్టుకు ఒక విజ్ఞాపన పత్రం సమర్పించారు. సావర్కర్‌పై గతంలో చేసిన వ్యాఖ్యలతో పాటు ఇటీవల తాను లేవనెత్తిన రాజకీయ అంశాల దృష్ట్యా తన భద్రత ప్రమాదంలో పడినట్లు భావిస్తున్నానని తెలిపారు. తనపై ఫిర్యాదు చేసిన వ్యక్తి కుటుంబం గతంలో హింసాకాండకు పాల్పడినట్లు, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు దిగినట్లు సాక్ష్యాధారాలు ఉన్నాయని వివరించారు. ఆ చరిత్ర మళ్లీ పునరావృతం కావడానికి వీల్లేదన్నారు. మహాత్మా గాంధీ హత్య లాంటిది మళ్లీ జరగకూడదని కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు. అలాగే ఓట్ల చోరీ బాగోతాన్ని బయటపెట్టినందుకు ఇద్దరు బీజేపీ నాయకుల నుంచి తనకు బెదిరింపులు వచ్చాయని రాహుల్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రవనీత్‌సింగ్ బిట్టూ, తర్వీందర్‌సింగ్ మార్వా తనను బహిరంగంగా బెదిరించారని చెప్పారు. 'దేశంలో నెంబర్ వన్ టెర్రరిస్ట్ రాహుల్ గాంధీ' అంటూ వారు ఆరోపణలు చేశారని తెలిపారు. తనకు తగిన భద్రత కల్పించేలా అధికారులను ఆదేశించాలని న్యాయస్థానాన్ని రాహుల్ గాంధీ కోరారు.

ఉపసంహరించుకుంటాం

పుణే కోర్టులో రాహుల్ గాంధీ తరఫున ఆయన లాయర్ మిలింద్ పవార్ పిటిషన్ వేసిన కొన్ని గంటల్లోనే మరో ట్విస్టు చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ ఆమోదం లేకుండానే ఈ పిటిషన్ దాఖలు చేశానని సదరు లాయర్ పేర్కొన్నారు. పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని చెప్పారు. ఇందుకోసం గురువారం విజ్ఞాపన పత్రం సమర్పిస్తానన్నారు.



ఎన్నికల సంఘం మృతులుగా ప్రకటించిన బిహారీలతో రాహుల్‌గాంధీ భేటీ. వీరిని మృతులుగా పేర్కొంటూ ఓట్లను ఈసీ తొలగించింది.

'ఎలక్షన్ చోరీ ఆయోగ్'

ఓట్ల చోరీపై వీడియో విడుదల చేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: ఓట్ల చోరీపై విపక్ష కాంగ్రెస్ పార్టీ తమ పోరాటం ఉధృతం చేస్తోంది. పోలింగ్ బూత్‌లో ఒకరి బదులు ఇంకొకరు ఓటు ఎలా వేస్తున్నారో వివరిస్తూ ఒక వీడియోను పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం 'మీ ఓటు చోరీ, మీ అధికారం చోరీ, మీ గుర్తింపు చోరీ' అనే శీర్షికతో సోషల్ మీడియాలో చేశారు. ఓటర్ల జాబితాలో గోల్‌మాల్‌పై ప్రజలంతా గొంతు విప్పాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. రాజ్యాంగబద్ధ సంస్థలను బీజేపీ కబంధ హస్తాల నుంచి కాపాడుకోవాలని చెప్పారు.


వీడియోలో ఏముంది?

కాంగ్రెస్ విడుదల చేసిన వీడియోలో ఆసక్తికరమైన సన్నివేశం కనిపిస్తోంది. ఇందులో ఓ కుటుంబం ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్తుంది. ఇద్దరు వ్యక్తులు ఆ కుటుంబానికి తారసపడతారు. మీ ఓట్లు మేమే వేశాం, ఇక మీరు వెళ్లిపోవచ్చు అని చెప్తారు. దొంగ ఓట్లు వేసిన ఆ ఇద్దరు వ్యక్తులు పోలింగ్ కేంద్రంలోని ఎన్నికల అధికారికి బొటన వేలు పైకెత్తి విజయం చిహ్నం చూపిస్తారు. ఆ అధికారి టేబుల్‌పై 'ఎలక్షన్ చోరీ ఆయోగ్' అనే నేమ్‌బోర్డు ప్రత్యక్షం అవుతుంది.

నేడు దేశవ్యాప్తంగా ర్యాలీలు: ఓట్ల చోరీపై దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో గురువారం భారీ ర్యాలీలు నిర్వహించేందుకు కాంగ్రెస్ నాయకత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఈ బుల్లిరాయి భూమికే పెద్దన్న

- పుడమి కంటే ముందే పుట్టిన అంతరిక్ష శిల అమెరికాలో పడిన వైనం
- అత్యంత అరుదైన ఘటనగా అభివర్ణించిన ఖగోళ శాస్త్రవేత్తలు



ఇంటికి అతిథిగా చిన్ననాటి స్నేహితులు, అప్పులు వస్తే ఎంతో ఆత్మీయంగా, సాదరంగా ఆహ్వానిస్తాం. మళ్లీ ఎప్పుడొస్తారా అని ఎదురుచూస్తాం. అలాంటి ఎదురుచూపులకు తావివ్వకుండా ఒక అతిథి ఒక అమెరికన్ ఇంట్లోకి ప్రవేశించింది. తలుపు గడియ కొట్టి సింహద్వారం గుండా రాకుండా నేరుగా ఇంటి పైకప్పుకు కన్నం వేసి ఇంట్లోకి దూరింది. మెరుపువేగంతో దూసుకొచ్చిన ఆ అతిథిని చూసి ఆ ఇంటాయన అవాక్కయ్యారు. ఎందుకంటే అది చిన్న రాయి. అది కూడా నిన్న మొన్న నేల తవ్వి తీసిన రాయి కాదు. గట్టిగా మాట్లాడితే అది అసలు భూమి మీది రాయే కాదు. ఆ రాయి ఉద్భవించినప్పుడు మన పుడమి కూడా పుట్టలేదు. మరి ఆ రాయి ఎక్కడిది? అంటే అంతరిక్షంలో అంగారకుడు, బృహస్పతి గ్రహాల మధ్యలోని గ్రహశకలాల కూటమి నుంచి భూమి వైపు ఇలా దూసుకొచ్చింది. భూమి ఏర్పడకముందు ఆస్టరాయిడ్ బెల్ట్‌లోనే చక్కర్లు కొట్టిన ఈ రాయి జూన్ 26వ తేదీన భూవాతావరణంలోకి చొరబడి చివరకు అమెరికాలో నేలను తాకింది. ఈ బుల్లి గ్రహశకలానికి 'ది మెక్‌డోనా' అని పేరు పెట్టారు. జార్జియా రాష్ట్రంలోని ఒక ఇంటి పైకప్పుకు రంధ్రం చేసి మరీ లోపల పడిన ఈ రాయిని జార్జియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అంతరిక్ష వస్తువుగా గుర్తించారు.

అట్లాంటా ఆకాశంలో తోకచుక్కలా..

భూమి మీద పడటానికి కొద్దిసేపటి ముందు పట్టపగలే ఇది తోకచుక్కలా అత్యంత ప్రకాశవంతంగా మెరుస్తూ దూసుకొచ్చింది. చిన్నపాటి అగ్నిగోళంగా మండుతున్న దీనిని అమెరికాలోని వేర్వేరు రాష్ట్రాల ప్రజలు వీక్షించి తమ కెమెరాల్లో బంధించారు. ఎట్టకేలకు ఇది హెన్రీ కౌంటీనిలోని మెక్‌డోనా ప్రాంతంలోని ఇంట్లో ఇది పడింది. ఇది పడినప్పుడు పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో గన్‌తో షూట్‌చేస్తే ఎలాంటి శబ్దం వస్తుందో అచ్చం అలాంటి శబ్దం వచ్చిందని ఇంటి యజమాని చెప్పారు. విషయం తెల్సుకున్న జార్జియా వర్సిటీలోని భూవిజ్ఞాన శాస్త్రవేత్త స్కాట్ హారిస్ వెంటనే రంగంలోకి దిగి ఆ ఇంట్లోని చెల్లాచెదురుగా పడిన 50 గ్రాముల ఖగోళధూళిని సేకరించారు. అందులో 23 గ్రాముల నాణ్యమైన ధూళిని అత్యంత శక్తివంతమైన ఆప్టికల్, ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్‌లతో పరిశీలించారు. అది ఏకంగా 456 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడిన లో మెటల్(ఎల్) ఆర్డినరీ ఖోన్‌డ్రైట్ మూలకంతో ఏర్పడిందని తేల్చారు. ఈ లెక్కన ఈ రాయి భూమి కంటే ముందే ఏర్పడింది. ఇన్నాళ్లూ ఇది తన భారీ గ్రహశకలాలలో భాగంగా ఉండేది. అయితే దాదాపు 47 కోట్ల సంవత్సరాల క్రితం గ్రహశకలం మరింత చిన్నపాటి ముక్కలుగా ఛిద్రమైంది. అలా ఏర్పడిన చిన్నపాటి రాళ్లలో అమెరికాలో పడిన రాయి కూడా ఒకటి అని జార్జియా వర్సిటీ పరిశోధకులు తేల్చి చెప్పారు. " ఈ బుల్లి రాయి 0.50 క్యాలిబర్ బుల్లెట్ కంటే రెట్టింపు పెద్దదిగా ఉంది. కాంతి వేగంతో ఇది భూ వాతావరణంలోకి ప్రవేశించింది. భూ వాతావరణంలోకి వచ్చాక అధిక గాఢత ఉన్న గాలి దీని వేగాన్ని ఒక్కసారిగా తగ్గించింది. దీంతో ఘర్షణ ఏర్పడి మండింది. వేగం సెకన్‌కు కిలోమీటర్‌కు తగ్గి చివరకు పైకప్పును చీల్చుకుంటూ నేలపై పడింది. దీనికి అధికారికంగా పేరు పెట్టేందుకు గ్రహశకలాల సంఘం కమిటీకి పంపించారు. పేరు పెట్టాక గ్రహశకలాల సంబంధ బులెటిన్‌లో ముద్రిస్తారు. పురాతన ఖగోళ ఖజానాగా దీనిని అభివర్ణిస్తున్నారు. దీని నిర్మాణం ద్వారా ఆనాటి అంతరిక్ష వాతావరణ పరిస్థితులను అంచనావేసేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్ని స్తున్నారు. విశ్వం ఇప్పటికీ తన రహస్యాలను ఒక్కొక్కటిగా మనకు తెలియ జేప్పేందుకు ఇలా ఖగోళ దూతలను భూమి మీదకు పంపిస్తోందని ఖగోళ శాస్త్రవేత్తలు వ్యాఖ్యానించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి హైదరాబాద్

గురువారం । 14 । ఆగస్టు । 2025



సివరేజీ.. డ్యామేజీ..
నగరంలో వానొస్తే నరకప్రాయంగా మారుతోంది. చిన్నపాటి ట్రయల్ పిట్ తవ్వకాలకు ట్రంక్ మెయిన్‌లు కూలిపోతున్నాయి. అప్పటికే శిథిలావస్థకు చేరిన పైపులైన్లు కుప్పకూలుతున్నాయి. -10లో



'జిమ్'దగీ కోసం..
నగరంలో ఏర్పాటవుతున్న జిమ్స్‌ల ఎంపిక విషయంలో యువత జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు నిపుణులు. సరైనది ఎంచుకోకపోతే ప్రమాదాలు తప్పవని హెచ్చరిస్తున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0/22.0
నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. గరిష్టంగా 30, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

సింగూర్‌కు పెరిగిన వరద

ఏ క్షణమైనా మంజీరా బ్యారేజ్ గేట్ల ఎత్తివేత

సాక్షి, సిటీబ్యూరో: సింగూర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద ప్రవాహం పెరిగింది. బుధవారం ప్రాజెక్టులోకి 5,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. దీంతో ప్రాజెక్టు పవర్ హౌస్, ప్రాజెక్టు గేట్ల ద్వారా వరద నీటిని వదలనున్నట్లు నీటిపారుదల శాఖ ప్రకటించడంతో జలమండలి అధికారులు మంజీరా డ్యామ్ నుంచి నీటిని విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో మంజీరా డ్యామ్ దిగువ ప్రాంతాల నివాసితులు అప్రమత్తం కావాలని జలమండలి అధికారులు సూచించారు. మంజీరా నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని జలమండలి విజ్ఞప్తి చేసింది.

మాదకద్రవ్యాల కట్టడిలో భాగస్వాములవ్వాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ కర్ణన్

లక్డీకాపూల్ : మాదక ద్రవ్యాల కట్టడిలో ప్రతి ఒక్కరూ క్రియాశీలక భాగస్వామ్యం కావాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పిలుపునిచ్చారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా అధికారులు, సిబ్బందితో కమిషనర్ మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ.. సమాజ, దేశ అభివృద్ధిలో యువత పాత్ర ముఖ్యమైందన్నారు. డ్రగ్ ఫ్రీ ఇండియా ప్రచారంలోనూ యువత ప్రధాన పాత్ర పోషించాలని చెప్పారు. తాము మాత్రమే కాకుండా, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులను మాదక ద్రవ్యాల కట్టడి కార్యక్రమంలో భాగం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు రఘుప్రసాద్, వేణుగోపాల్, పంకజ, గీతారాధిక, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వెంకటేశ్వర్ రెడ్డి, జాయింట్ కమిషనర్ (ఐటీ) రాధ, సీపీఆర్‌ఓ మహ్మద్ ముర్తుజా అలీ, పీఆర్వో దశరథం పాల్గొన్నారు.

ప్రజలకు వర్షం ఇబ్బందులు తలెత్తకుండా చూడండి

అధికారులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ సూచన



లక్డీకాపూల్ : భారీ వర్షాల నేపథ్యంలో నగర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ నెంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై సంబంధిత క్షేత్ర స్థాయిలోని అధికారులకు తక్షణ చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఓపెన్ నాలాలు పొంగి వరదనీరు సమీపంలోని కాలనీలు, ఇళ్లలోకి చేరకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, తీగలు తెగిపడటం, వరద నీరు నిలిచిపోవడం, చెట్లు కూలిపోవడం వంటి అత్యావసర పరిస్థితి ఏర్పడినప్పుడు జీహెచ్‌ఎంసీ హెల్ప్ లైన్ : 21111111. ఫోన్ నెంబర్ : 040–23225397లకు ఫిర్యాదు చేయాలని పౌరులకు ఆయన సూచించారు.

మల్కం చెరువు వద్ద వాటర్ స్పోర్ట్స్

సాక్షి, సిటీబ్యూరో: రాయదుర్గం దగ్గరలోని మల్కం చెరువుకు మహర్దశ రానుంది. ఇప్పటికే నగరవాసులతో పాటు పర్యాటకులను ఆకట్టుకుంటున్న ఈ చెరువులో త్వరలో అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. పర్యాటకాభివృద్ధి చర్యల్లో భాగంగా వీటిని చేపట్టనున్నారు. వాటర్ స్పోర్ట్స్‌లో జెట్‌స్కీ (ఆపరేటర్ నడిపే వాటర్ స్కూటర్), జెట్ అటాక్ (ఆపరేటర్ నియంత్రణతో నడిపే స్కూటర్), పెడల్ బోట్లు, వాటర్ జార్బింగ్, వాటర్ సైక్లింగ్, ఎలక్ట్రిక్ డోనట్ బోట్–ఫ్లోటింగ్ డిన్నర్, సోలార్ జీప్స్ బోట్, బంపర్, బనానా బోట్, ఫ్లైబోర్డింగ్, ఇన్‌ఫ్లేటబుల్ డిస్నీల్యాండ్ బౌన్సీ, ఇన్‌ఫ్లేటబుల్ రాకెట్ వంటివి ఉండనున్నాయి. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మల్కం చెరువులో పర్యాటక ఆకర్షణ కలిగిన పై స్పోర్ట్స్ నిర్వహణకు అనుమతించాల్సిందిగా జీహెచ్‌ఎంసీని కోరింది. మరోవైపు, వీటి నిర్వహణకు బిడ్డింగ్‌లో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి అధీకృత ఏజెన్సీగా ఎంపికైన అమరావతి బోటింగ్ క్లబ్ అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ కార్యకలాపాలను ప్రారంభించడానికి తమకు అనుమతి ఇవ్వాల్సిందిగా జీహెచ్‌ఎంసీని కోరింది. ఈ నేపథ్యంలో నెలకు రూ.60 వేలు లైసెన్స్ ఫీజు చెల్లించేలా మూడు సంవత్సరాల వరకు అనుమతించే ప్రతిపాదనను అధికారులు స్టాండింగ్ కమిటీ ముందుంచారు. అనుమతించాక వాటర్ స్పోర్ట్స్ అందుబాటులోకి రానున్నాయి.



హిమాయత్ సాగర్ జలాశయం

నిండుకుండల్లా..

జంటజలాశయాలకు వరద ప్రవాహం
- హిమాయత్ సాగర్ నాలుగు గేట్లు ఎత్తివేత

సాక్షి, సిటీబ్యూరో/బండ్లగూడ

జంట జలాశయాలకు వరద నీటి ఉద్ధృతి పెరిగింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లకు వరద ప్రవాహం అధికమైంది. హిమాయత్ జలాశయం పూర్తి నీటిమట్టం చెరువవుతుండటంతో బుధవారం నాలుగు గేట్లు మూడు ఫీట్ల వరకు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఉస్మాన్ సాగర్ జలాశయంలోకి కూడా వరద ప్రవాహం పెరిగింది.

- హిమాయత్‌సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1761.35 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో 1,600 క్యూసెక్కులు వస్తుండటంతో నాలుగు గేట్లు మూడు ఫీట్ల వరకు ఎత్తి దిగువకు 3,854 క్యూసెక్కులు వదులుతున్నారు. ఉస్మాన్ సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1784.80 అడుగులకు చేరింది. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున వర్షాలతో ఇన్‌ఫ్లో 900 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ అధికారులతో కలిసి వరద పరిస్థితిని పర్యవేక్షించేందుకు హిమాయత్‌సాగర్ రిజర్వాయర్‌ను బుధవారం సందర్శించారు. ఆయన వెంట టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ట్రాన్స్మిషన్ సీజీఎం బ్రిజేష్, జీఎం సంతోష్ తదితరులున్నారు.

మూసీకి వరద నీరు

మూసీ నదిలోకి వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. అంబర్‌పేట్ వద్ద మూసారాంబాగ్ వంతెన పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. వరద ప్రవాహం పెరగడంతో.. బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అంబర్‌పేట్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే వాహనదారులు దారి మళ్లించారు. మలక్‌పేట్ నుంచి ముసారాబాద్ బ్రిడ్జి మీదుగా అంబర్ పేట్ పరిసర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులను కూడా దారి మళ్లించారు. మలక్ పేట నుంచి వచ్చే వాహనాలను గోల్నాక కొత్త బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకున్నారు.

పార్శిల్స్ పరేషాన్!

ఆర్టీసీలో వేల సంఖ్యలో కార్గో బుకింగ్‌లు

- తీసుకోకుండా వదిలేస్తున్న వినియోగదారులు
- ప్రతి నెలా 500కుపైగా వస్తువుల డెలివరీ పెండింగ్
- ఎలక్ట్రిక్ వస్తువుల నుంచి గృహోపకరణాల దాకా
- వేలానికి సిద్ధం చేసిన ఆర్టీసీ



సాక్షి, సిటీబ్యూరో: తక్కువ ధరల్లో నాణ్యమైన బ్రాండెడ్ వస్తువులు ఆర్టీసీ కార్గో కేంద్రాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. షాపింగ్ సెంటర్లు, మాల్స్, సూపర్ మార్కెట్లు, వస్త్ర దుకాణాల్లో లభించాల్సిన వస్తువులు ఆర్టీసీ బస్టేషన్‌లలో విక్రయించనున్నారు. గుట్టలుగా పేరుకుపోతున్న రకరకాల వస్తువులను ఆర్టీసీ వేలం వేసి అమ్మనుంది. ఆర్టీసీ బిడ్డింగ్‌కు వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. ఇందుకోసం చాలామంది పోటీపడుతున్నారు. వివిధ రకాల వస్తువులపై నిర్ణీత ధరల కంటే 30 నుంచి 50 శాతం వరకు తక్కువ ధరల్లో లభిస్తుండటంతో కొనుగోలుదారులు సైతం ఆసక్తి చూపుతున్నారు. ప్రతి నెలా వందలాది వస్తువులను ఇలా బిడ్డింగ్ ద్వారా అమ్మకానికి పెడుతున్నట్లు ఆర్టీసీ కార్గో విభాగానికి చెందిన ఉద్యోగి ఒకరు తెలిపారు. మహాత్మాగాంధీ, జూబ్లీ బస్టేషన్‌లలో ప్రధాన పార్శిల్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ రెండు కేంద్రాల నుంచే తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు పార్శిళ్లు పంపిణీ అవుతాయి. ప్రతి నెలా సుమారు 5000 నుంచి 6000 పార్శిళ్లను ఆర్టీసీ కార్గో చేరవేస్తోంది. కానీ.. పలు కారణాలతో ప్రతి నెలా 500 నుంచి 850 వరకు పార్శిళ్లు డెలివరీ కాకుండా నిలిచిపోతున్నాయి. ఇలా పెండింగ్‌లో పేరుకుపోయిన వస్తువులను ఆర్టీసీ అధికారులు విక్రయానికి వేలం పెట్టేస్తున్నారు.

బుక్ చేసి.. వదిలేసి..

హైదరాబాద్ నుంచి జిల్లాలకు, వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున వస్తువులు రవాణా అవుతున్నాయి. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్‌లు, టీవీలు, దుస్తులు, మందులు, ఆహార పదార్థాలు, పచ్చళ్లు, తినుబండారాలు వంటి వివిధ రకాల వస్తువులను ఆర్టీసీ కార్గో ఒక చోటు నుంచి మరో చోటుకు చేరవేస్తోంది. సాధారణంగా బంధువులు, స్నేహితులు ఒకరికొకరు పంపించుకొనే పార్శిళ్లు మాత్రం ఎలాంటి ఆటంకం లేకుండా వినియోగదారులకు చేరుతాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ పార్శిల్ కేంద్రాలకు వెళ్లి తమ పేరిట వచ్చిన ఆర్డర్‌లను వినియోగదారులు తీసుకెళ్తారు. కానీ.. కొంతమంది 45 రోజులు దాటిన తరువాత కూడా వస్తువులను తీసుకెళ్లకుండా వదిలేస్తున్నారు.

- ఇలాంటి పెండింగ్ డెలివరీల్లో ఆర్టీసీ అధికారులు సంబంధిత వినియోగదారులకు ఫోన్ చేసినప్పటికీ ఎలాంటి స్పందన లభించకపోవడం గమనార్హం. 'చాలా వరకు క్యాష్ ఆన్ డెలివరీపై బుక్ చేసే ఆటోమొబైల్ వస్తువులు, ఎలక్ట్రిక్ వస్తువులను వినియోగదారులు తీసుకోకుండా వదిలేస్తున్నారు. కొన్ని పార్శిళ్లపై తప్పుడు అడ్రస్‌లు, తప్పుడు ఫోన్ నంబర్లు నమోదై ఉంటున్నాయి' అని జూబ్లీ బస్టేషన్ కార్గో అధికారి ఒకరు తెలిపారు. వివిధ రకాల పార్శిళ్లను 3 రోజుల వ్యవధిలో వినియోగదారులకు ఉచితంగా అందజేస్తారు. ఆ తరువాత రూ.25 చొప్పున వసూలు చేస్తారు. రోజుల తరబడి డెలివరీ కాకపోవడంతో పార్శిల్ చార్జీలు అనూహ్యంగా పెరుగుతాయి. ఆ రకంగా కూడా కొందరు తమ వస్తువులను వదిలేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నిబంధనల మేరకే వేలం..

ప్రస్తుతం మహాత్మాగాంధీ బస్టేషన్‌లో 350 వస్తువులు, జూబ్లీబస్‌స్టేషన్‌లో మరో 542 వస్తువులు వేలానికి సిద్ధంగా ఉన్నాయి. మరో వారం తరువాత ఈ వస్తువులను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్గో నిబంధనల మేరకు 45 కంటే ఎక్కువ రోజులు డెలివరీ కాకుండా పెండింగ్‌లో ఉన్న వస్తువులను వేలం వేసేందుకు ముందు ఆర్టీసీ ఒక కమిటీని ఏర్పాటు చేస్తోంది. ఆ కమిటీ సమక్షంలో పెండింగ్ వస్తువుల జాబితాను తయారు చేస్తారు. వాటి అసలు ధరపై మొదటి విడత వేలంలో 50 శాతం తగ్గించి వేలానికి సిద్ధంగా ఉంచుతారు. అదే వస్తువును రెండోసారి వేలం వేస్తే 30 శాతం ధరలకే వేలం వేయనున్నట్లు అధికారులు తెలిపారు. మరో వారం రోజుల్లో జూబ్లీ, మహాత్మాగాంధీ బస్టేషన్‌లలోనూ వేలం నిర్వహించనున్నారు.

వాటర్ హాట్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి

కలుషిత నీటి సరఫరాకు అడ్డుకట్ట
- సివరేజి ఓవర్‌ఫ్లో సమస్యకు చెక్
- మ్యాన్‌హోల్ మూతలు తెరిస్తే క్రిమినల్ కేసులు
- జూమ్ మీటింగ్‌లో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వర్షాల నేపథ్యంలో వరద నీరు నిలిచే హాట్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు సివరేజి ఓవర్‌ఫ్లో సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన జూమ్ మీటింగ్‌లో డైరెక్టర్, సీజీఎం, జీఎం, డీజీఎం, సెక్షన్ మేనేజర్లతో మాట్లాడారు. ఎక్కడైనా మ్యాన్‌హోళ్లు ఉప్పొంగితే వెంటనే పూడికతీత పనులు చేపట్టాలన్నారు. తరచూ ఓవర్‌ఫ్లో అయ్యే ప్రాంతాల పట్ల ప్రత్యేక దష్టి సారించి మ్యాన్‌హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలను వెంటనే తొలగించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఈఆర్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మ్యాన్‌హోళ్లకు సేఫ్టీ గ్రిల్స్

నగరంలోని డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల వల్ల ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా రక్షణ కవచంగా సేఫ్టీ గ్రిల్లులు ఏర్పాటు చేశామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అన్నారు. ఎంసీసీ ఫిర్యాదులపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరమన్నారు. ముఖ్యంగా వర్షపు నీరు మురుగులో కలవడం వల్ల కలిగే కలుషత నీరు సమస్యలపై దృష్టి పెట్టాలని అన్నారు. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ స్థాయిలో నీటి నాణ్యతను కాపాడాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను తెరవవద్దని అశోక్ రెడ్డి హెచ్చరించారు. ఎక్కడైనా నీరు నిలిచినా, మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉన్నా జలమండలి కస్టమర్ కేర్ నెంబరు 155313కి ఫోన్ చేయాలని సూచించారు. తాగునీరు సరఫరా అయ్యే సమయంలో కచ్చితంగా మంచినీటి నాణ్యతను పరీక్షించాలని అధికారులను ఆదేశించారు.

వరద పట్ల అప్రమత్తం..

ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, సింగూరు రిజర్వాయర్ల వరద పరిస్థితిని ప్రతి గంటకోసారి పర్యవేక్షించి, నీటి ప్రవాహం ఉన్న దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు. నిరంతర కార్యకలాపాల కోసం ఐసీసీసీతో పాటు హైడ్రా, జీహెచ్‌ఎంసీ పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి
- కలెక్టరేట్ కంట్రోల్ రూమ్: 040-23202813, 7416687878



మూసీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హరిచందన

సాక్షి, సిటీబ్యూరో: భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సూచించారు. బుధవారం లంగర్ హౌస్‌లోని బాపూ ఘాట్ వద్ద మూసీ నదిని అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డితో కలిసి వరద ఉధ్ధృతిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా హరిచందన మాట్లాడుతూ.. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. నగరంలో ఎక్కడైనా సమస్యలు ఉంటే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 040 23202813, 7416687878లకు ఫోన్ చేయాలన్నారు.

అంతా అటెన్షన్

జీహెచ్‌ఎంసీ యంత్రాంగం హై అలర్ట్

- వర్షాల నేపథ్యంలో జడ్‌సీలు, డీసీల పర్యటనలు
- ట్రాఫిక్ జామ్‌లపై ప్రత్యేక దృష్టి
- అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావొద్దు
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జీహెచ్‌ఎంసీ యంత్రాంగం సర్వం సన్నద్ధంగా ఉందని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. బుధవారం జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌లోని కంట్రోల్ రూంను ఆయన తనిఖీ చేశారు. ఫిర్యాదులపై ఆరా తీశారు. కంట్రోల్ రూం కార్యకలాపాలను సమీక్షించారు. 24x7 అప్రమత్తంగా ఉండాలని కంట్రోల్ రూం సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..

- 'నగరంలో భారీ వర్షాలున్నాయనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు సెలవులు రద్దు చేశాం. ఉన్నత అధికారులను హెడ్ క్వార్టర్లో ఉండాలని ఆదేశించాం. జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని గమనిస్తూ అపసవ్యతలను చక్కదిద్దుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు శిథిలావస్థకు చేరిన భవనాలలో నివాసం ఉంటున్న ప్రజలను ఖాళీ చేయిస్తున్నారు.
- పౌరుల ఫిర్యాదులపై స్పందించేందుకు, సహాయక కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రభావవంతంగా నిర్వహించేందుకు పోలీస్, హైడ్రా, విద్యుత్, జలమండలి, మెట్రో రైలు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం వాటిల్లకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. రిలీఫ్ కార్యకలాపాలను డిప్యూటీ కమిషనర్, స్థానిక తహసీల్దార్లు చూసుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీకి కంట్రోల్ రూమ్‌తో పాటు నేరుగా, వివిధ మాధ్యమాల ద్వారా అందుతున్న ప్రజా ఫిర్యాదులపై సత్వరమే స్పందిస్తున్నాం. నాలాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాం. ప్రజలు లోతట్టు ప్రాంతాల్లోకి వెళ్లకూడదు' అని కమిషనర్ సూచించారు.

ట్రాఫిక్ ఫ్లో సజావుగా సాగేలా చర్యలు..

- నగరంలో వర్షాల నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉంటుందని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ చెప్పారు. నగర ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మ్యాన్‌హోళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవవద్దు అని కమిషనర్ జీహెచ్‌ఎంసీ, జలమండలి, హైడ్రా సిబ్బందికి, ప్రజలకు సూచించారు. మ్యాన్‌హోళ్లపై ఫిర్యాదులను జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.
- ట్రాఫిక్ చోకింగ్ పాయింట్లపై ప్రత్యేక దృష్టి సారించామని, ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీస్, హైడ్రా తో సమన్వయం చేసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా కృషి చేస్తున్నామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో భూగర్భ సంపుల నిర్మాణంతో వాటర్ లాగింగ్ కాకుండా చేసినందువల్ల ట్రాఫిక్ జామ్‌లు తగ్గాయని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో భూగర్భ సంపులను నిర్మిస్తామని కమిషనర్ తెలిపారు.

దెబ్బతిన్న మ్యాన్‌హోళ్ల వద్ద బారికేడ్లు

సాక్షి, సిటీబ్యూరో: భారీ వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న మ్యాన్‌హోళ్ల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా బారికేడ్ల ఏర్పాటుకు జలమండలి ఉపక్రమించింది. నగరంలో దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్ గుర్తిస్తోంది. మరోవైపు మురుగు కట్టడికి జెట్టింగ్ వాహనం, సిల్ట్ గ్రాబర్ వాహనం, మురుగు కాలువ సిబ్బందిని అత్యవసరంగా నియమించింది. ప్రస్తుతం జెట్టింగ్ వాహనం, సిల్ట్ గ్రాబర్ వాహనాలను ప్రతిరోజూ వినియోగిస్తూ మురుగునీటి ఉప్పొంగడాన్ని తాత్కాలికంగా నియంత్రిస్తున్నారు. అదనంగా, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని తాత్కాలికంగా వాహన రాకపోకలను మళ్లించారు. వర్షాలు తగ్గిన వెంటనే, కూలిపోయిన మ్యాన్‌హోల్ పునర్నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించనున్నామని అధికారులు చెప్పారు.



మ్యాన్‌హోల్ వద్ద బారికేడు ఏర్పాటు

బతుకమ్మ కుంటకు ఢిల్లీ బృందం

మూడు నెలల్లో చెరువు నిర్మాణం అపూర్వమని కితాబు

- చెరువు ఇన్‌లెట్, ఔట్‌లెట్లను పరిశీలించిన అధికారులు
- ప్రతి రాష్ట్రంలోనూ హైడ్రా వంటిది అవసరమని వ్యాఖ్య

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను ఢిల్లీ మున్సిపల్ అధికారుల బృందం సందర్శించింది. చెరువు చుట్టూ తిరిగిన ప్రతినిధులు అభివృద్ధి కోసం దశలవారీగా తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఒకప్పుడు చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండిన ప్రాంతం చెరువులా రూపాంతరం చెందడాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కేవలం మూడు నెలల్లో ఈ స్థాయి మార్పు తీసుకురావడం అపూర్వమని కితాబిచ్చారు. హైడ్రా వంటి విభాగం ప్రతి రాష్ట్రంలోనూ ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ చెరువు అభివృద్ధి జాతీయ స్థాయిలో చర్చకు వచ్చిందని బృందానికి నేతృత్వం వహిస్తున్న ఢిల్లీ మున్సిపల్ హార్టికల్చర్ విభాగం అధిపతి డా.ఆశిష్ అన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించడం, మండు వేసవిలో రెండు మీటర్ల లోతు తవ్వగానే నీరు ఉబికిరావడం తదితరాలకు సంబంధించిన వీడియోలను బృందం పరిశీలించింది. ఢిల్లీలో కూడా చెరువులు చాలా వరకు కబ్జాకు గురయ్యాయని, హైడ్రా వంటి సంస్థతో వాటిని పునరుద్ధరించడం, పరిరక్షించడం సులభం అవుతుందని బృందం అభిప్రాయపడింది. ఈ చెరువు లేనప్పుడు చుట్టుపక్కల ప్రాంతాల్లో వరద ప్రభావం ఎలా ఉండేది? ఇప్పుడు ఎలా ఉంది? అనే అంశాలను ఈ బృందం ఆరాతీసింది. ఈ చెరువుకు ఆనుకుని సాగే మురుగు కాలువ నుంచి వరద నీరు మాత్రమే వచ్చేలా ఇన్‌లెట్ నిర్మించడాన్ని పరిశీలించింది. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో వరద నీరు ఎలా వచ్చి చేరిందో వీడియోల ద్వారా హైడ్రా అధికారులు ఢిల్లీ బృందానికి వివరించారు. ఈ వరద నీరు గతంలో ఎటు వెళ్లేదనే విషయాన్ని స్థానికులతో మాట్లాడి తెలుసుకుంది. అప్పట్లో వరద నీరు తమ బస్తీలను, కాలనీలను ముంచెత్తేదని, ఈసారి ఆ ముప్పు తప్పిందని వారంతా ఢిల్లీ బృందానికి తెలిపారు. చెరువు ఔట్‌లెట్లను కూడా బృందం పరిశీలించింది. హైడ్రా అధికారులు మోహనరావు, బాలగోపాల్, చెరువులను అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్ ఎండీ పి.యూనస్‌తో పాటు హెచ్‌ఎండీఏ, ఆస్కీ అధికారులు ఢిల్లీ బృందం వెంట ఉన్నారు.



బతుకమ్మ కుంట వద్ద అధికారుల బృందం

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి

- యువతకు అవగాహన కల్పించాలి
- హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి



సాక్షి, సిటీబ్యూరో: మాదకద్రవ్యాల నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, వాటి వినియోగం వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ, నివారించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలతో యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. ముందు నుంచే పిల్లలకు మన సంస్కతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని, చెడుకు దూరంగా ఉండే విధంగా చూడాలన్నారు. డీ-ఎడిక్షన్ కేంద్రాలలో మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారికి చికిత్స అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ క్యాంపెయిన్ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ రేస్ క్లబ్ చైర్మన్‌గా సురేందర్‌రెడ్డి



చాదర్‌ఘాట్: హైదరాబాద్ రేస్ క్లబ్ (హెచ్‌ఆర్‌సీ) చైర్మన్‌గా ఆర్.సురేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం హెచ్‌ఆర్‌సీలో నిర్వహించిన 54వ వార్షిక జనరల్ మీటింగ్‌లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా రేస్ క్లబ్ డైరెక్టర్లుగా ఎన్‌వీఆర్ నర్సింహా రెడ్డి, ఎంవీ కృష్ణదాస్, ఎస్‌బీ నాయర్, ఆర్.రాజేష్ ఎన్నికయ్యారని ఆయన తెలిపారు.

అంతటా అప్రమత్తం



హుస్సేన్‌సాగర్‌లో పెరిగిన నీటిమట్టం

- సిటీలో మధ్యాహ్నం నుంచి వర్షం
- ఒంటిపూట పనిచేసిన బడులు
- నేడు అతి భారీ వర్ష సూచన

సాక్షి, సిటీబ్యూరో: వాతావరణ శాఖ 'మహా హైదరాబాద్'కు రెడ్ అలర్ట్ ప్రకటించింది. గురువారం అత్యంత భారీ వర్ష సూచన మేరకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అత్యవసర సేవలకోసం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. జీహెచ్‌ఎంసీ, జలమండలి, హైడ్రా, పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు కంట్రోల్ రూమ్స్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నాయి. అధికారుల నుంచి సిబ్బంది వరకు రంగంలోకి దిగి క్షేత్ర స్థాయిలో లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించారు. గురువారం భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సగటున 15 నుంచి 20 సెంటీమీటర్ల వరకు వర్షం పడవచ్చని హెచ్చరించింది. ఇప్పటి వరకు ఈ సీజన్‌లో 15.6 సెంటీ మీటర్ల వర్షపాతం మించలేదు. తాజా హెచ్చరికలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. పగటి పూట కంటే రాత్రి వేళల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు హైడ్రా హెచ్చరించింది. వాహనాల్లో రాకపోకలు తగ్గించాలని, లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారంతా అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించింది.. అత్యవసర సమయాల్లో డీఆర్‌ఎఫ్ హెల్ప్‌లైన్ 040-29560521తో పాటు 9000113667, 9154170992 నంబర్లలో సంప్రదించాలని కోరింది.

మూసీలో పెరిగిన ఉధృతి..

మూసీలో వరద నీటి ఉధృతి పెరిగింది. నగరంలో వర్షాలు కురవడం, హిమాయత్ సాగర్ నీటిని విడుదల చేసినప్పుడు మూసీ వరద ఉధృతంగా ఉంటుంది. మరోవైపు హుస్సేన్ సాగర్‌లో సైతం భారీగా వరద నీరు వచ్చి చేరడంతో నిండుకుండగా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి 1704 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 869 క్యూసెక్కులు వదులుతున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది.



లక్డీకాపూల్‌లో రోడ్డుపై వరద నీరు

అత్యధికంగా 9.3 సెం.మీ..

నగరంలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి తొమ్మిది గంటల వరకు శివారు ప్రాంతంలోని బాలాపూర్‌లోని మామిడిపల్లిలో 9.3 సెంటీ మీటర్లు, ఎయిర్‌పోర్టులో 8.7, కొంగరకలాన్‌లో 6.7, రాజేంద్రనగర్‌లో 4.7, బహదూర్‌పురాలో 4.5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

ఏజీ బీఎస్సీ విద్యార్థి ఆత్మహత్య



రిత్విక్ రాజ్ (ఫైల్)

రాజేంద్రనగర్: బ్యాక్‌లాగ్ ఉన్నాయని మనస్థాపానికి గురైన అగ్రికల్చర్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్‌కు చెందిన రిత్విక్ రాజ్ (21) రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చరల్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. 2021 బ్యాచ్‌కు చెందిన రిత్విక్ రాజ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో హాస్టల్‌లో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి 9 గంటలకు విద్యార్థులందరూ హాస్టల్‌లో భోజనానికి వెళ్లగా రిత్విక్ రాజ్ గదిలోనే ఉన్నాడు. విద్యార్థులు భోజనం చేసి రాత్రి 10 గంటలకు హాస్టల్ గదికి రాగా రిత్విక్ రాజ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే తోటి విద్యార్థులు అతన్ని అత్తాపూర్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. రిత్విక్‌రాజ్ ఆత్మహత్యకు బ్యాక్‌లాగ్‌లు ఉండటమే కారణమని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. బుధవారం ఉదయం పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు

కార్పొరేట్ క్లయింట్లతో సెంట్రల్ బ్యాంకు ఎండీ సమావేశం



సాక్షి, సిటీబ్యూరో: వ్యూహాత్మక అవగాహన ఒప్పందంలో భాగంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి. మురళీకృష్ణ కార్పొరేట్ క్లయింట్లతో సమావేశమయ్యారు. వ్యాపారణ విస్తరణ, భాగస్వామ్య ఒప్పందాల బలోపేతం లక్ష్యంగా క్లయింట్లతో చర్చలు జరిపారు. బ్యాంకు వద్ద అధిక ద్రవ్య లభ్యత ఉన్నందున రుణ వృద్ధి కోసం దూకుడుగా ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రూ.7 లక్షల కోట్లుగా ఉన్న బ్యాంకు వ్యాపారాన్ని ఏడాది చివరికల్లా రూ.8 లక్షల కోట్లకు చేర్చడం తమ లక్ష్యమని మురళీకృష్ణ తెలిపారు.

యువకుడిని కాపాడిన హైడ్రా బృందం



మహ్మద్ గౌస్‌ను బయటకు తీసుకువస్తున్న కార్పొరేటర్ వసీవుద్దీన్

సాక్షి, సిటీబ్యూరో/యాకుత్‌పురా : పాతబస్తీలోని యాకుత్‌పురా రైల్వే స్టేషన్ సమీపంలోని వరద కాలువలో కొట్టుకుపోతున్న ఓ యువకుడిని హైడ్రా సిబ్బంది బుధవారం కాపాడారు. స్థానికుడైన గౌస్ (35) తన మేకల మేత కోసం చెట్టు కొమ్మలను తీసుకువచ్చేందుకు ప్రయత్నించాడు. ఈ ప్రయత్నాల్లో ఉండగా ప్రమాదవశాత్తు వరద కాలువలోకి జారిపోయారు. ఇది గమనించిన స్థానికులు అక్కడకు 100 మీటర్ల దూరంలో కచ్చామోరీల్లో చెత్తను తొలగించే పనిలో ఉన్న హైడ్రా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హైడ్రా ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్ నేతృత్వంలోని బృందం హుటాహుటిన చేరుకుంది. ఆ కాలువలోకి దిగడానికి ఏమాత్రం అవకాశం లేకుండా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నా... ఓ నిచ్చెనను కిందకు వేసి దాని ద్వారా యువకుడిని కాపాడింది. రెయిన్ బజార్ కార్పొరేటర్ వసీవుద్దీన్‌తో పాటు హైడ్రా సిబ్బంది వంశీ, బాలరాజు ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

కారు ఢీకొని బాలుడి దుర్మరణం

కుషాయిగూడ: బుల్లెట్ వాహనంపై వెళ్తున్న ఓ మైనర్ బాలుడిని ఎదురుగా వచ్చిన కారు ఢీ కొనడంతో మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి సిల్వర్‌వోక్ బంగ్లాస్‌లో నివసించే బాలుడు (14) నాగారంలోని ఓ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం సమయంలో బాలుడు బుల్లెట్ వాహనంపై వివేకానందనగర్ నుంచి సురానా ఎక్స్ రోడ్డు వైపుగా వెళ్తుండగా చర్లపల్లి ఫేజ్-2 టీవీఎస్ కంపెనీ వద్ద ఎదురుగా వేగంగా దూసుకువచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. బాలుడి తండ్రి రఘునందన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా తమకు తెలియకుండా బాలుడు వాహనాన్ని తీసుకెళ్లినట్లు తండ్రి పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.

ఉద్యమాలతోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు



మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య

ఉస్మానియాయూనివర్సిటీ: ఉద్యమాలతోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమని జస్టిస్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్‌లో ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ (ఏఐబీసీఎఫ్) ఆధ్వర్యంలో 9వ షెడ్యూల్ ద్వారా 42 శాతం రిజర్వేషన్ల సాధన అనే అంశంపై సెమినార్ జరిగింది. కార్యక్రమానికి ఓయూ ఎకనామిక్స్ విభాగం అధ్యాపకులు ప్రొ.నారాయణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఏఐబీసీఎఫ్ వ్యవస్థాపకులు జస్టిస్ ఈశ్వరయ్య, గౌరవ అతిథిగా బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఛైర్మన్, మాజీ ఏఐఎస్ అధికారి టి.చిరంజీవులు, ఏఐటీబీసీ జేఏసీ చైర్మన్ డా.అవ్వారు వేణుకుమార్ పాల్గొని ప్రసంగించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు చిత్తశుద్ధితో పని చేయడం లేదని ధ్వజమెత్తారు. అడ్వొకేట్ జేఏసీ నేత నాగుల శ్రీనివాస్‌యాదవ్, పొన్నం దేవరాజ్‌గౌడ్, చామకూర రాజు, కేవీ రాజు, ఆర్ట్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ ప్రొ.సుదర్శన్ రావు పాల్గొని ప్రసంగించారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి



కిరణ్‌బాబు (ఫైల్)

చిలకలగూడ: ఆత్మహత్య యత్నానికి పాల్పడిన కానిస్టేబుల్ తూము కిరణ్‌బాబు (40) సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు సికింద్రాబాద్ రాణిగంజ్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన తూము కిరణ్‌బాబు 2010లో పోలీస్ కానిస్టేబుల్‌గా సెలక్ట్ అయ్యాడు. 2017లో మీర్‌చౌక్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న సమయంలో సస్పెన్షన్‌కు గురయ్యాడు. అప్పటి నుంచి సస్పెన్షన్ తొలగించాలని పోలీస్ ఉన్నతాధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కాగా, కుటుంబపోషణ భారమైంది. ఈ క్రమంలో ఈనెల 4న ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు. 64 శాతం కాలిన గాయాల్లో గాంధీ బర్న్స్‌వార్డులో చికిత్స పొందుతు బుధవారం ఉదయం 7 గంటలకు మృతి చెందాడు. మృతునికి భార్య సారిక, కుమార్తెలు మదనిక(08) శరణ్య (07)లు ఉన్నారు. దిక్కులేని తమకు న్యాయం చేయాలని మృతుని భార్య సారిక పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది. గాంధీ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కటుంబసభ్యులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు.

ఫొటో మార్ఫింగ్ చేసి మహిళకు బెదిరింపులు

వెంగళరావునగర్: మహిళ ఫొటో మార్ఫింగ్ చేసి బెదిరింపులకు గురిచేస్తున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్‌కు చెందిన ఓ మహిళ కాల్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో గత సోమవారం రమ్య పేరుతో ఆమెకు ఇన్‌స్టాగాం ద్వారా పోస్ట్ వచ్చింది. రమ్య పేరుతో తన ఫొటో ఉండటంతో లింక్‌ను ఓపెన్ చేసింది. అందులో ఆమె ఫొటోలు మరికొన్ని మార్ఫింగ్ చేసి ఉన్నాయి. అకౌంట్‌ను బ్లాక్ చేస్తే ఫొటోలను సోషల్ మీడియాలో పెడతామని హెచ్చరించారు. దాంతో ఆమె ఆందోళన చెంది భర్తకు విషయాన్ని తెలియజేసింది. అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా..పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలోంచి పడి వ్యక్తి దుర్మరణం

బంజారాహిల్స్: సామగ్రితో వెళ్తున్న ఆటోలో నుంచి ప్రమాదవశాత్తూ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. టోలిచౌకి ఎండీ లైన్స్‌కు చెందిన మహ్మద్ ఖలీం(35) సామగ్రిని మాసబ్‌ట్యాంక్‌లో ఓ ఆటోలో లోడ్ చేసేందుకు వెళ్లాడు. అదే ఆటోలో సామగ్రిపై కూర్చొని చేర్చాల్సిన చోటుకు వెళ్తుండగా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-8లో చెట్టుపై వేలాడుతున్న విరిగిన కొమ్మ ఆటోలో ఉన్న బీరువాను తాకింది. ఆ బీరువా పక్కనే కూర్చొన్న ఖలీం బీరువాతో పాటు కిందపడటంతో తల పగిలి అక్కడికక్కడే చనిపోయాడు. అయితే ఆటో నడుపుతున్న మహేందర్ ఇదేమీ చూసుకోకుండా అలాగే వెళ్తుండగా అటునుంచి వెళ్తున్నవారంతా అప్రమత్తం చేసి ఖలీం ఆటోలో నుంచి కిందపడి చనిపోయిన విషయాన్ని తెలిపాడు. దీంతో ఆటో వెనక్కి తిరిగి వచ్చి ఖలీంను ఆటోలో వేసుకుని సమపంలోని ఏఐజీ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనకు కారకులైన అశోక్ లేల్యాండ్ వెహికల్ డ్రైవర్ మహేందర్‌తో పాటు ఆటోలో ముందు కూర్చొన్న మహ్మద్ యూనస్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడు రజాక్

వెంగళరావునగర్: బెంగళూరు నుంచి నగరానికి డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని మధురానగర్ పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ తెలిపిన మేరకు..ఎల్లారెడ్డిగూడకు చెందిన రజాక్ బెంగుళూరు నుంచి డ్రగ్స్ తీసుకుని నగరానికి వస్తున్నట్టుగా సమాచారం అందడంతో పోలీసులు వలపన్నారు. బుధవారం సాయంత్రం రజాక్ డ్రగ్స్‌తో ఇంట్లో ఉన్నాడని తెలుసుకుని ముట్టడించారు. ఈ క్రమంలో రజాక్ పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే అతనిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా అతని వద్ద దాదాపు 4 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ (0.75 గ్రాములున్న 5 పాకెట్లు) లభించాయి. ఒక్కో గ్రాము రూ.5 వేల నుంచి 10 వేల వరకు విక్రయిస్తుంటాడని పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగి బస్సులు నడిపిన డ్రైవర్లకు జైలు శిక్ష



డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడ్డ ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లు

అమీర్‌పేట: మద్యం తాగి డ్రైవింగ్ చేసిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్లకు న్యాయస్థానం జైలు శిక్ష, జరిమాన విధించింది. ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు అమీర్‌పేట మైత్రివనం వద్ద ఈ నెల 6న రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మొత్తం 15 కేసులు నమోదు చేయగా వారిలో ముగ్గురు బస్సు డ్రైవర్లు, మిగతా వారు వ్యకిగత వాహనాలు నడుతుపూ పట్టుపడ్డారు. ముగ్గురు డ్రైవర్లు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే కావడం గమనార్హం. ప్రొద్దుటూరుకు వెళ్తున మిట్టమానేపల్లికి చెందిన కేఎమ్‌ఆర్ ట్రావెల్ బస్సు డ్రైవర్ సీహెచ్. చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి వెళ్తున్న కర్నూల్ జిల్లా మార్కాపురానికి చెందిన మార్నింగ్ స్టార్ డ్రైవర్ మాదిగ రామచంద్రుడు, అనంతపురం వెళ్తున్న అనంతపురం భవానీనగర్‌కు చెందిన అల్ మదీనా ట్రావెల్స్ డ్రైవర్ రాజేశ్‌కు బ్రీతింగ్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగినట్లు నిర్ధారణ కావడంతో కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.2100 జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు. తనిఖీల్లో ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో బిల్డింగ్ మీద నుంచి దూకి..



ఆత్మహత్య చేసుకున్న పవన్‌రాజ్

మల్లాపూర్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా బిల్డింగ్ పైనుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని హబ్సిగూడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పశ్చిమగోదావరి జిల్లా మండపేటకు చెందిన డి.పవన్‌రాజ్ (26) హబ్సిగూడలోని ద్వారకా లాడ్జిలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా అప్పుల బాధలతో ఇబ్బంది పడుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం పనిచేస్తున్న లాడ్జి పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్ నిధుల దుర్వినియోగం

20 మంది యూనియన్ నాయకులపై కేసు నమోదు

బంజారాహిల్స్: నిధుల దుర్వినియోగానికి పాల్పడిన డిజిటల్ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్ నాయకులపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్‌లో ఉన్న తెలుగు మూవీ అండ్ డిజిటల్ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్‌లో కొంతకాలంగా నిధులు దుర్వినియోగం జరుగుతున్నదని, 2021 నుంచి 2025 వరకు పలు దఫాలుగా అకౌంట్ల నిర్వహణలో చేతివాటం ప్రదర్శించారని చిల్లర రాంబాబు అనే డబ్బింగ్ ఇన్‌ఛార్జి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిర్మాతల నుంచి రూ.15 లక్షలు వసూలు చేసి రూ.5 లక్షలు మాత్రమే ఆర్టిస్ట్‌లకు పంపిణీ చేశారని, మిగతా రూ.10 లక్షలు వీరు తమ వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించుకున్నారని ఆరోపించారు. బోగస్ పత్రాలతో, సంతకాలతో కొంతకాలంగా యూనియన్ డబ్బులు పక్కదారి పడుతున్నాయని వెల్లడించారు. తాను పెట్టిన కేసులను విత్‌డ్రా చేసుకోవాలంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. రికార్డులు తిరగేస్తే అకౌంట్స్ చూస్తే వీరి బాగోతం బయటపడుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణలో సమగ్ర దర్యాప్తు జరిపి రికార్డులు పరిశీలించి నిందితులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలుగు మూవీ అండ్ డిజిటల్ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్ మాజీ, తాజా నాయకులు పీవీ సుబ్బారావు, పి.మనోహర్ రావు, సి.దామోదర్‌రెడ్డి, టి.హరికృష్ణ, వి.లెనినాచౌదరి, బి.శివారెడ్డి, బీఎల్‌ఎన్ సత్యప్రియ, టి.ఫణి, ఎం.మంగరాజు, జి.సోమశేఖర్, బీవీ రమణ, డి.ఈశ్వర్, ఎన్వీఎస్ అచ్యుత్, ఎంవీఎస్ రవికుమార్, ఎస్.షర్మిలాకుమారి తదితరులపై కేసు నమోదైంది. 20 మందిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వీరందరిపై బీఎన్ఎస్ సెక్షన్ 318 (1), (3), 316 (1), (2), 314, 351 (1), రెడ్‌విత్ 35 (2) (5), 61 కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ 12,999/-కే గజం DTCP అప్రూవ్డ్ విజయవాడ హైవే ఫేసింగ్ చౌటుప్పల్ దగ్గర RRR దగ్గరలో న్యూవెంచర్లో ప్లాట్లు అమ్మబడును. 8309376230 [SCA25007209]

PLOT FOR SALE

■ న్యూవెంచర్ లాంచింగ్ @ శ్రీశైలం హైవే ఫ్యూచర్ సిటీ దగ్గర కడ్తాల్ టౌన్‌లో DTCP అప్రూవల్ వెంచర్‌లో అన్ని డెవలప్‌మెంట్స్ కంప్లీట్ అయిన వెంచర్‌లో ప్లాట్స్ కలవు. బ్యాంక్‌లోన్ కలదు. సంప్ర: 9666695886 [HA-1451]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800537]

BUSINESS OFFER

■ Learn, EarnMoney Online & Offline.Investment: 22K-5L, Affiliate/ Refer, Franchise. 9652138542. www.IndiaStudent.Com [SCA25007237]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, GONGADI JYOTHI, W/o GONGADI LAXMAN, R/o H.No. 8-2-676/1/B/30/4, Sri Ram Nagar, Banjara Hills, Hyderabad, TG-500034 Change my Name as PENTAM JYOTHI [SCA25000107]

■ I, M PARDHA SARADHI S/o. Late M.S. Jaya Swarup, Retired (IAF) Employee, R/o. H.No.2-1-72/2, Raghavendra Colony, Uppal Medchal - Malkajgiri District - 500039, T.S. have changed my name from M PARDHA SARADHI to MALLAVELLI PARTHA SARATHI, vide affidavit signed by Advocate & Notary N. Chandraiah, on 11-08-2025 [HA-01322]

■ I, SURENDER KUMAR SHARMA S/o LATE KIDARNATH SHIRMA R/o F. No:- 203Rahul Residency Sitarampuram Old Bowenpally Near Dubaigate Tirumalagiri Secunderabad Telangana changed my Name from" S K SHARMA TO SURENDER KUMAR SHARMA ALIAS S K JAIN [SCA25007253]

■ I, DONTHULA PAVAN KUMAR S/o DONTHULA LAXMIPATHY, R/o. H.No : 1-4-85, Old Alwal, Alwal, Medchal- Malkajgiri, T.G-10. My Son Original Name DONTHULA HANSIDH S/o DONTHULAPAVAN KUMAR Changed My Son Name as DONTHULA SRIHAN S/o DONTHULA PAVAN KUMAR [SCA25007254]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చీర్యాల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 939103 9990, 6281125552 [H-783380]

Wanted

■ బట్టల షాప్‌లో పనిచేయుటకు ఆఫీస్ బాయ్స్ (M) & హెల్పర్స్ (M) 25-50 సం.ల వయస్సు కలిగి, 10వ తరగతి చదివిన వారు కావలెను. జీతం : చిక్కడపల్లి, హైదరాబాద్. 9440609054 [HA-01319]

■ దిల్‌సుఖ్‌నగర్‌లోని కోచింగ్ సెంటర్‌లో పనిచేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ మరియు డిటిపి ఆపరేటర్ కావలెను. Ph: 9848458639 [SSP25000104]

■ స్పాట్ జాయినింగ్. SBI, HDFC, AXIS బ్యాంక్ ఏజెన్సీ, కంపెనీలో M/F స్టాఫ్ కా॥. Age: 18-35, Q: 10th-PG. జీతం: 18-35. ఫోన్: 8309534098 [SCA25007043]

■ షిరిడిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యభర్తలు కావలెను. ఫోన్: 8985114453, 9391036931 [HA-16124]

■ Wanted Good Salesmen Cum Marketing in Textiles , Auto Drivers for Delivery , Girls for Sales & Accounts @ Sec-Bad, Ph.no: 9391644112 [HA-6431]

■ VIJAY MARIE HOSPITAL and EDUCATIONAL SOCIETY VIJAY MARIE SCHOOL of NURSING Khairatabad, HYD Applications are invited from Intermediate passed Female Candidates to General Nursing & Midwifery Course for 2025-2026. Prescribed Application Forms may be obtained from Nursing School Office from 9.00 A.M. to 5.00 P.M. Ph No. 8523060581. [SSP25000101]

FACULTY TEACHERS

■ St. Joseph's High School, Ramanthapur (ESTD 1979) Requires Trained/Untrained Lady Teacher for Teaching Computer, SST, Science in Primary Classes. Fluency in English is a must. Candidates may mail their resume to sjhsacademy@gmail.com or Contact: 7013551914. [HA-16126]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ భారతీనాయక్

వెంకటేశ్వరకాలనీ: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక భారంతో బిల్లులు కట్టలేని సామాన్య, మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ బి.భారతీనాయక్ పంపిణీ చేశారు. ఆదర్శ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వెంకటేశ్వరనగర్ డివిజన్‌కు చెందిన 14 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ కార్యాలయంలో అర్హులైన వారు ఈ పథకం కింద దరఖాస్తులు అందజేస్తే ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని సూచించారు.

ముగిసిన నమూనా పార్లమెంట్ సెషన్స్



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో మోడల్ పార్లమెంట్ సెషన్స్ బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు చట్టసభల నిర్వహణ ఏవిధంగా ఉంటుందనే అంశాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 37, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 55, క్యాప్సికం 40, పచ్చి కాకరకాయ 26, పందిరిబీర 38, క్యాబేజీ 13, క్యారెట్ 45, దొండకాయ 23, గుండు బీన్స్ 50, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 35, కందగడ్డ 45, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4, మామిడికాయ 20, ముల్లంగి 4–5, ఉల్లిపొరక 35 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అడుగడుగునా లోపాలే..!

తప్పులు చేస్తున్న జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ వ్యవస్థ



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ఎదుట వరద నీటిని తోడుతున్న హైడ్రా సిబ్బంది

- ఎక్కడికక్కడే ఆగిపోతున్న వర్షపు నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను రూ. 650 కోట్ల వ్యయంతో అత్యంత ఆర్భాటంగా నిర్మించారు. అయితే ఇక్కడి నుంచి వరద వెళ్లే పైప్‌లైన్లు మాత్రం అడ్డదిడ్డంగా నిర్మించడంతో చినుకు పడిందంటే ఇక్కడ రోడ్డంతా వరద నీటితో నిండిపోయి ట్రాఫిక్ స్తంభించిపోతున్నది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఇక్కడ వరదనీటిని తోడాలంటే భారీ మోటార్ పంపులను ఏర్పాటు చేయాల్సి వస్తోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మించిన ప్రభుత్వం ఇక్కడ భారీ వరదనీటి పైప్‌లైన్లు మాత్రం నిర్మించలేకపోయింది.

☛ ఇక్కడ వరదనీరు నిలుస్తుందని తెలిసి కూడా నిర్మాణ సమయంలో సరైన ప్రణాళికలు రూపొందించకుండా ఆదరా బాదరగా కట్టేశారు. జీహెచ్‌ఎంసీ, ఆర్ అండ్ బీ ఇంజనీర్ల మధ్య సమన్వయం కుదరకపోవడంతో ఇక్కడ వరదనీటి పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టకుండా గాలికొదిలేశారు. ఫలితంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇక్కడ వరదనీరు వెళ్లే మార్గాలు లేక నీళ్లన్నీ రోడ్లను ముంచెత్తుతున్నాయి. ట్రాఫిక్ జాం అవుతున్నది.

☛ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం సమయంలోనే కింది నుంచి భారీ వరదనీటి పైప్‌లైన్ నిర్మించి ఉంటే ఈ పరిస్థితి ఉండకపోయేదని పోలీసు అధికారులు అంటున్నారు. ఇంజనీరింగ్ వ్యవస్థ లోపాలు ఇక్కడ కళ్లకు కడుతున్నాయి.



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని శబ్దాలయ గేటును ఆనుకుని రోడ్డుకు ఎత్తులో నిర్మించిన వరదనీటి మ్యాన్‌హోల్

రోడ్డుకు ఎత్తులో మ్యాన్‌హోళ్లు..

జీహెచ్‌ఎంసీ ఇంజనీర్ల లోపాలు, సరైన ప్రణాళికలు లేకపోవడం వల్ల వరదనీటి సమస్య తీవ్రరూపం దాల్చుతున్నది. ఇంజనీరింగ్ విభాగమే అత్యంత అధ్వాన్నంగా ఉన్నట్లు ఇటీవల రోడ్లను ముంచెత్తుతున్న వరద నిరూపిస్తున్నది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని కేబీఆర్ పార్కు మీదుగా ముందుకువెళ్లే క్రమంలో శబ్దాలయ స్టూడియో గేటును ఆనుకుని ఇటీవల వెంకటేశ్వరకాలనీ డివిజన్ ఇంజనీర్లు లక్షలాది రూపాయలు వెచ్చించి వరదనీటి కాలువ నిర్మాణం చేపట్టారు.

☛ అయితే రోడ్డుకు కొంచెం లోతుగా లేదా సమాంతరంగా మ్యాన్‌హోళ్లు నిర్మించి వరదనీరు వెళ్లే విధంగా రంధ్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం సదరు ఇంజనీర్ల నిర్వాకంతో రోడ్డుకు ఎత్తులో ఐదు మ్యాన్‌హోళ్లు నిర్మించారు. తూతూమంత్రంగా నిర్మించిన ఈ మ్యాన్‌హోళ్లలోకి వరద వెళ్లలేక రోడ్ల మీదనే తిష్టవేస్తున్నది. ఇంజనీరింగ్ వ్యవస్థ ఎంత భ్రష్టు పట్టిపోయిందో ఈ ఒక్క ఉదంతం చాలు. ఇంజనీరింగ్ ప్రణాళికా లోపాలు అడుగడుగునా కళ్లకు కడుతున్నాయి.

☛ ఎక్కడ చూసినా వరదనీటి కాలువలోకి చేరే వరదంతా మ్యాన్‌హోళ్లలోకి వెళ్లకుండా రోడ్లపై తిష్ట వేయడానికి కారణం అవి ఎత్తులో ఉండటమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా వరదంతా రోడ్లను ముంచెత్తుతున్నది. జీహెచ్‌ఎంసీ ఒకవైపు.. జలమండలి ఇంకోవైపు.. హైడ్రా తీరు మరోవైపు.. ఇలా అన్ని విభాగాలు 'అట్టర్ ఫ్లాప్' దిశలో నడుస్తుండగా వాహనదారులు, పాదచారుల పాట్లు వర్ణనాతీతం.

సీఎం వస్తున్నారని హైరానా..

- అయినా తగ్గని వరద
- అలాగే పర్యటన ముగించిన ముఖ్యమంత్రి



ముఖ్యమంత్రి వచ్చే మార్గంలో వరదనీటిని తోడేస్తున్న హైడ్రా, ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల పరిస్థితులపై సమీక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వచ్చారు. ఉదయం నుంచి కురుస్తోన్న వర్షానికి కమాండ్ కంట్రోల్ సెంటర్ ముందు భారీగా వరదనీరు నిలిచిపోగా హైడ్రా సిబ్బంది మోటార్ల సాయంతో తోడేస్తున్నా ఎంతకీ వరద తగ్గుముఖం పట్టలేదు. కొద్దిసేపట్లో ముఖ్యమంత్రి వస్తున్నారనగా ఇక్కడ భారీగా వరద పేరుకుపోవడంతో ట్రాఫిక్ పోలీసులు హైరానా పడ్డారు. ఈ వరదలో నుంచే ముఖ్యమంత్రి వెళ్లాల్సి ఉండటంతో వరదను తోడేందుకు రెండు గంటల పాటు నానా అవస్థలు పడ్డారు. హైడ్రా సిబ్బందితో పాటు బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వరద నీటిని తోడే క్రమంలో అటు మోటార్ పంపులు పని చేయక, ఇటు వరద తగ్గక, మరోవైపు వర్షం కురుస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒకవైపు వీరంతా వరదనీటిని తోడేందుకు యత్నిస్తుండగానే ముఖ్యమంత్రి కాన్వాయ్ రానే వచ్చింది. ఇక చేసేదేమీ లేక సిబ్బంది మొత్తం పక్కకు తొలిగారు. వరదలో నుంచే ముఖ్యమంత్రి ముందుకువెళ్లారు. ఆయన తిరిగి వెళ్లే క్రమంలోనూ రోడ్డుకు అవతలి వైపు భారీగా వరదనీరు పేరుకుపోయింది. ఇది మరో సమస్యగా మారింది. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి ఉదయం 11.30 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు రావాల్సి ఉంది. అప్పటికే పోలీసులు రూట్లు వేసుకుని బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. అయితే కమాండ్ కంట్రోల్ సెంటర్ ముందు భారీ వరద నిలిచిపోయిందని సమాచారం రావడంతో ఆయన తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. సాయంత్రానికి తగ్గుముఖం పడుతుందని భావించినా వరద ప్రభావిత ప్రాంతాలను సమీక్షించేందుకు తప్పనిసరిగా రావాల్సి రావడంతో ఆయన తప్పనిసరి పరిస్థితుల్లోనే వరదలో నుంచే వెళ్లాల్సి వచ్చింది.

గణేష్ ఉత్సవాలు 'సమన్వయం'తో సాగాలి



సమన్వయ సమావేశంలో అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

బంజారాహిల్స్: వినాయక ఉత్సవాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో బుధవారం వివిధ విభాగాల అధికారుల సమన్వయం సమావేశం జరిగింది. ఇందులో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో పాటు సెంట్రల్ జోన్ డీసీపీ హాజరై గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులకు మార్గనిర్దేశం చేశారు. అలాగే లాజిస్టికల్ ఏర్పాట్లు, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు వంటి కీలక ప్రదేశాల్లో గుంతలను పూడ్చడం, చెట్ల కొమ్మలను కత్తిరించడం, నీటి సరఫరా, డెబ్రీస్ లిఫ్టింగ్, క్రేన్ ప్లేస్‌మెంట్ వంటి అంశాలపై చర్చించారు. గణేష్ చతుర్థిని సజావుగా, శాంతియుతంగా జరిగేలా చూడాలని ఈ సందర్భంగా అధికారులు గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులకు సూచించారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ సత్తాచాటాలి



మాట్లాడుతున్న అంజన్‌కుమార్ యాదవ్

శ్రీనగర్‌కాలనీ: త్వరలో జరనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఏకతాటిపై పయనించి పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు అంజన్ కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఎర్రగడ్డలోని గోకుల్ థియేటర్ వద్ద బుధవారం ఆయన కాంగ్రెస్ నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయించినా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలన్నారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు మోసిన్ ఖురేసి, ఎర్ర కృష్ణకుమార్, రవిగౌడ్, పి.నర్సింగరావు, విజయ్ యాదవ్, రమేష్ నాయక్, దీపక్, యాదగిరి యాదవ్, ఖాజా, ఆవాస్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేయను

కాంగ్రెస్ నేత వేణుగోపాల్ స్వామి

పంజగుట్ట: త్వరలో జరిగే ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు ఆసక్తి లేదని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకుడు సి.ఎ. వేణుగోపాల్ స్వామి పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2024 ఎన్నికల్లో తాను సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టిక్కెట్ అడిగిన విషయం వాస్తవమే అని కాని అధిష్టానం తనకు ఇవ్వలేదని దానం నాగేందర్‌కు ఇచ్చిందన్నారు. ఆయన కోసం తాను పనిచేశానని కాని ఓడిపోయామని గుర్తుచేశారు. ఇటీవల కొంతమంది తన అభిమానులు, కార్యకర్తలు జూబ్లీహిల్స్ టిక్కెట్ తనకు ఇవ్వాలని బ్యానర్‌లు ఏర్పాటు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని సదరు బ్యానర్లు ఎవరు ఏర్పాటు చేశారో కూడా తనకు తెలియదన్నారు. జూబ్లీహిల్స్ టిక్కెట్ కోసం కాంగ్రెస్ నుంచి ఇప్పటికే 10 మంది వరకు ఆశిస్తున్నట్లు పత్రికల్లో కథనాలు వస్తున్నాయన్నారు. ఈ విషయమై ఢిల్లీ కాంగ్రెస్ అధిష్టానానికి, రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానానికి లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.



శిక్షణ శిబిరంలో పాల్గొన్న ప్రొఫెసర్లు

కృత్రిమ మేధపై శిక్షణ

పంజగుట్ట: చింతల్‌బస్తీలోని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కాలేజీ వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ భాగస్వామ్యంతో 'కృత్రిమ మేధస్సు– సమర్థవంతమైన బోధన, అభ్యాసన, పరిశోధన' అనే అంశంపై ఒకరోజు జాతీయ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్. రాజేందర్ సింగ్, ప్రొఫెసర్ బాలభాస్కర్, పి.ఎం.ఉష, ప్రాజెక్ట్ ఆఫీసర్ సౌందర్య జోసెఫ్‌లు పాల్గొన్నారు.వివిధ కాలేజీల నుంచి సుమారు 200 మంది ఆచార్యులు, సహాయ ఆచార్యులు హాజరయ్యారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించి ఎలా సమర్థవంతమైన బోధన, అభ్యాసన, పరిశోధనా పద్ధతులు, వాటి ప్రయోజనాలు, అనర్థాలు అనే అంశంపై వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి, ఉస్మానియా యూనివర్సిటీ వాణిజ్య విభాగాధిపతి ప్రొఫెసర్ గంగాధర్, డీన్ ప్రొఫెసర్ కృష్ణ చైతన్య, ప్రొఫెసర్ వై.రామకృష్ణ, డాక్టర్ పి.కళ్యాణి, ప్రొఫెసర్ సయ్యద్ ఖాజా సైఫుద్దీన్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ బి.రాజేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఇన్వెస్టిచ్యూర్' సంబురం



ఇన్వెస్టిచ్యూర్ వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

ఫిలింనగర్: భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో బుధవారం ఇన్వెస్టిచ్యూర్ (నాయకత్వ బాధ్యతల స్వీకారోత్సవం) వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్ చోడవరపు ఎన్నికైన సభ్యులకు బ్యాడ్జీలను ధరింపజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకముందు విద్యార్థులు నిర్వహించిన అంబుజా వాసిని నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అలాగే శ్యామలే మీనాక్షి స్వాగత నృత్యం అందరినీ కట్టిపడేసింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్ చోడవరపు మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని ఉత్తమ భావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తమకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ తదితరులు పాల్గొన్నారు.



నాలా ప్రహరీ కూలితే రక్షణ చర్యలుండవా?



నాలా ప్రహరీ కూలిన ప్రాంతంలో బ్యాండ్ కట్టిన అధికారులు

బంజారాహిల్స్: నాలా ప్రహరీలు కూలిపోయిన చోట్ల చిన్న పిల్లలు, పెద్ద వారు అందులో పడిపోకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యల్లో అధికారులు విఫలం అవుతున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నాలుగు రోజుల క్రితం బంజారాహిల్స్‌రోడ్ నెం. 13లోని అంబేద్కర్‌నగర్ బస్తీలో నాలా ప్రహరీ 30 అడుగుల మేర కూలిపోయింది. నాలా చుట్టూ నివాసాలు కూడా ఉంటాయి. ఇక్కడే చిన్న పిల్లలు, వృద్ధులు కూడా అటూఇటూ రాకపోకలు సాగిస్తుంటారు. నాలా ప్రహరీ కూలిపోయిన చోట కనీసం బారికేడ్లు పెట్టాల్సిన అధికారులు ఓ బ్యాండ్ కట్టేసి చేతులు దులుపుకొన్నారు. రాత్రివేళ పిల్లలను బయటికి పంపాలంటే భయంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వర్షం వచ్చి ఈ ప్రమాదకర నాలా వల్ల ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గద్దర్‌కు డాక్టరేట్ ఇవ్వాలి

హిమాయత్‌నగర్: ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ఇవ్వాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ వైస్ చాన్సలర్ ఎం.కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఇస్రో చైర్మన్ ఒక ప్రభుత్వ ఉద్యోగి మాత్రమే అని, తన పని తాను చేశారే తప్ప ఈ దేశ ప్రజల కోసం ఎలాంటి త్యాగం చేయలేదన్నారు. కనుక ఉస్మానియా యూనివర్సిటీ ఇచ్చే డాక్టరేట్‌కు ఇస్రో చైర్మన్ కంటే తొలి, మలి తెలంగాణ ఉద్యమానికి తన ఆట పాటలతో తెలంగాణ ప్రజలను చైతన్యం చేసి తెలంగాణ ద్రోహుల చేతిలో బుల్లెట్ దెబ్బలకు చావు వరకు వెళ్లొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ ఉద్యోగం, భార్యా పిల్లలను వదిలేసి సమాజం కోసం తన చివరి శ్వాస వరకు పనిచేసిన గద్దర్‌కే అన్ని రకాల అర్హతలు ఉన్నాయన్నారు. కానీ తన ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ఇంజనీర్ కావడంతో వైస్ చాన్సలర్ రాజకీయ పార్టీల ఒత్తిడితో ఇస్రో చైర్మన్ నారాయణకు డాక్టరేట్ ఖరారు చేయడం అన్యాయం అని విమర్శించారు.



కాసేపు కురుస్తూ.. కాసేపు ఆగుతూ...



బంజారాహిల్స్: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం వర్షం కాసేపు కురుస్తూ.. కాసేపు ఆగుతూ కనిపించింది. వర్షం వస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో చాలా పాఠశాలలు ఒంటిపూటబడి పూర్తికాగానే ఇళ్లకు పంపించాయి. దీంతో రోడ్ల మీద వాహనాల రద్దీ ఎక్కువగా కనిపించలేదు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు కూడా వర్షం వస్తూ, పోతూ ఉండటంతో ఎక్కడా కూడా పెద్దగా వరద నిలవలేదు. వరద నిలవకుండా ఉండేందుకు అధికారులు, హైడ్రా సిబ్బంది ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకున్నారు.





బంజారాహిల్స్‌లో వర్షం దృశ్యాలు

సహకరించకుంటే కుటుంబ సభ్యుల్ని చంపేస్తా..

మహిళకు బెదిరింపులు..కేసు నమోదు

ఫిలింనగర్: 'తన కోరిక తీర్చకపోతే, తనతో రాకపోతే, తన ఫోన్లు లిఫ్ట్ చేయకపోతే నీ భర్తతో పాటు పిల్లలను చంపేస్తా' అంటూ బెదిరిస్తున్న వ్యక్తిపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డినగర్ బస్తీలో నివసించే వివాహిత (35) హౌస్ కీపింగ్ పని చేస్తున్నది. ఇదే బస్తీలో నివసించే సి.రవికుమార్ అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతూనే పరిచయాన్ని అడ్డదారుల్లోకి నెట్టాడు. ఆమె పనిచేస్తున్న ప్రాంతానికి వెళ్లి తనతో పాటు బయటకు రావాలంటూ బెదిరించేవాడు. తన కోరిక తీర్చాలంటూ హెచ్చరించేవాడు. దీంతో ఆమె రవికుమార్ చేస్తున్న ఫోన్లకు సమాధానం ఇవ్వకపోవడంతో ఇటీవల ఆమెను వెంబడించసాగాడు. దీంతో ఆమె పని కూడా మానేసింది. అంతటితో ఊరుకోని నిందితుడు ఆమె భర్తకు కూడా ఫోన్ చేయసాగాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు పెరిగాయి. బుధవారం మళ్లీ ఫోన్ చేసి హెచ్చరించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు రవికుమార్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 75 (2), 78, 351 (2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైడ్రా, జీహెచ్‌ఎంసీ మధ్య కొరవడిన సమన్వయం

కర్ణన్‌కు ఫిర్యాదు చేసిన బీజేపీ కార్పొరేటర్లు



లక్డీకాపూల్ : హైడ్రా, జీహెచ్‌ఎంసీల మధ్య తీవ్ర సమన్వయ లోపం ఉందని బీజేపీ కార్పొరేటర్లు ఆరోపించారు. బుధవారం బీజేపీ కార్పొరేటర్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను కలిసి స్థానికంగా ఎదురవుతున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇంతవరకూ హైడ్రా, స్థానిక కార్పొరేటర్లు, సర్కిల్ స్థాయి అధికారుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవతున్నారని చెప్పారు. వరదలపై పదికిపైగా నివేదికలున్నా అవన్నీ బుట్ట దాఖలాలయ్యాయని పేర్కొన్నారు. ఎన్ని ప్రమాదాలు జరిగినా ప్రభుత్వం నోరు మెదపకపోవడం దారుణమన్నారు. వీధికుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నగరంలో కూడా అమలు చేయాలని బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేసారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మూసాపేట్, సరూర్‌నగర్ కార్పొరేటర్లు మహేందర్, ఆకుల శ్రీవాణి తదితరులు ఉన్నారు.

'ఒయాసిస్'లో ది వీల్ ఆఫ్ హోప్ యాక్టివిటీ' సేవలు

బంజారాహిల్స్: ఒయాసిస్ ఫెర్టిలిటీ నమ్మకమైన సైన్స్ ఆధారిత సంతానోత్పత్తి భాగస్వామిగా ఎప్పటికప్పుడు తన స్థానాన్ని బలోపేతం చేస్తూ వస్తున్నదని ఆ సంస్థ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గాజీరావు అన్నారు. ఐ వాల్యూ ఫ్యామిలీ ఫర్ ఇండియాస్ బ్రైటెంట్ ఫ్యూచర్‌లో భాగంగా ఒయాసిస్ ఫెర్టిలిటీలో చేపట్టిన ది వీల్ ఆఫ్ హోప్ యాక్టివిటీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గాజీరావు మాట్లాడుతూ... ది వీల్ ఆఫ్ హోప్ యాక్టివిటీ ద్వారా 600లకు పైగా జంటలు లబ్ధి పొందాయన్నారు. ఆయా జంటలకు రూ. 41 లక్షలకు పైగా డిస్కౌంట్లు అందించడం జరిగిందని చెప్పారు. బెంగుళూరు, ఒడిస్సా, హైదరాబాద్ కేంద్రాల్లో 11 జంటలు ఉచిత ఐవీఎఫ్ చికిత్సను గెలుచుకున్నాయని చెప్పారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ ద్వారా వారి మాతృత్వ కలను సాకారం చేసుకోవడానికి వారిని ఒక అడుగు దగ్గరగా తీసుకువచ్చినట్లు చెప్పారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

వానలోనూ 'పంద్రాగస్టు' రిహార్సల్స్

గోల్కొండ: పంద్రాగస్టు వేడుకల రిహార్సల్స్ గోల్కొండ కోటలో ముమ్మరంగా జరుగుతున్నాయి. జోరుగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోలీసులు రిహార్సల్స్ కొనసాగించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో గోల్కొండ మెయిన్ గేటు వద్ద పోలీసు పరేడ్‌తోపాటు సీఎం సెల్యూట్ రిహార్సల్స్ కూడా జరిగాయి. స్థానికులు భారీగా తరలివచ్చి ఈ రిహార్సల్స్‌ను తిలకించారు. నగర పోలీసు అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ ఇక్బాల్ సిద్దిఖీ, టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ కోటలో భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.

ఇస్రో చైర్మన్‌కు ఓయూ గౌరవ డాక్టరేట్

– 19న జరిగే స్నాతకోత్సవంలో ప్రదానం



ఉస్మానియా యూనివర్సిటీ: ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్‌కు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. బుధవారం వర్సిటీ అతిథిగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 19న వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే ఓయూ 84వ స్నాతకోత్సవంలో నారాయణన్‌కు డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గతంలో వివిధ అంశాల్లో విశేష కృషి చేసిన దేశ, విదేశాలకు చెందిన 49 మంది మహనీయులకు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేసిన ఓయూ 50వ గౌరవ డాక్టరేట్‌కు అంతరిక్ష రంగంలో విశేష కృషి చేస్తున్న డాక్టర్ నారాయణన్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 121 మంది విద్యార్థులు బంగారు పతకాలు అందుకోనున్నట్లు పేర్కొన్నారు. బంగారు పతకాలతో పాటు 2022–23, 2023–24 విద్యా సంవత్సరాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన 1,261 మంది డాక్టరేట్ డిగ్రీలు అందుకోనున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథి డాక్టర్ నారాయణన్, గౌరవ అతిథి ఓయూ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పతకాలను, డిగ్రీలను అందచేయనున్నట్లు తెలిపారు. గవర్నర్ పేరుతో కొత్తగా బంగారు పతకం ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర గవర్నర్ పేరుతో బంగారు పతకాన్ని గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రవేశ పెట్టినట్లు వీసీ తెలిపారు. ఇంగ్లిష్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గవర్నర్ బంగారు పతకాన్ని అందచేయనున్నట్లు పేర్కొన్నారు.

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్ ప్లాజాలో చేనేత ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

సీవరేజి.. డ్యామేజీ..

- చిన్నపాటి తవ్వకాలకూ కూలుతున్న ట్రెంచ్
- శిథిలమవుతున్న అండర్‌గ్రౌండ్ మురుగు వ్యవస్థ
- యుద్ధ ప్రాతిపదికన జలమండలి చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో వాన వస్తే నరకప్రాయమే. వరద, మురుగునీరు కలగలిసి పారితే ఇక అంతే! రహదారులు ఏరులవుతాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తాయి. ఈ పరిస్థితికి అండర్‌గ్రౌండ్ మురుగు కాల్వలు శిథిలావస్థకు చేరుకోవడం కూడా ఒక కారణం. చిన్నపాటి ట్రయల్ పిట్ తవ్వకాలకు ట్రంక్ మెయిన్‌లు కూలిపోతున్నాయి. రెండు రోజుల క్రితం





నగర శివారులోని ఆటోనగర్ సెక్షన్ పరిధిలో సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యను పరిష్కరించేందుకు ఆర్‌సీసీ సీవరేజ్ ట్రంక్ మెయిన్‌పై ట్రయల్ పిట్ తవ్వకాలు నిర్వహిస్తుండగా ట్రెంచ్ కూలిపోయింది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో నిజాం కాలం నాటి భూగర్భ పైప్‌లైన్ వ్యవస్థ కూడా కొనసాగుతోంది. అధికారులు వాటినే రీ మోడలింగ్ చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే కొన్ని పాంతాల్లో మాత్రం పైప్‌లైన్ల మార్పు, రీ మోడలింగ్, కొత్త పైప్‌లైన్ల అవసరాలను గుర్తించిన జలమండలి చర్యలకు ఉపక్రమించింది. మరికొన్ని ప్రాంతాల్లో సీవరేజీ లైన్లకు వర్షపు నాలాల లైన్లు కలిసి ఉండటం, డ్రైనేజీ పెప్‌లైన్‌లో మురుగు మేట వేయడంతో ఓవర్ ఫ్లో సమస్యగా మారింది. వాటిని కదిలిస్తే అప్పటికే శిథిలావస్థకు చేరిన పైప్‌లైన్లు కుప్పకూలుతున్నాయి.

వందేళ్ల నాటి డ్రైనేజీ వ్యవస్థ

హైదరాబాద్ పాత నగరంలో వందేళ్ల నాటి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కొనసాగుతోంది. అప్పట్లో వరద, మురుగునీటిని తరలించేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అప్పటి జనాభాకు ఐదింతలు పెరిగినా సీవరేజి పైపులైన్లు పనిచేసేలా పక్కా ప్రణాళికతో నిర్మాణాలు చేపట్టారు. అయితే సామర్థ్యానికి మించి మురుగు పారడంతో పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుతోంది.

పైప్‌లైన్ వ్యవస్థ అంతంతే..

మహా హైదరాబాద్‌లో మురుగు నీటి పైప్‌లైన్ వ్యవస్థ అంతంత మాత్రంగానే ఉంది. 1,454 చదరపు కిలోమీటర్ల మేర ఉన్న జలమండలి పరిధిని 2,050 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. మురుగునీటి పైప్‌లైన్‌వ్యవస్థ సుమారు 9,769.74 కిలోమీటర్లకు మించిలేదు. సుమారు 612 కిలోమీటర్ల ట్రంక్ లైన్లు ఉన్నాయి. మొత్తం డ్రైనేజీ లైన్లపై సుమారు 6,31379 మ్యాన్‌హోల్స్ ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పెరుగుతున్న గృహ సముదాయాలకు అనుగుణంగా మరో 8 వేల కిలోమీటర్ల డ్రైనేజీ వ్యవస్థ అవసరం ఉంటుందని జలమండలి అంచనా వేస్తోంది.

అన్ని జిల్లాలకు సెట్విన్ విస్తరణ

ఎండీ వేణుగోపాల్‌రావు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సెట్విన్ సెంటర్లు విస్తరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, ఇప్పటికే నగరంతో పాటు 8 జిల్లాల్లో సెంటర్లు కొనసాగుతున్నాయని సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్, జహీరాబాద్, హుస్నాబాద్, నల్లగొండలో నూతనంగా సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. జడ్చర్ల, బోడుప్పల్, గోషామహల్‌లో వారం రోజుల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ డిమాండ్ ప్రకారం కొత్త కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థకు చెందిన 21 శిక్షణ కేంద్రాలు, 47 ఫ్రాంచైజీ సెంటర్లలో 51 జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను యువత కోసం ప్రవేశపెట్టామని వివరించారు. సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా స్పోకెన్ ఇంగ్లిష్, ఆటోక్యాడ్ తదితర కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సెట్విన్ ఆధ్వర్యంలో 60 కోర్సుల్లో శిక్షణతోపాటు వివిధ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం జాబ్‌మేళాలు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సెట్విన్ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఈ ఏడాది 11,254 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చామని, దాదాపు 80 శాతం మంది అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ కల్పించామని వేణుగోపాల్‌రావు చెప్పారు. కొత్తగా ఆన్‌లైన్ ద్వారా అడ్వాన్స్ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ కోసం SETWIN.ONLINE ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ శాఖ అప్రమత్తం

సాక్షి, సిటీబ్యూరో: భారీ వర్షాలు, వరదల హెచ్చరికల నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అప్రమత్తమైంది. ఇప్పటికే ఇంజనీర్ల సెలవులను రద్దు చేయడంతోపాటు ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, జేఎల్ఎంలు, ఆర్టిజన్లు.. ఇలా విద్యుత్ అధికారులు, సిబ్బంది నిరంతరం వినియోగదారులకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంజనీర్లెవరూ హెడ్ క్వార్టర్స్‌ను విడిచి వెళ్లొద్దని స్పష్టం చేసింది. కార్పొరేట్ కార్యాలయంతోపాటు జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో పని చేసే 200 మంది ఇతర విభాగాల అధికారులను, సిబ్బందిని క్షేత్రస్థాయి ఆపరేషన్ సర్కిళ్లకు కేటాయించింది. నగరంలో 213 సెక్షన్ ఆఫీసులకు చెందిన ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీసుల్లో జీపీఎస్ ఆధారంగా పనిచేసే అత్యాధునిక ఆటోలు, సంస్థ పరిధిలో ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వీలుగా విద్యుత్ అంబులెన్సు తరహాలో 167 ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం వాహనాలను అందుబాటులో ఉంచారు. క్షేత్ర స్థాయి తనిఖీల్లో భాగంగా ఆ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ బుధవారం హుస్సేన్‌సాగర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగదారులు ఈ నంబర్లకు సమాచారం అందించాలని సీఎండీ సూచించారు.

విద్యుత్‌శాఖ అత్యవసర నంబర్లు:

హైదరాబాద్ సెంట్రల్	87124 69862
హైదరాబాద్ సౌత్	87124 70596
సికింద్రాబాద్	87124 70535
బంజారాహిల్స్	87124 68948
సైబర్ సిటీ	87124 69534
రాజేంద్రనగర్	87124 70075
సరూర్నగర్	87124 72315
హబ్సిగూడ	87124 71466
మేడ్చల్	87124 72559

బాలభవన్‌లో చైల్డ్ రైట్స్ కమిషన్ తనిఖీ



బాలభవన్‌ను సందర్శించిన చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు

నాంపల్లి: పబ్లిక్ గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్‌ను చైల్డ్ రైట్స్ కమిషన్ తనిఖీ చేసింది. చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి నేతృత్వంలో కమిటీ సభ్యులు అపర్ణ, వచన్‌కుమార్, చందన, సరిత, ప్రేమలత అగర్వాల్ కలిసి బాలభవన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడ నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. పదేళ్ల కాలంలో బాలభవన్ నిర్లక్ష్యానికి గురైందని, ఉపాధ్యాయుల కొరత కారణంగా బాలభవన్‌కు పిల్లలు దూరమయ్యారనే విషయాన్ని గ్రహించారు. ఇక్కడ ఐదేళ్ల నుంచి 16 ఏళ్ల వయస్సు వరకు ఉన్న పిల్లలకు శిక్షణ ఇస్తారు. లలిత కళలు, చిత్రలేఖనం, భరతనాట్యం, కూచిపూడి వంటి కళలతోపాటు పలు సంగీత వాయిద్యాల శిక్షణ ఇస్తారు. అయితే బాలభవన్‌లో పిల్లలు లేకపోవడాన్ని చూసి కమిషన్ చైర్‌పర్సన్, సభ్యులు ఆశ్చర్యపోయారు. గతంలో ఇక్కడ జూనియర్ ఎన్టీఆర్, తరుణ్ లాంటి పలువురు విద్యార్థులు విద్యాభ్యాసం చేశారు. బాలభవన్ ఉద్దేశం పక్కదారి పడుతోందని, ఈ ప్రాంగణానికి తిరిగి పూర్వ వైభవం తీసుకురావడానికి అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని సభ్యులు పేర్కొన్నారు.

మూసీ పరీవాహకంలో అప్రమత్తంగా ఉండాలి

– జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



మూసీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

అంబర్‌పేట: భారీ వర్షాలకు మూసీ పరీవాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సిబ్బంది, అధికారులను ఆదేశించారు. బుధవారం అంబర్‌పేట, ముసారాంబాగ్ మూసీ పరిసరాల్లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. మూసీ నదీ ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. పరిసర ప్రాంతాల ప్రజలకు తలెత్తే ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ముసారాంబాగ్ బ్రిడ్జ్‌పై వరద ప్రవాహాన్ని పరిశీలించారు. భారీగా వరద వచ్చినప్పుడు వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు సర్కిల్ డీఎంసీ మారుతీ దివాకర్ కమిషనర్‌కు తెలిపారు. హైడ్రా సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఇబ్బందులను తొలగిస్తున్నట్లు చెప్పారు. కమిషనర్ వెంట పలువురు జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశ గడువు పెంపు

రిజిస్ట్రేషన్, ట్యూషన్ ఫీజు చెల్లింపునకు చివరి తేదీ ఈ నెల 30

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ (బీఏ/బీకాం/బీఎస్సీ) కోర్సులు, పీజీ (ఎంఏ/ఎంకాం/ఎమ్మెస్సీ, ఎంబీఏ) కోర్సులు, డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికిగాను గడువును ఆగస్టు 30వ తేదీ వరకు పొడిగించినట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయంలో 2023–24, 2024–25 విద్యాసంవత్సరాల్లో డిగ్రీలో చేరిన ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులుగానీ, అంతకుముందు చేరిన డిగ్రీ/పీజీ విద్యార్థులుగానీ సకాలంలో ఫీజు చెల్లించలేకపోయినవారు కూడా ఆగస్టు 30వ తేదీ లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. 2016 నుంచి 2024 విద్యా సంవత్సరాల్లో ఆయా కోర్సుల్లో చేరి సకాలంలో ట్యూషన్ ఫీజు చెల్లించలేకపోయినవారు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆగస్టు 30, 2025 తేదీ లోపు నెట్ బ్యాంకింగ్ / క్రెడిట్ / డెబిట్ కార్డు లేదా ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. పూర్తి సమాచారం, ఆన్‌లైన్‌లో నమోదు తదితర అంశాలపై సందేహాలు ఉంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని లేదా విశ్వ విద్యాలయ హెల్ప్‌డెస్క్ నెంబర్ 040–23680222/ 333 / 444 / 555, టోల్ ఫ్రీ నెంబర్ 18005990101లో సంప్రదించవచ్చని సూచించారు. పూర్తి వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్ లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్‌లో సంప్రదించాలని సూచించారు.

నవోదయ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పెంపు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026–27 విద్యా సంవత్సరం అడ్మిషన్ల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు గడువును అధికారులు పొడిగించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో విద్యార్థులందరికీ అవకాశం కల్పించేందుకు గడువును పొడిగించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులంతా వినియోగించుకోవాలన్నారు.

ఉపాధి కేంద్రీకృత అభివృద్ధి ఉండాలి

– ప్రొఫెసర్ సుదీప్తో మండల్



సనత్‌నగర్: వికసిత్ దేశంగా ఎదగాలంటే ఉపాధి కేంద్రీకృత అభివృద్ధి ఎంతో అవసరమని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ (ఢిల్లీ) చైర్మన్ ప్రొఫెసర్ సుదీప్తో మండల్ అన్నారు. సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.రాధాకృష్ణ స్మారక ఉపన్యాస కార్యక్రమం బుధవారం బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో జరిగింది. సెస్ చైర్మన్ ప్రొఫెసర్ దిలీప్ నాచినే అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా సుదీప్తో మండల్ హాజరయ్యారు. ప్రపంచ ఆర్థిక సూచిక– 2025 వెల్లడించిన నివేదిక ప్రకారం భారతదేశ స్థూల వృద్ధి 6.5 శాతం పెరగడం ద్వారా చైనాను అధిగమించడమే కాకుండా ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. ఉపాధి, అభివృద్ధి వ్యూహంలో భాగంగా దేశంలో ప్రధానమైన వ్యవసాయ రంగం, ఉత్పత్తి, తయారీ రంగాల్లో శ్రమతో కూడిన ఉపాధిని పెంచాలని పేర్కొన్నారు. విద్యారంగంలో సమూల మార్పులను తీసుకురావాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ సాంకేతిక విద్యావిధానాన్ని మాధ్యమిక స్థాయిలో ప్రవేశపెట్టాలన్నారు. కృత్రిమ మేధస్సు నైపుణ్యాలను పెంచి నూతన ఆర్థిక వ్యవస్థకు దోహదపడేటట్లు శ్రామిక శక్తిని తయారు చేయాలని పేర్కొన్నారు. చైనా, రష్యా వంటి దేశాలు ప్రాథమిక విద్యకు ప్రాధాన్యత నిస్తూ పురోగతిని చాలా బాగా పెంపొందించాయన్నారు. సమావేశంలో సెస్ డైరెక్టర్ రేవతి, వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ మహేందర్‌రెడ్డి, ఈపీడబ్ల్యూ మాజీ ఎడిటర్ రాంరెడ్డి, వివిధ విశ్వవిద్యాయాల ఆచార్యులు, అధికారు లు, సెస్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

– భట్టివిక్రమార్కకు ఆర్.కృష్ణయ్య వినతి



ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ యూనివర్సిటీ అడ్మిషన్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఉన్నతవిద్యకు దూరమవుతున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కళాశాల అద్దెలతో పాటు బోధన, బోధనేతర ఉద్యోగుల జీత భత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాయని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం సరిగ్గా అమలు చేయకపోవడంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టి వేయబడుతోందన్నారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు స్కీంను పునరుద్ధరించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, చెరకు మణికంఠ, జిల్లపల్లి అంజి, భూపేష్, సి.రాజేందర్, పగిళ్ల సతీష్, శివ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

వల్లభనేని అనిల్‌ను అరెస్టు చేయాలని ధర్నా



వల్లభనేని అనిల్‌ను అరెస్టు చేయాలంటూ ఎఫ్‌డీసీ వద్ద ధర్నా చేస్తున్న సినీ కార్మికులు

బంజారాహిల్స్: చిత్రపురి హౌసింగ్ సొసైటీలో సుమారు రూ.300 కోట్ల మేర భారీ కుంభకోణం జరిగిందని, బాధ్యులను అరెస్టు చేయాలని సినీ కార్మికులు, నాయకులు ఆందోళన చేశారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) కార్యాలయం ముందు బుధవారం మహాధర్నా చేపట్టారు. నిజమైన సినిమా కార్మికులకు ఇళ్లు దక్కకుండా అన్యాయం చేస్తున్నారని, ప్లాట్లను బ్లాక్ మార్కెట్‌లో కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ వల్లభనేని అనిల్‌కుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిత్రపురి పోరాట సమితి, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కార్మికుల కోసం కేటాయించిన స్థలం విషయంలో కుట్ర జరుగుతోందని అన్నారు. అనిల్‌కుమార్‌పై ఇప్పటికే 15 ఎఫ్ఐఆర్‌లు, 10 చార్జ్‌షీట్లు నమోదయ్యాయని, రెండుసార్లు జైలుకు వెళ్లి వచ్చినా అక్రమాలు ఆపడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అవినీతిపరులను కాపాడి మూల్యం చెల్లించుకుందని, మరి ఈ ప్రభుత్వం ఎందుకు వారిని రక్షిస్తోందని ప్రశ్నించారు. ఈ ధర్నాలో చిత్రపురి పోరాట సమితి అధ్యక్షుడు కస్తూరి శ్రీనివాస్, జూనియర్ ఆర్టిస్ట్స్(సీఐటీయూ) నాయకులు సంకూరి రవీందర్, భద్ర, నవోదయం పార్టీ అధ్యక్షుడు శివశంకర్ పటేల్, ఆప్ పార్టీ నాయకురాలు హేమ సుదర్శన్, గాదం లలిత, రమేష్ వర్మ, శ్రీను, సీహెచ్ ప్రకాష్, ఓంప్రకాష్, గోపాలకృష్ణ, మద్దినేని రమేష్ పాల్గొన్నారు.

జలమండలిలో 'నషా ముక్త్' ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న ఈడీ మయాంక్ మిట్టల్

సాక్షి,సిటీ బ్యూరో: కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జలమండలిలో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ నిర్వహించారు. బుధవారం జలమండలి ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఈడీ మయాంక్ మిట్టల్ ఉద్యోగులతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం తీవ్రమైన సామాజిక, మానసిక, శారీరక సమస్యలకు దారితీస్తుందని, దీనిని అరికట్టడానికి అందరూ ముందుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్ –2 వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి, సీజీఎంలు, జీఎంలు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వదేశీ ఆయుధాలతో యుద్ధం చేశాం

'హర్ ఘర్ తిరంగా'లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మల్లాపూర్: ఆపరేషన్ సిందూర్‌లో స్వదేశీ టెక్నాలజీతో చేసిన ఆయుధాలను ఉపయోగించి యుద్ధం చేశామని, ప్రపంచానికి భారత్‌శక్తి తెలిసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందరావు అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్న ప్రధాని మోదీ పిలుపు మేరకు అందరూ జెండాలు ఎగురవేయాలని సూచించారు. నెక్లెస్ రోడ్డులో నిర్వహించే హర్ ఘర్ తిరంగా ర్యాలీకి విద్యార్థులు, యువత తరలిరావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, స్వాతంత్ర్య ఉద్యమంలోని కొన్ని సంఘటనలపై ప్రదర్శించిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీపీఎస్ చైర్మన్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ అధికార ప్రతినిధి రాణీ రుద్రమ తదితరులు హాజరయ్యారు.

కగార్‌కు నిరసనగా 24న వరంగల్‌లో సభ

ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ.లక్ష్మణ్, ప్రొ.అన్వర్ ఖాన్ తదితరులు

హిమాయత్‌నగర్: ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వ హత్యాకాండ ఆపాలని, ఆదివాసీ హక్కులను కాపాడాలని, కార్పొరేటీకరణ, కగార్ హత్య కాండను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న వరంగల్ అంబేడ్కర్ భవన్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ప్రకటించింది. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వాల్‌పోస్టర్, కరపత్రాలను వేదిక రాష్ట్ర కన్వీనర్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణ రావు తదితరులు ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సభలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

మండలి వెంకటకృష్ణారావు పురస్కారాల ప్రదానం



నాంపల్లి: తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతుల పరివ్యాప్తికి ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో విశేషమైన సేవలందించిన వ్యక్తులకు, తెలుగు సంస్థలకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి ఏటా కీర్తిశేషులు మండలి వెంకటకృష్ణారావు సంస్కృతి పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం నాంపల్లి ప్రాంగణంలోని తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు అధ్యక్షతన పురస్కారాలు ప్రదానం చేశారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై 2024వ సంవత్సరానికిగాను అజో–విభో–కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణరావుకు, 2025వ సంవత్సరానికిగాను తెలుగు భాషాభివృద్ధి సార్వజనిక గ్రంథాలయం అధ్యక్షుడు కమటం మల్లికార్జున్‌కు పురస్కారాలను అందజేశారు. ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున నగదు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి, మండలి బుద్ధప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు పాల్గొన్నారు.





నూలుపోగుల అందాల బొమ్మ





క్రోచెట్ వస్తువులకే కాకుండా చేతితో తయారు చేసే ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉంది. ఫ్యాషన్, క్రాఫ్ట్ మార్కెట్లలో ప్రసిద్ధి చెందాయి. అలాంటి వాటితో వినూత్నంగా బొమ్మల తయారీకి ఓ విద్యార్థిని శ్రీకారం చుట్టింది. రాయదుర్గం లోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్‌లో ద్వితీయ సంవత్సరం బి.డెస్(బ్యాచిలర్ ఆఫ్ డిజైన్) చదివే హర్షిత వినూత్న ఆలోచనతో క్రోచెట్ బొమ్మలు, దుస్తుల తయారీ మొదలు పెట్టింది. పాలిస్టర్ నూలు 300 గ్రాములు (క్రీమ్ కలర్), క్రోచెట్ సూది, కంటి పూసలు, పింక్ థ్రెడ్ వంటి వస్తువులతో డిజైన్ బొమ్మను తయారు చేసింది. ఈ సందర్భంగా ఆమెను ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.తేజ్‌లోహిత్ రెడ్డి, ఫ్యాకల్టీ డాక్టర్ ముప్పిడి రాంబాబు అభినందించారు.
– రాయదుర్గం



జిమ్‌దగీ కోసం..

ఎంపికలో నిపుణుల సూచనలు పాటించాల్సిందే..



- నగరంలో పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్న జిమ్స్
- ఎంపిక విషయంలో తడబడుతున్న యువత
- సరైనది ఎంచుకోకపోతే ప్రమాదాలు తప్పవు

జీవితం ఆనందంగా ఉండాలంటే ఆరోగ్యం ఉండాలి.. ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం చేయాలి.. వ్యాయామం అంటే సరైన జిమ్‌ను ఎంచుకోవాలి. లేదంటే ఆరోగ్యం సంగతి దేవుడెరుగు.. జీవితమే కోల్పోవాల్సి రావొచ్చు.. సిటీ యూత్‌లో పెరుగుతున్న ఫిట్‌నెస్ క్రేజ్‌ను వాడుకుని లాభార్జనే ధ్యేయంగా ఎటువంటి అవగాహన లేకుండా జిమ్‌లు నెలకొల్పుతున్న వారూ ఉన్నారు.. సో బీకేర్ ఫుల్.. జిమ్ ఎంపికలో తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలు..
– సాక్షి, సిటీబ్యూరో

వ్యాయామాలు చేయడానికి ఎంచుకునే జిమ్ వీలైనంత వరకూ ఇంటికి దగ్గరగానే ఉండాలి. దీనివల్ల సమయం కలిసి రావడమే కాకుండా, రెగ్యులారిటీ అలవాటై డుమ్మాలు కొట్టే అవకాశం తగ్గుతుంది.

నగరంలో ఇపుడు వీధికో జిమ్ ఉంది. ఏరియాకో ఫిట్‌నెస్ సెంటర్ ఉంది. అయితే అన్నీ మన అవసరాలను తీర్చేవి కాకపోవచ్చు. కొన్నింటిలో చేరితే లాభం కంటే నష్టమే ఎక్కువ. అందుకే జిమ్‌ని ఎంచుకునేటప్పుడు కొన్ని సందేహాలను తప్పనిసరిగా నివృత్తి చేసుకోవాలి.

సదరు జిమ్/ఫిట్‌నెస్ సెంటర్ గత చరిత్ర ఏమిటి? అక్కడ మెంబర్లుగా ఉన్న ఇతరుల అభిప్రాయాలూ సేకరించాలి. అంతేకాకుండా వర్కవుట్స్ చేసే ప్రాంగణం సరిపడా విస్తీర్ణంలో ఉందా? లేదా? ఏసీ జిమ్ అయితే లోపలి గాలి బయటకు వెళ్లేందుకు సరైన ఏర్పాట్లు ఉన్నాయా లేదా? వంటివి సరిచూసుకోవాలి.

- శిక్షణ అందించే కోచ్‌లకు సరైన సర్టిఫైడ్ అర్హతలు ఉన్నాయో లేదో వాకబు చేయాలి. పర్సనల్ ట్రైనింగ్ కావాలంటే విడిగా మాట్లాడుకోవాలని పలు జిమ్స్ సూచిస్తుంటాయి. సదరు జిమ్‌లో మెంబర్ల సంఖ్య ఎంత అనేది తెలుసుకోవాలి. ఎందుకంటే సామర్థ్యానికి మించి మెంబర్లను చేర్చుకుంటే అక్కడి ఎక్విప్‌మెంట్‌ను ఉపయోగించుకోవడానికి మనం క్యూలో నిలుచునే దుస్థితి కూడా తలెత్తవచ్చు.
- కొన్ని జిమ్‌లు చూడటానికి ఆర్భాటంగా ఉండి, శిక్షణ పరంగా అంత మెరుగ్గా ఉండకపోవచ్చు. కొన్ని చూసేందుకు సాధారణంగా ఉన్నా.. మంచి ట్రాక్ రికార్డు ఉండొచ్చు. కాబట్టి ఫస్ట్ లుక్‌కు.. పడిపోవద్దు. జిమ్‌లో సభ్యత్వం తీసుకునేటప్పుడు నిర్వాహకుల తీయటి పలుకుల మాయలో పడిపోవద్దు. వీలున్నంత వరకూ లైఫ్ మెంబర్‌షిప్‌ల జోలికి పోవద్దు. ఏడాది లోపున మాత్రమే పరిమితం కావాలి. అప్పుడే మధ్యలో మీకేమైనా అసౌకర్యం కలిగినా, జిమ్ నచ్చకపోయినా మారేందుకు ఇబ్బంది ఉండదు.
- జిమ్‌లో దుస్తులు మార్చుకునేందుకు, మన వస్తువులు జాగ్రత్తగా పెట్టుకునేందుకు సరైన వసతులు ఉన్నాయా లేదా ముందుగానే చూసుకోవాలి.
- చాలా వరకూ జిమ్‌లలో యువతీ యువకులకు ప్రత్యేక సమయాలు ఉంటాయి. ఇది గమనించి అవసరాన్ని బట్టి సమయాన్ని ఎంచుకోవాలి.
- ఒకసారి వర్కవుట్ టైమ్ ఎంచుకున్న తర్వాత అది వెంట వెంటనే మార్చుకోవడానికి జిమ్‌లో నిబంధనల ప్రకారం వీలుండకపోవచ్చు. కాబట్టి, రోజూ ఎక్సర్‌సైజ్‌లు చేసేందుకు అనువైన సమయాన్ని ఒకటికి రెండుసార్లు ముందుగా ఆలోచించి నిర్ణయించుకోవాలి.



నగరంలోని జిమ్‌ల మెంబర్‌షిప్ వివరాలు..

- టాప్‌క్లాస్ కేటగిరిలోకి వచ్చే 'స్పా'లలో ఎక్సర్‌సైజ్‌లు చేసే అవకాశంతో పాటు మసాజ్, స్టీమ్‌బాత్, సోనాథెరపీ, పార్లర్.. వంటి అదనపు సౌకర్యాలూ ఉంటాయి. ఇంటి తరహాలో కొన్ని గంటల పాటు ఇక్కడ గడిపేందుకు వీలుంది. సభ్యత్వ రుసుము ఏడాదికి రూ.25వేలు.
- ఆ తర్వాత కేటగిరిలోకి వచ్చే ఫిట్‌నెస్ సెంటర్లలో అత్యాధునిక జిమ్ ఎక్విప్‌మెంట్ ఉంటుంది. అలాగే స్టీమ్ రూమ్స్, డ్రెస్సింగ్ రూమ్స్, ప్రత్యేకంగా ఫిట్‌నెస్ డ్యాన్స్ ఫ్లోర్స్.. వగైరా వసతులుంటాయి. వీటి సభ్యత్వ రుసుము ఏడాదికి రూ.15వేలు ఆపైన.
- మూడో కేటగిరీలోకి వచ్చే జిమ్స్‌లో అన్ని రకాల ఎక్విప్‌మెంట్ ఉంటుంది. జిమ్ మొత్తానికి ఒకరిద్దరు మించి ట్రయినర్లు ఉండరు. వీటికి రుసుము ఏడాదికి రూ.8వేలు ఆపైన.
- ఎంసీహెచ్ గ్రౌండ్స్‌లో అధికారికంగా నిర్వహిస్తున్న వ్యాయామ కేంద్రాలలో సాధారణ స్థాయిలోనే నెలవారీ రుసుము వసూలు చేస్తున్నారు. తక్కువ్వ ఫీజు చెల్లించగలిగిన వారికి ఇవి నప్పుతాయి.
- స్టార్ హోటల్స్, క్లబ్స్, రిసార్ట్స్.. అన్నీ జిమ్‌లను నిర్వహిస్తున్నాయి. రూమ్స్‌లో బస చేసిన అతిథులతో పాటు కేవలం జిమ్ మాత్రమే ఉపయోగించుకునే నగర వాసులకూ తమ సేవలను ఇవి అందిస్తున్నాయి.
- కొన్ని జిమ్‌లు అందిస్తున్న ప్రత్యేక సభ్యత్వం తీసుకుంటే సదరు జిమ్‌కు నగరంలో అన్ని ప్రాంతాల్లో అలాగే దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ సంస్థలలో కూడా దానిని ఉపయోగించుకునే వీలుంటుంది. తరచూ ఇళ్లు మారేవారికి, ఇతర ఊర్లకు, వేరే ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారికి ఈ తరహా సభ్యత్వం బాగా ప్రయోజనకరం. ఒకటీ అరా జిమ్‌లు ఇంటర్నేషనల్ మెంబర్‌షిప్‌లను కూడా అందిస్తున్నాయి. ఈ జిమ్స్‌లో మెంబర్‌షిప్ తీసుకుంటే విదేశాల్లో కూడా ఆ సభ్యత్వాన్ని వినియోగించుకునే అవకాశం ఉంటుంది.
- కొన్ని బ్రాండెడ్ జిమ్స్ ప్రొటీన్ షేక్‌ల విక్రయంతో మొదలుపెట్టి సభ్యులకు రకరకాల ఆకర్షణలు చూపిస్తూ డబ్బులు గుంజాలని చూస్తుంటాయి. అలాంటివి ఎంచుకునేటప్పుడు ఆచి తూచి నిర్ణయం తీసుకోవాలి. స్వల్పకాలిక ఫలితాల మీద ఆశతో స్టెరాయిడ్స్ జోలికి మాత్రం అస్సలు పోవద్దు.
- కొన్ని జిమ్‌లలో మనకు కేటాయించిన సమయంలో అదనపు రుసుము చెల్లించగలిగితే.. మనకు మాత్రమే పరిమితమై వ్యక్తిగత సేవలు అందించే కోచ్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. అయితే తొలి దశలోనే పర్సనల్ ట్రైనింగ్ కోసం డబ్బులు వృథా చేసుకోవాల్సిన అవసరం లేదు. కొంత కాలం చేశాక.. మన వ్యక్తిగత లక్ష్యాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవచ్చు.



వహ్.. వాల్..





ఆ గోడలు మాట్లాడుతున్నాయి.. అటువైపు నుంచి వెళ్తున్న వారికి దేశభక్తిని గుర్తుచేస్తున్నాయి.. తెల్లారితే స్వాతంత్య్ర దినోత్సవం.. మనకు స్వాతంత్య్రం తీసుకొచ్చిన సమరయోధులను స్మరించుకోవాలని చెబుతున్నాయి.. మొన్న ఆపరేషన్ సిందూర్‌లో మన దేశం సాధించిన విజయాన్ని మననం చేసుకోవాలంటున్నాయి.. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని గ్లెండేల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదివే విద్యార్థులు పాఠశాలలోని గోడలకు సందేశాత్మక చిత్రాలు వేసి అందరినీ ఆలోచింపజేశారు. దేశభక్తి, సృజనాత్మకత, సాంస్కృతిక గర్వాన్ని ప్రతిబింబించేలా వేసిన చిత్రాలు ఔరా అనిపించాయి. గ్లెండేల్ స్కూల్ ఇండియా డైరెక్టర్ మినుసలూజా విద్యార్థులను అభినందించారు.
– రాయదుర్గం

ఎల్లలు దాటిన ప్రేమ.. నాగ్-సామ



సాక్షి, సిటీబ్యూరో: కొంతకాలంగా తెలుగు సినీతారలు అంతర్జాతీయ వేదికగా విశేష ఆదరణ పొందుతున్నారు. ఎల్లలు దాటిన ఈ అభిమానం సోషల్ మీడియా వేదికగా అందరి దృష్టిని ఆకర్శిస్తోంది. ఇందులో భాగంగానే జపాన్‌లో 'నాగ్–సామ' ట్రెండ్ వైరల్‌గా మారింది. 'నాగ్–సామ' అంటే ఎవరో కాదు.. టాలీవుడ్ స్టార్ అక్కినేని నాగార్జున. జపనీస్ సంస్కృతిలో 'సామ' అనే గుర్తింపు అత్యున్నత గౌరవం ఉన్న వ్యక్తులకు మాత్రమే ఇస్తారు. సాధారణంగా దేవుళ్లు, రాజులు, ఉన్నత స్థాయి వ్యక్తులను సంబోధించడానికి 'సామ' ఉపయోగించబడుతుంది. దేశానికి చెందిన ఒక నటుడు విదేశాలలో ఇంత ఉన్నత స్థాయి అభిమానాన్ని సంపాదించుకోవడం చాలా అరుదు. అయితే జపాన్‌లో ప్రస్తుతం అక్కినేని కుటుంబ చిత్రం 'మనం' విడుదల నేపథ్యంలో.. జపాన్‌లోని నాగ్ అభిమానులు 'నాగ్–సామ' ట్రెండ్‌తో సందడి చేస్తున్నారు. ఈ మధ్యనే విడుదలైన కుబేర సినిమా, నేడు విడుదల అవుతున్న కూలీ సినిమాల్లో నాగ్ మరోసారి మెరవడంతో ఈ జపనీస్ నాగ్ అభిమానులు సరికొత్తగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ అభిమానుల ప్రేమకు అక్కినేని నాగార్జున సైతం వర్చువల్ మీటింగ్స్‌లో, సోషల్ మీడియాలో తన అభిమానులకు తన సంతోషాన్ని, ధన్యవాదాలను తెలియజేస్తున్నారు.







శ్రావణం స్పెషల్

ఇంపాక్ట్ ఫెయిర్–మినీ ఎడిషన్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వీ హబ్ వేదికగా నిర్వహించిన వినూత్న కార్యక్రమం 'ఇంపాక్ట్ ఫెయిర్–మినీ ఎడిషన్' విశేషంగా ఆకట్టుకుంది. తెలంగాణ సంప్రదాయం, సృజనాత్మకత, మహిళా వ్యవస్థాపకత– ఆవిష్కరణలను ప్రదర్శించడానికి వీ హబ్ ఆధ్వర్యంలో శ్రావణం స్పెషల్‌గా 'ఇంపాక్ట్ ఫెయిర్–మినీ ఎడిషన్'ను నిర్వహించింది. మహిళా వ్యవస్థాపకులకు విలువైన అమ్మకాల అవకాశాలు, ప్రత్యక్ష మార్కెట్ లింకేజీలను అందించడం లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం సందర్శకులకు తెలంగాణ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించింది. రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి దాదాపు 30 మంది మహిళా వ్యవస్థాపకులు, స్థానిక చేతి వృత్తుల వారు ఒకచోట చేరి వారి కళాత్మక, సృజనాత్మక ఉత్పత్తులను ప్రదర్శించారు. ఇందులో భాగంగా అద్భుతమైన చేనేత, హస్తకళలు, పండుగ దుస్తులు, నగలు, ప్రామాణికమైన తెలంగాణ ఆహారాలు, స్నాక్స్–స్వీట్లు, గృహాలంకరణ వస్తువులను ఇక్కడ ఉంచారు. వీ హబ్ సీఈఓ సీతా పల్లచోళ్ల మాట్లాడుతూ.. ఇది ఒక ప్రదర్శన మాత్రమే కాదు.. ఇది మహిళల సంస్థ, మహిళా శక్తి. ఈ సంస్కృతి సమాజ స్ఫూర్తికి ఒక వేడుక అని తెలిపారు. ప్రతి మహిళా వ్యవస్థాపకురాలు తన నేపథ్యం లేదా స్థానంతో సంబంధం లేకుండా ఈ కమర్షియల్ మార్కెట్లకు ప్రాప్యత పొందేలా చూసుకోవడమే తమ లక్ష్యమన్నారు.



మస్తున్నయ్.. మది దోచేస్తున్నయ్..

ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను బుధవారం సినీనటులు శ్రవంతి, కామాక్షి, నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు ఆకట్టుకుంటున్నాయి. అన్ని వర్గాల మనసు దోచేలా డిజైన్స్ ఉన్నాయన్నారు. నటులు రూప, భ్రమరాంబిక, మోడల్స్ పాల్గొన్నారు. – మాదాపూర్



ప్రేమ కథా చిత్రమ్..

చిత్రించడానికి సిటీ లవర్స్ సిద్ధం

నగరంలో వెరైటీ ఈవెంట్ 16న..



సాక్షి, సిటీబ్యూరో: సిటిజనుల అభిరుచులు శరవేగంగా మారిపోతుంటే వాటిని అందిపుచ్చుకోవడానికి, వారిని తమవైపు తిప్పుకోవడానికి నగరానికి చెందిన కేఫ్స్, క్లబ్స్, పార్టీ ప్లేస్‌లు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీని కోసం భిన్న రకాల ఈవెంట్స్‌ను నిర్వహిస్తున్నాయి. అదే క్రమంలో నగరవాసుల కోసం గచ్చిబౌలిలోని మైండ్ స్పేస్ సోషల్ సరికొత్త కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

కలిసి రండి.. 'కళ'ను చూపండి.. అంటూ ప్రేమ జంటలను ఆహ్వానిస్తోంది. నగరానికి చెందిన ప్రేమికులు, దంపతులు.. జంటగా తమ డేట్ నైట్ ఆర్ట్ ఈవెంట్‌కు హాజరు కావాలని, వారి ప్రేమకథను చిత్రాలుగా గీయాలని ఆహ్వానిస్తోంది. దీనిలో పాల్గొనేవారికి ఎటువంటి చిత్ర కళా నైపుణ్యాలు ఉండాల్సిన అవసరం లేదు. హాజరైన జంటలకు నిపుణుల ఆధ్వర్యంలో దశలవారీ మార్గదర్శకత్వం కూడా అందుబాటులో ఉంటుంది. రొమాంటిక్ పరిసరాల నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో, నేపథ్య సంగీతం, విందు, ఆస్వాదిస్తూ నిర్వాహకులు అందించిన సామగ్రితో, అర్థవంతమైన కళా ఖండాన్ని వీరు రూపొందిస్తారు. ఇది కేవలం ఒక పెయింటింగ్ మాత్రమే కాదు అంతకంటే ఎక్కువ కాబట్టి దానిని భద్రంగా ఇంటికి తీసుకువెళతారు. కార్యక్రమం గంటన్నరపాటు కొనసాగుతుంది. ఆసక్తి కలిగిన వారు బుక్ మై షో ద్వారా ఎంట్రీలను కొనుగోలు చేయవచ్చు.

ఏపీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నలుగురు ప్రమాణం




సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లు ప్రమాణం చేశారు. హైకోర్టులోని మొదటి హాలులో బుధవారం జరిగిన కార్యక్రమంలో వీరితో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు.

తెరపైకి నాలుగు ఇంట్రాస్టేట్ లింక్ ప్రాజెక్టులు

గోదావరి- కావేరి అనుసంధానం తొలిదశ కింద ప్రతిపాదించిన ఏపీ

- ఇంట్రా లింకు ప్రాజెక్టులుగా చింతలపూడి, ఉత్తరాంధ్ర, పల్నాడు, గుండ్రేవుల రిజర్వాయర్లు
- ఏపీ ప్రతిపాదనలపై అధ్యయనానికి డీపీఆర్ సమర్పించాలని కోరిన ఎన్‌డబ్ల్యూడీఏ
- ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి తెలంగాణ ఓకే.. ఏపీ ఇంట్రా లింకులపై అభ్యంతరాలు
- ఈ నెల 22, 27న జరగనున్న ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో జరగనున్న వాడీవేడి చర్చ



తుంగభద్ర నదిపై సుంకేశుల బరాజ్ ఎగువభాగంలో 20 టీఎంసీలతో ఏపీ ప్రతిపాదించిన గుండ్రేవుల రిజర్వాయర్

సాక్షి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగు కొత్త ప్రతిపాదనలను తెరపైకి తీసుకొచ్చింది. గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టు తొలిదశలో భాగంగా తమ రాష్ట్రంలోని చింతలపూడి ఎత్తిపోతల పథకం, బాబూజగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వైఎస్సార్ పల్నాడు కరువు నిర్మూలన ప్రాజెక్టులతోపాటు కొత్తగా కట్టాల్సిన గుండ్రేవుల రిజర్వాయర్ ..అనే నాలుగు కొత్త ఇంట్రా స్టేట్ లింక్ ప్రాజెక్టులను నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ)కి ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఒక రాష్ట్రం అంతర్గతంగా చేపట్టే నదుల అనుసంధాన ప్రాజెక్టులనే ఇంట్రా స్టేట్‌లింక్ ప్రాజెక్టులుగా పరిగణిస్తారు. గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుపై 2023 డిసెంబర్ 18న విజయవాడలో ఏపీతో ఎన్‌డబ్ల్యూడీఏ నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నాలుగు ఇంట్రా స్టేట్ లింక్ ప్రాజెక్టుల ప్రతిపాదనలు చేసింది. దీనిపై అధ్యయనం చేసేందుకు సంక్షిప్త నోట్/సవివర పథక నివేదిక(డీపీఆర్)ను సమర్పించాలని నాటి సమావేశంలో ఎన్‌డబ్ల్యూడీఏ ఏపీకి సూచించింది. 2024 జూలై 8న ఈ ప్రాజెక్టులకు సంబంధించిన కాన్సెప్చువల్ నోట్స్‌ను ఎన్‌డబ్ల్యూడీఏకి ఏపీ సమర్పించగా, డీపీఆర్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెల 22న హైదరాబాద్‌లోని జలసౌధలో గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుపై నిర్వహించనున్న 6వ సంప్రదింపుల సమావేశ ఎజెండాలో ఈ విషయాన్ని ఎన్‌డబ్ల్యూడీఏ పొందుపరచడంతో తొలిసారిగా ఏపీ ప్రతిపాదనలు వెలుగులోకి వచ్చాయి.

ఆ ఇంట్రా లింక్ ప్రతిపాదనలు ఇవే

- → పోలవరం ప్రాజెక్టుకు దిగువన గోదావరి ఎడమగట్టుపై చింతలపూడి వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాన్ని తొలి ఇంట్రా లింక్ ప్రాజెక్టుగా ఏపీ కొత్తగా ప్రతిపాదించింది. 53 టీఎంసీల గోదావరి వరద జలాలను తరలించి నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టును స్థిరీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.
- → పోలవరం ప్రాజెక్టుకు దిగువన గోదావరిపై కుడిభాగం నుంచి 63 టీఎంసీల వరద జలాలను తరలించడానికి చేపట్టిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఎత్తిపోతల పథకాన్ని ఏపీ రెండో ఇంట్రా లింక్ ప్రాజెక్టు కింద కొత్తగా ప్రతిపాదించింది. దీని ద్వారా గోదావరి వరద జలాలను పోలవరం ఎడమ ప్రధాన కాల్వలోకి 162 కి.మీ.ల వద్ద ఎత్తిపోసి ఉత్తరాంధ్ర జిల్లాలకు తరలించడానికి ఈ ప్రాజెక్టును చేపట్టింది. పర్యావరణ అనుమతులు లేకుండా చేపట్టడంతో ఈ రెండు ప్రాజెక్టుల పనులపై ఇప్పటికే ఎన్జీటీ స్టే విధించడంతోపాటు రూ.200 కోట్ల జరిమానా సైతం విధించింది.
- → గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా ఏపీ ప్రతిపాదించిన వైఎస్సార్ పల్నాడు కరువు నిర్మూలన పథకాన్ని మూడో ఇంట్రా లింక్ ప్రాజెక్టుగా ఏపీ చూపింది. పోలవరం కుడి ప్రధాన కాల్వ నుంచి తరలించిన నీటిని ప్రకాశం బరాజ్‌కు ఎగువన కృష్ణానదిలో వేసి అక్కడి నుంచి లిఫ్టు ద్వారా పల్నాడు జిల్లాకు తరలించడానికి ఈ ప్రాజెక్టును చేపట్టింది. రూ.6 వేల కోట్లతో ఈ ప్రాజెక్టుకు గతంలో ఏపీ పరిపాలనాపర అనుమతులు జారీ చేయగా, ఇప్పటికే రూ.1,000 కోట్ల విలువైన పనులూ పూర్తయ్యాయి.
- → నాలుగో ఇంట్రా లింక్ ప్రాజెక్టుగా 20 టీఎంసీల సామర్థ్యంతో సుంకేశుల జలాశయానికి 19 కి.మీ.ల ఎగువన తుంగభద్ర నదిపై గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణాన్ని ఏపీ ప్రతిపాదించింది. గుండ్రేవుల రిజర్వాయర్‌లో నిల్వ చేసిన నీటిని కేసీ కాల్వ కింద కడప జిల్లాలో ఉన్న చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ఏపీ పేర్కొంది. ఈ ప్రాజెక్టుతో ఏపీతోపాటు తెలంగాణలో మొత్తం 3,003.24 హెక్టార్ల భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని తెలిపింది. తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పెద్ద ధన్వాడ, వెనిసోమపురం, కేశవపురం గ్రామాలు పూర్తిగా, కుటుకునూరు, కిసాన్‌సాగర్ గ్రామాలు పాక్షికంగా ముంపునకు గురవుతాయని కాన్సెప్చువల్ నోట్స్‌లో ఏపీ వెల్లడించింది. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించాలని ఏళ్లుగా ఏపీలో డిమాండ్ ఉందని తెలిపింది.

ఇచ్చంపల్లికి ఓకే.. ఇంట్రా లింకులకు నో

గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించి నీటిని తరలించాలని ఎన్‌డబ్ల్యూడీఏ చేసిన ప్రతిపాదనలకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమ్మతి తెలిపింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతోపాటు ఇప్పటికే తాము చేపట్టిన సమ్మక్క బరాజ్ నుంచి నీటిని తరలించాలని డిమాండ్ చేసింది. తాజాగా ప్రభుత్వ వాదనలో మార్పు వచ్చిన నేపథ్యంలో ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి ఈ నెల 22న జరగనున్న ఎన్‌డబ్ల్యూడీఏ సంప్రదింపుల సమావేశంలో సమ్మతి తెలపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నెల 27న ఢిల్లీలో ఎన్‌డబ్ల్యూడీఏ పాలకమండలి సమావేశం సైతం జరగనుంది. ఈ రెండు సమావేశాల్లో ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి సమ్మతి తెలపడంతోపాటు ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన నాలుగు ఇంట్రా లింక్ ప్రాజెక్టులను తీవ్రంగా వ్యతిరేకించాలని తెలంగాణ నిర్ణయించింది. వారం రోజుల వ్యవధిలో ఎన్‌డబ్ల్యూడీఏ నదులు అనుసంధానంపై రెండు కీలక సమావేశాలు నిర్వహించనుండడంతో ఈ మేరకు తమ వాదనలు వినిపించేందుకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ముమ్మర కసరత్తు చేస్తోంది.

ఏజెంట్లే లేకుండా ఎన్నికలా?

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ

టీడీపీ దుర్మార్గాలను సాక్ష్యాధారాలతో కడిగిపారేసిన వైఎస్ జగన్

> అసలు ఏజెంట్లే లేకుండా పోలింగ్ నిర్వహిస్తే.. వాటిని ఎన్నికలు అని ఎలా అంటారు? ప్రజాస్వామ్యంలో ఉన్న ప్రతి ఒక్కరూ దీన్ని ప్రశ్నించకపోతే, గొంతు విప్పకపోతే అసలు ప్రజాస్వామ్యం అనేది ఉండదు. ఎన్నికలు హాస్యాస్పదమే అవుతాయి. అప్పుడు ఎన్నికల అవసరం కూడా ఉండదు. ఇష్టం వచ్చినట్లు అంతా ఓట్లు వేసుకోవడమే. సీఎం చంద్రబాబు, ఆయనతో చేతులు కలిపి అంట కాగుతున్న ఎల్లో మీడియా లక్ష్యం ఇదే. వారి లక్ష్యం ప్రజలకు మంచి చేయడం.. పాలకుల మోసాన్ని ప్రశ్నించడం కానే కాదు. కేవలం దోచుకో.. పంచుకో.. తినుకో.. అదే వారి ఎజెండా. దీనికి ప్రజాస్వామ్యం సిగ్గుపడాలి.
>
> చంద్రబాబుకు మా డిమాండ్.. అలాగే ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వారికి మా విన్నపం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోకపోతే, అది చేజారిపోతే.. నక్సలిజమ్ అక్కడే పుడుతుంది. చంద్రబాబు ఈ రోజు ఒక ప్రమాదకర పరిస్థితికి పునాది వేస్తున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరవండి. నిన్న జరిగిన రెండు ఎన్నికలు రద్దు చేయండి. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఎన్నికలు జరపండి. ప్రజలు ఎవరికి ఓటు వేస్తారో ఒక ఛాలెంజ్‌గా తీసుకోండి.
>
> పులివెందుల జెడ్పీటీసీ కింద ఆరు పంచాయతీలకు సంబంధించి 15 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఏకంగా 700 మంది పోలీసులను పెట్టారు. కేవలం ఓటర్లను భయపెట్టడం కోసమే అంత మందిని మోహరించారు. ఉదయం 4 గంటలకల్లా జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గాలు, అనంతపురం జిల్లా నుంచి వచ్చిన వారు ఆయా గ్రామాల్లో మకాం వేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఒక్కో బూత్ వద్ద దాదాపు 400 మంది పాగా వేశారు. పోలీసుల సమక్షంలోనే ఇదంతా జరిగింది. వారే ప్రోత్సహించారు. పచ్చ చొక్కాలు వేసుకున్న పోలీసులు, బయట నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు, ఆ పార్టీ నాయకులు.. అంతా కలిపి మొత్తం 7 వేల మంది ఉంటారు. అంటే ఒక్కో ఓటరుకు బయట నుంచి దాదాపు ఒక్కో రౌడీని ఏర్పాటు చేశారు.

సాక్షి, అమరావతి: 'సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మీరు ప్రజలను మోసం చేశారు. మీ పాలన మొత్తం రాక్షస పాలన అని ప్రజలకు అర్థమైంది. కాబట్టి మీకు ఓట్లు వేసే పరిస్థితి లేదు. అందుకే పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో ఇదివరకు చంబల్ లోయ బందిపోటు దొంగలను మరిపించేలా.. పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, అడ్డగోలుగా దొంగ ఓట్లు వేసుకున్నా'రని సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఇలా అడ్డగోలుగా రాజకీయాలు చేసే వారిని నాయకుడనరని.. చంద్రబాబు ఒక మాబ్‌స్టర్.. లేదా ఫ్రాడ్‌స్టర్ (మోసగాడు) అని తేల్చి చెప్పారు. 'మీ పరిపాలన మీద మీకు విశ్వాసం ఉంటే.. మీరు ప్రజలకు మంచి చేశారని నమ్మితే, వారు మీకు ఓటు వేస్తారనుకుంటే.. వెంటనే మంగళవారం జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికలు రద్దు చేయండి. కేంద్ర బలగాల పర్యవేక్షణలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించండి' అని సవాల్ విసిరారు. మీకు ఆ నమ్మకం లేదు కాబట్టే.. మీరు ప్రజలను మోసం చేశారు కాబట్టే.. ప్రజలు మీకు ఓటు వేయరు కాబట్టే, విచ్చలవిడిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని దెప్పిపొడిచారు. 'ప్రతి బూత్‌కు సంబంధించిన వెబ్ కాస్టింగ్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఇచ్చే ధైర్యం ఉందా? పోలింగ్ బూత్ ఆవరణల్లో సీసీ ఫుటేజ్ బయట పెడతారా? ఆ ధైర్యం ఉందా?' అని సీఎం చంద్రబాబుకు మరో సవాల్ విసిరారు. వెబ్ కాస్టింగ్, సీసీ ఫుటేజ్ ఇస్తే ఎవరెవరు బయటి నుంచి వచ్చి, పోలింగ్ బూత్‌లు ఆక్రమించి దొంగ ఓట్లు వేశారనేది మరింతగా బట్టబయలవుతుందన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు తుమ్మల హేమంత్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌లను తనతో కూర్చోబెట్టుకుని వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఉప ఎన్నిక పోలింగ్‌లో పోలీసులు, టీడీపీ నాయకులు జట్టుగా ఏర్పడి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలింగ్ బూత్‌లలోకి వెళ్లకుండా అడ్డుకోవడం, ఏజెంట్లపై దౌర్జన్యం చేయడం.. ఓటు వేయడానికి వెళ్తున్న ఓటర్లను అడ్డుకోవడం.. ఇతర ప్రాంతాల నుంచి రప్పించిన టీడీపీ నాయకులతో దొంగ ఓట్లు వేయించుకోవడం, కలెక్టర్ సమక్షంలోనే దొంగ ఓట్లు వేయడం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసుల ఏకపక్ష దాడులు.. టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకుల దౌర్జన్యాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను చూపుతూ సాక్ష్యాధారాలతో ప్రభుత్వాన్ని కడిగిపారేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చేసిన తీరును తూర్పారబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక నిర్వహించడంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైన తీరును సాక్ష్యాధారాలతో ఎండగట్టారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబుకు ఇదే నా సవాల్

- మీ పరిపాలన మీద మీకు విశ్వాసం ఉంటే, మీరు ప్రజలకు మంచి చేశారని నమ్మితే, వారు మీకు ఓటు వేస్తారనుకుంటే, వెంటనే నిన్నటి ఎన్నికలు రద్దు చేయండి. కేంద్ర బలగాలు దింపి, వారి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించండి. మీకు ఆ నమ్మకం లేదు కాబట్టే, మీరు ప్రజలను మోసం చేశారు కాబట్టే, ప్రజలు మీకు ఓటు వేయరు కాబట్టే, విచ్చలవిడిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ప్రతి బూత్‌కు సంబంధించిన వెబ్‌కాస్టింగ్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఇచ్చే ధైర్యం ఉందా? పోలింగ్ బూత్ ఆవరణల్లో సీసీ ఫుటేజ్ బయట పెడతారా? ఆ ధైర్యం ఉందా? మీకు ఆ ధైర్యం లేదు. అయినా ఎవరెవరు బయటి నుంచి వచ్చి, పోలింగ్ బూత్‌లు ఆక్రమించి దొంగ ఓట్లు వేశారనేది చూపుతాం. ఇలా అడ్డగోలు రాజకీయాలు చేసే నాయకుణ్ని లీడర్ అనరు. మాన్‌స్టర్ లేదా ఫ్రాడ్‌స్టర్ అంటారు.
- ఎంత దారుణంగా నిన్నటి ఎన్నికలు జరిగాయంటే.. ఎక్కడైనా ఏ ఊరి ఓటర్లు ఆ ఊరిలోనే ఓట్లు వేస్తారు. ఎప్పుడైనా, ఎక్కడైనా అదే జరుగుతుంది. ఓటర్లు వారి సొంత ఊళ్లలోనే ఓటేయడం సహజం. కానీ, ఇక్కడ చంద్రబాబు ఏకంగా ఒక ఊరి నుంచి మరో ఊరికి పోలింగ్ బూత్‌లు మార్చేశారు.



- ఎర్రబల్లి నుంచి నల్లపురెడ్డిపల్లికి, నల్లగొండవారిపల్లి నుంచి నల్లపురెడ్డిపల్లికి, మళ్లీ నల్లపురెడ్డిపల్లి వారు ఎర్రబల్లికి.. నల్లపురెడ్డిపల్లి నుంచి నల్లగొండవారిపల్లికి వెళ్లి ఓటు వేయాలంట. 4 కిలోమీటర్లు నడిచి వెళ్లేలా పోలింగ్ సెంటర్లు మార్చారు.
- దాదాపు 10,600 ఓట్లకు గాను, 4 వేల ఓట్లకు సంబంధించిన పరిస్థితి ఇది. స్కెచ్ అక్కడే మొదలైంది. ఇంకా వారి ఆలోచన ఏమిటంటే, ఓటర్లు 4 కిలోమీటర్లు నడిచి పోతుంటే బెదిరించాలి. దాడి చేసి అడ్డగించాలి. ఓటేయకుండా చూడాలి. నిన్న అదే జరిగింది.

ఇవిగో ఆధారాలు..

- ఇతర నియోజకవర్గాలు, మండలాల నుంచి వచ్చిన వారు ఎలా దొంగ ఓట్లు వేసింది.. వారు ఎవరనే పూర్తి వివరాలతో ఈ ఫొటోల్లో (ఫొటోలు చూపుతూ) చూడండి. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సమక్షంలోనే వారు దొంగ ఓట్లు వేశారు. ఆ వేసింది జమ్మలమడుగుకు చెందిన (ఫొటో చూపుతూ) టీడీపీ కార్యకర్తలు దస్తగిరి, సందీప్‌కుమార్. నల్లపురెడ్డిపల్లె పోలింగ్‌బూత్‌లో వారు దొంగ ఓట్లు వేశారు. మరో ఆశ్చర్యం ఏమిటంటే, ఈ రోజు (బుధవారం) రీ పోలింగ్‌లో కూడా దొంగ ఓట్లు వేస్తున్నారు (ఆ ఫొటోలు కూడా ప్రెస్‌మీట్‌లో చూపారు). పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేరు కాబట్టి, యథేచ్ఛగా దొంగ ఓట్లు వేస్తున్నారు.
- జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన ప్రకాశం, మైలవరానికి చెందిన ద్వారచర్ల జనార్దనరెడ్డి నల్లపురెడ్డిపల్లెలో ఓటు వేశారు.
- పొన్నతోట మల్లికార్జున టీడీపీ జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి (చంద్రబాబుతో దిగిన ఫొటో ప్రదర్శించారు). జమ్మలమడుగు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కూడా. వీళ్లందరూ వచ్చి పులివెందులలో ఓట్లు వేశారు. పోలింగ్ కేంద్రంలో ఏజెంట్ అనే వాడిని ఉండనివ్వలేదు. ఇక అడిగేవాడు లేడని దొంగ ఓట్లు వేసుకున్నారు. కలెక్టర్ రెండు చేతులు జేబులో పెట్టుకుని దొంగ ఓట్లు వేయిస్తున్నాడు.
- కర్మలవారిపల్లె గ్రామం టీడీపీ సర్పంచ్ మారెడ్డి చిన్న పుల్లారెడ్డి పులివెందులలో ఓటు వేశారు. జమ్మలమడుగు మండలానికి చెందిన నాగేశ్వరరెడ్డి, అదే మండలంలోని గూడెం చెరువు గ్రామానికి చెందిన పాతకోట శివారెడ్డిలు నల్లపురెడ్డిపల్లెలో దొంగ ఓటు వేశారు.
- నవాబుపేట గ్రామానికి చెందిన రామస్వామిరెడ్డి, భీమగుండం గ్రామానికి చెందిన కొత్తపల్లి రాజగోపాల్, హనుమంతగిరి గ్రామానికి చెందిన బోయిన బాలుగ్రామ్, కమలదిన్నె గ్రామానికి చెందిన మంత్రి కుళ్లాయప్ప ఇలా అందరూ దొంగ ఓటర్లే.
- విచిత్రంగా బుధవారం రీ పోలింగ్ జరుగుతుంటే కూడా.. కమలాపురం నియోజకవర్గానికి చెందిన నసంతపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గుజ్జల నారాయణ యాదవ్ పులివెందులలోని ఈ కొత్తపల్లిలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడ్డాడు. ఇలా రిపిటీషన్ పద్ధతిలో దొంగ ఓటర్లను తిప్పుకున్నారు.

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పండి

- డీఐజీ కోయ ప్రవీణ్ పర్యవేక్షణలో ఇన్ని అక్రమాలతో జరిగింది ఎన్నికలేనా? అసలు ఎందుకు ఈ ఎన్నికలు జరపడం? (ఫొటో, వీడియో ఆధారాలు చూపుతూ)
- ఉదయం 4 గంటల నుంచే పోలింగ్ బూత్‌ల ఆక్రమణ నిజం కాదా?
- పులివెందుల టౌన్‌లో ఉన్న ఎంపీ అవినాష్‌రెడ్డి అక్రమ అరెస్ట్ నిజం కాదా? నిజానికి అక్కడ ఎన్నిక లేదు. అయినా తెల్లవారుజామున అరెస్టు చేశారు.
- మొట్నూతలపల్లెకు 2 కిలోమీటర్ల దూరంలోనే వాహనాలు ఆపి, ఓటర్లను అడ్డగించడం నిజం కాదా?
- ఎర్రపల్లెలో మహిళలను ఓటు వేయనివ్వక పోవడం నిజం కాదా?
- కనంపల్లి సర్పంచ్ రామాంజనేయులు ఇంటికి వెళ్లి, మంచంపై రైఫిల్ పెట్టి బెదిరించడం వాస్తవం కాదా?
- ఎర్రపల్లెలో రిగ్గింగ్‌కు వెళ్తున్న టీడీపీ కార్యకర్తలకు పోలీసులు స్వాగతం పలకలేదా?
- కనంపల్లెలో రిగ్గింగ్ జరిగిందని మహిళల ఆగ్రహం వ్యక్తం చేయడం, బిటెక్ రవి తమ్ముడు భరత్ బెదిరింపులు నిజం కాదా?
- తమను ఓటు వేయనీయాలంటూ ఓటర్లు కనంపల్లెలో పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకోలేదా?
- పులివెందులలో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డిని బయటకు రానివ్వడం నిజం కాదా?
- ఒంటిమిట్టలోనూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఓటర్లు వాపోలేదా?
- ఆర్.తుమ్మలపల్లిలో టీడీపీ వాళ్లు స్లిప్‌లు ఇస్తూ, దొంగ ఓట్లు వేయించలేదా?
- ఎన్నిక పులివెందుల రూరల్‌లో జరుగుతుంటే, పులివెందులలో ఉన్న ఎమ్మెల్యే ఆఫీస్‌కు డీఐజీ కోయ ప్రవీణ్ వెళ్లి ఎందుకు హడావుడి చేశారు?
- 'కాల్చి పారేస్తా నా కొడకా' అంటూ డీఎస్పీ మురళి బెదిరించడం వాస్తవం కాదా?
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఒంటిమిట్ట మండలం చిన్న కొత్తపల్లిలో పోలింగ్ సెంటర్‌లో దౌర్జన్యం చేయలేదా? ఆయన సమక్షంలోనే మా పార్టీ ఏజెంట్‌పై దారుణంగా దాడి చేయడం కళ్లెదుటే కనిపిస్తున్నా నిజం కాదా?
- చంద్రబాబూ.. నీవు నిజంగా మంచి చేశావనుకుంటే, ప్రజలు ఓటు వేస్తారనుకుంటే, ఎందుకీ అక్రమాలు?

డమ్మీ కన్నా దారుణంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్

ఇన్ని దారుణాలు జరుగుతున్నా, దురదృష్టవశాత్తు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) డమ్మీ కన్నా దారుణమైన పాత్ర పోషిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన బాధ్యత గల స్థానంలో ఉన్న వ్యక్తులు, నిజంగా ఇంత దిగజారిపోయిన పరిస్థితుల మధ్య ఈ వ్యవస్థ నడుస్తోంది. ఇది చాలా దురదృష్టకరం. అందుకే కచ్చితంగా న్యాయ పోరాటం చేస్తాం. కోర్టులో కేసులు వేస్తాం. ఈ ఆధారాలన్నీ చూపుతాం. నిన్న పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు కూడా అందుకే ఇక్కడికి వచ్చారు. మళ్లీ చెబుతున్నాం. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలన్నది మా డిమాండ్. ఆ డిమాండ్‌తోనే కోర్టులను కూడా ఆశ్రయిస్తాం.

ఏపీ గురించి రాహుల్ ఎందుకు మాట్లాడరు?

- రేవంత్‌రెడ్డి ద్వారా నిత్యం రాహుల్ గాంధీతో హాట్‌లైన్‌లో చంద్రబాబు మంతనాలు
- అందుకే రాష్ట్రంలో 'ఓట్ల చోరీ' గురించి మాట్లాడరని వైఎస్ జగన్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: దేశంలో మహారాష్ట్ర, కర్ణాటక సహా ఇతర రాష్ట్రాల్లో ఓట్ల అవకతవకలపై 'ఓట్ల చోరీ' పేరుతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో జరిగిన అవకతవకల గురించి మాత్రం ఎందుకు మాట్లాడటం లేదని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. రాష్ట్రంలో గత శాసనసభ ఎన్నికలు జరిగాక తమకున్న అభ్యంతరాలను ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ముందుంచామని గుర్తు చేశారు. తమకు జరిగిన అన్యాయాలను సవివరంగా చెప్పామన్నారు. నిజానికి దేశంలోనే అత్యంత అన్యాయం ఎక్కడన్నా జరిగిందంటే అది ఆంధ్రప్రదేశ్‌లోనేనని, పోలింగ్ ముగిసిన తర్వాత అంటే పోలైన ఓట్లకూ.. కౌంటింగ్ నాడు లెక్కించిన ఓట్లకు మధ్య భారీ తేడా ఉందని, అది ఏకంగా 12.5 శాతం పెరిగిందని ఎత్తిచూపారు. దాదాపు 48 లక్షల ఓట్లు పోలైన ఓట్ల కంటే అధికంగా లెక్కించారని వివరించారు. ఆ స్థాయిలో ఓట్లలో తేడా వచ్చిన నేపథ్యంలో ఎన్నికల సంఘం అధికారులు అందరినీ కలిసి సాక్ష్యాధారాలతో సహా వాస్తవాలను వివరించామని స్పష్టం చేశారు. స్టేట్ ఇంటెన్సివ్ రివిజన్ ఎక్సర్‌సైజ్ కింద ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితాను సవరిస్తామని ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. ఇప్పుడు దేశంలో మహారాష్ట్ర, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల్లో ఓట్ల చోరీ పేరుతో ఓటర్ల జాబితాలో అవకతవకలపై మాట్లాడుతున్న రాహుల్ గాంధీ.. ఆంధ్రప్రదేశ్ గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. నిజానికి గత ఎన్నికల్లో ఇక్కడే అత్యధికంగా ఓట్లలో అక్రమాలు జరిగాయని చెప్పారు. అయినా రాహుల్ గాంధీ ఆంధ్రప్రదేశ్ గురించి ఎందుకు మాట్లాడరంటే.. రేవంత్‌రెడ్డి ద్వారా చంద్రబాబు.. రాహుల్ గాంధీతో హాట్‌లైన్‌లో టచ్‌లో ఉన్నందుకేనని తేల్చి చెప్పారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ శాసనసభ ఎన్నికల్లో ఓట్ల అవకతవకల వల్లే ఓడారని.. దానిపై రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడరని వైఎస్ జగన్ నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్, ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మాణిక్యం ఠాగూర్ కూడా అందుకే లేనిది ఉన్నట్లుగా చిత్రీకరిస్తూ ప్రతిపక్షంలో ఉన్న మాపై తరచూ బురదజల్లుతున్నారని ఎత్తి చూపారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రీ పోలింగ్‌లోనూ దొంగ ఓట్ల దందా

కంటి తుడుపుగా రెండు బూత్‌లలో నిర్వహణ

- ఆయా గ్రామాల్లో పచ్చమూకల బెదిరింపులతో బయటకు రాని ఓటర్లు.. ఈ.కొత్తపల్లెలో కమలాపురం టీడీపీ ముఠా.. అచ్చివెళ్లిలో 'బీటెక్' బ్యాచ్ తిష్ట
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చి యథేచ్ఛగా దొంగ ఓట్లు..
- రీపోలింగ్‌ను బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు.. 15 బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్
- వెబ్ కాస్టింగ్ ఇస్తే అక్రమాలను ఆధారాలతో సహా నిరూపిస్తామన్న వైఎస్సార్‌సీపీ

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



కలెక్టర్ సమక్షంలో దొంగ ఓట్లు వేస్తున్న జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన దస్తగిరి, సందీప్

'నీట్' తొలి విడతలో 30,608 మందికి సీట్లు

- ఆలిండియా కోటా కింద కేటాయించిన మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ
- ఎంబీబీఎస్‌లో 26,308, బీడీఎస్‌లో 2,600, బీఎస్సీ నర్సింగ్‌లో 1,700 సీట్లు
- ఇందులో తెలంగాణ విద్యార్థులకు ఎంబీబీఎస్‌లో 156, బీడీఎస్‌లో 5 సీట్లు

సాక్షి, హైదరాబాద్: నీట్ యూజీ-2025లో ఆలిండియా కోటా తొలి విడత కౌన్సెలింగ్‌లో వివిధ కోర్సుల్లో 30,608 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ మేరకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) వారికి సీట్లను కేటాయించింది. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వం బుధవారం ఎంసీసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఎంబీబీఎస్‌కు సంబంధించి 26,308 మంది విద్యార్థులకు 337 కళాశాలల్లో సీట్లు కేటాయించారు. బీడీఎస్‌లో 2,600 మంది విద్యార్థులు 120 కళాశాలల్లో సీట్లు పొందారు. బీఎస్సీ నర్సింగ్‌లో 1,700 మంది విద్యార్థులు 22 కళాశాలల్లో సీట్లు పొందారు. ఈ విద్యార్థులంతా ఈనెల 18లోగా సంబంధిత కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈనెల మూడో వారం చివరలో రెండో రౌండ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఉండే అవకాశం ఉంది. స్థానికత అంశంపై సుప్రీం కోర్టులో కేసు నేపథ్యంలో రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ వాయిదా పడుతూ వస్తోంది.

తెలంగాణలో ఇలా...

ఆలిండియా కోటా కింద మొదటి విడతలో తెలంగాణకు చెందిన కళాశాలల్లో 306 సీట్లు భర్తీ అయ్యాయి. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల్లోనే కావడం గమనార్హం. వీటిలో 161 సీట్లను తెలంగాణ విద్యార్థులు సాధించగా, మిగతా సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులు పొందారు. రాష్ట్రానికి చెందిన 156 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించగా, ఐదుగురు బీడీఎస్ కోర్సుల్లో సీట్లు పొందారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎయిమ్స్ హైదరాబాద్‌లో 17 సీట్లు, ఈఎస్ఐసీలో 9 సీట్లను తెలంగాణ విద్యార్థులు సాధించారు. ఎంసీసీ జాబితా ప్రకారం, తెలంగాణ విద్యార్థులు హైదరాబాద్‌లోని గాంధీలో 15, ఉస్మానియాలో 14 సీట్లు పొందారు. ఇతర ప్రభుత్వ వైద్య కళాశాలల విషయానికొస్తే.. తెలంగాణ విద్యార్థులు నిజామాబాద్‌లో 12, మహబూబ్‌నగర్‌లో 11, సిద్దిపేటలో 14, సూర్యాపేటలో 13, కరీంనగర్‌లో 12, సంగారెడ్డిలో 11, జగిత్యాలలో 12, ఖమ్మంలో 13, మంచిర్యాలలో 11, ఆదిలాబాద్‌లో 10, వరంగల్‌లో 8, భూపాలపల్లిలో 6, వికారాబాద్‌లో 5, వనపర్తిలో 5, భద్రాద్రి కొత్తగూడెంలో 5, మెదక్, నారాయణపేట్, జనగామ 4 చొప్పున, గద్వాల, ములుగు, నాగర్‌కర్నూల్, సిరిసిల్ల, యాదాద్రిలో 3 చొప్పున, కామారెడ్డి, నిర్మల్, పెద్దపల్లి, భద్రాద్రిలో 2 చొప్పున, ఆసిఫాబాద్‌లో ఒక సీటు సాధించారు. కాగా తెలంగాణ విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో ఎక్కువగా ఏపీలో 12 మంది సీట్లు పొందారు. కర్ణాటకలో 9, తమిళనాడులో 7, మహారాష్ట్రలో 5, కేరళలో 4, ఢిల్లీలో 3, యూపీలో 3, పశ్చిమ బెంగాల్, ఒడిశాలో 2 సీట్ల చొప్పున, రాజస్తాన్‌లో ఒకరు ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించారు.

టీటీడీకి రూ.కోటి విరాళం



తిరుమల: బెంగళూరుకు చెందిన కళ్యాణ్ రామన్ కృష్ణమూర్తి బుధవారం టీటీడీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందించారు. ఈ మేరకు అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

భోగ శ్రీనివాసునికి బంగారు లక్ష్మీపతకం

భోగ శ్రీనివాసమూర్తికి బెంగళూరుకు చెందిన కె.ఎం.శ్రీనివాసమూర్తి బుధవారం ఉదయం రూ.25లక్షల విలువైన వజ్రం, వైజయంతి పొదిగిన 148 గ్రాముల బంగారు లక్ష్మీపతకాన్ని సమర్పించారు. ఆభరణాన్ని టీటీడీ అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరికి అందజేశారు.

ఈడీ విచారణకు హాజరైన నటి మంచు లక్ష్మి



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కేసులో నటి మంచు లక్ష్మి బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. మహిళా అధికారి ఆధ్వర్యంలో ఈడీ అధికారుల బృందం ఆమెను ప్రశ్నించింది. 'యో 247' అనే బెట్టింగ్ యాప్ ప్రమోషన్ వివరాలు సేకరించింది. గత మూడు సంవత్సరాలకు సంబంధించిన బ్యాంక్ లావాదేవీల ఆధారంగా ప్రశ్నించింది. లక్ష్మి చెప్పిన వివరాలతో దాదాపు మూడు గంటల పాటు స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. ప్రధానంగా మంచు లక్ష్మి ప్రమోట్ చేసిన యాప్‌కు అనుమతులు ఉన్నాయా అనే కోణంలో విచారించినట్లు తెలిసింది. ప్రమోట్ చేసినందుకు ఎలాంటి అగ్రిమెంట్లు చేసుకున్నారనే వివరాలను ఈడీ అధికారులు సేకరించినట్లు సమాచారం. బెట్టింగ్ యాప్ నుంచి మంచు లక్ష్మి బ్యాంక్ అకౌంట్లలోకి జరిగిన లావాదేవీల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. పారితోషికం, కమీషన్లకు సంబంధించిన వివరాలతో స్టేట్‌మెంట్ రికార్డ్ చేసినట్లు సమాచారం. కొన్ని అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించిన డాక్యుమెంట్లను అందించాలని ఆమెకు ఈడీ బృందం సూచించినట్లు తెలిసింది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 14-8-2025

● న్యూస్ మేకర్



'ఓట్ల చోరీ' అనేది దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారిన నేపథ్యంలో... పూనమ్ అగర్వాల్ పేరు ప్రస్తావనకు వస్తోంది. ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ అయిన పూనమ్ అగర్వాల్ గత కొన్ని సంవత్సరాలుగా ఓటింగ్ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకల గురించి గొంతెత్తుతోంది. 'ఎన్నికల ప్రక్రియలో నిజాయితీ, పారదర్శకత ఉండాలి' అంటున్న పూనమ్ అగర్వాల్ 'ఇండియా ఇంక్‌డ్: ఎలక్షన్స్ ఇన్ ది వరల్డ్స్ లార్జెస్ట్ డెమోక్రసీ' పేరుతో పుస్తకం రాసింది...

ఓటైపైట్

మూడు దశాబ్దాలుగా ఎలక్షన్ కమిషన్‌కు సంబంధించిన వార్తలు రాస్తున్న ఒక జర్నలిస్ట్‌తో ఇటీవల పూనమ్ అగర్వాల్ మాట్లాడినప్పుడు ఆమె నోటి నుంచి వినిపించిన మాట...

'ఆ రోజుల్లో ఆఫీసులలోకి వెళ్లి అధికారులతో మాట్లాడడం, సమాచారం తీసుకోవడం చాలా సులభంగా ఉండేది. ఇప్పుడు చాలా కష్టమై పోయింది'

ఆ జర్నలిస్ట్ మాట పూనమ్ అగర్వాల్‌ను అంతగా ఆశ్చర్యపరచక పోయి ఉండవచ్చు. ఎందుకంటే ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా పూనమ్ ఎంతో కాలంగా మన దేశ ఎన్నికల ప్రక్రియ... అందులో జరుగుతున్న అవకతవకలపై ప్రత్యేక దృష్టిసారించింది.

జర్నలిజంలో రెండు దశాబ్దాల అనుభవం ఉన్న పూనమ్ మహారాష్ట్ర నుంచి మధ్యప్రదేశ్ వరకు ఎన్నో రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియలో జరిగిన అవకతవకలను వెలికితీసింది. ఈ అవకతవకలపై కేంద్ర ఎన్నికల సంఘం మౌనాన్ని విమర్శించింది. పారదర్శకత లేకపోవడాన్ని గురించి ప్రశ్నించింది.



పూనమ్ అగర్వాల్ తాజా పుస్తకం 'ఇండియా ఇంక్‌డ్–ఎలక్షన్స్ ఇన్ ది వరల్డ్స్ లార్జెస్ట్ డెమొక్రసీ' విస్తృత చర్చకు దారితీసింది.

'జర్నలిస్ట్‌గా నా అనుభవాలు, ప్రయాణానికి ఈ పుస్తకం అద్దం పడుతుంది. విస్తృత సబ్జెక్ట్ అయిన ఎన్నికల ప్రక్రియపై సమాచారాన్ని అందించడం మంచి అవకాశంగా భావిస్తున్నాను. ఈ సబ్జెక్ట్‌పై రాయడం అంత సులువైన విషయం ఏమీ కాదు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన విషయాలతో పాటు నా వ్యక్తిగత విషయాలను కూడా ఈ పుస్తకంలో రాశాను. ఎలక్టోరల్ బాండ్స్, ఎలక్షన్ కమిషన్‌పై ఓటర్లకు ఉన్న భ్రమ...ఈ పుస్తకం రాయడానికి ప్రధాన కారణాలు' అని 'ఇండియా ఇంక్‌డ్' పుస్తకం గురించి చెప్పింది పూనమ్.

'ఇండియా ఇంక్‌డ్' పుస్తకం కోసం పూనమ్ ఎంతో కసరత్తు చేసింది.

మారుమూల పల్లెలో జరిగే ఎన్నికల ప్రక్రియ నుంచి మొదటి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సుకుమార్ సేన్ ఆధ్వరంలో జరిగిన ఎన్నికల వరకు ఎన్నో విషయాలను అధ్యయనం చేసింది. ఆనాటి ఎన్నికల ప్రక్రియను జాగ్రత్తగా ప్లాన్ చేసిన సుకుమార్ సేన్ దూరదృష్టి గురించి, ఆయన రూపొందించిన విధానాలను ఇప్పటికీ ఎన్నికల కమిషన్ అనుసరించడం గురించి తన పుస్తకంలో ప్రస్తావించింది పూనమ్.

అకాడమిక్‌గా కాకుండా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమస్త విషయాలను సామాన్య పాఠకులకు కూడా సులభంగా అర్థమయ్యేలా రీతిలో రాయడంలో పూనమ్ అగర్వాల్ నేర్పరి.

మరిన్ని పుస్తకాలు

మన ఎన్నికల ప్రక్రియ గురించి కొన్ని పుస్తకాలు వచ్చాయి. 'పారదర్శకంగా, నిజాయితీగా జరిగే ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యానికి వెన్నెముక' అనేది భావితరాలు అర్థం చేసుకోవడానికి నా పుస్తకం ఉపయోగపడాలని ఆశిస్తున్నాను. 'ఇది విలువైన పుస్తకం' అనుకున్నప్పుడు పాఠకులు తాము చదవడమే కాదు తాము చదివిన విషయాలను ఇతరులతో పంచుకుంటారు. పుస్తక రచనకు సంబంధించి నా అభిప్రాయం విషయానికి వస్తే...అందుకు ఎంతో ఓపిక కావాలి. మనం సేకరించిన సమాచారంలోని నిజానిజాల గురించి లోతుగా తెలుసుకోవాలి. పుస్తకం రాయాలనుకున్నప్పుడు మన ఎన్నికల కమిషన్ గురించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నాకు తగినంత సమాచారం లభించలేదు. దీంతో ఎంతో మంది నిపుణులతో మాట్లాడాను. భవిష్యత్‌లో కూడా మరెన్నో పుస్తకాలు రాయాలనుకుంటున్నాను.

– పూనమ్ అగర్వాల్

ఔట్‌స్టాండింగ్

ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం విభాగంలో రామ్‌నాథ్ గోయెంకా అవార్డ్, సీఎన్ఎన్ యంగ్ జర్నలిస్ట్ అవార్డ్, ఔట్‌స్టాండింగ్ ఒరిజినల్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం విభాగంలో బీబీసి న్యూస్ అవార్డ్‌లాంటివి అందుకుంది పూనమ్ అగర్వాల్. లోన్ యాప్ స్కామ్‌పై పూనమ్ చేసిన ఇన్వెస్టిగేటివ్ డాక్యుమెంటరీ 'ది ట్రాప్: ఇండియాస్ డెడ్లీయెస్ట్ స్కామ్'కు ఎంతో పేరు వచ్చింది. లండన్‌లోని ప్రతిష్ఠాత్మకమైన 'సెంటర్ ఫర్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం'లో గావిన్ మెక్‌ఫెడియన్ స్మారక ఉపన్యాసం ఇచ్చింది పూనమ్ అగర్వాల్.

● రేపు ఆగస్టు 15

ఝండా ఊంచా రహే హమారా!



● స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా చెన్నైలో మెరైన్ అక్వేరియంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న స్కూబా డైవర్. వందనం చేస్తున్న స్కూలు విద్యార్థులు.

నా దేశ పతాకం సమోన్నతంగా ఎగరాలి. కన్నెత్తి చూడాలన్నా శత్రువు వెన్నులో చలి పుట్టేట్టుగా, చెమట పట్టేట్టుగా మువ్వన్నెల నా దేశపతాకం అశేష భరతజాతి పరాక్రమ చిహ్నంగా రెపరెపలాడాలి. శార్దూల గాండ్రింపు, కరి ఘీంకారం, కాలు దువ్వే వృషభపు రంకె వంటి శౌర్య ప్రకటన చేస్తూ నా దేశ జెండా అలల కదలికల అంచులతో పెరపెరలాడుతూ ఎగరాలి. పసిబిడ్డ కడుపు నింపడానికి కర్షక క్షేత్రాలలో తుళ్లి పడేందుకు, గింజలకు మొలకలిచ్చేందుకు, పైరు నడుములను ధాన్యపు రాశుల బరువుతో వొంచేందుకు బిరబిరమని పరుగులెత్తి వచ్చే జీవనదుల నురగలా నా జాతి జెండా తళుకులీనుతూ ఎగురుతూ ఉండాలి.

కారడవుల్లో అడవి బిడ్డల అమలిన రేలపాట వోలె, ఎంగిలి అంట వీలులేని కొండతేనె తీపి వోలె, పేరు తెలియని పూల పరిమళాల వోలె, గుర్తు తెలియని రంగుపూల పెనుసౌందర్యం వోలె నా త్రివర్ణ పతాకం ఎగురుతూ ఉండాలి. గిరిజనుల అమిత అతిథ్యం వంటి, మైదాన ప్రాంత జనుల చనువైన పలకరింత వంటి, జన సమూహాల అరమరికలు లేని జీవనం వంటి మూడు రంగుల అలాయి బలాయితో నా దేశ జెండా ఎగురుతూ ఉండాలి.

అతి శీతల హిమ పర్వతాల శిఖరాలపైన, ఎల్లలుగా ఉన్న అగాధపు సముద్రాల కెరటాల పైన, అంబరాలలో, ఆకాశాలలో, తుఫానులు రేగే ఎడారులలో, మానవ ప్రవేశానికి వీలు లేని అత్యంత కఠినమైన సరిహద్దు క్షేత్రాలలో నా జెండా అదరక బెదరక తడబడక వెనుదిరగక వందనం అర్పించే ఖణేల్మనే గొంతుల మధ్య, జైహింద్ పలికే సాయుధ దళాల ఎదుట స్ఫూర్తినిస్తూ, దీప్తి రగిలిస్తూ ఎగురుతూనే ఉండాలి.

గనులూ మణులూ అందరివీ అని, సంపదా సౌభాగ్యాలపై హక్కు అందరిదీ అని, భాషా యాసలు ఎవరివైనా సరే సమానమే అని, ఆచార వ్యవహారాలు రీతి రివాజులు ఉన్నది గౌరవించడానికే అని, తక్కువైనది ఏదీ లేదని, ఎక్కువ అనుకుంటూ ఏదీ ఎల్లెడలా మనజాలదని సందేశం ఇస్తూ నా జెండా ఎగురుతూ ఉండాలి. కండలు కరిగించే కూలీ, కంప్యూటర్ ఎదుట ఉద్యోగి, గవర్నమెంటు క్లర్కు, నిర్ణయాలు తీసుకునే అధికారి, ప్రమాణం చేసి పదవిలోకి వచ్చిన పాలకుడు... ఈ దేశాన ఉన్నది, గాలి పీలుస్తున్నది గట్టి మేల్ తలపెట్టడానికేనని, వొట్టి మాటలు కట్టి పెట్టాలని సందేశం ఇస్తూ ఈ దేశ జెండా ఎగురుతూ ఉండాలి. విద్యలో నిమగ్నమయ్యే విద్యార్థి, వికాసంలో సమ అవకాశాలు పొందే స్త్రీ, భద్రమైన బాల్యాన్ని పొందే బుజ్జాయి, ఆకలి కడుపు లేని ఇల్లు... ఇవే దేశ గౌరవానికి హేతువులు అని ఉపదేశం చేస్తూ నా దేశ జెండా ఎగురుతూ ఉండాలి.

మత్తు పదార్థాలకు చోటులేని, ద్వేషానికి తావు లేని, కుట్రలలో అనుక్షణం నిమగ్నం కాని, తోటి వారిపై అసూయా ద్వేషాలతో రగలని, అంతరాత్మ ఎదుట పతనమై నిలవని, నీతి నియమాలంటూ కొన్నయినా ఉన్నాయనే గ్రహింపు కలిగి, మనిషై పుట్టినందుకు మానవతను చాటు దామనే మనసు కలిగి, కులమతాల సంకుచితత్వం వీడి, సౌభ్రాతృత్వం శిరోధార్యమై, వైజ్ఞానిక ప్రగతి వైపు అడుగు కదిపే జాతిగా అవతరించమని ఆదేశిస్తూ, ఆరోహించమని హెచ్చరిస్తూ ఈ దేశపతాకం జాతికి ధ్రువతారయై ఎగురుతూ ఉండాలి. ఎగురుతూనే ఉండాలి.

– కె.

● సమ్‌థింగ్ స్పెషల్

ఈ కొరియన్ భోజ్‌పురి నేర్పిస్తాడు!



కొరియన్ వ్యక్తి కొరియన్ భాష నేర్పించడం వింత కాదు. భోజ్‌పురి నేర్పించడమే వింత. యెచన్ సి లీ అనే కొరియన్ యూట్యూబ్ కంటెంట్ క్రియేటర్. పిల్లలకు సరదాగా భోజ్‌పురి నేర్పిస్తుంటాడు. యెచన్ సి లీ పిల్లలకు భోజ్‌పురి నేర్పిస్తున్న వీడియో వైరల్ అయింది.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్‌కు లక్షలాది వ్యూస్ వచ్చాయి. పిల్లలు భోజ్‌పురి వాక్యాలను ఆసక్తిగా నేర్చుకోవడం మరో విశేషం.

'కొరియన్ పిల్లలకు భోజ్‌పురి నేర్పించడం అద్భుతమైన అవకాశంగా భావిస్తున్నాను' అని తన వీడియోకు క్యాప్షన్ ఇచ్చాడు లీ.

మొదటిసారి ఎవరినైనా కలిసినప్పుడు భోజ్‌పురిలో ఎలా పలకరించాలి? మరోసారి ఆ వ్యక్తిని కలిసినప్పుడు ఎలా పలకరించాలి?... మొదలైనవి పిల్లలకు నేర్పిస్తుంటాడు లీ.

'అమేజింగ్ వర్క్' అంటూ పాజిటివ్ ఫీడ్‌బ్యాక్‌తో కామెంట్ సెక్షన్ నిండిపోయింది. 'లీ' భోజ్‌పురి ఎప్పుడు నేర్చుకున్నాడో, ఎలా నేర్చుకున్నాడో తెలియదుగానీ అతడి భోజ్‌పురి పాఠాలు ఆన్‌లైన్ హార్ట్‌ను దోచుకున్నాయి.

● లాడో పంచాయత్

ఖాప్ పంచాయత్‌ల గురించి వినే ఉంటారు... వీటికి ఉత్తర భారత్ పెట్టింది పేరు! లాడో పంచాయత్‌ల గురించి విన్నారా? మహిళా హక్కులను కాపాడేందుకు గొంతెత్తుతున్న పంచాయత్‌లు! ఖాప్ పంచాయత్‌లకు వ్యతిరేకంగా ఓ ఉద్యమంలా సాగుతున్నాయి.

ఇది స్త్రీరామ రక్ష



అయిదారేళ్ల కిందట...

హరియాణ, ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో.. పుట్టకుండానే ఆడపిల్లలను చంపేసేవారు. పొరపాటున పుడితే ఆ పిల్లలకు కాఫీ (ఇక చాలు), మాఫీ (క్షమాపణ) లాంటి పేర్లు పెట్టేవారు. ఆడపిల్లల్ని కన్నందుకు సమాజానికి సంజాయిషీలా! అక్కడ అమ్మాయిలు ఐడెంటిఫై అయ్యేది వివక్షతోనే! ఆంక్షల మధ్యే వాళ్ల గమనం. అరుదుగా చదువుకునే చాన్స్ దొరికితే సర్కారు బడితోనే సరి. తర్వాత పెళ్లే! వాళ్లకు సోషల్ మీడియాలో అకౌంట్స్ నిషేధం! వరకట్నాలు, డొమెస్టిక్ వయొలెన్స్‌తోనే సహజీవనం.

ఇప్పుడు...

చాలా ప్రాంతాల్లో పరిస్థితి మారింది. భ్రూణ హత్యల మీద స్త్రీలు నిరసన గళం వినిపిస్తున్నారు. ఆడపిల్ల పుట్టడాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. అబ్బాయిలతో సమంగా అమ్మాయిలను చదివిస్తున్నారు. మెన్‌స్ట్రువల్ రైట్స్ గురించి మాట్లాడుకుంటున్నారు. బాల్యవివాహాలను నిరోధిస్తున్నారు. వరకట్నాన్ని వ్యతిరేకిస్తున్నారు. గృహహింసను అడ్డుకుంటున్నారు. సోషల్ మీడియా అకౌంట్లు క్రియేట్ చేసుకోవడమే కాదు.. తమ పోరాటాలను పోస్ట్ చేస్తున్నారు. అమ్మాయిల పెళ్లి వయసును పద్దెనిమిది నుంచి 21 ఏళ్లకు పెంచాలని ఉద్యమిస్తున్నారు. ఆస్తి హక్కు కోసం నినదిస్తున్నారు.

ఈ ధైర్యానికి కారణం.. లాడో పంచాయత్‌లు...

దీని వ్యవస్థాపకుడు సునీల్ జగ్లాన్. హరియాణాలోని బీబీపూర్ మాజీ సర్పంచ్, సామాజిక కార్యకర్త. కూతురు పుట్టిందని సునీల్ సంబరాలు చేసుకుంటుండగా ఊళ్లోని పెద్దలంతా అతన్ని చూసి జాలిపడ్డారట. అప్పుడే అనుకున్నాడతను.. అమ్మాయి పుట్టినందుకు గర్వపడేలా, అమ్మాయిని గౌరవంగా చూసేలా జనాల్లో చైతన్యం తేవాలని, ఆ ప్రయాణంలో ముందుగా తమ హక్కుల పట్ల అమ్మాయిలకు అవగాహన కల్పించాలని! ఆ ఆలోచనే 'లాడో పంచాయత్'గా మొదలైంది. అందులో భాగంగానే చదువు నుంచి ఆస్తి దాకా ఆడపిల్లలకున్న హక్కుల గురించి వాళ్లకు అవగాహన కల్పించాడు. ప్రశ్నించడం, పోరాడటం నేర్పించాడు. దానికోసం దాదాపు అయిదేళ్లు శ్రమ పడ్డాడు. వేలమంది అమ్మాయిలను ఏకం చేశాడు.

ఇది ఎలా పనిచేస్తుంది?

ఇందులో 15 – 30 ఏళ్ల మధ్య అమ్మాయిలు సభ్యులుగా ఉంటారు. వీళ్లంతా ఊళ్లల్లోని అమ్మాయిలు, మహిళలను సమావేశపరుస్తారు. ప్రతి సెషన్‌లో ఒక అమ్మాయిని ప్రధాన్ లేదా హెడ్‌లా ఎంచుకుంటారు. ఆమె తలకు పాగా చుట్టుకుని మీటింగ్ నిర్వహిస్తుంది. సభ్యులంతా కలిసే మీటింగ్ ఎజెండాను నిర్ణయిస్తారు. చర్చల్లో తీసుకున్న తీర్మానాలను అందరి సంతకాలతో సంబంధిత ప్రభుత్వాధికారులకు సబ్‌మిట్ చేస్తారు. అయితే ఈ పంచాయత్‌లోని ప్రధాన్ తలకు పాగా చుట్టుకోవడమన్నది సంప్రదాయ పంచాయతీలోని పురుషాధిపత్య వ్యతిరేకతను చాటడానికే అంటాడు సునీల్ జగ్లాన్.

దుర్భాషల మీద జరిమానా...

సునీల్ జగ్లాన్ సర్పంచ్‌గా ఉన్న టైమ్‌లో.. తన కూతురి నోటివెంట చెడ్డ మాట విని అవాక్కయ్యాడు. అలా ఎంతమంది పిల్లలు అలాంటి మాటలు నేర్చుకుంటున్నారోననే ఆందోళనతో తన ఇలాఖాలో దుర్భాషలాడిన వాళ్లకు జరిమానా విధించడం మొదలుపెట్టాడు. ఆ స్ఫూర్తితోనే హరియాణా, హిసార్ జిల్లాలోని నల్వా గ్రామంలో లాడో పంచాయత్ సభ్యులు 'ఆడవాళ్లను కించపరచే అసభ్య పదాలు, భాషను నేరంగా పరిగణించాలని, సామాజిక దుష్ప్రవర్తనలా చూడాలని, దాని మీద కఠిన చట్టాన్ని తీసుకురావాల'ని డిమాండ్ చేశారు. ఇలా.. అమ్మాయిలు నిర్వహిస్తున్న ఈ లాడో పంచాయత్‌లు గవర్నెన్స్, పంచాయత్‌లు ఎలా ఉండాలో చూపిస్తున్నాయి. వాళ్లకు రాజ్యసభ ఆహ్వానాన్నీ అందిస్తున్నాయి.



సెల్ఫీ విత్ డాటర్

సునీల్ జగ్లాన్ బీబీపూర్ సర్పంచ్ కాకముందు లెక్కల మాష్టారు. ప్రస్తుతం రోహతక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. లింగ వివక్షను రూపుమాపే ప్రయత్నంలో భాగంగా 2015లో తండ్రులు తమ కూతుళ్లతో సెల్ఫీలు దిగి, పోస్ట్ చేసే 'సెల్ఫీ విత్ డాటర్' క్యాంపెయిన్‌ను స్టార్ట్ చేశాడు. దీన్ని ప్రధాని మోదీ కూడా ప్రోత్సహించారు. 'తరతరాల జాడ్యాలు పోవడానికి చాలా టైమ్ పడుతుంది. మార్పు వచ్చేదాకా ప్రయత్నం కొనసాగాలి' అంటాడు సునీల్ జగ్లాన్.



చట్టబద్ధత ఉండదు.. కానీ..

ఖాప్ పంచాయత్స్‌లాగే లాడో పంచాయత్‌లకూ చట్టబద్ధత ఉండదు. కానీ సమాజాన్ని చైతన్య పరచడానికి ఉపయోగపడతాయి. మహిళల హక్కుల విషయంలో దీని తీర్మానాల ఆధారంగా కోర్టుల్లో రికమండేషన్స్, న్యాయం పొందే అవకాశం ఉంటుంది.

– ఇ. పార్వతి, హైకోర్ట్ అడ్వకేట్

● మన(సు)లో మాట

సైకియాట్రిస్టులంటే వాళ్లకే వైద్యం చేస్తారని కాదు...

మా అక్క ప్రెగ్నెన్సీతో ఉన్నపుడే మా బావ చనిపోయారు. తండ్రి లేని పిల్లవాడని చిన్నప్పటినుంచి వాణ్ణి అందరూ బాగా గారాబం చేశారు. 'నా ఫ్రెండ్స్ అందరూ బీటెక్ కోసం చెన్నై వెళ్తున్నారు, నేనూ వెళ్తాను' అంటే ఒక డీమ్డ్ యూనివర్సిటీలో మా నాన్న గారు జాయిన్ చేశారు. అక్కడికి వెళ్లగానే ఐఫోన్, లాప్‌టాప్ కొనిపించుకున్నాడు. ఇంక రోజంతా ఆ ల్యాప్‌టాప్‌లో గేమ్స్ ఆడుతూ కూర్చునేవాడు. 'నాకు ఇంజినీరింగ్ ఇష్టం లేదు, యానిమేషన్ కోర్సులో జాయిన్ అవుతాను' అంటే అక్కడి నుండి తీసుకొచ్చి యానిమేషన్ కోర్సులో జాయిన్ చేశాం. కాలేజీకి వెళ్ళడానికి బైకు కావాలి అని చెప్పి ఖరీదైన బైకు కూడా కొనిపించుకున్నాడు. లోకల్ ఫ్రెండ్ సర్కిల్ ఎక్కువై పోయి రోజూ మందు, సిగిరెట్లు తాగడం స్టార్ట్ చేశాడు. అప్పుడప్పుడు గంజాయి, ఇంకా వేరే ఏవో డ్రగ్స్ తీసుకుంటున్నాడని తెలిసి మేం డబ్బులు ఇవ్వం అని అంటే– నేను ఇంట్లో నుంచి వెళ్ళి పోతాను, చచ్చిపోతాను అని బెదిరిస్తున్నాడు! మా అక్కేమో, మా అమ్మాయిని తన కొడుక్కు ఇచ్చి పెళ్లి చేస్తే దారిలోకి వస్తాడంటోంది. మా ఆవిడకు అది ఇష్టం లేదు, అలా చేస్తే చచ్చిపోతానని బెదిరిస్తోంది. వీళ్లందరి మూలంగా నేను కూడా డిప్రెషన్‌కు లోను అవుతున్నాను. దయచేసి నేను ఏం చేయాలో చెప్పండి.

– **శ్రీనివాస రావు,** నెల్లూరు

మీ సమస్య చాలా సంక్లిష్టమైనది, సున్నితమైనది కూడా! ఇది ఒక వ్యక్తికి సంబంధించింది కాకుండా ఒక కుటుంబానికి సంబంధించిన సమస్యగా చూడాల్సి ఉంటుంది. ముందు మీరూ మీ కుటుంబ సభ్యులు అంతా కౌన్సెలింగ్ తీసుకోవల్సి ఉంటుంది. ప్రేమ అంటే అడగ్గానే అవసరం ఉన్నా లేకున్నా, అన్నీ తెచ్చి ఇవ్వడం కాదు. పిల్లలకు ఏది మంచిది. ఏది వాళ్ళను పాడు చేస్తుంది– అనే వివేచనాశక్తి పెద్దలు కలిగి ఉండాలి. నియంత్రణ, బాధ్యత లేని ప్రేమ చాలా ప్రమాదకరం. అది మంచి కంటే చెడే ఎక్కువ చేస్తుంది. దురదృష్టవశాత్తూ మీ మేనల్లుడి విషయంలో అదే జరిగింది. దీనివల్ల ఆ పిల్లవాడు చిన్న వయసు నుంచి ఒక పద్ధతి, క్రమ శిక్షణ లేకుండా ఒక జలాయిలా పెరిగాడు. దానికి తోడు ఈ మొబైల్ ఫోను, చెడుసావాసాలు, డ్రగ్స్ అతన్ని మరింతగా పాడు చేశాయి. మీ మేనల్లుడికి ఖచ్చితంగా 'పర్సనాలిటీ డిజార్డర్' ఏదైనా ఉండొచ్చు. దాన్ని కౌన్సెలింగ్, మందుల ద్వారా కొంతవరకు సరిచేయవచ్చు. అయితే అతను ట్రీట్మెంట్ కు సహకరించకపోవచ్చు. అతనికి ఈ సూసైడ్ ఆలోచనలు ఉండడం, విపరీతంగా డ్రగ్స్ తీసుకోవడం అనేది సైకియాట్రిక్ ఎమర్జెన్సీని సూచిస్తాయి. – అలాంటి సందర్భాల్లో పేషంట్‌కు ఇష్టం లేకపోయినా కుటుంబ సభ్యుల సహకారంతో వైద్యం అందించవచ్చు. అవసరమైతే కొంతకాలం అతన్ని రీ హ్యాబిలిటేషన్ సెంటర్లో ఉంచి ఒక క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని తనకి అలవాటు చేయవచ్చు. ఈలోపు మీ అక్క, మీ అమ్మనాన్నలకి పేరెంటింగ్ విషయంలో కౌన్సెలింగ్ చేయడం జరుగుతుంది. ఇప్పటికీ ఏమీ మించిపోయింది లేదు. కాబట్టి ముందు మీరు మీకు దగ్గరలో ఉన్న సైకియాట్రిస్ట్‌ని కలవండి. ఈలోగా మీ అమ్మాయిని చదువుకుని తన కాళ్ళ మీద తనను నిలబడమని ప్రోత్సహించండి. ఈలోపు మీ మేనల్లుడిలో ఎలాంటి మార్పు వస్తుందో మీకు అవగాహన వస్తుంది. అప్పుడు పెళ్లి గురించి నిర్ణయం తీసుకోవచ్చు. అసలు ఇప్పుడే ఆ విషయం గురించి తల బద్దలు కొట్టుకోవడం సరైంది కాదు. సైకియాట్రిస్టులంటే కేవలం పిచ్చి పట్టిన వారికి మాత్రమే కాదు, ఇలాంటి కుటుంబ, వైవాహిక జీవిత సమస్యలున్న వారికి కూడా, తగిన సలహాలు, కౌన్సెలింగ్, వైద్య చికిత్స చేసే మనోవైద్య నిపుణులని అందరూ తెల్సుకోవాలి!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● ఎకో ఫ్రెండ్లీ

పర్యావరణ్‌వీర్



నీటి సంరక్షణ, చెరువుల సుందరీకరణ, నీటి వనరుల పునరుద్ధరణకు సంబంధించి ఎంతో కృషి చేస్తున్నాడు రణ్‌వీర్ తన్వార్. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హరియాణ, మధ్యప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్, కర్నాటక రాష్ట్రాల్లో 80కి పైగా చెరువులను పునరుద్ధరించాడు. పర్యావరణంపై గ్రామస్థాయిలో అవగాహన కలిగించడానికి 'సే ఎర్త్' అనే స్వచ్ఛందసంస్థను స్థాపించాడు. ఘజియాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రణ్‌వీర్‌ను 'స్వచ్ఛ్ భారత్ మిషన్'కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఘజియాబాద్ జిల్లా 'గ్రౌండ్ వాటర్ ఫోర్స్' కోఆర్డినేటర్‌గా కూడా పనిచేశాడు రణ్‌వీర్.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని గౌతమ బుద్ధా నగర్ జిల్లాకు చెందిన రణ్‌వీర్ మెకానికల్ ఇంజనీరింగ్ చేశాడు. ఇంజనీర్‌గా కొద్దికాలమే పనిచేసిన రణ్‌వీర్ పూర్తి సమయాన్ని పర్యావరణ సంబంధిత కార్యక్రమాలకు వెచ్చించాడు. సెంట్రల్ పోల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా భూగర్భ జలాల పరిరక్షణలో శిక్షణ తీసుకున్నాడు.

నీటి వనరుల పునరుద్ధరణ ఉద్యమాలలో యువతను భాగస్వాములను చేయడానికి 'సెల్ఫీ విత్ పాండ్' కార్యక్రమాన్ని చేపట్టాడు. 'అమర్ చిత్ర కథ' ప్రచురించిన కామిక్ పుస్తకం 'మన్ కీ బాత్'లో ఆదర్శనీయమైన రణ్‌వీర్ జీవితకథను ప్రచురించారు.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఆగస్ట్ 13న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,01,300	1,02,950	1,01,350	1,02,950	1,00,550	1,01,340
బంగారం (22 క్యారెట్లు)	94,390	92,900	92,900	95,690	92,510	92,900
వెండి	1,18,500	1,17,700	1,25,000	1,17,700	1,17,500	1,26,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



భారత ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్‌గా జమీల్ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు కొత్త హెడ్ కోచ్‌గా ఖాలిద్ జమీల్ బుధవారం బాధ్యతలు స్వీకరించాడు. రెండేళ్ల కాలానికి జమీల్ ఈ పదవిలో ఉండనున్నాడు. ఆ తర్వాత ప్రదర్శన ఆధారంగా ఒక ఏడాది పాటు కాంట్రాక్ట్ పొడిగించే అవకాశముంది. ఈ మేరకు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఒక ప్రకటన విడుదల చేసింది. 'జాతీయ జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా. చాన్నాళ్లుగా భారత ఆటగాళ్లతో కలిసి పని చేస్తున్నా. వారి బలాబలాలపై అవగాహన ఉంది. నేషన్స్ కప్‌కు జట్టును మెరుగ్గా సిద్ధం చేస్తా' అని 48 ఏళ్ల జమీల్ పేర్కొన్నాడు. నేషన్స్ కప్‌లో భాగంగా ఈ నెల 29న తజికిస్తాన్‌తో తలపడనున్న టీమిండియా ఆ తర్వాత సెప్టెంబర్ 1న ఇరాన్‌తో, 4న అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్‌లు ఆడనుంది. ఆ తర్వాత ఆసియా కప్ క్వాలిఫయింగ్‌లో భాగంగా సింగపూర్‌తో రెండు మ్యాచ్‌లు ఆడుతుంది. మనోలో స్థానంలో జమీల్ బాధ్యతలు స్వీకరించాడు. తద్వారా 2011–12 తర్వాత భారత ఫుట్‌బాల్ జట్టుకు తొలి స్వదేశీ కోచ్‌గా జమీల్ నిలిచాడు. గతంలో జమీల్ ఐ–లీగ్‌లో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ, నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ, ఐజ్వాల్ ఎఫ్‌సీ, ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీ, మోహన్ బగాన్ ఎఫ్‌సీ, ముంబై ఎఫ్‌సీ జట్లకు కోచ్‌గా వ్యవహరించాడు.



రాధ



యస్తిక

గెలిపించిన రాధ, యస్తిక

తొలి వన్డేలో 3 వికెట్లతో నెగ్గిన భారత మహిళల 'ఎ' జట్టు

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల 'ఎ' జట్టు తొలి విజయం అందుకుంది. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను 0–3తో కోల్పోయిన భారత మహిళల 'ఎ' జట్టు వన్డే సిరీస్‌లో మాత్రం శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 3 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 47.5 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. దూకుడుగా ఆడిన అనిక లియరాయిడ్ (90 బంతుల్లో 92 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా, రాచెల్ ట్రెనమన్ (62 బంతుల్లో 51; 6 ఫోర్లు) అర్ధ సెంచరీతో రాణించింది. భారత బౌలర్లలో కెప్టెన్ రాధ యాదవ్ 45 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... టిటాస్ సాధు, మిన్ను మణి చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 42 ఓవర్లలో 7 వికెట్లకు 215 పరుగులు చేసి గెలిచింది. వికెట్ కీపర్ యస్తిక భాటియా (70 బంతుల్లో 59; 7 ఫోర్లు) హాఫ్ సెంచరీ చేయగా... షఫాలీ వర్మ (31 బంతుల్లో 36; 5 ఫోర్లు), ధారా గుజ్జర్ (53 బంతుల్లో 31; 2 ఫోర్లు), రాఘ్వీ బిష్త్ (25 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. లూసీ హామిల్టన్, హేవార్డ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలో నిలవగా, రెండో మ్యాచ్ రేపు జరుగుతుంది.

సుశీల్ మళ్లీ జైలుకు...

రెజ్లర్ బెయిల్ రద్దు చేసిన సుప్రీంకోర్టు ● వెంటనే లొంగిపోవాలని ఆదేశం



న్యూఢిల్లీ: భారత ప్రముఖ రెజ్లర్, డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ సుశీల్ కుమార్‌పై సుప్రీంకోర్టు కొరడా ఝళిపించింది. హత్య కేసులో నిందితుడైన సుశీల్‌కు ఈ ఏడాది మార్చిలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన బెంచ్ ఈ తీర్పునిచ్చింది. వారం రోజుల్లోగా కోర్టులో లొంగిపోవాలని ఆదేశించడంతో సుశీల్ మళ్లీ జైలుపాలు కానున్నాడు. యువ రెజ్లర్ సాగర్ ధన్‌కర్ హత్య కేసులో జైల్లో ఉన్న సుశీల్‌కు ఐదు నెలల క్రితం బెయిల్ లభించగా... దీనిని వ్యతిరేకిస్తూ సాగర్ తండ్రి అశోక్ ధన్‌కర్ కోర్టుకెక్కడంతో సుప్రీంకోర్టు స్పందించింది. ఆటగాడిగా సుశీల్ స్థాయి, ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన అతను ఘనతలను కూడా ప్రత్యేకంగా ఉదహరిస్తూ కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

పరారీ తర్వాత లొంగిపోయి...

కేసు వివరాల్లోకెళితే... 2021 మే నెలలో సుశీల్ కుమార్‌తో పాటు పలువురు రెజ్లర్లు సాధన చేసే ఛత్రశాల్ స్టేడియం ముందు ఈ ఘటన జరిగింది. ఒక ఆస్తి వివాదానికి సంబంధించిన వ్యవహారంలో సుశీల్ తదితరులు కలిసి సాగర్ ధన్‌కర్, అతని మిత్రులపై తీవ్ర దాడికి పాల్పడ్డారు. గాయాలతో ఆ తర్వాత సాగర్ మృతి చెందాడు. దాంతో సుశీల్‌పై కేసు నమోదైంది. దాదాపు ఇరవై రోజుల పాటు పరారీలో ఉన్న తర్వాత చివరకు సుశీల్ పోలీసుల ముందు లొంగిపోయాడు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ సందర్భంగా హత్యతో పాటు అక్రమంగా ఆయుధాలను కలిగి ఉండటం తదితర అంశాలతో పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ క్రమంలో సుశీల్‌ను తీహార్ జైలుకు పంపించారు. అయితే ఈ నాలుగేళ్ల కాలంలో వేర్వేరు కారణాలతో అతను ఐదుసార్లు స్వల్పకాలిక బెయిల్ పొందాడు.

హైకోర్టు తప్పు చేసింది...

సుశీల్‌కు గత మార్చిలో ఢిల్లీ కోర్టుపై బెయిల్ మంజూరు చేయడం తనకు తీవ్ర వేదన కలిగించిందని, తనకు న్యాయం చేయాలంటూ ఢిల్లీ పోలీసు విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సాగర్ తండ్రి అశోక్ ధన్‌కర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. సుశీల్‌కు బెయిల్ ఇచ్చిన ప్రతీసారి అతను సాక్షులను ప్రభావితం చేశాడని... 35 మంది సాక్షుల్లో 28 మంది ఇప్పుడు గతంలో తాము ఇచ్చిన సాక్ష్యానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని పిటిషనర్ ఆరోపించారు. అనంతరం కేసుపై కోర్టు తమ అభిప్రాయాలు వెల్లడించింది. 'నిందితుడు అగ్రశ్రేణి రెజ్లర్. ప్రపంచ స్థాయిలో మన దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. కాబట్టి సమాజంలో కూడా వ్యక్తిగతంగా కూడా ఎంతో గుర్తింపు ఉన్న వ్యక్తి అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి అతను సాక్షులను, విచారణను ప్రభావితం చేయవచ్చు. ఎఫ్ఐఆర్ తర్వాత కూడా అతను పరారీలో ఉన్న విషయంలో మర్చిపోవద్దు. అతనిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కేసు తీవ్రత తగ్గించే విధంగా బెయిల్ ఉండరాదు. సత్ప్రవర్తనలాంటి అంశాలను ఇలాంటి కేసుల్లో పరిగణలోకి తీసుకోవద్దు. ఈ కేసులో బెయిల్ ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు తప్పుగా వ్యవహరించింది' అని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. అయితే బెయిల్ ఇచ్చిన కారణాలను తప్పుగా చూపిస్తూ దీనిని రద్దు చేసిన సుప్రీంకోర్టు... మున్ముందు సుశీల్ కుమార్‌కు కొత్తగా మళ్లీ బెయిల్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం మాత్రం ఇచ్చింది.



భారత చెస్‌లో 89వ గ్రాండ్‌మాస్టర్

జీఎంగా చెన్నై కుర్రాడు రోహిత్ కృష్ణ

అల్మాటీ (కజకిస్తాన్): భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ల జాబితాలో మరో ఆటగాడు చేరాడు. చెన్నైకి చెందిన 19 ఏళ్ల రోహిత్ కృష్ణ కొత్త జీఎంగా అవతరించాడు. కజకిస్తాన్‌లోని అల్మాటీలో జరిగిన మాస్టర్స్ కొనేవ్ కప్ టోర్నీ చివరి రౌండ్‌లో ఆర్థర్ డేవ్‌టన్ (రొమేనియా)ను ఓడించి మూడో జీఎం నార్మ్ సాధించడంతో రోహిత్‌కు గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కింది. 2022లో ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) హోదా సాధించిన తర్వాత రోహిత్... ఈ ఏడాది మార్చిలో తొలి జీఎం నార్మ్‌ను, మే నెలలో రెండో జీఎం నార్మ్‌ను గెలుచుకున్నాడు. గ్రాండ్‌మాస్టర్ ఘనత సాధించిన 89వ భారత ఆటగాడిగా అతను నిలిచాడు. ఇటీవల 'ఫిడే' మహిళల వరల్డ్ కప్‌ను గెలుచుకోవడంతో దివ్య దేశ్‌ముఖ్ 88వ గ్రాండ్‌మాస్టర్ హోదాను సొంతం చేసుకుంది. రోహిత్ ప్రస్తుతం ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. '2013 నుంచి గ్రాండ్‌మాస్టర్ కావాలనే లక్ష్యంతో శ్రమించాను. ఇన్నేళ్లకు నా కష్టం ఫలించడం చాలా సంతోషంగా ఉంది. ఈ ఘనత సొంతం చేసుకునేందుకు అనుకున్నదానికంటే చాలా ఎక్కువ సమయం పట్టడంతో నాపై చాలా ఒత్తిడి పెరిగింది. అయితే కఠిన సమయంలో తల్లిదండ్రులు, మిత్రులతో పాటు నేను చదివిన స్కూల్, కాలేజీ యాజమాన్యాలు అండగా నిలిచాయి' అని రోహిత్ అన్నాడు. అతను గత ఆరేళ్లుగా చెన్నైలో కోచ్ విశ్వేశ్వరన్ వద్ద శిక్షణ పొందుతున్నాడు.



అర్జున్–అనీశ్ గిరి గేమ్ 'డ్రా'

చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీ మాస్టర్స్ కేటగిరీలో ప్రపంచ ఆరో ర్యాంకర్, భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో వరుసగా మూడో 'డ్రా' చేరింది. అనీశ్ గిరి (నెదర్లాండ్స్)తో బుధవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను అర్జున్ 35 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఇతర గేముల్లో కార్తికేయన్ మురళీ (భారత్) 71 ఎత్తుల్లో విదిత్ (భారత్)పై, నిహాల్ సరీన్ (భారత్) 43 ఎత్తుల్లో రే రాబ్సన్ (అమెరికా)పై, విన్సెంట్ కీమెర్ (జర్మనీ) 39 ఎత్తుల్లో అవండర్ లియాంగ్ (అమెరికా)పై విజయం సాధించారు. ప్రణవ్ (భారత్)–జోర్డెన్ వాన్ ఫారీస్ట్ (నెదర్లాండ్స్) మధ్య గేమ్ 98 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. ఏడో రౌండ్ తర్వాత కీమెర్ 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 4 పాయింట్లతో అర్జున్, కార్తికేయన్ సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు.

ఇదే టోర్నమెంట్ చాలెంజర్స్ కేటగిరీలో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక ఐదో పరాజయం చవిచూసింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ హర్షవర్ధన్‌తో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన హారిక 75 ఎత్తుల్లో ఓడిపోయింది. ఇతర గేముల్లో ప్రాణేశ్ (భారత్) 76 ఎత్తుల్లో వైశాలి (భారత్)పై, లియోన్ ల్యూక్ (భారత్) 52 ఎత్తుల్లో దీప్తాయన్ ఘోష్ (భారత్)పై గెలిచారు. అభిమన్యు పురాణిక్ (భారత్)–ఆర్యన్ చోప్రా (భారత్) గేమ్ 42 ఎత్తుల్లో... ఆధిబన్ (భారత్)–ఇనియన్ (భారత్) గేమ్ 36 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. ఈ టోర్నీలో మరో రెండు రౌండ్‌లు మిగిలి ఉన్నాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

మీరు నా మొదటి గురువు



● రజనీకాంత్, హృతిక్ రోషన్

– రజనీకాంత్‌ని ఉద్దేశించి హృతిక్ రోషన్

"మీ పక్కన నటుడిగా నా తొలి అడుగులు వేశాను. నా మొదటి గురువుల్లో మీరు ఒకరు'' అంటూ హీరో హృతిక్ రోషన్ ఎక్స్ వేదికగా (ట్విట్టర్) ఓ పోస్ట్ చేశారు. రజనీకాంత్ హీరోగా జె. ఓం ప్రకాశ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భగవాన్ దాదా'(1986). రాకేశ్ రోషన్ నిర్మించిన ఈ చిత్రంలో ఆయన తనయుడు హృతిక్ రోషన్ బాలనటుడిగా నటించారు. 'భగవాన్ దాదా' గా రజనీకాంత్ నటించగా, ఆయన పెంపుడు కొడుకు గోవిందా దాదాగా హృతిక్ నటించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కూలీ'. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలకానుంది. అదేవిధంగా హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటించిన చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ సినిమా కూడా నేడు విడుదలవుతోంది. 'కూలీ, వార్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఒకే రోజు పోటీ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో రజనీకాంత్ గురించి హృతిక్ రోషన్ పోస్ట్ చేయడం విశేషంగా మారింది. ''రజనీకాంత్ సార్.. మీ పక్కన నటుడిగా నా తొలి అడుగులు వేశాను. నా మొదటి గురువుల్లో మీరు ఒకరు. నాకెప్పుడూ మీరు ఆదర్శం. యాభై ఏళ్ల ఆన్ స్క్రీన్ మ్యాజిక్ పూర్తి చేసుకున్నందుకు మీకు అభినందనలు'' అని హృతిక్ రోషన్ పోస్ట్ చేశారు.

చేయి లేని సూపర్ హీరో?

– 'ఇరుంబు కై మాయావి' కథలో మార్పులు



● లోకేశ్ కనగరాజ్, ఆమిర్ ఖాన్

వెండితెరపై సూపర్ హీరో చేసే విన్యాసాలు పిల్లలు, పెద్దలు అందరికీ నచ్చుతాయి. ఇక ఆమిర్ ఖాన్‌లాంటి హీరో సూపర్ హీరోగా కనిపిస్తే... ఆ చిత్రానికి ఎనలేని క్రేజ్ ఉంటుంది. ఆ క్రేజీ ప్రాజెక్ట్‌కి సన్నాహాలు జరుగుతున్నాయి. ఆమిర్‌ని దర్శకుడు లోకేశ్ కనగరాజ్ సూపర్ హీరోగా చూపించనున్న సంగతి తెలిసిందే. నిజానికి సూర్య హీరోగా 'ఇరుంబు కై మాయావి' (ఇనుప చేయి మాయగాడు) టైటిల్‌తో చేయాల్సిన కథని ఇప్పుడు ఆమిర్‌తో తీయనున్నారు లోకేశ్. అయితే నాలుగైదేళ్ల క్రితం లోకేశ్ ఈ కథ రాసుకున్నారు. ఆ తర్వాత తాను తెరకెక్కించిన చిత్రాల్లో ఈ స్క్రిప్ట్‌లోని కొన్ని సన్నివేశాలను కూడా ఉపయోగించారు. అలానే వేరే చిత్రాల్లోనూ ఈ కథలోని కొన్ని సన్నివేశాలు పోలినవి ఉన్నాయట. సో... ఈ స్క్రిప్ట్‌ని రీ వర్క్ చేస్తున్నారట లోకేశ్. ముందు అనుకున్నట్లుగానే సూపర్ హీరో మూవీలానే తెరకెక్కిస్తారు. అయితే ముందు అనుకున్న కథలో హీరోకి ఒక చేయి ఉండదు. దాంతో ఇనప చేయి పెట్టించుకుంటాడు. ఆ మెటల్ హ్యాండ్‌తో ఈ సూపర్ హీరో చేసే విన్యాసాలు మామూలుగా ఉండవట. ముందు అనుకున్న కథ ఇది. మరి... ఇప్పుడు కథలో మార్పులు చేర్పులు చేస్తున్నారు కాబట్టి... ఈ కథలో సూపర్ హీరో ఆమిర్ ఖాన్‌కి చేయి ఉంటుందా? లేకపోతే ఇరుంబు కై (ఇనుప చేయి)తో ఈ హీరో ఎలాంటి విన్యాసాలు చేయనున్నారనేది చూడాలి. ఈ కథ మీద వర్క్ చేస్తూనే మరోవైపు కార్తీ హీరోగా 'ఖైదీ' సీక్వెల్‌ని తెరకెక్కిస్తారు లోకేశ్. ఇక రజనీకాంత్ హీరోగా లోకేశ్ దర్శకత్వం వహించిన 'కూలీ' చిత్రంలో ఆమిర్ ఖాన్ ఓ కీ రోల్ చేసిన విషయం తెలిసిందే. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

ఆ రహస్యాలు బహిర్గతం చేయొద్దు

– హృతిక్ రోషన్, ఎన్టీఆర్



● ఎన్టీఆర్, హృతిక్ రోషన్

హృతిక్ రోషన్, కియారా అద్వానీ జంటగా నటించిన చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఈ సినిమా ద్వారా హీరో ఎన్టీఆర్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్యా చోప్రా పాన్ ఇండియా స్థాయిలో నిర్మించిన ఈ చిత్రం నేడు హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా హృతిక్ రోషన్, ఎన్టీఆర్.. స్పాయిలర్‌లకు, తమ అభిమానులకు ఓ వినతి చేశారు. ''వార్ 2' సినిమాను ఎంతో ప్రేమతో కష్టపడి తెరకెక్కించాం. ఎంతో ప్యాషన్‌తో చేసిన ఈ మూవీ నేడు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాటిక్ దృశ్యాన్ని ఎక్స్‌పీరియన్స్ చేయడానికి అందరూ థియేటర్లలోనే సినిమాను చూడండి. దయచేసి సినిమాలోని సీక్రెట్లు, ట్విస్ట్‌లను బహిర్గతం చేయకండి'' అంటూ హృతిక్ రోషన్ పేర్కొన్నారు. ''మీరు(అభిమానులు) 'వార్ 2'ని మొదటిసారి చూసినప్పుడు పొందే ఆనందం, థ్రిల్, వినోదాన్ని మిగతా వారూ పొందాలి. స్పాయిలర్లు రహస్యాలు, ట్విస్టులు రివీల్ చేయడం వల్ల మిగతా వాళ్లకు ఆ అనుభూతి ఉండదు. దయచేసి 'వార్ 2' కథను రహస్యంగా ఉంచండి'' అని ఎన్టీఆర్ తెలిపారు.

సౌత్‌లోనే సూపర్!



● పూజా హెగ్డే

''బాలీవుడ్‌లో నన్ను గ్లామరస్ హీరోయిన్‌గానే చూస్తున్నారు. అయితే సౌత్‌లో మాత్రం నాలో మంచి నటిని చూస్తున్నారు. సౌత్‌లోనే నాకు సూపర్ క్యారెక్టర్స్ వస్తున్నాయి'' అన్నట్లు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు పూజా హెగ్డే. అలాగే దక్షిణాదిన చేసిన కొన్ని చిత్రాల గురించి కూడా ప్రస్తావించారామె. వాటిలో 'అరవింద సమేత వీర రాఘవ, రాధే శ్యామ్' చిత్రాలు కూడా ఉన్నాయి. ఇక తమిళంలో ఇటీవల విడుదలైన 'రెట్రో'లో చేసిన క్యారెక్టర్ గురించి కూడా పేర్కొన్నారు పూజ. సౌత్‌లో ఇంకా మరిన్ని మంచి చిత్రాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు పూజా హెగ్డే. అలాగే 'బాహుబలి' తనకు చాలా ఇష్టమైన సినిమా అని, ఒకవేళ 'బాహుబలి 3' కూడా ఉంటే, అందులో ప్రభాస్ నటిస్తే, తనను హీరోయిన్‌గా తీసుకోమని ప్రభాస్‌ని అడుగుతానని తన మనసులోని మాటను వ్యక్తపరిచారు. అలాగే సెలబ్రిటీలపై ప్రచారమయ్యే ట్రోల్స్ గురించి పూజా హెగ్డే మాట్లాడుతూ– ''నా గురించి జరిగే అసత్య ప్రచారాలను, ట్రోల్స్‌ను నేను పెద్దగా పట్టించుకోను. కానీ మా అమ్మగారు మాత్రం చాలా బాధపడతారు. మనల్ని ఎవరైనా కిందకు లాగాలని ప్రయత్నిస్తున్నారంటే మనం వారికన్నా ఎంతో ఎత్తులో ఉన్నట్లే. అందుకే నా గురించి వచ్చే చెడు ప్రచారాన్ని నేను కాంప్లిమెంట్‌గా తీసుకుంటాను. అలాగే ఎయిర్‌పోర్టులో కనిపించినప్పుడు ఫొటోలు అడిగే వాళ్లు, థియేటర్లో తెరపై కనబడగానే అభిమానంతో పేపర్లు, పువ్వులు విసిరే వాళ్లే నిజమైన వ్యక్తులు. ఇలాంటివారిని పట్టించుకుంటాను. అంతే తప్ప నెగటివ్ పీఆర్‌ని పట్టించుకోను'' అని కూడా పేర్కొన్నారు పూజ.

సమాధానం నేనే చెప్పాలి!



● సత్యరాజ్, 'సత్యం' రాజేష్

'చూడు బార్బరికా.. ఈ యుద్ధం నీది.. ధర్మ ధ్వజం రెపరెపలాడాలంటే అధర్మం చేసే వారికి దండన లభించాలి' అనే డైలాగులతో మొదలైంది 'త్రిబాణధారి బార్బరిక్' చిత్రం ట్రైలర్. సత్యరాజ్, 'సత్యం' రాజేష్, ఉదయభాను, వశిష్ఠ ఎన్. సింహా, క్రాంతి కిరణ్, సాంచి రాయ్ కీలక పాత్రలు పోషించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. మారుతీ టీమ్ ప్రొడక్ట్ సమర్పణలో వానర సెల్యూలాయిడ్‌పై విజయపాల్ రెడ్డి అడిదల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ని బుధవారం రిలీజ్ చేశారు మేకర్స్. 'సమస్య నాదే అయినప్పుడు సమాధానం నేనే చెప్పాలి', 'బార్బరిక్ ఎవరి పక్కన ఉంటే వాళ్లకి కొండంత ధైర్యం'(సత్యరాజ్), 'నేను పాలల్లో నీళ్లే కలుపుత.. విషం కలుప', 'నా అల్లుణ్ణి సంపినోడు రేపు గిదే టైమ్‌కల్లా సచ్చి శవమై తేల్తాడు(ఉదయభాను)'.. వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''మిస్సింగ్ కేసు, మర్డర్ కేసు చుట్టూ 'త్రిబాణధారి బార్బరిక్' చిత్ర కథ తిరుగుతుంది. విజువల్స్, మ్యూజిక్, ఆర్ఆర్.. ఇలా అన్నీ అద్భుతంగా ఉంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

చర్చలు విఫలం.. సమ్మె కొనసాగింపు



● 'దిల్' రాజు

తెలుగు చిత్ర పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు 30శాతం పెంచాలంటూ 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి బంద్ జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారంతో ఈ సమ్మె పదో రోజుకు చేరుకుంది. ఈ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత 'దిల్' రాజు నేతృత్వంలో 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్', ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, నిర్మాతలు బుధవారం సమావేశమై, చర్చించారు. అయితే ఈ చర్చలు విఫలం కావడంతో కార్మికుల సమ్మె కొనసాగనుంది. ఈ చర్చల్లో 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్' కో ఆర్డినేషన్ చైర్మన్ వీరశంకర్, ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు, ట్రెజరర్ అలెక్స్, ఫైటర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బాజీ, మహిళా ప్రొడక్షన్ నాయకురాలు లలిత పాల్గొన్నారు. నిర్మాతల తరఫున బి. బాపినీడు, ఆచంట గోపీనాథ్, ఠాగూర్ మధు, మైత్రీ మూవీ మేకర్స్ సీఈఓ చెర్రీ, కిరణ్, వివేక్ కూచిభొట్ల హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం **'దిల్' రాజు మాట్లాడుతూ–** ''వేతనాలు పెంచాలని గత కొద్దిరోజులుగా ఫెడరేషన్ వాళ్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో నిర్మాతల నుంచి కొన్ని షరతులు ఉన్నాయి. ముఖ్యంగా 2018, 2022లలో జరిగిన ఒప్పందంలో ఉన్న రెండు షరతులను వాళ్లు అమలు చేయడం లేదు. ముందు వాటిని ఒప్పుకోవాలి. వీటితో పాటు మరో రెండు షరతులు కూడా ఉన్నాయి. ఇదే విషయాన్ని ఛాంబర్ ద్వారా వాళ్ల దృష్టికి తీసుకొచ్చాం. వాటిపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటే వేతనాలు పెంచడానికి నిర్మాతలు సిద్ధంగా ఉన్నాం. రెండు వేలు కన్నా తక్కువ వేతనం తీసుకునే వారికి ఒక పర్సంటేజీ ఆఫర్ చేస్తున్నాం. దాని కన్నా ఎక్కువ వేతనం తీసుకునే వాళ్లకు మరొక పర్సంటేజీ ఇవ్వాలని ప్రతిపాదించాం. ఫెడరేషన్‌లోని అన్ని యూనియన్లతో మాట్లాడుకుని వస్తే ఈ సమస్యని పరిష్కరిస్తాం. ప్రస్తుతం సానుకూల ధోరణిలో చర్చలు జరుగుతున్నాయి. మరో రెండు, మూడు సార్లు చర్చలు జరగాల్సి ఉంది'' అని తెలిపారు. **'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్' ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు మాట్లాడుతూ–** ''ఈరోజు నిర్మాతలు, ఫెడరేషన్ నాయకులకు మధ్య చర్చలు జరిగాయి. తాము పెట్టిన షరతులకు ఒప్పుకుంటేనే వేతనాలు పెంచడానికి సిద్ధం అని నిర్మాతలు చెప్పారు. మీ షరతులకు మేము ఒప్పుకుంటే 30శాతం కంటే ఎక్కువ వేతనాలు పెంచుతారా? అని అడిగాం. మా 24 క్రాఫ్ట్స్ నాయకులతో వారి షరతుల గురించి చర్చించి, మళ్లీ ఫిల్మ్ ఛాంబర్‌తో సమావేశం అవుతాం. కొన్ని యూనియన్స్‌లో సభ్యత్వం కోసం అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు అవాస్తవం. ఆ డబ్బుని కార్మికుల సంక్షేమం కోసమే వాడతాం'' అన్నారు.

ఆర్ట్ మాఫియా వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

– తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్

''నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌గారు ఇటీవల ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో 'ఆర్ట్ మాఫియా' అంటూ ఆర్ట్ డైరెక్టర్ల గురించి మాట్లాడటం బాధాకరం. ఆ వ్యాఖ్యల్ని ఆయన ఉపసంహరించుకోవాలి'' అని 'తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్' డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్షుడు రమణ వంక, ప్రధాన కార్యదర్శి కేఎం రాజీవ్ నాయర్, కోశాధికారి ఎం. తిరుమల బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ''సినిమాలో కథను అనుసరించి దర్శకుల ఊహను దృశ్యరూపంలో చూపించడంలో కళా దర్శకులు చాలా కీలకం. సృష్టికి ప్రతిసృష్టిని దృశ్యరూపంలో చూపించే మేధా సంపత్తి కలిగిన అతిముఖ్యమైన విభాగమే కళాదర్శకత్వ విభాగం. అంతటి విలువైన, ప్రాముఖ్యత కలిగిన మా విభాగంపై పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ అధినేత, నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌గారు 'ఆర్ట్ మాఫియా' అంటూ చేసిన వ్యాఖ్యలను మేము(కళా దర్శకత్వ, ఆర్ట్ డైరెక్టర్స్) ఖండిస్తున్నాం. ఇటీవల కాలంలో ఆయన పలు సినిమాలు నిర్మిస్తూ ఎంతోమంది కార్మికులకు ఉపాధి కల్పించారు, కల్పిస్తున్నారు.. ఇందుకు కార్మికుల పక్షాన కృతజ్ఞతలు. అయితే సినిమా చిత్రీకరణ సమయంలో ఎన్నో మార్పులు జరుగుతాయి. సెట్స్‌లోనూ మార్పులు చేయాల్సి వస్తుంది. నిర్మాతల అనుమతితోనే మార్పులు చేస్తాం. అలాంటప్పుడు ఖర్చులు పెరుగుతాయి. కొన్నిసార్లు తగ్గుతాయి. ఈ విషయంపై ఏ నిర్మాతకైనా అవగాహన, ఆలోచన ఉంటుంది. మీడియాలో మా గురించి తప్పుగా మాట్లాడే ఆ నిర్మాత తన సినిమా విషయంలో జరిగిన అంశాన్ని ఫిల్మ్ ఛాంబర్ దృష్టికి తీసుకెళ్లవచ్చు. అలాగే పనిచేసిన ప్రొడక్షన్ డిజైనర్–ఆర్ట్ డైరెక్టర్‌పై 'తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్' ద్వారా వివరణ తీసుకోవచ్చు. ఇలాంటివి చేయకుండా మాపై నిందలు వేయడం సరికాదు'' అని తెలిపారు.

స్టాక్ మార్కెట్లు
(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
304	132
80,540	24,619

విదేశీ సూచీలు

నాస్‌డాక్	21,689	▲	4
డోజోన్స్	44,789	▲	330
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,165	▲	18
డాక్స్	24,198	▲	173
షాంఘై	3,683	▲	18
నికాయ్	43,275	▲	556

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	87.25	88.27
£	బ్రిటన్ పౌండ్	117.00	119.99
€	యూరో	101.20	103.93
¥	జపాన్ యెన్ (100)	58.53	60.02
AU$	ఆస్ట్రేలియా డాలర్	56.17	58.42
S$	సింగపూర్ డాలర్	65.89	69.57
SAR	సౌదీ రియాల్	22.51	24.01
UAE D	యూఏఈ దిర్హామ్	23.01	24.25
¥	చైనా యువాన్	11.37	13.18

ఇక చకచకా చెక్కుల క్లియరెన్స్

అక్టోబర్ 4 నుంచి కొత్త విధానం



ముంబై: చెక్కులను వేగంగా క్లియర్ (చెల్లింపులు) చేసే దిశగా ఆర్‌బీఐ అక్టోబర్ 4 నుంచి కొత్త యంత్రాంగాన్ని అమల్లోకి తీసుకురానుంది. బ్యాంక్‌లో చెక్కు సమర్పించిన గంటల్లోనే అది నగదుగా మారిపోనుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న చెక్కు ట్రంకేషన్ సిస్టమ్ (సీటీఎస్) కింద రెండు పనిదినాల వరకు సమయం తీసుకుంటోంది. కొత్త విధానంలో చెక్కులను స్కాన్ చేసి వాటిని వెంటనే క్లియరింగ్ హౌస్‌కు బ్యాంక్‌లు పంపాల్సి ఉంటుంది. దీంతో క్లియరింగ్ సైకిల్ టీప్లస్1 (సమర్పించిన తర్వాతి రోజు) నుంచి కొన్ని గంటలకు తగ్గిపోనుంది. సీటీఎస్‌లో బ్యాచ్ ప్రాసెసింగ్ నుంచి కంటిన్యూయెస్ క్లియరింగ్ విత్ 'ఆన్ రియలైజేషన్ సెటిల్‌మెంట్'కు బ్యాంక్‌లు మారిపోనున్నాయి. ఈ మేరకు బ్యాంక్‌లకు ఆర్‌బీఐ సర్క్యులర్ జారీ చేసింది. "సీటీఎస్ నుంచి కంటిన్యూయెస్ క్లియరింగ్ అండ్ సెటిల్‌మెంట్ ఆన్ రియలైజేషన్‌కు రెండు దశల్లో మారిపోవాలని నిర్ణయించడమైంది. మొదటి దశ అక్టోబర్ 4 నుంచి, రెండో దశ 2026 జనవరి 3 నుంచి అమల్లోకి వస్తుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒకటే సెషన్ (చెక్కుల సమర్పణ) ఉంటుంది' అని ఆర్‌బీఐ పేర్కొంది.

టారిఫ్‌లు భారత్ వృద్ధిని ఆపలేవు

- సానుకూల రేటింగ్‌కు ముప్పు లేదు
- ఎస్అండ్‌పీ అంచనా

న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌లు భారత వృద్ధిని అడ్డుకోలేవని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అభిప్రాయపడింది. భారత్ ఎగుమతులపై ఆధారపడిన దేశం కాదని గుర్తు చేసింది. భారత సార్వభౌమ రేటింగ్ అంచనా సానుకూలంగానే కొనసాగుతుందని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ డైరెక్టర్ యీఫార్న్ ఫువా స్పష్టం చేశారు. భారత సార్వభౌమ రేటింగ్‌ను బీబీబీ మైనస్ నుంచి సానుకూలానికి అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ఎస్అండ్‌పీ గతేడాది మేలో ప్రకటించడం తెలిసిందే. బలమైన వృద్ధి అవకాశాలను ఇందుకు నేపథ్యంగా పేర్కొంది. అంతేకాదు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ 6.5 శాతం వృద్ధిని సాధిస్తుందని ఎస్అండ్‌పీ అంచనాగా ఉంది. భారత్‌పై ఈ నెల 6 నుంచి 25 శాతం టారిఫ్‌లను యూఎస్ అమలు చేస్తుండడం, ఆగస్ట్ 27 నుంచి మరో 25 శాతం మేర టారిఫ్‌లు అమలు కానున్న నేపథ్యంలో ఎస్అండ్‌పీ గ్లోబల్ తన విశ్లేషణను వెల్లడించింది. టారిఫ్‌ల విధింపు భారత సానుకూల ఔట్‌లుక్‌ను తగ్గించొచ్చా? అన్న సందేహంపై యీఫార్న్ స్పందించారు. అమెరికాతో వాణిజ్యం భారత జీడీపీలో 2 శాతంగానే ఉన్నట్టు గుర్తు చేశారు. ప్రధాన రంగాలైన ఫార్మాస్యూటికల్స్, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులకు టారిఫ్‌ల నుంచి మినహాయింపు ఉన్నట్టు చెప్పారు. దీర్ఘకాలంలో అధిక టారిఫ్‌లు భారత ఆర్థిక వ్యవస్థపై ఏమంత ప్రభావం చూపించబోవంటూ.. సానుకూల దృక్పథాన్ని కొనసాగిస్తున్నట్టు చెప్పారు.




పెట్టుబడులపైనా ప్రభావం ఉండదు..

అమెరికా టారిఫ్‌లు భారత్‌లో పెట్టుబడులపై ప్రభావం చూపిస్తాయా? అన్న ప్రశ్నకు ఈఫార్న్ స్పందిస్తూ.. గత కొన్నేళ్లలో చైనా ప్లస్ వన్ విధానం ఫలితమిచ్చినట్టు చెప్పారు. భారత్‌లో వ్యాపారాన్ని ప్రారంభించిన కంపెనీలు దేశీ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకునే ఆ పనిచేస్తున్నట్టు చెప్పారు. "భారత్‌కు వచ్చే చాలా వరకు పెట్టుబడులు యూఎస్‌కు ఎగుమతుల కోసం ఉద్దేశించినవి కావు. దేశీయంగా భారీ డిమాండ్ ఉండడమే కారణం. మధ్యతరగతి వర్గం పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. కనుక భారత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టే కంపెనీలు, ఎగుమతులు చేయాలనుకునే వాటికి యూఎస్ మార్కెట్ ప్రధానంగా ఉండకపోవచ్చు'' అని ఈఫార్న్ వివరించారు. 2021–25 మధ్య భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉండడం గమనార్హం. దేశ మొత్తం ఎగుమతుల్లో 18 శాతం అమెరికాకే వెళ్లాయి. భారత్ దిగుమతుల్లో అమెరికా వాటా 6.22 శాతంగా ఉంది. 2024–25లో ద్వైపాక్షిక వాణిజ్యం 186 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రధానంగా భారత్ 35.32 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులు కలిగి ఉంది.

సెన్సెక్స్ 304 పాయింట్లు ప్లస్

- 132 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- దిగొచ్చిన ద్రవ్యోల్బణ ప్రభావం
- ఆటో, మెటల్, ఫార్మా షేర్లకు డిమాండ్

ముంబై: అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు అంచనాల కంటే తక్కువగా నమోదు, భారత రిటైల్ ద్రవ్యోల్బణం ఎనిమిదేళ్ల కనిష్టానికి దిగిరావడంతో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్ లాభాలతో ముగిసింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ర్యాలీ సెంటిమెంట్‌ను మరింత బలపరిచింది. సెన్సెక్స్ 304 పాయింట్లు పెరిగి 80,540 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 132 పాయింట్లు బలపడి 24,619 వద్ద ముగిసింది. ఒక దశలో సెన్సెక్స్ 448 పాయింట్లు పెరిగి 80,684 వద్ద, నిఫ్టీ 178 పాయింట్లు ఎగసి 24,665 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 16 పైసలు బలపడి 87.47 వద్ద ముగిసింది. అమెరికా ద్రవ్యోల్బణం తగ్గడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు 86% నుంచి 94 శాతానికి పెరిగాయి. దీంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- బీఎస్ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో ఫార్మా 2%, మెటల్ 1.22%, ఆటో, కన్జూమర్ డిస్క్రెషనరీ, ఇండస్ట్రియల్స్ 1% పెరిగాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం లాభపడ్డాయి.
- ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్‌గా ఆర్‌బీఐ అనుమతులు దక్కించుకోవడంతో పేటీఎం పే మెంట్స్ సర్వీసెస్ షేరు 3% లాభపడి రూ. 1,154 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 6% ఎగసింది.

3 లక్షల కోట్లిస్తాం...



క్రోమ్ బ్రౌజర్ అమ్ముతారా!
- గూగుల్‌కు పర్‌ప్లెక్సిటీ ఆఫర్


న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెర్చ్ స్టార్టప్ పర్‌ప్లెక్సిటీ తాజాగా టెక్నాలజీ ప్రపంచంలో సంచలనానికి తెరతీసింది. టెక్ దిగ్గజం గూగుల్‌కి చెందిన క్రోమ్ బ్రౌజర్‌ని కొనుగోలు చేస్తానంటూ 34.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3 లక్షల కోట్లు))ఆఫర్ ఇచ్చింది. పర్‌ప్లెక్సిటీ వేల్యుయేషన్‌కి ఇది దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. అరవింద్ శ్రీనివాస్ సారథ్యంలోని కంపెనీ ఇప్పటివరకు ఎన్విడియా, సాఫ్ట్‌బ్యాంక్‌లాంటి ఇన్వెస్టర్ల నుంచి 1 బిలియన్ డాలర్లు సమీకరించింది. దీని ప్రకారం సంస్థ వేల్యుయేషన్ సుమారు 18 బిలియన్ డాలర్లుగా ఉంది. పలు బడా ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ ఈ లావాదేవీ కోసం నిధులను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు పర్‌ప్లెక్సిటీ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా గూగుల్ క్రోమ్ యూజర్ల సంఖ్య దాదాపు మూడు వందల కోట్లుగా ఉంటుంది. ఇంటర్నెట్ సెర్చ్ విభాగంలో గూగుల్ గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందని, దీనికి పరిష్కారంగా క్రోమ్‌ను విక్రయించాలంటూ అమెరికా కోర్టు ఉత్తర్వులిచ్చిన తరుణంలో పర్‌ప్లెక్సిటీ ఆఫర్ ప్రాధాన్యం సంతరించుకుంది.

వెనక్కి తగ్గిన ఐసీఐసీఐ బ్యాంక్

పెంచిన కనీస బ్యాలన్స్‌లు తగ్గింపు



న్యూఢిల్లీ: కొత్త సేవింగ్స్ ఖాతాలకు సంబంధించి కనీస బ్యాలన్స్‌లను గణనీయంగా పెంచిన ఐసీఐసీఐ బ్యాంక్ కాస్తంత వెనక్కి తగ్గింది. కస్టమర్ల నుంచి వచ్చిన సూచనలకు అనుగుణంగా ఆగస్ట్ 1 నుంచి తెరిచే కొత్త సేవింగ్స్ బ్యాంక్ ఖాతాల్లో కనీస బ్యాలన్స్‌లను తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. మెట్రోలు, పెద్ద పట్టణ ప్రాంతాల్లో (అర్బన్) రూ.50,000 బ్యాలన్స్‌ను రూ.15,000కు తగ్గించింది. చిన్న పట్టణాల్లో (సెమీ అర్బన్) బ్యాలన్స్‌ను రూ.25,000 నుంచి రూ.7,500కు తగ్గించింది. గ్రామీణ శాఖల్లో కనీస బ్యాలన్స్‌ను రూ.10,000 నుంచి రూ.2,500కు తగ్గించింది. వాస్తవానికి ఆగస్ట్ 1కి ముందు ప్రారంభించిన ఖాతాలకు మెట్రోలు, అర్బన్ శాఖల్లో రూ.10,000, సెమీ అర్బన్ శాఖల్లో రూ.5,000, గ్రామీణ శాఖల్లో రూ.2,500 చొప్పున కనీస బ్యాలన్స్ నిబంధన ఉండడం గమనార్హం.



ఓఎన్‌జీసీ లాభం క్షీణత

క్యూ1లో రూ. 8,024 కోట్లు

న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 10 శాతం క్షీణించి రూ. 8,024 కోట్లకు పరిమితమైంది. చమురు ధరలు బలహీనపడటం, పురాతన క్షేత్రాల నుంచి ఉత్పత్తి మందగించడం ప్రభావం చూపాయి. గతేడాది (2024–25) ఇదే కాలంలో రూ. 8,938 కోట్లు ఆర్జించింది. ఈ కాలంలో ముడిచమురు బ్యారల్‌కు 67.87 డాలర్లు మాత్రమే లభించగా.. గత క్యూ1లో 80.64 డాలర్లు ఆర్జించింది. గ్యాస్‌కు మాత్రం ఒక్కో ఎంబీటీయూకి 6.64 డాలర్లు అందుకుంది. గత క్యూ1లో ఇది 6.5 డాలర్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో ఓఎన్‌జీసీ షేరు 1.5% పుంజుకుని రూ. 239 వద్ద ముగిసింది.

కపిల్ వాధ్వాన్, ధీరజ్ వాధ్వాన్‌పై

సెబీ వేటు

- ఐదేళ్ల పాటు నిషేధం
- మరో నలుగురిపైనా ఇదే చర్య
- రూ.120 కోట్ల పెనాల్టీ



న్యూఢిల్లీ: కంపెనీ ఖాతాలను వండి వార్చడం, నిధుల మళ్లింపు చర్యలకు పాల్పడిన దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ (డీహెచ్‌ఎఫ్‌ఎల్) మాజీ సీఎండీ కపిల్ వాధ్వాన్, మాజీ డైరెక్టర్ ధీరజ్ వాధ్వాన్, మరో నలుగురిపై సెబీ కఠిన చర్యలకు దిగింది. ఐదేళ్ల పాటు సెక్యూరిటీల మార్కెట్లలోకి ప్రవేశించకుండా వీరిపై నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించింది. లిస్టెడ్ కంపెనీల్లో ఎలాంటి పదవులూ చేపట్టకుండా నిషేధించింది. అలాగే రూ.120 కోట్ల పెనాల్టీని విధించింది. కపిల్, ధీరజ్‌తోపాటు డీహెచ్‌ఎఫ్‌ఎల్ మాజీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాకేశ్ వాధ్వాన్, మాజీ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సారంగ్ వాధ్వాన్, మాజీ జాయింట్ ఎండీ, సీఈవో హర్షిల్ మెహతా, మాజీ సీఎఫ్‌వో సంతోష్ శర్మపై ఈ చర్యలు ప్రకటించింది. 181 పేజీలతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. 2006 నుంచి డీహెచ్‌ఎఫ్‌ఎల్ ప్రమోటర్లు, డైరెక్టర్లు, కీలక పదవుల్లో ఉన్న వారు మోసపూరితంగా కంపెనీ నిధులను ప్రమోటర్లకు చెందిన 'బాంద్రా బుక్ ఎంటిటీస్'(బీబీఈలు)కు బదిలీ చేసినట్టు.. 2019 మార్చి 31 నాటికి బీబీఈలకు డీహెచ్‌ఎఫ్‌ఎల్ మంజూరు చేసిన రుణాలు రూ.14,040 కోట్లకు చేరినట్టు సెబీ తేల్చింది. ఎలాంటి వ్యాపారం, ఆస్తుల్లేని ప్రమోటర్ల సంస్థలకు పెద్ద ఎత్తున అన్‌సెక్యూర్డ్ రుణాలను మంజూరు చేశారని.. ఇందుకు ఎలాంటి ముందస్తు మదింపు విధానాలను అనుసరించలేదని గుర్తించింది. పైగా వీటిని రిలేటెడ్ పార్టీ లావాదేవీలుగా కాకుండా రిటైల్ హౌసింగ్ రుణాలుగా పేర్కొన్నట్టు తేలింది. ఆయా సంస్థలు (బీఈఈలు) రుణాలపై వడ్డీ చెల్లించకపోయినప్పటికీ.. కల్పిత వడ్డీ ఆదాయాన్ని చూపిస్తూ 2007–08 నుంచి 2015–16 మధ్య కాలంలో నష్టాలకు బదులు లాభాలు పెరుగుతున్నట్టు చూపించారని సెబీ తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. 39 బీఈఈలకు ఇచ్చిన రూ.5,662 కోట్ల రుణాల్లో.. 40 శాతాన్ని ప్రమోటర్లకు చెందిన సంస్థలకు తిరిగి మళ్లించినట్టు తేల్చింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
భారత మార్కెట్‌పై అమెజాన్ మరింత ఫోకస్ | విక్రమ్ సోలార్ @ రూ. 315-332

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-బ్యాంకింగ్ అవేర్‌నెస్

విద్య, ఉద్యోగ సమాచారం

హిల్ ఇండియా లిమిటెడ్, న్యూఢిల్లీలో 11 ఉద్యోగాలు

ఢిల్లీలోని హిందూస్థాన్ ఇన్‌సెక్టిసైడ్స్ లిమిటెడ్ రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మార్కెటింగ్ మేనేజర్-02, అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్-02, మార్కెటింగ్ ఆఫీసర్-03, అసిస్టెంట్ మేనేజర్-04.
» **విభాగాలు:** మార్కెటింగ్, ఫైనాన్స్, హెచ్ఆర్ అండ్ అడ్మిన్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, సీఏ, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** డిప్యూటీ మార్కెటింగ్ మేనేజర్‌కు 42 ఏళ్లు, అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌కు 40 ఏళ్లు, మార్కెటింగ్ ఆఫీసర్‌కు 32 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు డిప్యూటీ మార్కెటింగ్ మేనేజర్‌కు రూ.24,900 నుంచి రూ.50,500, అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.20,600 నుంచి రూ.46,600, మార్కెటింగ్ ఆఫీసర్‌కు రూ.16,400 నుంచి రూ.40,500.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష లేదా ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అడిషనల్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్ అండ్ అడ్మిన్), హిల్ ఇండియా లిమిటెడ్, స్కోప్ కాంప్లెక్స్, కోర్-6, రెండో అంతస్తు, 7, లోధి రోడ్, న్యూఢిల్లీ-110003 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 12.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.hil.gov.in

హిల్ ఇండియా లిమిటెడ్, ఢిల్లీలో 13 పోస్టులు

ఢిల్లీలోని హిందుస్థాన్ ఇన్‌సెక్టిసైడ్స్ లిమిటెడ్ (హెచ్ఐఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.
» **పోస్టుల వివరాలు:** జనరల్ మేనేజర్-01, అడిషనల్ జనరల్ మేనేజర్-01, మేనేజర్-10, మైక్రోబయాలజిస్ట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, సీఏ, పీజీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** జనరల్ మేనేజర్‌కు 52 ఏళ్లు, అడిషనల్ జనరల్ మేనేజర్‌కు 50 ఏళ్లు, మేనేజర్, మైక్రోబయాలజిస్ట్‌కు 40 ఏళ్లు.
» **వేతనం:** నెలకు జనరల్ మేనేజర్‌కు రూ.36,600 నుంచి రూ.62,000, అడిషనల్ జనరల్ మేనేజర్‌కు రూ.32,900 నుంచి రూ.58,000, మేనేజర్‌కు రూ.20,600 నుంచి రూ.46,500, మైక్రో బయాలజిస్ట్‌కు రూ.24,900 నుంచి రూ.50,500.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అడిషనల్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్ అండ్ అడ్మిన్), హిల్ ఇండియా లిమిటెడ్, స్కోప్ కాంప్లెక్స్, కోర్-6, రెండో అంతస్తు, 7, లోధి రోడ్, న్యూఢిల్లీ-110003 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.08.2025.
» **వెబ్‌సైట్:** www.hil.gov.in

సీఎస్ఐఆర్-ఐఐసీబీ, కోల్‌కతాలో జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టులు

కోల్‌కతాలోని సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ బయాలజీ(ఐఐసీబీ) జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్-జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్-06, జూనియర్ స్టెనోగ్రాఫర్-02.
» **అర్హత:** 10+2/ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» **వయసు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు, జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు 27 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** స్కిల్ టెస్ట్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.08.2025.
» **వెబ్‌సైట్:** https://iicb.res.in

హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, హౌరాలో అప్రెంటిస్‌లు

హౌరా(కొలకత్తా)లోని హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో గ్రాడ్యుయేట్, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 05.

ఖాళీల వివరాలు

» **గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు:** మెకానికల్-01, ఎలక్ట్రికల్-01.
» **టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌లు:** మెకానికల్-02, ఎలక్ట్రికల్-01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 26.08.2025 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.12,000, టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు రూ.10,200.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.08.2025.
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

క్లాట్-2026

దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో యూజీ, పీజీ లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్)-2026 నోటిఫికేషన్ విడుదలైంది.

» **కోర్సుల వివరాలు:** అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా డిగ్రీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు(ఏడాది ఎల్ఎల్ఎం డిగ్రీ).
» **అర్హత:** యూజీ కోర్సులకు కనీసం 45 శాతం మార్కులతో 10+2 లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి. పీజీ కోర్సులకు కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు ఫీజు:** ఇతరులకు రూ.4000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, బీపీఎల్ అభ్యర్థులకు రూ.3,500.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2025.
» **క్లాట్-2026 పరీక్ష(ఆఫ్‌లైన్) తేది:** 07.12.2025.
» **వెబ్‌సైట్:** https://consortiumofnlus.ac.in/clat-2026

ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు మరో భారీ నోటిఫికేషన్‌తో ముందుకొచ్చింది. ఆరు వేలకుపైగా జూనియర్ అసోసియేట్ (క్లరికల్ కేడర్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏదైనా డిగ్రీతో ఈ పోస్టులకు పోటీపడొచ్చు. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది. ఎంపిక ప్రక్రియలో విజేతలుగా నిలిస్తే ప్రారంభంలోనే నెలకు రూ.46వేల వేతనంతో బ్యాంకింగ్ రంగంలో సుస్థిర కొలువు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్ కొలువులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ,పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» మొత్తం 6,589 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పోటీపడొచ్చు
» ప్రారంభంలోనే నెలకు రూ.46వేలు వేతనం

- పోస్టు పేరు: జూనియర్ అసోసియేట్(కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్).
- మొత్తం పోస్టుల సంఖ్య: 6,589(రెగ్యులర్ ఖాళీలు-5,180; బ్యాక్‌లాగ్ ఖాళీలు-1409).
- తెలుగు రాష్ట్రాల్లోని ఆంధ్రప్రదేశ్‌లో 310ఖాళీలు, తెలంగాణలో 250 ఖాళీలు ఉన్నాయి.

అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. అర్హత కోర్సు ఫైనల్ ఇయర్/ఫైనల్ సెమిస్టర్‌లో ఉన్న విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. అయితే వీరు 31.12.2025నాటికి ముందు తమ గ్రాడ్యుయేషన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి.

వయసు

01.04.2025 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్యలో వయసు కలిగి ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

స్థానిక భాష

అభ్యర్థులు ఏదైనా ఒక రాష్ట్రం/యూటీ(కేంద్ర పాలిత ప్రాంత)కి మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. సదరు రాష్ట్రం/యూటీకి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు స్థానిక భాషలో రాయడం, చదవడం, మాట్లాడటం, అవగాహన చేసుకోవడం వచ్చి ఉండాలి.

వేతనం

నెలకు వేతన శ్రేణి రూ.24,050-రూ.64,480 లభిస్తుంది. అలవెన్సులు అన్నీ కలుపుకొని ముంబయి వంటి మెట్రో నగరాల్లో ప్రారంభంలోనే నెలకు రూ.46వేల వేతనం అందుకునే అవకాశం ఉంది.

ఎంపిక ప్రక్రియ

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలుత ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష ఉంటుంది. ప్రిలిమ్స్‌లో ప్రతిభ చూపిన వారికి రెండో దశలో ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. మెయిన్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది.

వంద మార్కులకు ప్రిలిమ్స్

తొలి దశలో ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో మూడు విభాగాల నుంచి ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ (ఎంసీక్యూ) ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో 30 ప్రశ్నలు-30 మార్కులకు, న్యూమరికల్ ఎబిలిటీ విభాగంలో 35 ప్రశ్నలు-35 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులకు అడుగుతారు. ఇలా మొత్తం 100 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి ప్రతి విభాగానికి 20 నిమిషాల చొప్పున మొత్తం 60 నిమిషాలు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కు తగ్గిస్తారు. విభాగాల వారీగా కనీస అర్హత మార్కులను పేర్కొనలేదు. మొత్తంగా మూడు సెక్షన్‌లలో సాధించిన స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

200 మార్కులకు మెయిన్

ప్రిలిమ్స్‌లో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు పది మందిని చొప్పున మెయిన్‌కు ఎంపిక చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఆన్‌లైన్ మెయిన్ పరీక్షలో ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఇందులో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్‌పై 50 ప్రశ్నలు-50 మార్కులకు, జనరల్ ఇంగ్లిష్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-60 మార్కులకు ఉంటాయి. ఇలా మొత్తం 190 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి 2 గంటల 40 నిమిషాలు. ప్రతి విభాగానికి ప్రత్యేక సమయ నిబంధన ఉంది.

ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కును తగ్గిస్తారు. విభాగాల వారీగా కనీస అర్హత మార్కుల నిబంధన లేదు. కాని బ్యాంక్ నిర్ణయించిన మేరకు అన్ని విభాగాల్లో కలిపి కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

స్థానిక భాష పరీక్ష

మెయిన్ పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు చివరగా లోకల్ లాంగ్వేజ్ టెస్ట్ ఉంటుంది. అయితే పదో తరగతి, ఇంటర్‌లో స్థానిక భాషను చదివినట్లు ధ్రువపత్రాన్ని సమర్పించిన వారికి ఈ పరీక్ష నుంచి మినహాయింపు లభిస్తుంది.



సిలబస్-ప్రిపరేషన్

- ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ ఉండే విభాగం ఇంగ్లిష్. ఇందులో అధిక స్కోర్‌కు అవకాశం ఉంటుంది. ఇంగ్లిష్ విభాగంలో రాణించేందుకు గ్రామర్‌తోపాటు వొకాబ్యులరీపై పట్టు సాధించాలి. గత ప్రశ్నలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయడం కలిసొస్తుంది.
- మెయిన్ పరీక్షలో 50 మార్కులకు ఉండే జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్‌లో రాణించేందుకు గత ఆరు నెలల జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి. భారత ఆర్థిక వ్యవస్థ,ఆర్‌బీఐ విధానాలు, పాలసీ రేట్లు, బ్యాంకింగ్ రంగంలో తాజా పరిణామాలు, తాజా బడ్జెట్ ముఖ్యాంశాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలతోపాటు జనరల్ నాలెడ్జ్‌పై పట్టు సాధించాలి.
- న్యూమరికల్ ఎబిలిటీ/క్వాంటిటేటివ్ ఎబిలిటీలో స్కోర్ కోసం అర్థమెటిక్, నంబర్ సిరీస్, ఈక్వేషన్స్,సింప్లిఫికేషన్స్,డేటా ఇంటర్‌ప్రిటేషన్ పై అవగాహన పెంచుకోవాలి. గత ప్రశ్న పత్రాల సాధనతోపాటు మోడల్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.
- రీజనింగ్ ఎబిలిటీలో స్కోర్ కోసం కోడింగ్-డీకోడింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్, పజిల్స్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ఇనిక్వాలిటీస్, డేటా సఫీసియన్సీ తదితర అంశాలపై పట్టు సాధించాలి.
- కంప్యూటర్ అప్టిట్యూడ్ కోసం బేసిక్ కంప్యూటర్ ఆపరేషన్స్ తెలుసుండాలి. ఆపరేటింగ్ సిస్టమ్స్, కంప్యూటర్ లాంగ్వేజెస్, ఈ రంగంలో తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 06.08.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 26.08.2025
- ప్రిలిమినరీ పరీక్ష తేది: సెప్టెంబర్ 2025
- మెయిన్ పరీక్ష తేది: నవంబర్ 2025
- వెబ్‌సైట్: https://bank.sbi/web/careers/current-openings, https://sbi.co.in/web/careers/current-openings.



సింగిల్ చార్జింగ్‌తో గిన్నిస్‌లోకి దూసుకెళ్లింది..

ఈవీలు ఈ మధ్య బాగా పాపులర్ అవుతున్నాయి. నిజానికి ఒక ఎలక్ట్రిక్ కారు సింగిల్ చార్జింగ్‌తో ఎంత దూరం వెళ్తుంది? పోల్‌స్టార్ 3 (స్వీడన్) అనే ఈ కారు మాత్రం బ్రిటన్ రోడ్లపై ఏకంగా 935.5 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. తద్వారా గిన్నిస్ బుక్‌లోకి ఎక్కింది. ఒక ఎలక్ట్రిక్ కారు సింగిల్ చార్జింగ్‌తో ఇంత దూరం వెళ్లడం ఇదే మొదటిసారి. గతంలో ఈ రికార్డు ఫోర్డ్ మస్టాంగ్ మాక్‌–ఈ వాహనం పేరిట ఉండేది. ఆ వాహనం సింగిల్ చార్జింగ్‌తో 916.7 కిలోమీటర్లు ప్రయాణించింది. పోల్‌స్టార్‌–3 కారు ధర రూ.83 లక్షలు.


గాలం వేసి.. వల విసిరి



అధికారిక కార్యక్రమాలు.. సమావేశాలతో ఎప్పుడూ హడావుడిగా ఉండే మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఆటవిడుపుగా చేపలు పడుతూ కాసేపు సరదాగా గడిపారు. నాగర్‌కర్నూల్‌లో బుధవారం ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన మంత్రి తిరిగి వెళ్తుండగా.. పురపాలిక పరిధిలోని కేసముద్రం వద్ద కొంతమంది యువకులు చేపలు పడుతుండటం చూసి అక్కడ ఆగారు. మంత్రి సైతం గాలంతోపాటు వల విసిరి చేపలు పట్టే ప్రయత్నం చేశారు. ఆపై చెరువు కట్టపై చేపలు విక్రయిస్తున్న వ్యాపారులను కలిసి.. వారి జీవనోపాధి, చేపల ధరలు, మార్కెట్‌లో డిమాండ్‌పై ఆరా తీశారు. – నాగర్‌కర్నూల్

ఎందుకంత దూకుడు?

- హైడ్రా తీరుపై మరోసారి హైకోర్టు ఆగ్రహం
- మీరేమైనా యుద్ధానికి వెళ్తున్నారా?.. వాహనాలకు ఆ రంగులేంటి?
- తీరు మార్చుకోకుంటే కఠిన నిర్ణయాలు



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ సర్వే నంబర్ 37, 38/1లో 1.07 ఎకరాల భూమిపై ఎందుకంత దూకుడుగా వెళ్తున్నారని హైడ్రా (హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తి సంరక్షణ విభాగం) కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు స్టేటస్‌కో ఆదేశాలు పాటించాలని చెప్పినా వినకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని, కొందరు దీన్ని వాడుకుని ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని పేర్కొంది. చెరువులు, ప్రభుత్వ భూముల రక్షణ పేరుతో ప్రజలను అవస్థలకు గురిచేయడం, హడావుడి చేయడం ఎందుకని ప్రశ్నించింది. సరిహద్దుల్లో యుద్ధానికి వెళ్తున్నట్లు వాహనాలకు ఆ రంగులేంటని అడిగింది. ఇలానే చట్టవిరుద్ధంగా, కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తే కోర్టుకు రప్పించి.. కఠిన శిక్షలు విధించడానికి వెనుకాడబోమని తేల్చిచెప్పింది. తన భూమిలో హైడ్రా చట్టవిరుద్ధంగా జోక్యం చేసుకుంటోందంటూ జూబ్లీహిల్స్‌కు చెందిన ఎస్.వెంకటేశ్వర్‌రావు ఏప్రిల్ 23న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే అంశంపై మరో ఇద్దరు పిటిషన్లు వేశారు. మొత్తంగా 6 ఎకరాల భూమి తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉందంటూ హైడ్రా ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు.

ఎఫ్‌టీఎల్ నిర్ధారించారా?

హైకోర్టు ఏప్రిల్ 23న ఇచ్చిన స్టేటస్‌కో ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ హైడ్రా తమ భూమిలో జోక్యం చేసుకునేందుకు యత్నిస్తోందని జూన్ 11న వెంకటేశ్వర్‌రావుతోపాటు మరో ఇద్దరు ధిక్కరణ పిటిషన్లు వేశారు. వీటిపై బుధవారం జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది తరుణ్ జి.రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కోర్టు స్టేటస్‌కో ఆదేశాలు ఇచ్చినా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ లెక్కచేయలేదని, తమ్మిడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ను నిర్ధారించకుండానే దూకుడుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. హైడ్రా కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సిన అధికారులు.. హడావుడి నిర్ణయాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తాము నిలుపుదల ఆదేశాలు ఇవ్వని చెరువులున్న ప్రాంతాల్లో మునకపై ఏ చర్యలు తీసుకున్నారని, ఎఫ్‌టీఎల్‌పై ఇప్పటివరకు విధానపరమైన నిర్ణయం తీసుకున్నారా అని నిలదీశారు. అనంతరం విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

అలంపూర్ అర్చకుల సస్పెన్షన్.. ఈవో బదిలీ

అలంపూర్: అయిదో శక్తి పీఠం, అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ఈవోను బదిలీ చేయడంతో పాటు ముగ్గురు అర్చకులను సస్పెండ్ చేశారు. వివరాలివి. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాలో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమానికి జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయానికి చెందిన అర్చకులు విక్రాంత్ శర్మ, వెంకట కృష్ణ, కృష్ణమూర్తి హాజరయ్యారు. దేవదాయ ధర్మాదాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా వారు ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయ ఈవో పురేందర్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. బుధవారం ఆ ముగ్గురు అర్చకులను సస్పెండ్ చేశారు. ఆలయ ఈవో పురేందర్‌కుమార్‌ను గద్వాల జిల్లా కేంద్రంలోని జమ్మిచేడు శ్రీజములమ్మ ఆలయ ఈవోగా బదిలీ చేస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపురం ఆలయ ఈవో దీప్తికి.. అలంపూర్ ఆలయాల ఈవో బాధ్యతలు అప్పగించారు.

100 మంది విద్యార్థులకు ఉచిత ఇంజనీరింగ్ విద్య

సొంత నిధులతో అందిస్తానన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



స్టేషన్ మహబూబ్‌నగర్: తన సొంత నిధులతో 100 మంది పేద విద్యార్థులకు ఉచిత ఇంజనీరింగ్ విద్యను అందిస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చదువుకోవాలనే ఆసక్తి ఉండి, స్తోమత లేని 100 మంది నిరుపేద విద్యార్థులకు (బీపీఎల్) మహబూబ్‌నగర్‌లోని జీకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. దరఖాస్తును మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లేదా బీఎన్‌రెడ్డి కాలనీలోని ఫస్ట్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

భారత్‌లో ఏఐ రంగంలో ప్రభావశీల వ్యక్తుల్లో శ్రీధర్‌బాబు

మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ జాబితాలో చోటు



సాక్షి, హైదరాబాద్: అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ తాజాగా ప్రకటించిన 'ఇండియాస్ 100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ 2025' జాబితాలో ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు చోటు దక్కింది. ఆయన నాయకత్వంలో ఏఐ రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారినందున శ్రీధర్‌బాబును ఈ జాబితాలో చేర్చినట్లు అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ నిర్వాహకులు ప్రకటించారు. 'బాధ్యతాయుతమైన ఏఐ అమలుకు సమగ్ర ఏఐ ఆధారిత తెలంగాణ స్ట్రాటజీ అండ్ రోడ్ మ్యాప్ రూపకల్పనలో శ్రీధర్‌బాబు కీలకంగా వ్యవహరించారు. దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్‌ను ప్రారంభించేందుకు చొరవ చూపారు' అని కొనియాడారు. దీనిపై శ్రీధర్‌బాబు స్పందిస్తూ సమ్మిళిత వృద్ధి, మెరుగైన జీవితాలను అందించేందుకు ఏఐని వినియోగించాలన్న తమ ప్రభుత్వ సుదూర దృష్టికి ఈ గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విభాగంలో శ్రీధర్‌బాబుతో పాటు కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, పీయూష్ గోయల్, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఇండియా ఏఐ మిషన్ సలహాదారు ఆకృత్ వైష్, ఇండియా ఏఐ మిషన్ సీఈవో, ఎన్ఐసీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఎన్ పీసీఐ సీఈవో దిలీప్ అస్బే, నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్, నాస్కామ్ మాజీ అధ్యక్షుడు దేబయాని ఘోష్ తదితర ప్రముఖులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

'సెమీకండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో వివక్ష'

సాక్షి, హైదరాబాద్: పారిశ్రామిక అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం రాజకీయ అక్కసుతో అన్యాయం చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సెమీకండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో వివక్ష చూపించి తెలంగాణపై సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం శ్రీధర్‌బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ప్రపంచ స్థాయి అధునాతన సిస్టమ్, ప్యాకేజింగ్ ఫెసిలిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. మహేశ్వరంలో 10 ఎకరాల భూమి కేటాయించి అన్ని రకాల సబ్సిడీలకు ఆమోదం తెలిపాం.అన్ని రకాల అనుమతులిచ్చాం. ఇండియా సెమీకండక్టర్ మిషన్ తుది ఆమోదం లభిస్తే పనులు ప్రారంభించేందుకు పెట్టుబడిదారులు సిద్ధంగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు' అని శ్రీధర్‌బాబు తెలిపారు. అన్ని రకాల అర్హతలున్నా తెలంగాణను విస్మరించి కనీస సంసిద్ధత లేని ఏపీకి ప్రాజెక్టును ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణకు న్యాయం జరిగేలా చొరవ చూపాలి అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

వాహనాలపై లైఫ్‌ట్యాక్స్ శ్లాబుల వివరాలు ఇలా..

ద్విచక్రవాహనాలు (జీవిత పన్ను శాతాల్లో)

పీరియడ్/ వాహన కేటగిరీ	వాహన విలువ: రూ.50 వేల లోపు	రూ.50వేలు -రూ.లక్ష	రూ.1లక్ష- 2 లక్షలు	రూ 2లక్షల పైబడి -
కొత్త వాహనం	9	12	15	18
పాత వాహనాలైతే...				
2 సం.లోపు	8	11	14	17
2సం.-3 సం.లోపు	7	10	13	16
3 సం.-4 సం.	6	9	12	15
4 సం.-5 సం.	5	8	11	14
5 సం.-6 సం.	4	7	10	13
6సం.- 7 సం.	3.5	6.5	9.5	12.5
7 సం.-8 సం.	3	6	9	12
8సం.-9 సం.	2.5	5.5	8.5	11.5
9సం.-10సం.	2	5	8	11
10సం.-11సం.	1.5	4.4	7.5	10.5
11సం.కుపైబడి	1	4	7	10

ఆటోలు, కార్లు, జీపులు, మోటర్ క్యాబ్స్, ఓమ్ని బస్ (10 మంది ప్రయాణికుల సామర్థ్యం)

పీరియడ్/ వాహన కేటగిరీ	వాహన విలువ: రూ.5 లక్షల లోపు	రూ.5 లక్షలు -రూ.10 లక్షలు	రూ.10 లక్షలు - రూ.20 లక్షలు	రూ 20లక్షలు- రూ.50 లక్షలు	రూ.50 లక్షల పైబడి -
కొత్త వాహనం	13	14	18	20	21
పాత వాహనాలైతే...					
2 సం.లోపు	12	13	17	19	20
2సం.-3 సం.లోపు	11.5	12.5	16.5	18.5	19.5
3 సం.-4 సం.	11	12	16	18	19
4 సం.-5 సం.	10.5	11.5	15.5	17.5	18.5
5 సం.-6 సం.	10	11	15	17	18
6సం.- 7 సం.	9.5	10.5	14.5	16.5	17.5
7 సం.-8 సం.	9	10	14	16	17
8సం.-9 సం.	8.5	9.5	13.5	15.5	16.5
9సం.-10సం.	8	9	13	15	16
10సం.-11సం.	7.5	8.5	12.5	14.5	15.5
11సం -12సం.	7	8	12	14	15
12సం.పైబడి	6.5	7.5	11.5	13.5	14.5

నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు పది మంది ప్రయాణికుల సామర్థ్యం...

పీరియడ్/ వాహన కేటగిరీ	వాహన విలువ: రూ.5 లక్షల లోపు	రూ.5 లక్షలు -రూ.10 లక్షలు	రూ.10 లక్షలు- రూ.20 లక్షలు	రూ 20లక్షలు- రూ.50 లక్షలు	రూ.50 లక్షల పైబడి -
కొత్త వాహనం	15	16	20	22	25
పాత వాహనాలైతే...					
2 సం.లోపు	14	15	19	21	24
2సం.-3 సం.లోపు	13.5	14.5	18.5	20.5	23.5
3 సం.-4 సం.	13	14	18	20	23
4 సం.-5 సం.	12.5	13.5	17.5	19.5	22.5
5 సం.-6 సం.	12	13	17	19	22
6సం.- 7 సం.	11.5	12.5	16.5	18.5	21.5
7 సం.-8 సం.	11	12	16	18	21
8సం.-9 సం.	10.5	11.5	15.5	17.5	20.5
9సం.-10సం.	10	11	15	17	20
10సం.-11సం.	9.5	10.5	14.5	16.5	19.5
11సం -12సం.	9	10	14	16	19
12సం.పైబడి	8.5	9.5	13.5	15.5	18.5

ఫ్యాన్సీ నంబర్ల ధరల పెంపు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇలా..

నంబర్	ఫీజు
9999	రూ.లక్షన్నర
1, 9, 6666	రూ.లక్ష
99, 999, 3333, 4444, 5555, 7777	రూ.50 వేలు
5, 6, 7, 123, 333, 369, 555.666, 777, 1111, 1116, 1234, 2222, 2277, 2345, 2727, 3339, 33336, 3456, 3699, 4455, 4545, 4599, 6669, 6789, 8055, 8888	రూ.40 వేలు
3, 111, 234,567, 1188, 1818, 1899, 1999, 2799, 3636, 3999, 5678, 5999, 6999, 7999, 9009	రూ.30వేలు
2,4,8,11,18,27,36,39,45,55,77,143, 222,405,444, 456, 459,786,789,909, 1112,1122,1212,1233,1269, 1314, 1359,1889,2223,2255,2259,2349, 2525,3335, 3344, 3399, 3555,3789, 3888,3969,4446, 4554, 4567, 4777, 4959, 5445, 5559,5589,5599,5666, 5679, 5859, 6336, 6699,6777,6786, 6969,7779,7799,7979,8889,8899, 8999, 9099	రూ.20 వేలు



విజయవాడలో జరిగిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మేనల్లుడు పవన్ రాజ్, సాయి శ్రుతి వివాహ వేడుకకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు హాజరయ్యారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

మనసు దోచే మయూరి గార్డెన్

- సర్వ హంగులతో ఎకో అర్బన్ పార్క్
- వన ప్రేమికులకు స్వర్గధామం
- సాహస కృత్యాలకు వేదిక.. వారాంతంలో సందడి
- ప్రకృతి అందాలు తిలకించేలా వ్యూ పాయింట్లు
- ఫొటో షూట్‌లకు భలే క్రేజీ
- ఆకట్టుకుంటున్న జంగిల్ సఫారీ
- కర్ణాటక, ఏపీ నుంచి పర్యాటకుల తాకిడి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: పర్యాటక పరంగా మహబూబ్‌నగర్ జిల్లా దూసుకెళ్తోంది. మయూరి నర్సరీ నుంచి మయూరి ఎకో అర్బన్ పార్క్‌గా రూపాంతరం చెందిన మహా వనమే ఇందుకు నిదర్శనం. 2,087 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనాన్ని పరుచుకుని ఆహ్లాదం పంచుతోంది. చిన్నపిల్లల నుంచి మహిళలు, పురుషులు తేడా లేకుండా వృద్ధులు.. ఇలా అన్నివర్గాల వారికి వినోదం, విజ్ఞానం, ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. సాహస క్రీడలకు వేదికగా పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పట్టణ ప్రాంతంలో అద్భుతమైన పిక్నిక్ స్పాట్‌గా విరాజిల్లుతున్న సహజసిద్ధ వనక్షేత్రంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అప్పనపల్లి సమీపంలో మయూరి ఎకో అర్బన్ పార్క్‌కు 2015 జూన్ 3న శంకుస్థాపన చేశారు. 2017 ఏప్రిల్ 17న ప్రారంభించిన ఈ పార్క్ పర్యాటకులతో నిత్యం సందడి చేస్తోంది. సెలవు, వారాంతపు రోజుల్లో మరీ ఎక్కువగా పర్యాటకుల తాకిడితో కళకళలాడుతోంది. రాష్ట్రంలోని పెద్ద నగరాలతో పాటు కర్ణాటక, ఏపీ నుంచి పర్యాటకులు.. మయూరి అర్బన్ ఎకో పార్కును సందర్శిస్తూ ఆహ్లాదాన్ని పొందుతున్నారు.
- పర్యాటకులు సేదదీరేందుకు ఏర్పాటు చేసిన పచ్చదనం .. తివాచీని తలపిస్తూ సందర్శకులను ఆకట్టుకుంటోంది. కుటుంబ సమేతంగా వచ్చే పర్యాటకులు గార్డెన్‌లో కూర్చొని సేదదీరుతున్నారు. యోగా చేసుకునే వారికి పార్క్‌లో ప్రత్యేక షెడ్డును ఏర్పాటు చేశారు. రోజూ ఇక్కడికి వందలాది మంది వచ్చి యోగ సాధన చేసుకునేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పార్క్‌లో చిన్నారులు, పెద్దలకు ప్రత్యేకంగా ఓపెన్ ఎయిర్ జిమ్ ఏర్పాటు చేశారు. వివిధ రకాల వ్యాయామాలకు ఆరు పరికరాలను సమకూర్చారు. వెయిస్ట్ టర్న్ ట్విస్టర్, సిట్ అప్ బెంచ్, రోవర్, బాక్ పుల్ డౌన్, రైడర్, హెల్త్ వాకర్ ఉన్నాయి.

పార్క్‌కు శంకుస్థాపన	2015 జూన్ 3
ప్రారంభోత్సవం	2017 ఏప్రిల్ 17
పార్క్ విస్తీర్ణం	2,087 ఎకరాలు
ప్రవేశ రుసుం (పెద్దలకు)	రూ.40
పిల్లలకు..	రూ.20



సీతాకోకచిలుకల గార్డెన్

ప్రవేశద్వారం ఎదుట మొదట కనిపించేది బటర్‌ఫ్లై గార్డెన్. ఇందులో ఎన్నో రకాల మొక్కలు నాటారు. గతంలో నాటినవి.. ఇప్పుడు ఏపుగా పెరిగి ఆకట్టుకుంటున్నాయి. సీతాకోకచిలుకలను ఆకట్టుకునేలా స్వర్ణ గన్నేరు, పారిజాతం, విష్ణుశంఖం, మందారం వంటి 45 రకాల మొక్కలు ఉన్నాయి.

12 రాశులు.. 12 మొక్కలు

తెలుగు రాశులు 12 ఉంటాయి. ఈ మేరకు పార్క్‌లో రాశి నవగ్రహ వనం ఏర్పాటు చేశారు. రాశుల పేర్లతోపాటు మొక్కలు వాటి సాంస్కృతిక నామాలను బోర్డుపై కనిపించేలా రాశారు. ఏడాకుల పాలు (వృషభం), అశోక/వెదురు (మిథునం), ఎర్రచందనం (మేషం), మర్రి (మీనం), జమ్మి (కుంభం), సిస్సు (మకరం), రావి (ధనస్సు), సండ్ర (వృశ్చికం), పొగడ (తుల), మామిడి (కన్య), రేగు (సింహం), మోదుగల (కర్కాటకం) నాటారు.



కరెన్సీ పార్క్

వివిధ దేశాలకు సంబంధించిన కరెన్సీ నోట్లను వృత్తాకారంలో ఏర్పాటు చేశారు. ఒక్కో కరెన్సీ నోటు వద్ద సంబంధిత దేశం పేరు, ఏమని పలకాలో వివరంగా రాశారు. భారతదేశం, ఉత్తర కొరియా, ఆస్ట్రేలియా, అమెరికా, జర్మనీ, ఫిన్‌లాండ్, సింగపూర్, దక్షిణాఫ్రికా, క్యూబా, వెనిజులా దేశాలకు చెందిన కరెన్సీ నోట్ల వివరాలు పిల్లలు గుర్తుంచుకునేలా ఏర్పాటు చేశారు.



పల్లె వాతావరణం

ఆధునిక కాలంలో పిల్లలు ఎక్కువగా పట్టణాలు, నగరాల్లోనే విద్యనభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలపై వారికి అవగాహన కరువవుతోంది. ఈ నేపథ్యంలో పల్లె వాతావరణం ప్రతిబింబించేలా పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్టింగ్ పర్యాటకులకు ఆకట్టుకుంటోంది. మనిషి ఎద్దులబండిని నడిపేలా చిత్రం, వీటి వెనుక గుడిసె, చేదుడుబావి ఏర్పాటు చేశారు. వెదురు ఉత్పత్తులతో తయారు చేసిన వన కుటీరం అమితంగా ఆకట్టుకుంటోంది.

అడల్ట్ వాటర్ బోటింగ్

పార్క్ చివరి భాగంలో చెక్‌డ్యాం నిర్మించి అందులో వాటర్ బోటింగ్ ఏర్పాటు చేశారు. బోటింగ్‌కు పర్యాటకులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇద్దరు కూర్చుని సైకిల్‌లా తొక్కుతూ ముందుకు సాగవచ్చు. పచ్చని అందాల మధ్య నీటిలో విహారం ప్రత్యేక అనుభూతి మిగులుస్తోందని పర్యాటకులు చెబుతున్నారు. పది నిమిషాలకు ఒక్కొక్కరికి పది నిమిషాలకు రూ.100 వసూలు చేస్తున్నారు.





క్రీడాభిమానుల వేదిక ఆర్చరీ జోన్

పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆర్చరీ జోన్ క్రీడాకారులతోపాటు క్రీడాభిమానులను ఆకర్షిస్తోంది. సెలవుల్లో మినహా రోజూ ఇది అందుబాటులో ఉంటోంది. ఈ ఆర్చరీ జోన్‌లో ఐదు విల్లులు కొట్టడానికి రూ.50 వసూలు చేస్తారు. ఏటా వేసవిలో ఇక్కడ ప్రత్యేకంగా ఆర్చరీ శిక్షణ ఇస్తున్నారు.

రెయిన్ ఫారెస్ట్, వాటర్ ఫాల్స్ అద్భుతం

పార్క్‌లో రెయిన్ ఫారెస్ట్ ప్రత్యేక అనుభూతిని మిగులుస్తోంది. సహజసిద్ధ వాతావరణంలో వర్షం పడుతున్నట్లు కృత్రిమంగా ఏర్పాటు చేశారు. చెరువు నుంచి పైపుల ద్వారా నీటిని పంపింగ్ చేసేలా ప్రత్యేకమైన సెట్టింగ్ ఏర్పాటు చేయడం ఆకర్షిస్తోంది. గుట్టపై జాలువారుతున్న జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. చెరువు నుంచి పైకి నీళ్ల పంపింగ్ చేసి.. అక్కడ నిల్వ చేసి.. వదిలిపెడుతున్నారు. ఇలా ఏర్పడిన వాటర్ ఫాల్స్ సందర్శకులను మైమరిపింపజేస్తోంది.



సాహస విన్యాసాలకు వేదిక

మయూరి ఎకో అర్బన్ పార్క్ సాహస విన్యాసాలకు వేదికగా నిలుస్తోంది. రూ.50తో టైర్ బ్రిడ్జి, బాంబో బ్రిడ్జి, వాల్ క్లైంబింగ్ చేయవచ్చు. రూ.200తో సైక్లింగ్, రూ.100తో జిప్‌లైన్, వర్షాకాలం తర్వాత ఫారెస్ట్ ట్రెక్కింగ్ చేసే అవకాశం కల్పిస్తారు. యువకులు, విద్యార్థులు, పిల్లలు ఎక్కువగా ఈ ఈవెంట్లలో పాల్గొంటున్నారు.

జంగిల్ సఫారీ



మయూరి అటవీ ప్రాంతంలో జంగిల్ సఫారీకి అవకాశముంది. అందుకు అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఒక ట్రిప్‌కు రూ.2వేల చార్జితో ఎనిమిది మంది వరకు వాహనంలో అడవి మొత్తం చుట్టి రావొచ్చు. అడవి జంతువులతోపాటు రకరకాల చెట్లను చూడవచ్చు.

నైట్ క్యాంపింగ్‌కు ప్రత్యేక ప్యాకేజీ

ఎకో పార్క్‌లో ఒకరోజు, రాత్రివేళలో ప్రత్యేక నైట్ క్యాంపింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఒక్కొక్కరికి రూ.1,500 ప్యాకేజీతో డిన్నర్, భోజనంతో పాటు హైకింగ్ ఫారెస్ట్, జిప్‌లైన్ అండ్ రోప్ విన్యాసాలు, రెయిన్ ఫారెస్ట్, వాటర్‌ఫాల్, జిప్ సైక్లింగ్‌కు అవకాశం కల్పించారు. కొంతకాలంగా ఈ ప్యాకేజీ కొనసాగడం లేదు. త్వరలో పునఃప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.





మూడు వ్యూ పాయింట్లు

పార్క్‌లో మూడు వ్యూ పాయింట్లు ఉన్నాయి. హిల్ వ్యూపాయింట్, ఫ్లాగ్ పాయింట్‌తో పాటు మరో సాధారణ వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. హిల్ వ్యూపాయింట్ నుంచి చూస్తే ఇటు పక్క జడ్చర్ల, మరో పక్క మహబూబ్‌నగర్ రహదారి అద్భుతంగా కనిపిస్తోంది. వ్యూ పాయింట్‌లో పార్క్ అందాలు ఆకట్టుకుంటున్నాయి.

పిల్లలు కేరింతలు కొట్టాల్సిందే..



మయూరి ఎకో అర్బన్ పార్క్‌లో ఆడుకోవడానికి వీలుగా చిల్డ్రన్ పార్క్‌కు అన్ని హంగులు అద్దారు. చూడగానే ఆకట్టుకునేలా పార్క్ ముఖద్వారాన్ని తీర్చిదిద్దారు. లోపలికి ప్రవేశించారో.. లేదో.. పిల్లలు కేరింతలు కొట్టాల్సిందే. జారుబండలు, ఊయలలు, రోలింగ్, టైర్ స్వింగ్, అప్ అండ్ డౌన్ బల్లలు, అంబరిల్లా ఆటలు ఆడుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి. కోతులు, చింపాంజీల బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. చిన్నారుల వాటర్ బోటింగ్‌కు విశేష స్పందన వస్తోంది. వాటర్ బోటింగ్‌కు 10 నిమిషాలకు రూ.50 చార్జి వసూలు చేస్తున్నారు.

బ్లాక్ అండ్ వైట్ స్వాన్

పార్క్‌లో ఏర్పాటు చేసిన కొలనులో నలుపు, తెలుపు రంగుల హంసల సందడి ఆకట్టుకుంటోంది. ఆస్ట్రేలియా ఖండానికి చెందిన ఈ హంసలు ఎక్కువ సేపు నీటిమీద విహరిస్తూ గడుపుతాయి. ఆకులు, గింజలు వీటి ఆహారం. జీవిత కాలం 30 నుంచి 40 ఏళ్ల అన్న వివరాలను బోర్డుపై రాసి పెట్టారు.



ఫొటో షూట్‌లకు క్రేజీ

మయూరి ఎకో అర్బన్ పార్క్ ఫొటో షూట్‌కు వేదికగా నిలుస్తోంది. కొత్తగా పెళ్లి చేసుకునేవారు, చేసుకున్న జంటలు ఇక్కడికి వచ్చి ప్రకృతి అందాల మధ్య ఫొటోలు తీసుకుంటుండడంతో సందడి నెలకొంటోంది.

'మకావ్' అదరహో..



పార్క్‌లో ఏర్పాటు చేసిన చిలుక జాతికి చెందిన గ్రీన్‌వింగ్డ్ మకావ్ పక్షి సందర్శకులను ఆకట్టుకుంటోంది. దక్షిణ అమెరికా అడవుల్లో గుంపులుగా నివసించే ఈ పక్షిని ఎన్‌క్లోజర్‌లో పెట్టారు. ఈ పక్షి జీవితకాలం 60 నుంచి 80 ఏళ్ల అంటూ వివరాలు తెలిపేలా బోర్డు ఏర్పాటు చేయడంతో.. పిల్లలకు వినోదంతోపాటు విజ్ఞానం అందుతోంది.

చెట్ల మధ్య నడక వంతెన

పార్క్ మధ్యభాగంలో ఏర్పాటు చేసిన నడక వంతెన విశేషంగా ఆకట్టుకుంటోంది. ఒక పక్క నడక వంతెన ఎక్కి.. మరోచోట దిగేలా ఏర్పాటు చేశారు. ఈ నడక వంతెనపై చిన్నారులతోపాటు పెద్దలు వాకింగ్ చేస్తున్నారు. వంతెన వద్ద ఏర్పాటు చేసిన డైనోసర్‌ల ప్రతిమలు అలరిస్తున్నాయి. పార్క్‌లో భారీ పరిమాణంలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్ ఆకట్టుకుంటోంది. చుట్టూ నాటిన వివిధ రకాల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

ఎంత పెద్ద ఆస్ట్రిచ్ పక్షులో..

అర్బన్ పార్క్‌కే హైలెట్‌గా ఆస్ట్రిచ్ పక్షులు నిలుస్తున్నాయి. పొడవైన కాళ్లు, భారీ ఆకారంతో కూడిన ఆస్ట్రిచ్ పక్షులు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.



ఆఫ్రికా, ఆస్ట్రేలియా అడవుల్లో ఈ పక్షులు ఎక్కువగా కనిపిస్తాయి. వీటి గుడ్డు 32 సెంటీమీటర్ల పొడవు ఉంటుంది. బరువు కిలో 400 గ్రాములు ఉంటుంది.. అన్న వివరాలు ఉన్నాయి.

ఆహ్లాదంగా ఉంది



సెలవు రోజుల్లో కుటుంబంతో కలిసి పార్క్‌కు వస్తుంటాం. పార్క్ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. పార్క్‌లో కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడుపుతాం. పిల్లలు బాగా ఎంజాయ్ చేస్తారు. పెద్దలు సంతోషంగా గడిపేందుకు అవకాశముంది.

– రాజేశ్వర్, ఉపాధ్యాయుడు

పిల్లలకు చూపాలి



చిల్డ్రన్ పార్కులో ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు, బొమ్మలు కచ్చితంగా పిల్లలకు చూపాలి. సీతాకోక చిలుకల గార్డెన్‌లో రకరకాల మొక్కలు, వాటి పేర్లు తెలియడంతో విజ్ఞానం పెరుగుతుంది. సెలవులు ఉంటే తప్పకుండా మా పిల్లలతో ఇక్కడికొస్తాం.

– శంకర్, మహమ్మదాబాద్

హైదరాబాద్ తరహాలో..



హైదరాబాద్‌లోని పార్క్‌ల తరహాలో ఇక్కడే పలు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పచ్చదనంతో కూడిన పార్క్ అందాలు చాలా బాగున్నాయి. జీవితంలో గుర్తుండిపోయేలా ఉంది. పిల్లలకు ఆడుకునేందుకు, విజ్ఞానం పొందేందుకు ఇక్కడి ఏర్పాట్లు బాగున్నాయి.

– దీపిక, మహబూబ్‌నగర్

రాబోయే రోజుల్లో మరిన్ని ఏర్పాట్లు

ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటుతోపాటు రాక్ గార్డెన్, కాక్టస్ గార్డెన్ వంటివి ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. త్వరలో ఏర్పాటు చేసి పర్యావరణ విద్యపై శిక్షకుడిని ఏర్పాటు చేసి పార్కుకు వచ్చే సందర్శకులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోబోతున్నాం.

– వాసవి, అటవీ సెక్షన్ ఆఫీసర్

ఆపత్కాలంలో ప్రజలకు అండగా ఉండండి

- కాంగ్రెస్ కేడర్‌కు పీసీసీ చీఫ్ పిలుపు



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, ఆపత్కాలంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలకు అండగా నిలవాలని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రజలకు అవసరమైన సహాయక కార్యక్రమాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం సర్వశక్తులూ ఒడ్డి పనిచేస్తున్నప్పటికీ పార్టీ కార్యకర్తలు కూడా ప్రజలకు అవసరమైన సహాయం అందించడంలో ముందుండాలని బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

వరద సహాయానికి బీజేపీ సిద్ధం

- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీవర్షాలు, వరదల నుంచి ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించడం కర్తవ్యమని, ఈ విషయంలో అందరూ ఒకరికొకరు అండగా నిలవాలని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు కోరారు. పార్టీపరంగా బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా సహాయక చర్యలకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ఆహారం, తాగునీటి పంపిణీ, వైద్య సహాయం, వృద్ధులు, చిన్నపిల్లలకు సహకరించడంలో పార్టీ కార్యకర్తలు నిమగ్నం కావాలని విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో జాతీయ విపత్తు సహాయ బలగాలతో సమన్వయం చేసేందుకు కూడా చర్యలు చేపడతామని తెలిపారు.

'సీబీఐకి 'గట్టు' దంపతుల కేసు భేష్'

సాక్షి, హైదరాబాద్: న్యాయవాద దంపతులు గట్టు వామన్ రావు, నాగమణి హత్య కేసులో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. కేసు విచారణను వెంటనే సీబీఐకి అప్పగించడంతో పాటు.. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ తీర్పు, రాష్ట్ర ప్రభుత్వ విచారణ సంస్థలపై ప్రజలలో పెరుగుతున్న అవిశ్వాసానికి స్పష్టమైన నిదర్శనమని ఒకప్రకటనలో పేర్కొన్నారు. న్యాయవాదుల గౌరవం, భద్రత కోసం బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

భారీ వర్షాలతో జాగ్రత్త: తలసాని



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. 72 గంటలపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిందని, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

పంద్రాగస్టున ప్రతిభావంతులకు సన్మానం

సాక్షి హైదరాబాద్: పంద్రాగస్టును పురస్కరించుకుని ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించాలని విద్యాశాఖ నిర్ణయించింది. సర్కారు బడుల్లో చదివి పదోతరగతి, ఇంటర్మీడియట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థులను సన్మానించాలని ఆదేశాలిచ్చింది. జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాలిచ్చారు.

మాదకద్రవ్యాలతో తీవ్రమైన ముప్పు

- ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (పీఅండ్ఎల్) రమేశ్

సాక్షి, హైదరాబాద్: మాదక ద్రవ్యాల దుర్వినియోగంతో ప్రజారోగ్యం, భద్రత, యువత భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పు ఉందని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (పీ అండ్ ఎల్) ఎం.రమేశ్ హెచ్చరించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా డీజీపీ కార్యాలయంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అధికారులు, సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలపై అవగాహన ప్రచారాలను ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐజీ (ఎల్అండ్‌వో) ఎం.రమణ కుమార్, డీఎస్పీ ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

సీజేఎల్, జేఎల్ సర్వీస్‌ను ఎలా లెక్కిస్తారు?

- వివరాలు సమర్పించాలని ఎన్పీడీసీఎల్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్ (సీజేఎల్), జూనియర్ లైన్‌మెన్ల (జేఎల్) నియామకాల్లో సర్వీసును ఎలా లెక్కిస్తారో తెలియజేయాలని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్)ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలను తమ ముందు ఉంచాలని ఆదేశిస్తూ.. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. 2009, నవంబర్ 10న హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం నియమితులైన వారందరికీ ఒకే సీనియారిటీ వర్తింపజేయకపోవడాన్ని సవాల్ చేస్తూ 2011లో నియమితులైన వందమందికి పైగా ఉద్యోగులు హైకోర్టులో 12 పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ పుల్లా కార్తీక్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఒకే నోటిఫికేషన్ ఆధారంగా 2007లో కొందరు, 2011లో పిటిషనర్లు నియమితులయ్యారన్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం అందరినీ 2007లో నియమితులైనవారితో సమానంగా సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని ఉద్యోగ ప్రయోజనాలు కల్పించాల్సి ఉన్నా.. 2011లో నియమితులైనవారిని జూనియర్‌లుగా పేర్కొంటున్నారన్నారు. ఎన్పీడీసీఎల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 2007లో ప్రకటించిన ఖాళీల మేరకు పోస్టులను భర్తీ చేశామని చెప్పారు. ఆ తర్వాత 2011లో ఏర్పడిన ఖాళీల ఆధారంగా పిటిషనర్ల నియామకం చేపట్టామన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. సర్వీస్ లెక్కింపుపై పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

వార్షిక టోల్‌పాస్‌ను పొందేందుకు చర్యలు తీసుకోవాలి

మాజీ ఎంపీ బోయినపల్లి డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలు వార్షిక టోల్‌పాస్‌ను పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కోరారు. సాధ్యమైనంత వేగంగా తెలంగాణ వాహనాల వివరాలను వాహన్, సారథి పోర్టల్‌లకు అనుసంధానం చేసి తెలంగాణ ప్రజలు వార్షిక టోల్ పాస్ సౌకర్యాన్ని పొందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రైవేటు వాహనాల డాటా బేస్‌ను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వాహన్ పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేయని కారణంగా తెలంగాణ ప్రజలు ఫాస్టాగ్ వార్షిక టోల్‌పాస్ అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా కేవలం రూ.3 వేల ఫీజుతో ఏడాదిలో 200 సార్లు టోల్‌గేట్ దాటే వెసులుబాటు కేంద్రం కల్పిస్తుందని వివరించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు తమ పరిధిలోని ప్రైవేటు వాహనాల నంబర్లు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర వివరాలను ఇప్పటికే అనుసంధానం చేశాయని, ఒక్క తెలంగాణ రాష్ట్రం మాత్రమే పెండింగ్‌లో పెట్టిందని తెలిపారు. దీనిపై ఇప్పటికే కేంద్ర రవాణాశాఖ కార్యదర్శి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారని చెప్పారు.

చిన్నారులకు నడక యాతన



చక్కగా చదువుకొని, వారు వృద్ధిలోకి రావడమే కాక, దేశాన్ని ముందుకు నడిపించాల్సిన రేపటి పౌరులు వారు.. బడికి నాలుగైదు కిలోమీటర్లు నడిచివెళుతున్నారు. అల్లూరి జిల్లా పాడేరు మండలం కించూరు పంచాయతీలో వంటివీధుల, గడ్డిబంద గ్రామాల్లోని చిన్నారుల దుస్థితి ఇది. ఆ గ్రామాల్లో పాఠశాల లేకపోవడంతో 26 మంది విద్యార్థులు కాలినడకన కించూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి చదువుకొంటున్నారు. ఈ గ్రామాలకు రోడ్డు సదుపాయం ఉన్నా ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. దీంతో చిన్నారులకు నడక యాతన తప్పడం లేదు. ఈ గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేసి శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

–పాడేరు రూరల్

వైఎస్ ముద్రను చెరిపేసే కుట్ర

ఉద్యాన వర్సిటీ ముఖ ద్వారం వద్ద వైఎస్ విగ్రహం ఏర్పాటుకు అడ్డుపుల్ల

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో ఏర్పాటుచేసిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ముఖ ద్వారం వద్ద యోగముద్రలో ఉన్న వైఎస్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి ఏర్పాటును అడ్డుకునేందుకు వర్సిటీ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి 2023లో ఇక్కడ విగ్రహం ఏర్పాటుచేయాల్సి ఉంది. దీని తయారీకి అప్పటి డిప్యూటీ సీఎం శిల్పికి రూ.10 లక్షలు బయానాగా ఇచ్చారు. వర్సిటీ ముఖద్వారం వద్ద విగ్రహం ఏర్పాటుకు అప్పటి పాలకమండలి తీర్మానం చేసింది. ఇది కార్యరూపంలోకి తేకుండా అక్కడ ఒక రైతు, అతని భార్య బొమ్మలను ఏర్పాటుచేశారు. దీంతో వర్సిటీలో వైఎస్ ముద్రను చెరిపే కుట్ర మరోసారి తేటతెల్లమైంది. ఈ విషయంపై మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ కోర్టును ఆశ్రయించారు. విషయాన్ని పరిశీలించాల్సిన కోర్టు దీనికి సంబంధించిన వివరాలు అందచేయాల్సిందిగా ఉద్యాన వర్సిటీ అధికారులను ఆదేశించింది. రైతు ఉద్యాన పంటలతో ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలని వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకాంక్షించారు. దక్షిణ భారత దేశంలో మొదటిది.. దేశంలో రెండవదిగా ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని వెంకట్రామన్నగూడెంలో ఏర్పాటుచేశారు. తాడేపల్లిగూడెం ప్రాంతం వర్సిటీ ఏర్పాటుకు ఎందుకు అనుకూలమో కొట్టు సత్యనారాయణ అంకెలతో అసెంబ్లీలో విపులీకరించారు. గూడెంలో వర్సిటీని అడ్డుకొనే ప్రయత్నం చేసిన కొంతమంది నోటికి తాళం వేశారు. గూడెంలో రాజీవ్ గృహకల్ప సముదాయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన దివంగత సీఎం రాజశేఖరరెడ్డి అదే వేదికపై నుంచి గూడెంలో ఉద్యాన వర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. అనంతరం 2007లో వెంకట్రామన్నగూడెంలో ఏర్పాటు చేశారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. 2015లో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పేరును మార్చాలని జెడ్పీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. దీనిపై అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఈ ప్రతిపాదన అటకెక్కింది.

తాజాగా రెండో కుట్ర

వైఎస్ విగ్రహాన్ని ఆయన స్మృతిచిహ్నంగా ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేయడానికి ప్లాట్‌ఫాం కట్టించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శిల్పికి తయారీ బాధ్యత అప్పగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ విగ్రహం ఏర్పాటుచేయాల్సిన ప్రాంతంలో రైతు దంపతుల బొమ్మను ఏర్పాటుచేసింది. దీంతో కొట్టు సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు.



ఉద్యాన వర్సిటీ ముఖ ద్వారం వద్ద వైఎస్ విగ్రహం ఏర్పాటు చేయాల్సిన ప్రాంతంలో నెలకొల్పుతున్న రైతు బొమ్మ

సుంకాల ఉచ్చులో రొయ్య

కుదేలైన ఆక్వా రంగం



- విశాఖ జిల్లాలో తగ్గిన రొయ్యల ఎగుమతులు
- ఇప్పటికే పతనమైన ధరలు



మహారాణిపేట: ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ ఆక్వా రంగానికి రాజసం తెచ్చిపెట్టి, విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించిపెట్టిన బంగారు రొయ్య.. నేడు అమెరికా వాణిజ్య విధానాల కారణంగా తన ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడింది. దేశ రొయ్యల ఉత్పత్తిలో అగ్రగామిగా.. ఆక్వా హబ్‌గా వెలుగొందుతున్న ఆంధ్రప్రదేశ్.. ముఖ్యంగా విశాఖ తీరం, మునుపెన్నడూ లేని సంక్షోభంలో చిక్కుకుంది. భారత ఉత్పత్తులపై అమెరికా 25 శాతం సుంకాన్ని విధించడంతో.. అంతర్జాతీయ మార్కెట్‌లో మన రొయ్యల పోటీ సామర్థ్యం దెబ్బతింది. ఫలితంగా ధరలు రికార్డు స్థాయిలో పతనం కావడం, ఎగుమతులు నిలిచిపోవడంతో లక్షలాది మంది ఆక్వా రైతులు, మత్స్యకారులు, పరిశ్రమ కార్మికుల భవిష్యత్తు అంధకారంలోకి జారుకుంది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోకపోతే, ఈ సంక్షోభం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన, దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపడం ఖాయం.

కుప్పకూలిన ధరలు..

భారత రొయ్యల ఉత్పత్తులపై అమెరికా ఏకపక్షంగా 25 శాతం కస్టమ్స్ సుంకాన్ని విధించడమే ఈ సంక్షోభానికి మూల కారణం. ఇదే సమయంలో, ఈక్వెడార్ వంటి పోటీ దేశాలపై కేవలం 10 శాతం సుంకం విధించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రొయ్యలకు డిమాండ్ తగ్గింది. ఫలితంగా ఎగుమతులు ఒక్కసారిగా నిలిచిపోయి, స్థానిక మార్కెట్‌లో ధరలు రికార్డు స్థాయిలో పతనమయ్యాయి. గతంలో 100 కౌంట్ రొయ్యల ధర రూ. 270 పలకగా, ఇప్పుడు అది రూ. 230కి పడిపోయింది. ఈ ధరల పతనంతో రైతులు టన్నుకు రూ. 50 వేల నుంచి రూ. 80 వేల వరకు నష్టపోతున్నారు. పంట చేతికొచ్చే సమయానికి ధరలు కూలిపోవడంతో, పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగిరాని పరిస్థితి నెలకొంది. ఈ దుస్థితిని ఆసరాగా చేసుకున్న స్థానిక వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఈ గండం నుంచి గట్టెక్కేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని రైతులు, మత్స్యకారులు, పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. 'కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమెరికాతో దౌత్య, వాణిజ్యపరమైన చర్చలు జరిపి, సుంకాలను తగ్గించేలా లేదా పూర్తిగా తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలి. నష్టపోయిన రైతులకు తక్షణమే ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలి. టన్నుకు కనీస మద్దతు ధర ప్రకటించడం లేదా నష్టపరిహారం అందించడం వంటి చర్యలు చేపట్టాలి. విద్యుత్, రొయ్యల మేత వంటి కీలకమైన వాటిపై సబ్సిడీలను పెంచి, సాగు వ్యయాన్ని తగ్గించాలి. అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించి.. యూరప్, ఇతర ఆసియా దేశాల్లో కొత్త మార్కెట్లను అన్వేషించడానికి ఎగుమతిదారులకు ప్రభుత్వం ప్రోత్సాహం, సహకారం అందించాలి.' అని రైతులు కోరుతున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే.. రాబోయే సీజన్‌లో రొయ్యల సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరిశ్రమ భవిష్యత్తును మరింత ప్రమాదంలోకి నెడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పరిశ్రమపై ప్రభావం

ఈ సంక్షోభం కేవలం రైతులకే పరిమితం కాలేదు. దీని ప్రభావం మొత్తం సరఫరా గొలుసుపై పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 100–150 ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు, ముఖ్యంగా విశాఖ పరిసర ప్రాంతాల్లోని 15 ఫ్యాక్టరీలు ఎగుమతి ఆర్డర్లు లేక ఉత్పత్తిని భారీగా తగ్గించాయి. దీని వల్ల వేలాది మంది కార్మికులు, ముఖ్యంగా మహిళలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. రొయ్యల మేత, మందుల సరఫరాదారులు, ప్యాకేజింగ్ పరిశ్రమలు, రవాణా రంగంపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుంది. ఏడాదికి రూ. 25వేల కోట్ల విలువైన రొయ్యలను ఎగుమతి చేసే ఈ కీలక రంగం కుదేలవడం రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం కలిగిస్తోంది.

శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్/విజయపురిసౌత్/సత్రశాల (రెంటచింతల): శ్రీశైలానికి వరద ప్రవాహం భారీగా వస్తుండడంతో ఏడు క్రస్ట్ గేట్ల ద్వారా నాగార్జునసాగర్‌కు 1,89,133 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మంగళవారం నుంచి బుధవారం వరకు జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి 2,00,050 క్యూసెక్కుల వరదనీరు శ్రీశైలానికి వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులకు 2,04,917 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నాగార్జునసాగర్‌కు స్పిల్‌వే ద్వారా 99,514 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన అనంతరం 70,039 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. డ్యాం పరిసర ప్రాంతాలలో 5.20 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బుధవారం సాయంత్రానికి నీటిమట్టం 882.70 అడుగులకు చేరుకుంది.

సాగర్‌కు పోటెత్తిన వరద

కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ పోటెత్తింది. ఎగువనగల శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి 2,30,540 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం నుంచి దిగువనగల కృష్ణానదిలోకి 2,63,189 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, ఎస్ఎల్‌బీసీలకు 8,407 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జుసాగర్ జలాశయం ప్రస్తుత నీటి మట్టం 588.90 అడుగులకు చేరింది.

పులిచింతలకు 2.75 లక్షల క్యూసెక్కులు నీరు విడుదల

సత్రశాల వద్ద నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 16 క్రస్ట్‌గేట్లు ద్వారా 2,75,166 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. ప్రాజెక్టు నీటి మట్టం 74.62 మీటర్లకు చేరుకుందన్నారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 6.488 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు.



సాగర్ వరద నిర్వహణలో లోపాలున్నాయ్..

తెలంగాణ ఈఎన్‌సీకి ఏపీ ఈఎన్‌సీ లేఖ

సాక్షి, అమరావతి: నాగార్జునసాగర్ జలాశయానికి వస్తున్న భారీ వరద నిర్వహణ తగిన విధంగా లేదని ఏపీ ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తెలంగాణ ఈఎన్‌సీకి ఒక లేఖ రాశారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయానికి నీటిమట్టం 589.2 అడుగులు, నిల్వలు 309.65 టీఎంసీలకు చేరగా, కేవలం 2.4 టీఎంసీల మేర జలాశయాన్ని ఖాళీ (ఫ్లడ్ కుషియన్)గా ఉంచారని ఆయన ఈ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో సాగర్‌కి వచ్చే వరద మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎగువ నుంచి వచ్చే వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ దానికి తగ్గట్టు క్రస్ట్ గేట్లను ఎత్తాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే దిగువన ఏపీలోని ప్రాజెక్టులకు ముప్పు ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో సాగర్‌ను పూర్తిగా నింపకుండా సమర్థవంతమైన వరద నిర్వహణ కోసం అవసరమైన మేరకు ఖాళీగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఎగువ నుంచి వచ్చే వరదను ప్రణాళికాబద్ధంగా ఎప్పటికప్పుడు కిందికు విడుదల చేసేందుకు తగిన వరద నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

రబీ సీజన్‌కు 23.08 లక్షల టన్నుల ఎరువులు

- రాష్ట్ర ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం
- వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీ రావు

సాక్షి, అమరావతి: రానున్న రబీ సీజన్ కోసం రాష్ట్రానికి 23.08 లక్షల టన్నుల ఎరువులు కేంద్రం కేటాయించిందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీ రావు వెల్లడించారు. ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ప్రారంభంకానున్న రబీ సీజన్‌లో ఎరువుల కేటాయింపులపై కేంద్రం మార్గదర్శకాలను విడుదల చేసిందని తెలిపారు. వివిధ రాష్ట్రాల వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో ఇంటిగ్రేటెడ్ న్యూట్రియెంట్ మేనేజ్‌మెంట్ (ఐఎన్ఎం) కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి ఫ్రాంక్లిన్ ఎల్ కోబాంగ్ అధ్యక్షతన రబీ సీజన్ సాగు సన్నద్ధత, ఎరువుల కేటాయింపులపై సమీక్ష నిర్వహించారు. రబీ సీజన్‌లో వివిధ పంటల సాగు విస్తీర్ణం, గత ఐదేళ్లలో సగటు ఎరువుల వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుని రాష్ట్రాల వారీగా రానున్న రబీ సీజన్‌కు ఎరువుల కేటాయింపులపై చర్చించారు. 2025–26 సంవత్సరానికి రబీ సీజన్‌లో 44.05 లక్షల హెక్టార్లలో పంటల సాగు లక్ష్యంగా నిర్దేశించారు. రబీ సీజన్‌కు యూరియా 9.38 లక్షల టన్నులు, డీఏపీ 2.20 లక్షల టన్నులు, ఎంవోపీ. (పొటాష్) 1.00 లక్షల టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 9.50 లక్షల టన్నులు, ఎస్ఎస్‌పీ (సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) లక్ష టన్నులు కలిపి మొత్తంగా 23.08 లక్షల టన్నులు అవసరమని కోరగా ఆ మేరకు కేటాయించేందుకు కేంద్ర ఎరువుల విభాగం అంగీకరించిందని డైరెక్టర్ ఢిల్లీరావు వివరించారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి

పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర నాయుడు

సాక్షి, అమరావతి: వర్షాలు, వరదల సమయంలో పశుపోషకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ టి.దామోదర నాయుడు సూచించారు. ఈ మేరకు బుధవారం పలు సూచనలతో ఓ ప్రకటన విడుదల చేశారు. పశువులు, జీవాల షెడ్లకు మరమ్మతులకు చేసుకోవాలని, షెడ్లను పొడిగా ఉంచాలని పేర్కొన్నారు. జీవాలకు వ్యాధులు సోకకుండా ఉచితంగా నట్టల నివారణ మందు, వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు వివరించారు. బాహ్యపరాన్న జీవుల నిర్మూలనా మందులను వాడాలని, తగినంత దాణా, మేత నిల్వ ఉంచుకోవాలనీ సూచించారు.

29, 30 తేదీల్లో జిల్లాల్లో మంత్రుల పర్యటన

- వచ్చే నెల 15 నాటికి జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులపై నివేదిక
- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని

సాక్షి, అమరావతి: జిల్లా, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులపై వచ్చే నెల 15వ తేదీ నాటికి సీఎం చంద్రబాబుకు నివేదిక సమర్పించాలని మంత్రుల బృందం నిర్ణయించింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రులు పి.నారాయణ, వంగలపూడి అనిత, బిసి జనార్దన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్‌తో కూడిన బృందం బుధవారం సచివాలయంలో భేటీ అయ్యింది. ఈ నెల 29, 30 తేదీల్లో మంత్రుల బృందం రెండు గ్రూపులుగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పర్యటిస్తుందని మంత్రి అనగాని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి వచ్చిన అనేక సూచనలపై చర్చించామని చెప్పారు. ప్రజలు ఇప్పటినుంచే కలెక్టర్లకు వినతులు ఇవ్వొచ్చని.. సెప్టెంబర్ 2వ తేదీ వరకు స్వీకరిస్తామని చెప్పారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పుల తోపాటు కొత్త జిల్లాల ఏర్పాటు అంశాన్ని కూడా మంత్రుల బృందం పరిశీలిస్తుందని చెప్పారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా కేంద్రాలతోపాటు గిరిజనులకు అందుబాటులో ఉండేవిధంగా రెండు గిరిజన ప్రాంతాల్లో మంత్రుల బృందం పర్యటించి ప్రజల అభిప్రాయాలు తీసుకుంటుందని చెప్పారు.

గుర్రం జాషువా పేరు పెట్టాలని వినతి

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ గుంటూరు లేదా పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని మంత్రుల బృందానికి వినతి పత్రం సమర్పించారు. చీరాల నుంచి వచ్చిన కొందరు బాపట్ల జిల్లా కేంద్రాన్ని చీరాలకు మార్చాలని, బాపట్ల జిల్లాకు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా మురపాక గ్రామస్తులు తమ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. కృష్ణా జిల్లా మడిచర్ల సర్పంచ్, ఎంపీటీసీ, ఆ గ్రామ ప్రజలు తమ గ్రామాన్ని బాపులపాడు మండలం నుంచి తొలగించి నూజివీడు లేదా ముసునూరు మండలంలో కలపాలని కోరారు.

కొన ఊపిరికి కొత్త ఊపిరి

- ధన్య చరితులు.. పుణ్యమూర్తులు
- వారి త్యాగం చైతన్యానికి ప్రతీక
- కన్ను మూస్తూ.. మరొకరికి జన్మనిస్తున్న దాతలు

కపిలేశ్వరపురం: ఆలోచన అయినా ఆచరణ అయినా బొందిలో ప్రాణం ఉన్నంత వరకే. మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులు తీసుకొన్న సామాజిక అవగాహనతో కూడిన నిర్ణయాలు మరణించిన వ్యక్తిని మరెన్నో తరాలు జీవించేలా చేస్తాయి. అలాంటి కోవలోకి వచ్చే అవయవదానం సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంతోమంది తమ అవయవాలను దానం చేసి ఎంతోమందికి ప్రాణం పోశారు.

పెరిగిన అవసరం

భారతదేశంలో అవయవాలు సకాలంలో అందుబాటులో లేక రోజుకు 20 మంది చొప్పున చనిపోతున్నారని అంచనా ఉంది. ప్రతి పది నిమిషాలకు ఒకరు అవయవ మార్పిడి చేయించుకోవాల్సిన పరిస్థితి దేశంలో ఉంది. అవయవాలు అవసరమైన వారిలో పది శాతం మందికి కూడా అవి లభ్యం కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అవయవ దానం ప్రాధాన్యం పెరిగింది. సాహితీవేత్తలు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్తలు మరణానంతరం తమ దేహాలను దానం చేస్తూ అంగీకార పత్రాలను రాసిన చరిత్ర ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకి ఉంది.

బ్రెయిన్ డెత్ కావడంతో...

కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన యువకుడు నున్న శివన్నారాయణ (శివ) ఈ ఏడాది మే 25న ప్రమాదానికి గురికావడంతో బ్రెయిన్ డెత్ అయ్యింది. కుటుంబ సభ్యుల నిర్ణయంతో కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రిలో అతని అవయవాలను దానం చేయడం ద్వారా ముగ్గురికి జీవితాన్ని ప్రసాదించాడు. లివరు, ఒక కిడ్నీని ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి, మరో కిడ్నీని విశాఖపట్నం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి అమర్చారు. నేత్రాలలోని కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు.

చేయడం ఇలా..

దాతలు జీవిస్తూనే వారి అవయవాలలో కొంత భాగాన్ని దానం చేస్తూ ఇతరులకు ఊపిరి పోస్తున్నారు. రక్తాన్ని, 50 శాతం కాలేయాన్ని, రెండింటిలో ఒక కిడ్నీని ఇతరులకు దానం చేయడం ఈ కోవలోనివే. మరొక పద్ధతిలో వారు చనిపోయిన తర్వాత కుటుంబ సభ్యుల నిర్ణయంతో అవయవాలు దానం చేస్తున్నారు. బ్రెయిన్ డెత్ అయిన వ్యక్తుల్లో మొత్తం రెండు కిడ్నీలను, గుండెను, కాలేయాన్ని, ఊపిరితిత్తులను, ప్యాంక్రియాసిస్ గ్రంధిని వాటి పనితీరు సామర్థ్యాన్ని బట్టి ఇతరులకు దానం చేస్తున్నారు. తన దేహాన్ని మరణానంతరం వైద్య కళాశాల విద్యార్థుల పరిశోధన కోసం కళాశాలకు అప్పగించాలంటూ కొందరు ముందస్తు ఒప్పంద పత్రాన్ని రాస్తున్నారు. సహజ మరణం పొందిన వారి నుంచి కార్నియా, చర్మం, ఎముక, గుండె కవాటాలు, రక్తనాళాలు దానం చేసే వీలు ఉంది.



ఈ ఏడాది మే 28న బ్రెయిన్ డెత్‌తో అవయవ దానం చేసిన శివన్నారాయణ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మండపేట నియోజకవర్గ నాయకులు (ఫైల్)

చిరంజీవులయ్యారు

మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కాకర శ్రీనివాసరావు ఈ ఏడాది జూలై 12న గుండెపోటుతో మృతిచెందగా ఆయన నేత్రాలను అనపర్తి రాధాకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. తాళ్లరేవు మండలం పి.మల్లవరం గ్రామానికి చెందిన ధూలిపూడి సీతారాం అనే మహిళ ఈ ఏడాది జులై 1న గుండె పోటుతో మరణించగా నేత్రదానం చేశారు. తాళ్లరేవు మండలం పూడా హిమావతి ఈ ఏడాది జనవరి 26న గుండెపోటుతో మరణించడంతో రెండు నేత్రాలను కాకినాడ బాదం ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ద్రాక్షారామ పద్మ స్టూడియో అధినేత కె.వీర్రాజు ఈ ఏడాది మే 28న మృతి చెందగా కాకినాడ రెడ్ క్రాస్ ఐ బ్యాంకుకు రెండు కార్నియాలను దానం చేశారు. కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన పలపకూర వెంకట్రావు ఏడాది ఏప్రిల్ 26న గుండెపోటుతో మరణించగా కాకినాడ రెడ్ క్రాస్ ఐ బ్యాంకుకు రెండు కార్నియాలను దానం చేశారు. కె.గంగవరం గ్రామానికి చెందిన చింత చిన్నారి ఈ ఏడాది ఫిబ్రవరి 27న మృతి చెందగా రెండు నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు.



వైద్య విద్యార్థుల పరిశోధన లక్ష్యంగా..

కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, ఆలయ శిల్పి పెద్దింశెట్టి సూర్యనారాయణమూర్తి (91) 2021 డిసెంబర్ 8న వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆయన జీవించి ఉండగానే 2009 నవంబర్ 22న కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు దేహదాన ఒప్పంద పత్రాన్ని రాసి ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఆ మేరకు సూర్య నారాయణమూర్తి దేహాన్ని కళాశాలకు అప్పగించారు. పిఠాపురానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, వజ్రాయుధం పుస్తక రచయిత ఆవంత్స సోమసుందర్ 2016 ఆగస్టు 12న వృద్ధాప్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు దేహాన్ని అప్పగించారు. పిఠాపురం పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) తానూ, తన భార్య అనూరాధ ఇద్దరూ తమ దేహాలను వైద్య కళాశాలకు రాసి ఇచ్చారు. కాగా 2022 ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డే రోజున సత్యనారాయణశాస్త్రి గుండెపోటుతో మరణించగా కుటుంబ సభ్యులు రాజానగరం జీఎస్ఎల్ కళాశాలకు దేహాన్ని అప్పగించారు. ఆ స్ఫూర్తితో ఆదేరోజు సత్యనారాయణ శాస్త్రి కుమారుడు గౌరవ్, కోడలు కల్యాణిలు తమ దేహాలను దానం చేసేందుకు ఒప్పంద పత్రాలను రాసి ఇచ్చారు.

నాన్న స్ఫూర్తితో దేహదానం చేశాం

నాన్న మానవ సమాజం పట్ల అవగాహనతో జీవించారు. నా చిన్ననాటి నుంచీ అనేక విషయాలు బోధించారు. ఆయనతో పాటు అమ్మకు అవగాహన కల్పించి ఆమె దేహాన్ని కూడా దానం చేసేందుకు చైతన్య పర్చారు. ఆ స్ఫూర్తితో నేను, నా జీవిత భాగస్వామి కల్యాణి కూడా దేహదానం చేసేందుకు పత్రం రాశాం.

– మేకా గౌరవ్, పిఠాపురం, కాకినాడ జిల్లా

ఆలయ గోపాలుడు

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం సాక్షాత్తూ ఆ దేవదేవుడు శ్రీకృష్ణుడిగా ఈ భూమిపై ఉద్భవించిన పర్వదినం కృష్ణాష్టమి. ఈ శనివారం కృష్ణాష్టమి. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఉన్న కొన్ని వేణుగోపాల స్వామి ఆలయాల గురించి సంక్షిప్తంగా...



ముందుగా హైదరాబాద్ పరిసరాలలోని ఆలయాల గురించి...

శ్యాం మందిరం - కాచిగూడ, హైదరాబాద్

హైదరాబాద్‌లోని కాచిగూడ స్టేషన్‌కి సమీపంలో గల శ్రీ కృష్ణమందిరానికే శ్యాం మందిర్ అని పేరు. ఈ మందిరం ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఈ దేవాలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. నిత్యం స్వామివారికి విశేషమైన పూజా కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

గోవర్ధనగిరి - కేపీహెచ్‌బీ కాలనీ, హైదరాబాద్

హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో మలేసియాన్ టౌన్‌షిప్‌కి వ్యతిరేక దిశలో కొలువైన వేణుగోపాల స్వామి దేవాలయం ఒక గుట్ట పైన వెలసినది. గుట్టపైన స్వామి వారి విగ్రహం దొరకగా అక్కడే గుడి కట్టించారు. ఈ ప్రదేశాన్ని గోవర్ధన గిరి అని పిలుస్తారు.. ప్రతి నిత్యం స్వామి వారికి విశేషమైన పూజ కార్యక్రమాలు జరుగుతాయి. పండుగలప్పుడు, కృష్ణాష్టమికి చాలా విశేషంగా ఉత్సవాలు జరుపుతారు. ఇక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. గుట్ట పైన వెలసి ఉండడం వలన ప్రదేశం చాలా ప్రశాంతంగా ఉంటుంది.

సంతాన వేణుగోపాల స్వామి అని కూడా పిలుస్తారు. చాలా మంది భక్తులు ఇక్కడికి వచ్చి సంతానం కోసం స్వామిని సేవించుకుంటారు.

రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయం - ఏదులాబాద్

సికింద్రాబాద్‌కి సుమారు 30 కి.మీ. దూరంలో ఘటకేసర్ మండల కేంద్రానికి 5 కి.మీ. దూరంలో ఏదులాబాద్ గ్రామంలో వెలసిన క్షేత్రం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయం. శతాబ్దాల చరిత్ర గల ఈ దేవాలయం ఎంతో శక్తిమంతమైన ప్రాచీన క్షేత్రం. అందమైన రాజ గోపురం, ఆ గోపురం పైన రక రకాల శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. అద్భుతమైన కట్టడాలు, చక్కని శిల్పకళా సంపదతో ఎంతో రమణీయంగా ఉంటుంది. శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రాకారం ఇక్కడ పూజాకార్యక్రమాలు జరుగుతాయి.

శ్రీ రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామి దేవాలయం - రామడుగు

కరీంనగర్ జిల్లా రామడుగు మండల కేంద్రంలో సుమారు 1200 వందల సంవత్సరాల పూర్వమే శ్రీ రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామి దేవాలయం కొలువై ఉంది. ఈ ఆలయంలో వేణుగోపాల స్వామి 8 మంది భార్యలు మనకు దర్శనమిస్తారు. ఈ స్వామికి కూడా కల్యాణ వేణుగోపాలుడనీ, సంతాన వేణుగోపాలుడనీ పేరు.

సంతాన వేణుగోపాల స్వామి దేవాలయం, చీనూర్ గ్రామం, కామారెడ్డి జిల్లా

ఈ దేవాలయంలో వెలసిన వేణుగోపాల స్వామి సంతాన వేణు గోపాల స్వామిగా ప్రసిద్ధి గాంచాడు. ఎవరైతే ఈ క్షేత్రంలో స్వామి వారిని మనసా వాచా నమ్మి పూజిస్తారో వాళ్ళకి ఆ స్వామివారు మంచి సంతానాన్ని ప్రసాదిస్తారని ప్రతీతి. ఈ ఆలయంలో వెలసిన మరో సుందర విగ్రహం శ్రీ సుదర్శన పెరుమాళ్ వారిది. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ స్వామికి అభిషేకం, హోమం వంటి దివ్యమైన పూజలు జరిపిస్తే ఎటువంటి ఆరోగ్య సమస్య అయిన తొలగి పోతుందనీ, శత్రునాశనం జరుగుతందనీ నమ్మకం!

జగన్నాథ స్వామి దేవాలయం- చెన్నూర్

చెన్నూర్‌లో పూజలందుకుంటున్న అతి పురాతన జగన్నాథ స్వామి దేవాలయం ఇది. ఇక్కడ ప్రవహించే గోదావరిని ఉత్తరవాహిని అని పిలుస్తారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా దర్శించాల్సిన ప్రదేశం. ఇది. గోదావరి నది పుట్టిన చోట నుంచి సముద్రంలో కలిసే వరకు ఎక్కడ లేని ప్రత్యేకత ఈ ప్రాంతంలో ఉంటుంది.

శ్రీ కృష్ణ దేవాలయం - బహదూర్ పురా

150 సంవత్సరాల పూర్వం ఈ దేవాలయాన్ని నిర్మించారు. నెహ్రూ జంతు ప్రదర్శన శాలకు దగ్గరలో ఉన్న ఈ దేవాలయాన్ని కిషన్ బాగ్ దేవాలయం అని కూడా అంటారు. నిజాం దగ్గర వకీల్‌గా పని చేసిన రాజా రాం బహదూర్ ఈ ఆలయాన్ని నిర్మించారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజు ఇక్కడ ఘనంగా పూజ కార్యక్రమాలు, రథ యాత్ర నిర్వహిస్తారు. ఇక ఈ ఆలయం లో వెలసిన వేణుగోపాల స్వామిని

ఆంధ్రప్రదేశ్‌లో...

మొవ్వ వేణుగోపాల స్వామి ఆలయం

కృష్ణాజిల్లా కూచిపూడి అనగానే తెలుగు వారికి ప్రత్యేకమైన నృత్యం గుర్తుకువస్తుంది. ఆ కూచిపూడికి సమీపంలో ఉన్న మొవ్వ పేరు వినగానే వేణుగోపాలుడు మదిలో నిలుస్తాడు. మొవ్వలో ఉన్న వేణుగోపాలుని ఆలయం ఈనాటిది కాదు! ఆ స్వామి మహాత్మ్యమూ సామాన్యమైనది కాదు! వేణుగోపాల స్వామి విగ్రహం చాలా ప్రత్యేకమైనదని చెబుతారు. స్వామి వెనుక వున్న మకరతోరణంపై దశావతారాలు ఉన్నాయి. స్వామి పక్కన రుక్మిణీ సత్యభామలు దర్శనమిస్తారు. చేతిలో వేణువుకు గాలి వూదే రంధ్రాలు కూడా స్పష్టంగా కనబడతాయి. ఈ విగ్రహం ఇసుక నుంచి ఉద్భవించింది కావడంతో కాల క్రమంలో కొంచెం దెబ్బతిన్నది. ఆ కారణంగా 2000 సంవత్సరంలో స్వామివారి విగ్రహాన్ని పోలిన మరో విగ్రహాన్ని రూపొందించి ప్రతిష్ఠించారు. అయినా ఇప్పటికీ పాత విగ్రహాన్ని మనం ఆలయం వెనుక ఉన్న గదిలో చూడవచ్చు. ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామివారి ఉపాలయం కూడా ఉంది. మువ్వ పేరు వినగానే వేణుగోపాల స్వామి ఆలయమే కాదు, ఆ స్వామి మహత్తుతో అద్భుతమైన పదాలు రాసిన క్షేత్రయ్య కూడా గుర్తుకు వస్తాడు. మొవ్వ వేణుగోపాలుడిని దర్శిస్తే ఎవరి జీవితమైనా తరించిపోతుందని చెప్పేందుకు క్షేత్రయ్య జీవితమే ఒక ఉదాహరణ. విజయవాడ నుంచి మొవ్వ కేవలం 50 కిలోమీటర్లే!

హంసల దీవి శ్రీ వేణు గోపాల స్వామి

వేయి సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ దేవాలయం కృష్ణా జిల్లాలోని హంసలదీవిలో ఉంది. అద్భుతమైన శిల్పకళ, చక్కటి కట్టడాలతో నిర్మించిన ఈ ఆలయం సముద్రపు అటు పోటులను తట్టుకునేలా ప్రాకారాన్ని నిర్మించారు. తూర్పు ముఖాన అద్భుతమైన రాజగోపురం ఉంటుంది. ఈ ఆలయంలో వేణుగోపాలస్వామి శ్రీ రుక్మిణీ సత్యభామ సమేతుడై పూజలు అందుకుంటూ వున్నాడు. ఇక్కడి దేవాలయ కుడ్యాలపై చెక్కిన రామాయణ ఘట్టాలు తూర్పు చాళుక్యుల శిల్పకళా వైభవానికి అద్దం పడుతుంటాయి. ఆలయం చుట్టూ ఎన్నో అందమైన శిల్పాలు కొలువుదీరి ఉన్నాయి. ఈశాన్యంలో పురాతన కళ్యాణ మండపం కన్పిస్తుంది. ఈ ఆలయంలోని శ్రీ వేణుగోపాలస్వామి పిలిస్తే పలుకుతాడని భక్తుల విశ్వాసం. ప్రపంచంలో ఎక్కడా కనిపించని విధంగా ఈ విగ్రహం నీల మేఘఛాయ లో ఉండటాన్ని విశేషంగా చెప్పుకుంటారు.

మార్గం

కృష్ణాజిల్లా కోడూరు నుంచి 15 కి.మీ దూరం లోనూ, మోపిదేవి నుండి 28 కి.మీ దూరం లోనూ బంగాళాఖాతం అంచున ఈ పుణ్యక్షేత్రం ఉంది.

కుంతీ మాధవస్వామి ఆలయం, పిఠాపురం

ఇంద్రుడు వృత్తాసురుడు అనే రాక్షసుణ్ణి సంహరించి బ్రహ్మహత్యాపాతకం నుంచి విముక్తి కోసం ఐదు ప్రాంతాల్లో విష్ణ్వాలయాలను నిర్మించి ఆరాధించాడన్నది పురాణ కథనం. ఈ ఐదు క్షేత్రాల్లో మాధవ స్వామి ఆలయాలు వెలిశాయి. వారణాసిలో బిందు మాధవస్వామి ఆలయం, ప్రయాగలో వేణు మాధవస్వామి ఆలయం, పిఠాపురంలోని కుంతీ మాధవస్వామి ఆలయం, రామేశ్వరం లోని సేతుమాధవస్వామి ఆలయం, అనంత పద్మనాభంలోని సుందర మాధవస్వామి ఆలయం ప్రసిద్ధి చెందాయి.

మార్గం

పిఠాపురం రాజమండ్రికి 62 కిలోమీటర్లు, సామర్లకోటకు 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రధానమైన రైళ్లన్నీ పిఠాపురంలో ఆగుతాయి. కాకినాడ నుంచి, రాజమండ్రి నుంచి బస్సు సౌకర్యం ఉంది.

వేణుగోపాల స్వామి దేవాలయం - మెళియాపుట్టి

శ్రీకాకుళం జిల్లాలో వెలసిన పురాతన వేణుగోపాల స్వామి దేవాలయం మెళియాపుట్టి గ్రామంలో కొలువై ఉంది. టెక్కలికి 24 కి.మీ. దూరంలో ఉన్న ఈ గ్రామంలో గల ఆలయాన్ని గజపతిమహారాజు 1810 లో నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తుంది. ఆలయ నిర్మాణం, ఆలయంలో కొలువైన వేణుగోపాల స్వామి ఎంతో సుందరంగా దర్శనమిస్తారు. డోల పౌర్ణమి ఉత్సవాలు 9 రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని ఆంధ్ర ఖజురాహో అని కూడా పిలిచేవారట.. అక్కడ ఉన్న నిర్మాణ శైలి, గోడల పైన ఉన్న శిల్పాలు అలా ఉంటాయట.



● కాచిగూడలో శ్యాం మందిర్



● కేపీహెచ్‌బీలో గోవర్ధనగిరి టెంపుల్



● బహదూర్‌పురాలో శ్రీకృష్ణ దేవాలయం

శ్రీ రాజగోపాల స్వామి దేవాలయం నరసపూర్

నరసపూర్‌లో కొలువైన రాజగోపాలస్వామి దేవాలయం 18 వ శతాబ్దానికి చెందినదిగా శాసనాల ద్వారా తెలుస్తుంది. గోదావరి నదిలో విగ్రహం లభించగా దానిని తీసుకొని వచ్చి ప్రతిష్ఠించి దేవాలయాన్ని నిర్మాణం చేశారు. ఆలయంలో కొలువైన కృష్ణుడిని కల్యాణ కృష్ణుడిగా పిలుస్తారు. శ్రీ రుక్మిణి సత్యభామ సమేతంగా శ్రీ రాజగోపాల స్వామిగా కొలువైనారు. ఈ దేవాలయంలో స్వామి వారిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తే పెళ్లిళ్ల త్వరగా అవుతాయని నమ్మకం. స్వామి అనుగ్రహంతో పెళ్లి కుదిరిన వారు దేవాలయ ఆవరణలోనే పెళ్లి చేసుకుంటారు.

సమ్మోహన వేణుగోపాల స్వామి దేవాలయ-జూనం చుండూరు, గుంటూరు

గుంటూరు జిల్లా జూనంచుండూరు గ్రామంలో వెలసిన సమ్మోహన వేణుగోపాల స్వామి వారి దేవాలయంలో నల్లని రూపుడైన స్వామి విగ్రహం సుమారు ఆరు అడుగులు పొడవు, నాలుగు అడుగుల వెడల్పుతో సుందర, సుమనోహరంగా దర్శమిస్తోంది. దాదాపు 1500 సంవత్సరాల క్రితం ఈ దేవాలయం నిర్మాణమైనట్లు కథనం. దేవాలయంలోని ఈ స్వామిలో ఓ ప్రత్యేకత ఉంది. స్వామి వారి మూలవిరాట్ ప్రణవ స్వరూపంలో ఉండి ఆపై వేణుగోపాలునిగా స్వామి దర్శనమిస్తారు. దేశంలో మరెక్కడా ఇటువంటి భంగిమ ఉన్నటువంటి విగ్రహం ఉండదంటారు. ఆది ప్రణవ స్వరూపంలో చుట్టూ దశావతారాలు, సప్తరుషులు, వేణుగోపాలునికి ఇరుపక్కల రుక్మిణి, సత్యభామలు గోవులతో కొలువుదీరి ఉంటారు.ఈ స్వామిని సేవిస్తే కల్యాణం అవుతుందని, సంతాన, సౌభాగ్య సంపదలకు లోటుండదనీ ప్రతీతి.

– డి.వి.ఆర్.భాస్కర్



● మొవ్వలోని వేణుగోపాల స్వామి ఆలయం



● పిఠాపురంలో కుంతీ మాధవ స్వామి ఆలయం



● మెలియాపుట్టిలో వేణుగోపాల స్వామి ఆలయం



● ఏదులాబాద్‌లో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి



● రామడుగులో రుక్మిణి సత్యభామ సమేత...



● కామారెడ్డి, చీనూర్‌లో వేణుగోపాల స్వామి ఆలయం



● చెన్నూర్‌లోని జగన్నాథ స్వామి ఆలయం



● హంసలదీవిలో... వేణుగోపాల స్వామి టెంపుల్



● నరసాపురంలో రాజగోపాల స్వామి టెంపుల్



● చుండూరులో వేణుగోపాల స్వామి టెంపుల్

● సువార్త

నాయకత్వ ప్రేమ

శ్రీమంతుడైన ఇశ్రాయేలు దేవుడు సకల యుగములలో రాజుగా, సర్వాధిపతిగా, అధి నాయకుడుగా, పరిపాలకుడుగా తనను తాను అన్నింటా కనబరచుకున్నాడు (1తిమోతి 1:17, 6:15,16). దేవుడు తన ప్రజలతో కొత్తగా, కొత్త ఒడంబడిక చేసుకొనే సమయం ఆసన్నమైంది. అప్పుడు దేవుడు తన సంకల్ప ప్రకారంగా క్రీస్తును రంగంలోకి దించాడు.

ఆత్మ సంబంధ ఇశ్రాయేలీయుల రాజుగా అనగా మెస్సీయగా క్రీస్తు రాకతో కేవలం భౌతిక సంబంధులై పేరుకు మాత్రమే ఇశ్రాయేలీయులు అనబడే వారు ఎవరో, దేవుని ఇశ్రాయేలీయులు అనదగ్గ వారు ఎవరో తేట పడ్డారు. పనిలో పనిగా క్రీస్తు ద్వారా అన్య జనులకు కూడా రక్షణ భాగ్యం దొరికి వారు కూడా దేవుని ఇశ్రాయేలుతో సహ పౌరులుగా, యాకోబు వంశస్థులుగా ఇలా దేవుడు కలిగిన ధన్య జీవులుగా చరిత్రకెక్కారు. దేవుని పక్షాన ఏలే క్రీస్తురాజు ఏలుబడిలోకి పాపులు పరిశుద్ధులై ఇలాగున అవిధేయులు విధేయులై రావడం అంత తేలికైనా వ్యవహారం కాదు. అయితే ఇదంతా 'నాయకత్వ ప్రేమ'తోనే సుసాధ్యమైంది.

క్రీస్తు ద్వారా అనేకానేక విషయాలు తిరుగులేని విధంగా పునర్నిర్వచించబడ్డాయి. అందులో నాయకత్వం ఒకటి. తమ అవిధేయతతో తిరుగుబాటు చేస్తూ లోబడనొల్లని ప్రజల కోసం అంతిమంగా క్రీస్తు జీవితాన్ని ఉన్నతంగా రూపొందించాడు దేవుడు. దేవునికి, ఆయన ప్రజలకు క్రీస్తు తప్ప మరో మధ్యవర్తి ఇక భవిష్యత్తులో ఉండనంతగా, ఇక ఎన్నడూ దేవుడు మరో సంకల్పం, మరో నిబంధన చేయనంతగా ఏర్పాట్లు ఘనంగా అనాదిలోనే నిర్ణయించడం విశేషం.

మెస్సీయ ఈ భూమి మీదకు ఎలా రాబోతున్నాడు అన్న విషయం దివారాత్రాలు గ్రంథ రాజాన్ని హత్తుకొన్న వారికే తప్ప మరొకరికి తెలిసే వీలు లేదు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ నశించిన వారిని వెదకి రక్షించే సహాయక కార్యంలో భాగంగా రిక్తుడిగా దాసుని స్వరూపం ధరించుకొని వచ్చి, ప్రేమ పాలనతో దేవుని పిల్లలను ముందుండి గొప్ప గొర్రెల కాపరివలె దైవికంగా ముమ్ముందుకే నడిపించిన క్రీస్తు నాయకత్వం ఆనాడు గొప్ప సంచలనం సృష్టించింది. క్రీస్తును అర్థం చేసుకొన్న అనేకులు ఆయన్ను బట్టి దేవునికి మరింత దగ్గర అయ్యారు.

క్రీస్తు తనదైన ప్రేమను బట్టి ప్రేమతో నాయకత్వం చేపట్టిన విధానం లోకాన్ని ఆశ్చర్యపరచింది. దాని పేరే పరిచారక నాయకత్వం (సర్వెంట్ లీడర్షిప్).

దీనికి పర్యాయ పదమే నాయకత్వ ప్రేమ. భౌతిక విధానపు లోక రీతులలో ప్రథమ స్థానాలు కోరుకుంటూ హెచ్చించుకోబోతున్న శిష్యులకు క్రీస్తు ఇదే బోధించి వారిని సరిదిద్దాడు కూడా. 'మీలో ఎవడు నాయకుడై ఉండగోరునో వాడు మీ పరిచారకుడై ఉండవలెను'-మత్తయి 20:25,26.

రక్షణ భాగ్యం లేనివారికైన రక్షణానందంలో స్థిరపడినవారికైనా నిత్యమూ చెప్పే సత్య సువార్తను అనుసరించి క్రీస్తు బోధలతో, కార్యరూపకమైన నాయకత్వ ప్రేమతో ముందుకు నడిపించే ఆత్మ సంబంధ పరిచర్య ఎంతో మహిమ గలది. ఆది అపొస్తలులు, ఆదిమ సంఘం చేసిన పరిచర్య ఇలాంటి మహిమ గలదిగా బైబిలు నందు చూస్తాము.

దొడ్డపనిగా చెప్పబడే నాయకత్వాన్ని ప్రేమతో చేపడుతూ దాన్ని ఒకానొక అరుదైన బాధ్యతగా ఎంచి ఆ భారాన్ని ప్రేమతో భుజానకెత్తుకుంటే అదే నాయకత్వ ప్రేమ. ప్రేమ, గౌరవాలను బట్టే తగ్గించుకుంటాము. ప్రేమను బట్టే పరిచర్య చేయగలుగుతాము. తగ్గింపుకు, పరిచర్యకు ప్రేమ మూలం కాకుంటే అది తగ్గింపు కాదు. ఆత్మ సంబంధ పరిచర్య అసలే కాదు. ప్రేమను బట్టి సేవా పరిచర్యలు చేస్తూ కొనసాగిస్తూ ప్రేమించుట ద్వారా అవతలి వ్యక్తుల మనస్సులను గెలిచి వారిని ఉన్నతమైన పురోగమన దిశలో నడిపించడమే 'నాయకత్వ ప్రేమ' అని చెప్పవచ్చు.

– జేతమ్

● స్వాతంత్ర్య సూక్తులు

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న గొప్ప వ్యక్తులు, స్వాతంత్ర్యం గురించి వారు చెప్పిన కొన్ని అభిప్రాయాలు

మహాత్మా గాంధీ: 'స్వాతంత్ర్యం అంటే కేవలం రాజకీయ స్వాతంత్ర్యం కాదు, ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యం కూడా.

జవహర్‌లాల్ నెహ్రూ: 'స్వాతంత్ర్యం అనేది ఒక అవకాశం, ఒక బాధ్యత. మనం దానిని సద్వినియోగం చేసుకోవాలి, మన దేశాన్ని అభివృద్ధి చేసుకోవాలి.'

సర్దార్ వల్లభాయ్ పటేల్: 'ఒకే దేశంగా ఉండాలంటే ఐక్యత ముఖ్యం, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఐక్యతను కాపాడుకోవాలి.'

బాలగంగాధర్ తిలక్: 'స్వరాజ్యం నా జన్మహక్కు, నేను దానిని సాధిస్తాను.'

సుభాష్ చంద్ర బోస్: 'మీరు నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను.'

రాజగోపాలాచారి: 'స్వాతంత్ర్యం అంటే మన దేశాన్ని మనమే పాలించుకోవడం, మన విధి విధానాలను మనమే నిర్ణయించుకోవడం.'

భగత్ సింగ్: 'నా జీవితం దేశం కోసం, నా మరణం కూడా దేశం కోసమే. నా మరణం తర్వాత కూడా నా ఆశయం బ్రతికే ఉంటుంది.'

● ఇస్లాం వెలుగు

ధర్మబద్ధమైన జీవనమే సాఫల్యమార్గం

పుడమిపై శ్వాస పీలుస్తున్న ప్రతి ప్రాణీ ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక రోజు ఈ జీవితాన్ని ముగించాల్సిందే. పుట్టిన ప్రతి ప్రాణికీ మరణం తప్పదు. ఇది నగ్నసత్యం. తిరస్కరించలేని నిజం. ఇందులో ఎటువంటి భిన్నాభిప్రాయమూ లేదు. 'కుల్లునఫ్సిన్ జాయిఖతుల్ మౌత్ ' అని పవిత్ర ఖురాన్ చెప్పింది. 'జాతస్య మరణం ధ్రువం' అని వేదం చెప్పింది. ఏ ధర్మం చెప్పినా, ఏ గ్రంథం చెప్పినా అర్థం అదే. కాని మనం దీన్ని పట్టించుకోం. మన బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, తెలిసిన వాళ్ళు, తెలియని వాళ్ళు ఎంతోమంది ప్రతిరోజు ఎక్కడో ఒకచోట మరణిస్తూనే ఉన్నారు. మనం వారి అంత్యక్రియల్లో పాల్గొని, స్వయానా మన భుజాలపై మోసి, వారిని సమాధిలో దించి, స్వహస్తాలతో వారిపై మట్టికూడా వేస్తున్నాం. వారు సంపాదించిన ఆస్తిపాస్తులు, ఆభరణాలు, హోదా, అధికారం ఏదీ వారు తమవెంట తీసుకువెళ్ళడం లేదు. రిక్తహస్తాలతో వచ్చారు. రిక్తహస్తాలతోనే వెళ్ళిపోతున్నారు.

కనీసం పార్థివ శరీరంపై ఉన్న బట్టలు, ఆభరణాలు కూడా ఇక్కడే వదిలేసి, ఆత్మీయులతో బంధాలను సైతం తెంచుకొని ఈలోకాన్ని వీడివెళ్ళిపోతున్నారు. తమవెంట భూములు, డబ్బులు, ఆస్తులు, అంతస్తులు ఏవీ తీసుకొని వెళ్ళడంలేదు. ప్రాణప్రదంగా ప్రేమించే భార్యాబిడ్డలు కూడా వెంట వెళ్ళడంలేదు. అంటే ఇవేవీ ఆ రోజు పనికి రావన్నమాట.

ముహమ్మద్ ప్రవక్త ఒక మాట చెప్పారు. ధర్మాధర్మాల విచక్షణ పాటించండి. మంచి పనులు విరివిగా చేయండి. రేపు మిమ్మల్ని కాపాడేవి ఇవే. 'ఎందుకంటే, మీరు సంపాదించిన డబ్బూ దస్కం, ఆభరణాలు, ఆస్తిపాస్తులు సమస్తమూ మీ ఊపిరి ఆగిన మరుక్షణమే మీతో సంబంధాన్ని తెంచుకుంటాయి. మీరు తినీ తినకా, ధర్మం అధర్మం ఆలోచించకుండా, రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించినదంతా మీది కాకుండా పోతుంది. భార్యాబిడ్డలు, బంధుగణం, మిత్రబృందం... వీరంతా మిమ్మల్ని సమాధి వరకు మాత్రమే సాగనంపుతారు. సమాధిలో దించి, మిమ్మల్ని మట్టిలో కలిపేసి వెళ్ళిపోతారు. మీ వెంట వచ్చేది, మిమ్మల్ని కాపాడేది కేవలం మీరు చేసుకున్న మంచి పనులు మాత్రమే.



కనుక ధర్మాధర్మాలను విడిచిపెట్టి, ఇతరులను మోసం చేసి, వంచించి, అక్రమ దారిలో సంపాదించి చివరికి బావుకునేదేమిటో ఎవరికివారు ఆలోచించుకోవాలి. మంచీ చెడుల విచక్షణతో, ధర్మబద్ధంగా ముందుకు సాగితే, ఆ క్రమంలో ఎంత లభిస్తే అంతతో సంతృప్తి చెందితే అదే అసలు విజయం. అసలు సాఫల్యం. కేవలం మన లాభం కోసం ఇతరులను వంచించడం మానవీయ విలువలకే వ్యతిరేకం. కాబట్టి, ఇహలోక జీవితం ప్రశాంతంగా, సంతోషంగా, గౌరవప్రదంగా సాగిపోవాలన్నా, రేపటి పరలోక జీవితం జయప్రదం కావాలన్నా మరణాన్ని మరువకూడదు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

భారత మార్కెట్‌పై మరింత ఫోకస్

అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్ సమీర్ కుమార్

బెంగళూరు: దీర్ఘకాలికంగా తమ వ్యాపార వృద్ధికి భారత మార్కెట్ గణనీయంగా దోహదపడుతుందని ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ విశ్వసిస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడి మార్కెట్‌పై మరింతగా దృష్టి పెడుతోంది. భారీగా ఇన్వెస్ట్ చేస్తోంది. అమెజాన్ ఇండియా కంట్రీ హెడ్ సమీర్ కుమార్ ఈ విషయాలు వెల్లడించారు. భారత్‌లో తమ కార్యకలాపాలకు సంబంధించి మౌలిక సదుపాయాలను పటిష్టం చేసుకునేందుకు అమెజాన్ ఈ ఏడాది రూ. 2,000 కోట్లు వెచ్చించనున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తమ కార్యకలాపాలు అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లలో భారత్ కూడా ఒకటని కుమార్ చెప్పారు. ఇక్కడ ఆన్‌లైన్ షాపింగ్ పెరగడానికి మరింతగా అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 'ఇక్కడ యూజర్లు ఆన్‌లైన్‌లో ఉత్పత్తులు కొంటున్నారు. వీడియోలను వీక్షిస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్ పెరిగేందుకు ఇంకా భారీగా అవకాశాలున్నాయి. దాదాపు వంద కోట్ల మందికి మొబైల్ ఫోన్లు ఉన్నాయి. కానీ 10 కోట్ల మంది మాత్రమే ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేము మరో 20 కోట్ల మందికి చేరువ కావాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం' అని కుమార్ చెప్పారు. ఎకానమీ పెరిగే కొద్దీ వినియోగం కూడా పెరుగుతుందన్నారు.

చిన్న పట్టణాల్లో అవకాశాలు..

ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో కూడా ఆన్‌లైన్ షాపింగ్ చేసే వారు పెరుగుతున్నారని కుమార్ చెప్పారు. ఇటీవల ముగిసిన ప్రైమ్ డే గణాంకాలు చూస్తే కొత్త, పాత ప్రైమ్ కస్టమర్లలో 70 శాతం మంది చిన్న పట్టణాల నుంచే ఉన్నారని వివరించారు.



ఈ నేపథ్యంలో, ఈ ప్రాంతాల్లో ఆన్‌లైన్ షాపింగ్ పెరిగేందుకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని కుమార్ చెప్పారు. వారు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేందుకు, మెరుగైన డీల్స్‌ను .. వేగవంతమైన డెలివరీలను పొందేందుకు అనువైన పరిస్థితులు కల్పించడంపై దృష్టి పెడుతున్నామని తెలిపారు.

క్విక్ కామర్స్‌కి మంచి స్పందన..

ఇటీవల బెంగళూరు, ఢిల్లీలో ప్రవేశపెట్టిన క్విక్ కామర్స్ కార్యకలాపాలకు విశేష స్పందన లభిస్తోందని కుమార్ చెప్పారు. వీటిని మరిన్ని నగరాలకు విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని వివరించారు. పోటీపై స్పందిస్తూ, మార్కెట్లో ఎన్ని సంస్థలున్నా అంతిమంగా కస్టమర్లకు ఎంత మెరుగ్గా సర్వీసులు అందిస్తున్నామనే అంశమే కీలకంగా ఉంటుందని కుమార్ చెప్పారు.

బీఎస్‌ఈలో డిఫెన్స్ ఇండెక్స్

న్యూఢిల్లీ: బీఎస్‌ఈ ఇండెక్స్ సర్వీసెస్ విభాగం తాజాగా డిఫెన్స్ ఇండెక్స్‌ను ప్రారంభించింది. బీఎస్‌ఈ 1000 ఇండెక్స్‌లోని డిఫెన్స్ థీమ్ స్టాక్స్ ఈ సూచీలో ఉంటాయి. ఏటా రెండు సార్లు (జూన్, డిసెంబర్‌లో) ఇండెక్స్‌లో మార్పులు, చేర్పులు చేస్తారు. విధాన సంస్కరణలు, పెరుగుతున్న బడ్జెట్ కేటాయింపులు, దేశీయంగా తయారీపై మరింతగా దృష్టి పెరుగుతుండటం తదితర సానుకూల అంశాలతో డిఫెన్స్ రంగం గణనీయంగా వృద్ధి చెందనుందని బీఎస్‌ఈ ఇండెక్స్ సర్వీసెస్ వివరించింది. ఈ నేపథ్యంలో ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్ మొదలైన ప్యాసివ్ ఫండ్స్‌కి ఇండెక్స్ ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించింది. అలాగే, పీఎంఎస్ వ్యూహాలు, మ్యూచువల్ ఫండ్ స్కీములు, ఫండ్ పోర్ట్‌ఫోలియోల పనితీరు మదింపునకు దీన్ని ప్రామాణికంగా ఉపయోగించుకోవచ్చని పేర్కొంది.



అన్‌లిమిటెడ్ 'ఇండిపెండెన్స్ డే డబుల్ ఆఫర్'

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫ్యాషన్ దుస్తుల సంస్థ అన్‌లిమిటెడ్ 'ఇండిపెండెన్స్ డే డబుల్ ఆఫర్' కింద ప్రత్యేక ఆఫర్లు అందిస్తోంది. ఒకటి కొంటే మరొకటి ఉచితంగా పొందవచ్చు. అలాగే రూ.3,000 కొనుగోలుపై రూ.3,000 విలువైన ఉచిత ఆఫర్లు కూడా ఇస్తోంది. దాదాపు 20 వేలకు పైగా తాజా ఫ్యాషన్ మోడళ్లను అందుబాటు ధరలకే అందిస్తోంది. ఇప్పటికే మొదలైన ఆఫర్ ఆగస్ట్ 17 వరకు అందుబాటులో ఉంటుంది. కస్టమర్లంతా వినియోగించుకోవాలని కంపెనీ కోరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-8-2025	
విశాఖ	515-00
చిత్తూరు	548-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	485-00
వరంగల్	487-00
రిటైల్ ధర	5.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
APOLLOHOSP	7,830.00	8.2
HINDALCO	701	5.09
DRREDDY	1,253.40	2.71
CIPLA	1,560.00	2.52
HEROMOTOCO	4,754.50	2.35

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	773.2	-1.26
ADANIPORTS	1,320.90	-0.72
ITC	414.2	-0.52
TITAN	3,471.80	-0.43
TECHM	1,504.00	-0.35

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	8,395
ఎన్‌ఎస్‌ఈ	87,454
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,46,566
ఎఫ్ఐఐ	- 3,644
డీఐఐ	+ 5,624

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.57 (రాత్రి 11.30కు)	$ 63.17 (క్రితం ముగింపు)
బ్రెంట్	65.58 (రాత్రి 11.30కు)	$ 66.12 (క్రితం ముగింపు)

ఐపీవో స్ట్రీట్

ఐపీవోకు ఫ్రాక్టల్ అనలిటిక్స్

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- రూ. 4,900 కోట్లపై కన్ను



న్యూఢిల్లీ: ఏఐ సొల్యూషన్లు అందించే ఫ్రాక్టల్ అనలిటిక్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 1,279 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. మరో రూ. 3,621 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా మొత్తం రూ.4,900 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇష్యూ విజయవంతమైతే దేశీయంగా లిస్టయిన తొలి ఏఐ సేవల కంపెనీగా నిలిచే వీలుంది. టీపీజీ ఫెట్ హోల్డింగ్స్, క్వినాగ్ బిడ్కో, జీఎల్ఎం కుటుంబ ట్రస్ట్‌సహా సత్య కుమారి రేమాల, వెంకటేశ్వరరావు రేమాల షేర్లు ఆఫర్ చేస్తున్నారు. కాగా.. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ ఫ్రాక్టల్ యూఎస్ఏ రుణ చెల్లింపులకు, దేశీయంగా కొత్త కార్యాలయాల ఏర్పాటుకు, ఆర్అండ్‌డీ అభివృద్ధికి వెచ్చించనుంది. అంతేకాకుండా ఫ్రాక్టల్ అల్ఫా ప్లాట్‌ఫామ్ మార్కెటింగ్, ఇతర సంస్థల కొనుగోళ్లకు సైతం నిధులను వినియోగించనుంది. 2000లో శ్రీకాంత్ వెలమకన్ని, ప్రణయ్ అగర్వాల్ ఏర్పాటు చేసిన కంపెనీ ఏఐ, డేటా అనలిటిక్స్ సేవలలో కార్యకలాపాలు విస్తరించింది. క్లయింట్ల జాబితాలో గ్లోబల్ దిగ్గజాలు మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అల్ఫాబెట్, అమెజాన్, మెటా, టెస్లా తదితరాలను కలిగి ఉంది. గతేడాది(2024-25) ఆదాయం 26 శాతం ఎగసి రూ. 2,765 కోట్లను తాకింది. రూ. 220 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది రూ. 55 కోట్ల నికర నష్టం ప్రకటించింది.

విక్రమ్ సోలార్ @ రూ. 315-332

- ఈ నెల 19-21 మధ్య పబ్లిక్ ఇష్యూ
- రూ. 2,079 కోట్ల సమీకరణకు రెడీ



న్యూఢిల్లీ: సోలార్ మాడ్యూల్ తయారీ కంపెనీ విక్రమ్ సోలార్ పబ్లిక్ ఇష్యూకి రూ. 315-332 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 19న ప్రారంభమై 21న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను కేటాయించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 1,500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 579 కోట్ల విలువైన 1.74 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 2,079 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులను సొంత అనుబంధ సంస్థ వీఎస్ఎల్ గ్రీన్ పవర్ పెట్టుబడి వ్యయాలకు వినియోగించనుంది. ప్రాజెక్ట్ తొలి, రెండో దశలకు పెట్టుబడులను సమకూర్చనుంది. 2009లో కంపెనీ 12 మెగావాట్ల సోలార్ పీవీ మాడ్యూల్ స్థాపిత తయారీ సామర్థ్యంతో ప్రారంభమైంది. ప్రస్తుతం 4.5 గిగావాట్లకు సామర్థ్యాన్ని పెంచుకుంది. గతేడాది(2024-25) ఆదాయం 36 శాతం ఎగసి రూ. 3,423 కోట్లను తాకింది. నికర లాభం 75 శాతం జంప్‌చేసి రూ. 140 కోట్లకు చేరింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడులలో తయారీ ప్లాంట్లను కలిగి ఉంది. క్లయింట్లలో పీఎస్‌యూ దిగ్గజాలతోపాటు.. అక్మే క్లీన్‌టెక్, అదానీ గ్రీన్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ తదితర ప్రయివేట్ కంపెనీలున్నాయి.

స్కోడా ఆటో నుంచి లిమిటెడ్ ఎడిషన్ కార్లు



ముంబై: అంతర్జాతీయంగా 130 ఏళ్లు, భారత్‌లో పాతికేళ్ల వార్షికోత్సవ వేడుక సందర్భంగా స్కోడా ఆటో తన ప్రముఖ మోడళ్లు కైలాక్, స్లావియా, కుషాక్‌లకు లిమిటెడ్ ఎడిషన్ కార్లు విడుదల చేసింది. ఈ పరిమిత ఎడిషన్‌లను ఇప్పటికే ఉన్న హై-స్పెసిఫికేషన్‌ల ఆధారంగా తీర్చిదిద్దారు. అంటే కుషాక్, స్లావియా కోసం మోంటే కార్లో ట్రిమ్‌లపై, కైలాక్ కోసం ప్రెస్టీజ్, సిగ్నేచర్ ప్లస్ ట్రిమ్‌లపై ఆధారపడి రూపుదిద్దుకున్నాయి. ఎడిషన్ వేరియంట్లు ప్రత్యేకంగా 25వ వార్షికోత్సవ బ్యాడ్జ్‌తో, మరింత ప్రీమియం అనుభూతిని కలిగించేలా తయారయ్యాయి. ఉచితంగా ఇచ్చే యాక్సెసరీస్ కిట్‌లో 360-డిగ్రీ కెమెరా, పుడిల్ ల్యాంప్స్, అండర్ బాడీ లైటింగ్, ప్రత్యేక బాడీ గార్నిష్‌లు ఉంటాయి. ఈ కిట్ వేరియంట్లకు ప్రీమియం లుక్‌తో పాటు, మరింత ఫంక్షనల్ అప్‌గ్రేడ్‌ను అందిస్తుంది. ''మా సుదీర్ఘ ప్రయాణంలో భాగమైన అభిమానులకు ఇది మేము ఇస్తున్న కానుక . కస్టమర్ల ప్రాధాన్యతలకు పెద్ద పీట వేస్తూ ఉత్పత్తులు అందించే మా బలమైన అంకితభావానికి నిదర్శనం. ఇకపైనా అంకిత భావంతో పనిచేస్తామని హామీ ఇస్తున్నాము'' అని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా తెలిపారు.

పుదుచ్చేరిలో ఏసర్ తయారీ కేంద్రం



చెన్నై: ఐటీ, టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ ఏసర్ కొత్తగా పుదుచ్చేరిలో తయారీ ప్లాంటును ప్రారంభించింది. ఇందుకోసం ఫ్లామేజ్ సొల్యూషన్స్‌తో జత కట్టింది. కొత్త యూనిట్‌లో కంప్యూటర్ మానిటర్లు, ఆల్ ఇన్ వన్ డెస్క్‌టాప్‌లు, సర్వర్లు, వర్క్‌స్టేషన్లు, పవర్ అడాప్టర్లు, ఏటా సుమారు 3 లక్షల ల్యాప్‌టాప్‌లను తయారు చేయనున్నట్లు సంస్థ తెలిపింది. ఐటీ హార్డ్‌వేర్ కోసం ఉద్దేశించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) స్కీము కింద ఈ యూనిట్ ఏర్పాటైంది. ఉత్పత్తి సామర్థ్యాలను పెంచేందుకు ఫ్లామేజ్ గ్రూప్ వచ్చే మూడు, నాలుగేళ్లలో రూ. 50 కోట్లు ఇన్వెస్ట్ డెలివరీ వ్యవధిని తగ్గించేందుకు, ఆకర్షణీయమైన ధరల్లో వినూత్న ఉత్పత్తులను అందించేందుకు ఈ ప్లాంటు ఉపయోగపడుతుందని ఏసర్ ఇండియా ప్రెసిడెంట్ హరీష్ కోహ్లి తెలిపారు.

పీపుల్ టెక్ నుంచి థింక్ఎక్స్ ఈ-టూవీలర్



హైదరాబాద్: ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్ సంస్థ పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజ్ కొత్తగా ఏఐ ఆధారిత ఎలక్ట్రిక్ టూ-వీలర్ 'థింక్ఎక్స్' ప్రోటోటైప్‌ను ఆవిష్కరించింది. ఈ వాహనాల తయారీపై రూ. 800 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. దీనితో వచ్చే అయిదేళ్లలో వెయ్యికి పైగా ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి ఉత్పత్తి ప్లాంటును పూర్తి చేయనున్నట్లు విశ్వప్రసాద్ వివరించారు. గిగ్ వర్కర్లు, డెలివరీ ప్రొఫెషనల్స్ మొదలైన వర్గాల అవసరాలకు అనుగుణంగా ఈ వాహనం ఉంటుందని చెప్పారు.

బడ్జెట్ హోటల్స్ విభాగంలోకి రెడ్‌బస్ ఎంట్రీ

ముంబై: తక్కువ టారిఫ్‌లుండే బడ్జెట్ హోటల్స్ విభాగంలోకి కార్యకలాపాలు విస్తరించినట్లు ఆన్‌లైన్ బస్ టికెటింగ్ ప్లాట్‌ఫాం రెడ్‌బస్ తెలిపింది. దీనితో ట్రావెలర్లు తమ ప్లాట్‌ఫాం ద్వారా ఆన్‌లైన్‌లోనే వివిధ హోటల్స్‌లో గదుల లభ్యత, చార్జీలు మొదలైన వాటిని పోల్చి చూసుకునేందుకు వీలవుతుందని సంస్థ సీఈవో ప్రకాశ్ సంగం తెలిపారు. ప్రస్తుతం 2,000 పైగా నగరాల్లో ఈ సర్వీసు అందుబాటులో ఉందని, గది అద్దెలు రూ. 399 నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. త్వరలోనే మరింత వేగంగా విస్తరించనున్నట్లు చెప్పారు.

మేఘా ఇంజినీరింగ్‌కి త్రిపుర పవర్ జనరేషన్ కాంట్రాక్టు

విలువ రూ. 1,119 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్ దిగ్గజం మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) తాజాగా త్రిపుర పవర్ జనరేషన్ (టీపీజీఎల్) నుంచి కాంట్రాక్టు దక్కించుకుంది. సెపాహిజాలా జిల్లాలో రోఖియా పవర్ ప్లాంటులో 120 మెగావాట్ల కంబైన్డ్ సైకిల్ గ్యాస్ టర్బైన్ ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. పర్యావరణ హిత టెక్నాలజీతో వినియోగదారులకు చౌకగా విద్యుత్ అందించాలన్న లక్ష్యంలో భాగంగా ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూరుస్తోంది. ఎంఈఐఎల్ అత్యంత తక్కువగా రూ. 1,119.30 కోట్లు కోట్ చేసి, కాంట్రాక్టును దక్కించుకున్నట్లు టీపీజీఎల్ ఎండీ బిస్వజిత్ బసు తెలిపారు. కంపెనీకి ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) కాంట్రాక్టు లభించినట్లు వివరించారు.

టారిఫ్‌లు ఆర్నెల్లు మించి ఉండవు..

- ప్రైవేటు రంగం కీలకంగా వ్యవహరించాలి
- సీఈఏ అనంత నాగేశ్వరన్



ముంబై: అమెరికా టారిఫ్‌లకు సంబంధించి సవాళ్లు వచ్చే ఒకటి రెండు త్రైమాసికాల్లో సమసిపోతాయని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ అంచనా వేశారు. దేశం దీర్ఘకాలిక సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ప్రైవేటు రంగం మరింత ప్రముఖ పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. 2023-24లో జీడీపీ వృద్ధి 9.2 శాతం నుంచి 2024-25లో 6.5 శాతానికి తగ్గిపోవడానికి కఠిన రుణ పరిస్థితులు, లిక్విడిటీ అంశాలను కారణాలుగా పేర్కొన్నారు. సరైన వ్యవసాయ విధానాలను అమలు చేస్తే నిజమైన జీడీపీ వృద్ధికి 25 శాతం అదనపు తోడ్పాటునిస్తాయన్నారు. రత్నాభరణాలు, రొయ్యలు, టెక్స్‌టైల్స్ రంగాలపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం ఎక్కువగా ఉంటుందంటూ, వీటిని ఎదుర్కోవడం కష్టమన్నారు. ప్రభావిత రంగాలతో ప్రభుత్వం సంప్రదింపులు చేస్తున్నట్లు చెప్పారు. దీనిపై ప్రభుత్వం నుంచి చర్యలు ఉంటాయంటూ, కొంత ఓపిక పట్టాలని కోరారు. అమెరికా వాణిజ్య బృందం ఈ నెల చివర్లో భారత్‌కు చర్చలకు రానున్న నేపథ్యంలో.. అలాస్కాలో యూఎస్ అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య జరిగే సమావేశం ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంటుందన్నారు. టారిఫ్ సంబంధిత అంశాలపై దృష్టి పెడుతూ.. అదే సమయంలో ముఖ్యమైన సవాళ్లను విస్మరించరాదన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా పడే ప్రభావం, కీలక ఖనిజాల కోసం ఒకే దేశంపై ఆధారపడడం వంటి సవాళ్లను ప్రస్తావించారు. రానున్న సంవత్సరాల్లో పెద్ద ఎత్తున వ్యూహాత్మక సవాళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితుల్లో, ప్రైవేటు రంగం సైతం దీర్ఘకాల దృష్టితోనే ఆలోచించాలని సూచించారు.

విధానపరమైన మద్దతు

పరిశోధనల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిందని, తమ వంతు పెట్టుబడులు పెంచాల్సిన బాధ్యత ప్రైవేటు రంగంపై ఉన్నట్టు సీఈఏ అనంత నాగేశ్వరన్ చెప్పారు. ప్రభుత్వం నుంచి విధానపరమైన మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. దేశీయంగా వినియోగం బలంగా ఉన్నట్టు చెప్పారు. చైనాతో 100 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును ప్రస్తావిస్తూ.. దిగుమతులను మరిన్ని దేశాల మధ్య వైవిధ్యం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ప్రైవేటు రంగం కీలక పాత్ర పోషించాలని కోరారు.

క్యూ1 ఫలితాలు

బీపీసీఎల్ లాభం రెట్టింపు

రూ. 6,839 కోట్లు




న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 6,839 కోట్లను తాకింది. చమురు ధరలు తగ్గినప్పటికీ రిటైల్ ధరలను కొనసాగించడంతో మార్జిన్లు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 2,842 కోట్లు ఆర్జించింది. ఫలితంగా 2024-25లో ఆర్జించిన రూ. 13,337 కోట్లలో సగాన్ని క్యూ1లోనే ఆర్జించడం ద్వారా రికార్డ్ నెలకొల్పింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 1.28 లక్షల కోట్ల నుంచి రూ. 1.29 లక్షల కోట్లకు బలపడింది. ఈ కాలంలో ప్రతీ బ్యారల్ చమురు శుద్ధిపై 4.88 డాలర్లు మాత్రమే లభించింది.

ఫలితాల నేపథ్యంలో బీపీసీఎల్ షేరు బీఎస్‌ఈలో నామమాత్ర నష్టంతో రూ. 323 వద్ద ముగిసింది.

మ్యాక్స్ హెల్త్‌కేర్ లాభం అప్

రూ. 345 కోట్లు



న్యూఢిల్లీ: ఆరోగ్య పరిరక్షణ సంస్థ మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 17 శాతం ఎగసి రూ. 345 కోట్లను తాకింది. ఆసుపత్రులలో పడకల వినియోగం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 295 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,028 కోట్ల నుంచి రూ. 2,574 కోట్లకు బలపడింది. నికర రుణ భారం మాత్రం రూ. 1,576 కోట్ల నుంచి రూ. 1,755 కోట్లకు పెరిగింది. డెహ్రాడూన్‌లో బీటీఎస్ ద్వారా 130 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు లీజ్ ఒప్పందాన్ని బోర్డ్ అనుమతించినట్లు సంస్థ వెల్లడించింది. ఈ సౌకర్యం 2028కల్లా అందుబాటులోకి రానున్నట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో మ్యాక్స్ హెల్త్ షేరు 0.5 శాతం లాభపడి రూ. 1,268 వద్ద ముగిసింది.

ముత్తూట్ ఫైనాన్స్ అదుర్స్

65 శాతం పెరిగిన లాభం



న్యూఢిల్లీ: బంగారం తాకట్టు రుణాలను అందించే ముత్తూట్ ఫైనాన్స్ జూన్ త్రైమాసికంలో బలమైన పనితీరు నమోదు చేసింది. రూ.1,974 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని కంపెనీ ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,196 కోట్లతో పోల్చి చూస్తే 65 శాతం ఎగసింది. ఆదాయం సైతం ఇదే కాలంలో 44 శాతం పెరిగి రూ.6,485 కోట్లకు చేరుకుంది. కంపెనీ నిర్వహణలోని రుణ ఆస్తులు 37 శాతం ఎగిసి రూ.1,33,938 కోట్లకు చేరాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం చివరికి రుణ ఆస్తుల విలువ రూ.98,048 కోట్లుగా ఉంది.

బీఎస్‌ఈలో ముత్తూట్ ఫైనాన్స్ షేరు ఒక శాతం నష్టపోయి రూ.2,511 వద్ద స్థిరపడింది.

బలరామ్‌పూర్ చినీ లాభం డౌన్

రూ. 52 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం బలరామ్‌పూర్ చినీ మిల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 26 శాతంపైగా క్షీణించి రూ. 52 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 70 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 8 శాతంపైగా పుంజుకుని రూ. 1,542 కోట్లను అధిగమించింది. గత క్యూ1లో రూ. 1,422 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 1,334 కోట్ల నుంచి రూ. 1,485 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 2 శాతం నీరసించి రూ. 549 వద్ద ముగిసింది.

సీఎస్‌బీ బ్యాంక్ లాభం రూ.119 కోట్లు

పెరిగిన స్థూల ఎన్‌పీఏలు

న్యూఢిల్లీ: సీఎస్‌బీ బ్యాంక్ జూన్ త్రైమాసికానికి రూ.119 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.113 కోట్లతో పోల్చి చూస్తే 5 శాతం పెరిగింది. ఆదాయం ఇదే కాలంలో రూ.1,004 కోట్ల నుంచి రూ.1,286 కోట్లకు వృద్ధి చెందింది. వడ్డీ ఆదాయం రూ.832 కోట్ల నుంచి రూ.1,041 కోట్లకు చేరుకుంది. బ్యాంకు రుణ ఆస్తుల నాణ్యతను పరిశీలిస్తే.. స్థూల నిరర్థక ఆస్తులు (వసూలు కాని రుణాలు/ఎన్‌పీఏలు) మొత్తం రుణాల్లో 1.84 శాతానికి పెరిగాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం చివరికి ఇవి 1.69 శాతంగానే ఉన్నాయి. నికర ఎన్‌పీఏలు 0.66 శాతంగా ఉన్నాయి. ప్రొవిజన్లు, కంటింజెన్సీల రూపంలో బ్యాంక్ రూ.61 కోట్లను కేటాయించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ మొత్తం రూ.20 కోట్లుగానే ఉంది. బ్యాంక్ క్యాపిటల్ అడెక్వెసీ రేషియో 23.61 శాతం నుంచి 21.71 శాతానికి తగ్గింది.

బీఎస్‌ఈలో సీఎస్‌బీ షేరు ధర 5 శాతం నష్టపోయి రూ.385 వద్ద ముగిసింది.

సంవర్ధన మదర్సన్ లాభం వీక్

రూ. 606 కోట్లు



న్యూఢిల్లీ: ఆటోవిడిభాగాల దిగ్గజం సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 46 శాతం క్షీణించి రూ. 606 కోట్లకు పరిమితమైంది. పరిశ్రమలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 1,115 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 29,317 కోట్ల నుంచి రూ. 30,212 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 3.5 శాతం ఎగసి రూ. 93 వద్ద ముగిసింది.

శ్రీరామ్ ప్రాపర్టీస్ లాభం జూమ్

రూ. 21 కోట్లు



న్యూఢిల్లీ: రియల్టీ రంగ కంపెనీ శ్రీరామ్ ప్రాపర్టీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 18 శాతం ఎగసి రూ. 21 కోట్లకు చేరింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 17.5 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 211 కోట్ల నుంచి రూ. 262 కోట్లకు బలపడింది. బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, పుణేలలో కార్యకలాపాలు విస్తరించిన కంపెనీ 28.3 మిలియన్ చదరపు అడుగుల(ఎంఎస్ఎఫ్) విక్రయ ప్రాంతంతో 48 ప్రాజెక్టులను పూర్తి చేసింది. 36 ఎంఎస్ఎఫ్‌తో 39 ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 4 శాతం నష్టపోయి రూ. 88 వద్ద ముగిసింది.

నైకా లాభం హైజంప్

రూ. 24 కోట్లు



న్యూఢిల్లీ: ఫ్యాషన్, బ్యూటీ రిటైలర్ ఎఫ్ఎస్ఎన్ ఈకామర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 79 శాతం జంప్‌చేసి రూ. 24 కోట్లను అధిగమించిది. గతేడాది (2024-25) ఇదే కాలంలో నైకా బ్రాండ్ కంపెనీ దాదాపు రూ. 14 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,753 కోట్ల నుంచి రూ. 2,164 కోట్లకు బలపడింది. సౌందర్య విభాగం నుంచి రూ. 1,975 కోట్లు అందుకోగా.. ఫ్యాషన్ బిజినెస్ నుంచి రూ. 171 కోట్లు లభించింది.

ఫలితాల నేపథ్యంలో నైకా షేరు బీఎస్‌ఈలో 5 శాతం పుంజుకుని రూ. 215 వద్ద ముగిసింది.



గుల్‌వీర్ జాతీయ రికార్డు

న్యూఢిల్లీ: భారత లాంగ్‌డిస్టెన్స్ రన్నర్ గుల్‌వీర్ సింగ్ 3000 మీటర్ల విభాగంలో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. బుడాపెస్ట్‌లో జరిగిన ఇస్తవాన్ గ్యులాయ్ స్మారక అథ్లెటిక్స్ మీట్‌లో గుల్‌వీర్ ఈ ఘనత సాధించాడు. వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ గోల్డ్ లెవెల్ టోర్నీగా ఇస్తవాన్ గ్యులాయ్ మీట్‌కు గుర్తింపు ఉంది. నాన్ ఒలింపిక్ కేటగిరీ అయిన 3000 మీటర్ల రేసును 27 ఏళ్ల గుల్‌వీర్ 7 నిమిషాల 34.49 సెకన్లలో ముగించి ఐదో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ క్రమంలో గత ఫిబ్రవరిలో బోస్టన్ యూనివర్సిటీ డేవిడ్ హెమెరీ వాలెంటైన్ మీట్‌లో 7 నిమిషాల 38.26 సెకన్లతో తానే నెలకొల్పిన జాతీయ రికార్డును గుల్‌వీర్ బద్దలు కొట్టాడు. 5000 మీటర్లు, 10,000 మీటర్ల విభాగాల్లోనూ గుల్‌వీర్ పేరిటే జాతీయ రికార్డులు ఉన్నాయి.

పోరాడి ఓడిన అనిరుధ్ జోడీ



సిన్సినాటి (ఒహాయో): సిన్సినాటి ఓపెన్ ఏటీపీ మాస్టర్స్–1000 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్‌తోపాటు రోహన్ బోపన్న, యూకీ బాంబ్రీ జోడీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి. చివరి నిమిషంలో ఈ టోర్నీలో ఆడే అవకాశం లభించిన అనిరుధ్–రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జంట ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. పురుషుల డబుల్స్ ప్రపంచ నంబర్‌వన్ జోడీ మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడోర్)–మ్యాట్ పావిక్ (క్రొయేషియా)తో జరిగిన మ్యాచ్‌లో అనిరుధ్–రామ్‌కుమార్ ద్వయం 6–7 (5/7), 4–6తో ఓటమి పాలైంది. 79 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్–రామ్ నాలుగు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తొలి సెట్‌లో రెండు జోడీలు తమ సర్వీస్‌ను కాపాడుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో టాప్ సీడ్ జోడీ పైచేయి సాధించింది. రెండో సెట్‌లో ఒకసారి అనిరుధ్–రామ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి అరెవాలో–పావిక్ విజయాన్ని ఖాయం చేసుకున్నారు. రోహన్ బోపన్న (భారత్)–ఈథన్ క్విన్ (అమెరికా) ద్వయం 5–7, 6–3, 6–10తో 'సూపర్ టైబ్రేక్'లో మార్సెలో మెలో (బ్రెజిల్)–అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) జంట చేతిలో... యూకీ బాంబ్రీ (భారత్)–మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జోడీ 6–3, 6–7 (1/7), 4–10తో 'సూపర్ టైబ్రేక్'లో ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్)–లుకాస్ మిడ్లెర్ (ఆస్ట్రియా) జంట చేతిలో పరాజయం పాలయ్యాయి. తొలి రౌండ్‌లో ఓడిన అనిరుధ్–రామ్, బోపన్న–క్విన్, యూకీ–వీనస్ జోడీలకు 19,050 డాలర్ల (రూ. 16 లక్షల 65 వేలు) చొప్పున ప్రైజ్‌మనీ లభించింది.

తమిళ్ తలైవాస్ కెప్టెన్‌గా పవన్

ఈనెల 29 నుంచి ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్



న్యూఢిల్లీ: ఈనెల 29న ప్రారంభం కానున్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో పోటీపడే పలు జట్లు తమ కెప్టెన్‌లను ప్రకటించాయి. తమిళ్ తలైవాస్ కొత్త కెప్టెన్‌గా పవన్ సెహ్రావత్, వైస్ కెప్టెన్‌గా అర్జున్ దేశ్వాల్ వ్యవహరిస్తారు. గత సీజన్‌లో తమిళ్ తలైవాస్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. 22 మ్యాచ్‌ల్లో ఆ జట్టు కేవలం ఎనిమిది మ్యాచ్‌ల్లో గెలిచి 'ప్లే ఆఫ్స్' దశకు అర్హత సాధించడంలో విఫలమైంది. తొమ్మిదో సీజన్ వేలంలో తమిళ్ తలైవాస్ రూ. 2 కోట్ల 26 లక్షలు చెల్లించి పవన్‌ను కొనుగోలు చేసింది. అయితే ఆ సీజన్‌లో పవన్ ఆడిన తొలి మ్యాచ్‌లోనే గాయపడి సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. సీజన్ ముగిశాక పవన్‌ను తలైవస్ విడుదల చేయగా... తెలుగు టైటాన్స్ రూ. 2 కోట్ల 60 లక్షలు వెచ్చించి పవన్‌ను సొంతం చేసుకుంది. రెండు సీజన్లపాటు టైటాన్స్‌కు పవన్ ప్రాతినిధ్యం వహించినా ఆశించిన ఫలితాలు రాలేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి అయిన పవన్ 2019 దక్షిణాసియా క్రీడల్లో, 2023 ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు నెగ్గిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. మరోవైపు మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్ జట్టు కెప్టెన్‌గా అంకిత్ జగ్లాన్, వైస్ కెప్టెన్‌గా దీపక్ సింగ్... యూపీ యోధాస్ జట్టు కెప్టెన్‌గా సుమిత్ సాంగ్వాన్, వైస్ కెప్టెన్‌గా అశు సింగ్ నియమితులయ్యారు.



34 ఏళ్ల తర్వాత...

పాకిస్తాన్‌పై వెస్టిండీస్ వన్డే సిరీస్ సొంతం

- ఆఖరి మ్యాచ్‌లో 202 పరుగులతో గెలుపు
- 'శతక్కొట్టిన షై హోప్
- పాకిస్తాన్ 92 ఆలౌట్
- 6 వికెట్లతో హడలెత్తించిన జేడెన్ సీల్స్


హోప్


సీల్స్

టరూబా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న వెస్టిండీస్ క్రికెట్ జట్టు 34 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత పాకిస్తాన్‌పై వన్డే సిరీస్ విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్ 202 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసి 2–1తో సిరీస్ కైవసం చేసుకుంది. 1991 తర్వాత పాకిస్తాన్‌పై వన్డే సిరీస్ నెగ్గడం విండీస్‌కు ఇదే తొలిసారి. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. షై హోప్ (94 బంతుల్లో 120 నాటౌట్; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కట్టిపడేశాడు. జస్టిన్ గ్రీవ్స్ (24 బంతుల్లో 43 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించగా... ఎవిన్ లూయిస్ (37; 1 ఫోర్, 3 సిక్స్‌లు), రోస్టన్ ఛేజ్ (36; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. హోప్, గ్రీవ్స్ అబేధ్యమైన ఏడో వికెట్‌కు 8.1 ఓవర్లలోనే 110 పరుగులు జోడించడం విశేషం. పాకిస్తాన్ బౌలర్లలో నసీమ్ షా, అబ్రార్ అహ్మద్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ తడబడింది. జేడెన్ సీల్స్ (6/18) ధాటికి పాక్ జట్టు 29.2 ఓవర్లలో 92 పరుగులకు ఆలౌటైంది. సల్మాన్ ఆఘా (49 బంతుల్లో 30; 3 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... హసన్ నవాజ్ (13), మొహమ్మద్ నవాజ్ (23) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ (0), సయీమ్ అయూబ్ (0), అబ్దుల్లా షఫీక్ (0) డకౌట్ కాగా... మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ (9), హుసేన్ తలత్ (1) విఫలమయ్యారు. సీల్స్ ఆరు వికెట్లతో అదరగొట్టగా... గుడకేశ్ మోతీ రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. హోప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', సీల్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. వెస్టిండీస్ క్రికెట్‌ను గాడిన పెట్టేందుకు దిగ్గజాలతో ఇటీవల సమావేశం నిర్వహించిన తరుణంలోనే ఈ విజయం దక్కడం ఆ దేశ క్రికెట్‌లో కొత్త జవసత్వాలు నింపింది.

34 పాకిస్తాన్‌పై వెస్టిండీస్‌కు 34 ఏళ్ల తర్వాత ఇదే తొలి వన్డే సిరీస్ విజయం. 1991 తర్వాత ఇరు జట్ల మధ్య 11 సిరీస్‌లు జరగగా... అందులో ఒక్కసారి కూడా విండీస్ విజేతగా నిలవలేదు. పాకిస్తాన్‌పై ఏ ఫార్మాట్‌లోనైనా 2011 తర్వాత విండీస్‌కు ఇదే తొలి సిరీస్ గెలుపు.

4 పరుగుల తేడా పరంగా వెస్టిండీస్‌కు ఇది (202 పరుగులతో) నాలుగో అతిపెద్ద విజయం. 2011లో నెదర్లాండ్స్‌పై 215 పరుగులతో, 2010లో కెనడాపై 208 పరుగులతో, 2014లో న్యూజిలాండ్‌పై 203 పరుగులతో విండీస్ విజయం సాధించింది.

6/18 వన్డే క్రికెట్‌లో వెస్టిండీస్ తరఫున సీల్స్ మూడో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేసుకున్నాడు. విన్‌స్టన్ డేవిస్ (1983 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాపై 7/51), కొలిన్ క్రాఫ్ట్ (1981లో ఇంగ్లండ్‌పై 6/15) ముందున్నారు.



ఐదో స్థానంలో గుకేశ్

సెయింట్ లూయిస్ (అమెరికా): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో రెండో రోజు భారత స్టార్ దొమ్మరాజు గుకేశ్‌కు నిరాశ ఎదురైంది. మూడు గేమ్‌లు ఆడిన గుకేశ్ ఒక గేమ్‌లో ఓడిపోయి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ అయిన గుకేశ్... స్యామ్ షాంక్‌లాండ్ (అమెరికా)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో 62 ఎత్తుల్లో ఓడిపోయాడు. మాక్సిమ్ లాగ్రెవ్ (ఫ్రాన్స్)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను 41 ఎత్తుల్లో... నొదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను 59 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో ఆరో రౌండ్ ముగిశాక గుకేశ్ ఆరు పాయింట్లతో సంయుక్తంగా ఐదో స్థానంలో ఉన్నాడు. ఈ టోర్నీలో గేమ్ గెలిస్తే 2 పాయింట్లు, 'డ్రా' చేసుకుంటే ఒక పాయింట్ కేటాయిస్తున్నారు.

13వ సారి ప్రపంచ రికార్డు

- పురుషుల పోల్‌వాల్ట్‌లో డుప్లాంటిస్ ఘనత
- 6.29 మీటర్లను అధిగమించిన స్వీడన్ స్టార్



బుడాపెస్ట్: ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టడం అలవాటుగా మార్చుకున్న స్వీడన్ విఖ్యాత పోల్‌వాల్టర్ మోండో డుప్లాంటిస్ మరోసారి అదరగొట్టాడు. ఇస్తవాన్ గ్యులాయ్ స్మారక అథ్లెటిక్స్ మీట్‌లో 25 ఏళ్ల డుప్లాంటిస్ 13వసారి ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ప్రస్తుత ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ అయిన డుప్లాంటిస్ రెండో ప్రయత్నంలో 6.29 మీటర్ల ఎత్తుకు ఎగిరి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో గత జూన్‌లో 6.28 మీటర్లతో స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్ మీట్ సందర్భంగా నెలకొల్పిన ప్రపంచ రికార్డును డుప్లాంటిస్ సవరించాడు. ఐదేళ్ల క్రితం పోలాండ్‌లో జరిగిన మీట్‌లో డుప్లాంటిస్ 6.17 మీటర్ల ఎత్తుకు ఎగిరి తొలిసారి ప్రపంచ రికార్డు సృష్టించాడు. 6.16 మీటర్లతో రెనాడ్ లావిలెని (ఫ్రాన్స్) పేరిట ఉన్న వరల్డ్ రికార్డును డుప్లాంటిస్ తిరగరాశాడు. అప్పటి నుంచి డుప్లాంటిస్ వెనుదిరిగి చూడలేదు. 2020లో రెండోసారి... 2022లో మూడుసార్లు... 2023లో రెండుసార్లు... 2024లో మూడుసార్లు... 2025లో మూడుసార్లు అతను ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. 2020 టోక్యో ఒలింపిక్స్... 2024 పారిస్ ఒలింపిక్స్...2022 ప్రపంచ చాంపియన్‌షిప్, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో స్వర్ణ పతకాలు నెగ్గిన డుప్లాంటిస్ గత నాలుగేళ్లుగా డైమండ్ లీగ్‌లో విజేతగా నిలుస్తున్నాడు. 2022, 2024, 2025లలో జరిగిన ప్రపంచ ఇండోర్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ ఈ స్వీడన్ స్టార్ బంగారు పతకాలు గెలిచాడు. పురుషుల, మహిళల పోల్‌వాల్ట్ విభాగాల్లో అత్యధిక సార్లు ప్రపంచ రికార్డులు సృష్టించిన ఘనత సెర్గీ బుబ్కా (ఉక్రెయిన్), ఎలీనా ఇసిన్‌బయేవా (రష్యా)ల పేరిట ఉంది. వీరిద్దరూ 17 సార్లు చొప్పున ప్రపంచ రికార్డులు సృష్టించారు. ఇదే జోరు కొనసాగిస్తే డుప్లాంటిస్ ఏడాదిలోపు వీరి ద్దరిని అధిగమించే అవకాశాలున్నాయి.

6 నెలల్లో క్రీడా బిల్లు అమలు

విధివిధానాల రూపకల్పన ప్రారంభం

- మౌలిక సదుపాయాల పెంపుపై ప్రత్యేక దృష్టి
- క్రీడారంగంలో పారదర్శకతకు పెద్దపీట
- కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడి



న్యూఢిల్లీ: రాబోయే ఆరు నెలల్లో జాతీయ క్రీడా బిల్లు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుందని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లుకు ఆమోద ముద్ర లభించడంతో... ప్రపంచంలో క్రీడా చట్టం అమల్లోకి వచ్చిన 21వ దేశంగా భారత్ నిలిచింది. ఈ బిల్లు అమలుతో దేశ క్రీడారంగానికి ఎంతో లబ్ధి చేకూరనుంది. మౌలిక వసతులు మెరుగు పడటంతో పాటు... క్రీడల్లో పారదర్శకత పెరగనుంది. పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం లభించిన అనంతరం క్రీడా మంత్రి దీనిపై స్పందిస్తూ... ఇప్పటికే నియమ నిబంధనల రూపకల్పన ప్రారంభమైందని వెల్లడించారు. 'ఈ బిల్లు వీలైనంత త్వరగా అమల్లోకి వస్తుంది. రాబోయే ఆరు నెలల్లో వంద శాతం దీన్ని అమలు చేసే విధంగా విధివిధానాలు రూపొందిస్తున్నాం. దీనివల్ల క్రీడారంగానికి ఇతోధిక లబ్ధి చేకూరుతుంది. భారత అథ్లెట్లు అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే సమయంలో ఎలాంటి ఆంక్షలు ఉండవు. కాకపోతే జాతీయ విధానానికి అనుగుణంగా కొన్ని సూచనలు ఉంటాయి. ప్రత్యేక పరిస్థితుల్లో దీన్ని వినియోగిస్తారు. అవసరమైన పోస్టుల సృష్టి, పరిపాలనా అనుమతుల వంటి వాటి ప్రక్రియ ప్రారంభమైంది. జాతీయ క్రీడా బోర్డు (ఎన్ఎస్‌బీ), జాతీయ క్రీడా ట్రిబ్యునల్ (ఎన్ఎస్‌టీ)కు విధానపరమైన అనుమతులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం' అని మాండవీయ పేర్కొన్నారు. స్వతంత్ర భారత దేశంలో క్రీడా రంగంలో ఇది అతిపెద్ద సంస్కరణ అని క్రీడా మంత్రి వెల్లడించారు.

ప్రభుత్వానికి సర్వాధికారాలు...

బిల్లు ఆమోదంతో అంతర్జాతీయ ఈవెంట్లలో భారత అథ్లెట్లు పాల్గొనడంపై తుది నిర్ణయం తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లభించింది. గతంలోనూ ఇదే పద్ధతి కొనసాగినా... దానికంటూ ప్రత్యేకమైన విధానం లేకపోయింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో క్రీడల్లో పోటీపడాల్సి వచ్చిన సందర్భంతో పాటు దౌత్యపరంగా సఖ్యతగా లేని మరే దేశంలో పర్యటించాల్సి వచ్చినా... ప్రభుత్వ నిర్ణయం కీలకం కానుంది. 'ప్రపంచ వ్యాప్తంగా క్రీడా చట్టం అమలవుతున్న దేశాల్లో... అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే అంశంపై ఆయా దేశాల ప్రభుత్వాలదే తుది నిర్ణయం. ఇది కేవలం అసాధారణ పరిస్థితుల కోసం ఉద్దేశించి రూపొందించింది... అంతే తప్ప జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో పొరుగు దేశం కోసం తీసుకొచ్చింది కాదు. జాతీయ భద్రతా బెదిరింపులు, దౌత్య బహిష్కరణలు లేదా ప్రపంచ అత్యవసర పరిస్థితులు వంటివి సంభవించినప్పుడు ఇది ఉపయోగపడుతుంది. 2008 ముంబై దాడుల సమయం నుంచే పాకిస్తాన్‌తో భారత పురుషుల క్రికెట్ జట్టు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడటం లేదు. అప్పటి నుంచి ఇరు జట్ల మధ్య ప్రధాన మ్యాచ్‌లు తటస్థ వేదికలపై జరుగుతున్నాయి. ఆయా సమయాల్లో విదేశాంగ శాఖ అనుమతులతోనే టీమిండియా మ్యాచ్‌లు ఆడుతోంది. ఇకపై కూడా ఈ విధానమే కొనసాగుతుంది' అని కేంద్ర మంత్రి చెప్పారు.



సుదీర్ఘ చర్చల తర్వాతే...

ఈ బిల్లు ద్వారా జాతీయ క్రీడా సమాఖ్యలు, జాతీయ క్రీడా ట్రిబ్యునల్, జాతీయ క్రీడా ఎన్నికల ప్యానెల్ ఇలా అన్నింటిని జాతీయ క్రీడా బోర్డు (ఎన్ఎస్‌బీ) పర్యవేక్షణలోకి తీసుకురానున్నారు. దీంతో క్రీడల్లో పారదర్శకత పెరగడంతో పాటు వివాద పరిష్కారం మరింత సులువు కానుంది. ఆరంభంలో ఈ బిల్లుపై అవగాహన కొరవడినా... ఆ తర్వాత జాతీయ క్రీడా సమాఖ్యలు, అథ్లెట్లు, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) దీనికి మద్దతునిచ్చాయని క్రీడా శాఖ మంత్రి వెల్లడించారు. దేశ వ్యాప్తంగా అన్ని వర్గాలతో చర్చించి విశ్లేషించి 60 రౌండ్లకు పైగా 'చింతన్ శిబిర్'లను నిర్వహించి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించిన అనంతరమే బిల్లును పార్లమెంట్ ముందుంచినట్లు క్రీడా మంత్రి వెల్లడించారు. కొత్త చట్టంతో దేశ క్రీడా రంగం పురోగతి సాధిస్తుందనే నమ్మకముందన్న మాండవీయ... రాబోయే రెండు దశాబ్దాల్లో భారత్‌ను క్రీడల్లో సూపర్ పవర్‌గా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

త్వరలో స్పోర్ట్స్ మెడల్ స్ట్రాటజీ...

'జాతీయ క్రీడా సమాఖ్యల ప్రతినిధులతో రోజుల తరబడి మాట్లాడిన తర్వాతే ఈ బిల్లును రూపొందించాం. అథ్లెట్లు, కోచ్‌లు, క్రీడా విశ్లేషకులు, నిపుణులు ఇలా ఒక్కరేంటి అందరినీ సంప్రదించాం. బిల్లులోని ప్రతి నిబంధనను వారికి వివరించాం. వాటి అవసరమేంటో స్పష్టంగా చెప్పిన తర్వాత వారి అభిప్రాయాలు తీసుకున్నాం. ఎలాంటి బిల్లు కావాలో వారినే అడిగాం. వారిచ్చిన సూచనలు సలహాలతో పాటు సుప్రీం కోర్టు, హైకోర్టుల్లోని క్రీడా న్యాయవాదుల నుంచి కూడా సలహాలు తీసుకున్నాం. వారి సూచనలను పరిగణనలోకి తీసుకున్నాం. 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం ముసాయిదా క్రీడా బిల్లును రూపొందించింది. కానీ దాన్ని అమలు చేయలేకపోయింది' అని క్రీడా శాఖమంత్రి వెల్లడించారు. అథ్లెట్లతో సంప్రదింపులు జరుపుతున్న సమయంలోనే క్రీడా సమాఖ్యల్లో వారి ప్రాతినిధ్యం ఉండాలని నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. 'మహిళా అథ్లెట్ల ప్రాతినిధ్యం పెంచాం. ప్రతి జాతీయ క్రీడా సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీలో నలుగురు మహిళా అథ్లెట్లు తప్పనిసరిగా ఉండేలా నిబంధనలు తీసుకొచ్చాం. రానున్న రోజుల్లో 'స్పోర్ట్స్ మెడల్ స్ట్రాటజీ'ని కూడా తీసుకొస్తాం. ఇది అంతర్జాతీయ టోర్నీల్లో మన అథ్లెట్లు పతకాలు సాధించేందుకు రోడ్ మ్యాప్‌లా నిలవనుంది' అని మాండవీయ ఆశాభావం వ్యక్తం చేశారు.

2030 కామన్వెల్త్ గేమ్స్ బిడ్‌కు ఐఓఏ ఆమోదం

- అవకాశం దక్కితే అన్నీ క్రీడాంశాల్లో పోటీలు
- ఆర్చరీ, షూటింగ్, కబడ్డీ, ఖోఖోకు పెద్దపీట



న్యూఢిల్లీ: 2030 కామన్వెల్త్ క్రీడలను స్వదేశంలో నిర్వహించేందుకు వేసిన బిడ్‌కు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన ఒలింపిక్ సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సభ్యులంతా మూకుమ్మడిగా బిడ్‌ను ఆమోదించారు. చివరిసారిగా 2010లో కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యమివ్వగా... ఇరవై ఏళ్ల తర్వాత తిరిగి అవకాశం దక్కితే పూర్తి స్థాయిలో టోర్నమెంట్‌ను నిర్వహిస్తామని ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష వెల్లడించారు. 2026లో గ్లాస్గో వేదికగా జరగనున్న కామన్వెల్త్ క్రీడల్లో హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, షూటింగ్ వంటి పలు క్రీడాంశాలను తొలగించారు. ఈ నేపథ్యంలో తదుపరి క్రీడలకు ఆతిథ్యమిచ్చే చాన్స్ వస్తే పూర్తి స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని ఉష పేర్కొన్నారు. 'సభ్యులంతా సమష్టిగా బిడ్‌కు ఆమోదం తెలపడం ఆనందం. అహ్మదాబాద్‌లో మాత్రమే క్రీడలు నిర్వహిస్తామని చెప్పలేదు. న్యూఢిల్లీ, భువనేశ్వర్‌లో కూడా మెరుగైన సదుపాయాలు ఉన్నాయి. 2026 గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో పలు క్రీడాంశాలను తీసేశారు. 2030 ఆతిథ్య హక్కులు దక్కితే 2010లో మాదిరిగా అన్నీ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తాం' అని పీటీ ఉష తెలిపారు.

ఐఓసీ ఫండ్‌పై సానుకూలత..

జాతీయ క్రీడా సమాఖ్యల్లోని అనిశ్చితి నేపథ్యంలో... ఏడాది కాలంగా భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)కు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. గతేడాది అక్టోబర్ 8న జరిగిన ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం నుంచి నిధుల విడుదలను నిలిపివేశారు. అయితే అంతర్గత విబేధాలు అధిగమించిన నేపథ్యంలో తిరిగి గ్రాంట్‌లు వస్తానయని భారత ఒలింపిక్ సంఘం ఆశిస్తోంది. బుధవారం ఐఓఏ ప్రత్యేక సర్వసభ్య సమావేశం, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ భేటీ సజావుగా సాగడంతో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నుంచి సానుకూల స్పందన వచ్చే అవకాశం ఉందని పీటీ ఉష ఆశిస్తున్నారు.


గౌహతిలో రహదారిపై జాతీయ జెండాలు అమ్ముతున్న మహిళ


చెన్నైలోని మెరైన్ అక్వేరియంలో జాతీయ పతాకంతో స్కూబా డైవర్


న్యూఢిల్లీలో త్రివర్ణ కాంతుల్లో వెలిగిపోతున్న వికాస్ మినార్


అతిపొడవైన జాతీయ జెండాతో అహ్మదాబాద్‌లో తిరంగా యాత్ర

తమిళనాడు గవర్నర్‌కు అవమానం

- ఆర్.ఎన్.రవి చేతులు మీదుగా పట్టా స్వీకరించేందుకు నిరాకరణ
- జీన్ రాజన్ తీరు పట్ల సోషల్ మీడియాలో విమర్శలు

తిరునల్వేలి: తమిళనాడులోని మనోన్మణియమ్ సుందరనార్ యూనివర్సిటీలో బుధవారం అనూహ్య సంఘటన జరిగింది. స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి చేతులు మీదుగా డాక్టరేట్ పట్టా స్వీకరించేందుకు ఓ విద్యార్థిని నిరాకరించింది. ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది. స్నాతకోత్సవ వేదికపై గవర్నర్ పట్టాలు అందజేశారు. విద్యార్థులు వరుసగా వచ్చి తమ డిగ్రీ ఆయనకు ఇచ్చి, ఫోటో దిగిన తర్వాత పట్టాలు స్వీకరించారు. అయితే, జీన్ రాజన్ అనే విద్యార్థిని మాత్రం గవర్నర్ వైపు చూడకుండా అలాగే ముందుకెళ్లి పక్కనే ఉన్న యూనివర్సిటీ వైస్ చాన్సలర్ చంద్రశేఖర్‌కు తన డిగ్రీని అందజేసింది. దాంతో పట్టాను ఆయనే అందజేశారు. వీసీతో జీన్ రాజన్ ఫోటో తీసుకోవడానికి వీలుగా గవర్నర్ రవి కాస్త పక్కకు జరిగారు. అదేమీ ఆమె పట్టించుకోలేదు. పట్టా తీసుకొని వెళ్లిపోయింది. అనంతరం మీడియాతో మాట్లాడింది. తమిళనాడుకు గవర్నర్ రవి చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేసింది. తమిళనాడుకు, తమిళ్‌కు ఆయన వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించింది. తన పట్టాను ఎవరి నుంచి స్వీకరించాలన్నది తన ఇష్టమని పేర్కొంది. జీన్ రాజన్ నాగర్‌కోయిల్‌లో ఓ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తోంది. ఆమె అధికార డీఎంకే పార్టీ నాయకుడి భార్య అని తెలిసింది. తమిళనాడులో గవర్నర్, డీఎంకే ప్రభుత్వం మధ్య విభేదాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. జీన్ రాజన్ తీరుపట్ల సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగా గవర్నర్‌ను అవమానించారని జనం మండిపడుతున్నారు. బీజేపీ అగ్రనేత కె.అన్నామలై సైతం స్పందించారు. డీఎంకే నాయకులు చిల్లర డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. విద్యా సంస్థల్లో రాజకీయాలు ఏమిటి? అని నిలదీశారు.

కాల్పుల విరమణకు నెతన్యాహూ సంకేతం

- బందీలందరి విడుదల కోసం కృషి చేస్తున్నామని వెల్లడి
- హమాస్ లొంగిపోయినప్పుడే యుద్ధం ముగుస్తుందన్న నెతన్యాహూ

జెరూసలేం: గాజాలో కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సంకేతాలు ఇచ్చారు. మిగిలిన బందీలను ఒకేసారి విడుదల చేసే సమగ్ర ఒప్పందంపైనే దృష్టి సారించినట్లు ఆయన మంగళవారం ప్రకటించారు. తాము అన్ని రకాల ప్రయత్నాలు చేశామని, కానీ హమాస్ తమను తప్పుదారి పట్టిస్తోందని తేలిందని చెప్పారు. హమాస్ దగ్గరున్న బందీలందరినీ విడుదల చేయాలని, బతికున్నవారిని విడుదల చేయాలని, చనిపోయిన వారి మృతదేహాలను అప్పగించాలని అన్నారు. అలాగే హమాస్ లొంగిపోయినప్పుడే యుద్ధం ముగుస్తుందని స్పష్టం చేశారు. అయినా గాజా భూభాగం ఇజ్రాయెల్ భద్రతా నియంత్రణలోనే ఉంటుందని తేల్చి చెప్పారు. మధ్యవర్తిత్వం వహిస్తున్న ఈజిప్టు, ఖతార్ ఒక ఒప్పందాన్ని సిద్ధం చేస్తున్నాయని, ఇందులో గాజాలో శాశ్వత కాల్పుల విరమణ, ఇజ్రాయెల్ దళాల ఉపసంహరణకు బదులుగా బందీలందరినీ ఒకేసారి విడుదల చేసే వంటివి ఉంటాయని అరబ్ అధికారులు గతవారం వెల్లడించారు. ఆ మేరకు హమాస్ ప్రతినిధి బృందం చర్చలకోసం కైరోకు చేరుకుందని ఈజిప్టు ప్రభుత్వ న్యూస్ ఛానల్ తెలిపింది. కాల్పుల విరమణపై చాలాకాలంగా కొనసాగుతున్న పరోక్ష చర్చలు గత నెలలో విఫలమైనట్లుగా కనిపించినా.. కైరోకు హమాస్ బృందం చేరుకోవడంతో విరమణ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని స్పష్టమవుతోంది. కానీ.. హమాస్ లొంగిపోవాలని ఇజ్రాయెల్ డిమాండ్ చేస్తుండటం, ఆయుధాలను వదిలివేయడానికి హమాస్ సిద్ధంగా లేకపోవడం కాల్పుల విరమణ ఒప్పందంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

బైక్‌తో చేజ్ చేసి, ఎత్తుకెళ్లి..

యూపీలో దివ్యాంగ యువతిపై సామూహిక అత్యాచారం

బలరాంపూర్: ఉత్తరప్రదేశ్‌లోని బలరాంపూర్‌లో దారుణం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు 21 ఏళ్ల దివ్యాంగ యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. జిల్లా ఉన్నతాధికారులు నివాసముండే ప్రాంతంలోని రహదారిపై ఆమెను వెంబడించి.. కిడ్నాప్ చేసి మరీ దురాగతానికి పాల్పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు మూడు, నాలుగు బైక్‌లపై ఆమెను వెంబడిస్తుండటం, యువతి రోడ్డుపై పరుగెత్తుతుండటం ఎస్పీ నివాసంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజీలో రికార్డవ్వడం గమనార్హం. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తన ఇంటినుంచి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న తన మామ ఇంటికి వెళ్లిన యువతి.. తిరిగి తన ఇంటికి నడుచుకుంటూ వస్తోంది. దారిలో బైక్ ఆపిన వ్యక్తి ఆమెను వెంబడించారు. తరువాత ఆమెను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. అయితే యువతి ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు వెదకడం ప్రారంభించారు. చివరకు ఒక పోలీసు పోస్టు సమీపంలో పొదల్లో అపస్మారక స్థితిలో కనిపించింది. స్పృహలోకి వచ్చిన యువతి.. బైక్‌పై వచ్చిన వ్యక్తులు అత్యాచారం చేశారని వెల్లడించింది. వైద్య పరీక్షల అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి.. నిందితులకోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇద్దరు నిందితులు అంకుర్ వర్మ, హర్షిత్ పాండేలను అరెస్టు చేశారు.

ఇటలీలో బోల్తా పడిన పడవ

26 మంది వలసదారులు మృతి

రోమ్: ఇటలీలో ఘోర ప్రమాదం సంభవించింది. దాదాపు 100 మంది వలసదారులు ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో కనీసం 26 మంది మరణించినట్లు అధికారులు చెప్పారు. మరో 11 మంది గల్లంతయ్యారని, వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఇటలీకి చెందిన లాంపెడుసా ద్వీపం సమీపంలోని అంతర్జాతీయ జలాల్లో బుధవారం ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. 60 మంది వలసదారులను రక్షించామని, లాంపెడుసాకు క్షేమంగా తీసుకొచ్చామని ప్రకటించారు. ప్రమాద సమయంలో పడవలో 92 నుంచి 97 మంది ఉన్నట్లు తెలిసింది. లిబియా నుంచి బయలుదేరిన ఈ పడవ ఇటలీకి చేరుకోవాల్సి ఉంది. పడవ బోల్తా పడడానికి కారణం ఏమిటన్నది తెలియరాలేదు. వలసదారుల మరణాలు ఇటీవల పెరిగిపోతున్నాయి. ప్రమాదకర మార్గాల్లో ప్రయాణిస్తూ మృత్యువాత పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటిదాకా 675 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 30,060 మంది సముద్ర మార్గం గుండా ఇటలీకి వలస వచ్చారు.

రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదం

యూపీకి చెందిన 11 మంది మృతి

జైపూర్: రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దైవ దర్శనానికి వెళ్లిన భక్తులు ప్రయాణిస్తున్న పికప్ వ్యాన్.. ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 11 మంది మృతి చెందారు. 8 మంది గాయపడ్డారు. గాయపడినవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ఏడుగురు పిల్లలున్నారు. భక్తులు ఖాతూశ్యామ్, సలాసర్ బాలాజీ దేవాలయాలను సందర్శించుకుని తమ స్వగ్రామం యూపీలోని తమ స్వగ్రామం అస్రౌలీకి తిరిగి వస్తున్నారు. ఉదయం 4 గంటల ప్రాంతంలో దౌసా జిల్లాలోని మనోహర్‌పూర్ హైవేపై ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో పికప్ వ్యాన్‌లో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. 11 మంది మరణ వార్త తెలియడంతో ఎటాలోని అస్రౌలీలో విషాదం అలుముకుంది. ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారు కోలుకోవాలని ప్రార్థించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి అవసరమైన చికిత్స అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

డీఎంకేలో చేరిన మైత్రేయన్

చెన్నై: మాజీ ఎంపీ వి.మైత్రేయన్ అన్నాడీఎంకేను వీడి అధికార డీఎంకేలో చేరారు. అన్నా అరివాలయంలోని డీఎంకే ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో మైత్రేయన్ పార్టీ కండువా కప్పుకున్నారు. డీఎంకే సీనియర్‌నాయకులు మంత్రులు దురై మురుగన్, కేఎన్ నెహ్రూ, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆయనను పార్టీలోకి స్వాగతించారు. అంతకుముందు మైత్రేయన్ మాట్లాడారు. ఆలస్యమైనా చేరాల్సిన చోటికే చేరానని తెలిపారు. తాను ఐదేళ్లకిందటే డీఎంకేలో చేరాల్సి ఉందని, కానీ కొన్ని కారణాల వాయిదా పడిందని చెప్పారు. ఇప్పటికైనా నిర్ణయం తీసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో విజయ్ ప్రభావంపై ఇప్పుడే ఓ అంచనాకు రాలేమన్న మైత్రేయన్.. 2026 తరువాత ఎవరు పరిపాలించాలనేది ప్రజలు నిర్ణయిస్తారని వ్యాఖ్యానించారు. అయితే గత కొంతకాలంగా అన్నాడీఎంకే పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చినప్పటికీ తన అనుభవాన్ని పార్టీలో వినియోగించుకోలేదని చెబుతూ వచ్చారు. కాగా.. మైత్రేయన్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు ఏఐడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి ప్రకటించారు.

2,800 శునకాలను చంపేశాం.. ఎరువుగా మార్చేశాం

కర్ణాటక ఎమ్మెల్సీ భోజేగౌడ వెల్లడి

బెంగళూరు: వీధి కుక్కల అంశంపై కర్ణాటక శాసన మండలిలో బుధవారం వాడీవేడిగా చర్చ జరిగింది. జేడీ(ఎస్) ఎమ్మెల్యే ఎస్.ఎస్.భోజేగౌడ్ చేసిన వ్యాఖ్యలపై జంతు ప్రేమికులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను చిక్కమగళూరు మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో 2,800 శునకాలను చంపేయడాన్ని స్వయంగా పర్యవేక్షించానని ఆయన చెప్పారు. చంపిన శునకాలను చెట్ల కింద సమాధి చేశామని తెలిపారు. చెట్లకు సహజ ఎరువుగా మారడానికే ఇలా చేశామని వెల్లడించారు. అది సాధారణ విషయం అన్నట్లుగా ఆయన నవ్వుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. వీధి కుక్కలను చంపేసి, ఎరువుగా మార్చామన్న భోజేగౌడ ఒక క్రూరుడు అని సోషల్ మీడియాలో జనం మండిపడుతున్నారు.

ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు

గాజాలో 25 మంది మృతి


టెల్ అవీవ్: గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ సైన్యం రెచ్చిపోతోంది. అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటోంది. బుధవారం ఇజ్రాయెల్ జవాన్లు జరిపిన కాల్పుల్లో కనీసం 25 మంది పాలస్తీనా పౌరులు మృత్యువాత పడ్డారని స్థానిక అధికారులు వెల్లడించారు. మానవతా సాయం పంపిణీ చేసే కేంద్రాల వద్ద బారులు తీరిన జనంపై కాల్పులు జరిగాయని తెలిపారు. మరోవైపు గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకోవడం తథ్యమన్న సంకేతాలను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ మరోసారి ఇచ్చారు. త్వరలో సైనిక చర్య చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. పాలస్తీనా పౌరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. వారు బయటకు వెళ్లే అవకాశం కల్పిస్తామన్నారు. వారిని బలవంతం చేసే ప్రసక్తే లేదన్నారు. గాజాలో తిష్టవేసిన హమాస్ మిలిటెంట్లను అంతం చేయడమే ఇజ్రాయెల్ ధ్యేయమని పునరుద్ఘాటించారు. సాధారణ ప్రజలు తమ లక్ష్యం కాదన్నారు. ఇదిలా ఉండగా, గాజాలో ఇప్పటిదాకా ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో మరణించిన వారి సంఖ్య 61 వేలు దాటేసింది.

జాబిలిపై అణువిద్యుత్ సాధ్యమా?

అక్కడ మానవ ఆవాసాలు ఏర్పడితే అనుక్షణం విద్యుత్ అత్యావసరం

అందుకే నిరంతర విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా న్యూక్లియర్ ప్లాంట్ ఏర్పాటు

మరో ఐదేళ్లలో నిర్మించాలని యోచన


ప్రతీకాత్మక చిత్రం

వ్యోమగాములు తమ అంతరిక్ష పరిశోధనలకు మజిలీగా చందమామను మార్చుకోవాలని భావిస్తున్న తరుణంలో చంద్రునిపై ఏకంగా అణువిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పాలని నాసా భావిస్తోంది. అయితే 2030కల్లా అక్కడ న్యూక్లియర్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యమా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఎక్కువకాలంపాటు వ్యోమగాములు చంద్రునిపైనే స్థిరనివాసం ఏర్పర్చుకుని జీవించాలన్నా, ఎలాంటి విద్యుత్ అవాంతరాల లేకుండా శాస్త్రసాంకేతిక పరిశోధనలు కొనసాగించాలన్నా అనుక్షణం విద్యుత్ సరఫరా తప్పనిసరి. ప్రాణాధార ఉపకరణాలకూ విద్యుత్ ఖచ్చితంగా అవసరం. అందుకే ఐదేళ్లలోపే అణువిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని నాసా భావిస్తోంది. కేంద్రక విచ్ఛిత్తి (న్యూక్లియర్ ఫిజన్) సూత్రంపై పనిచేసే అణుప్లాంట్‌ను అక్కడ నెలకొల్పనున్నారు. అయితే నాసాకు పోటీగా సొంత అణువిద్యుత్ కేంద్రాలను ఏర్పాటుచేస్తామని చైనా, రష్యాలు సైతం ప్రకటించాయి. మరో పదేళ్లలో ఈ ప్లాంట్‌లను ఏర్పాటుచేస్తామని ఇప్పటికే వెల్లడించాయి.

అణు విద్యుతే ఎందుకు?

చందమామపై స్థిరనివాసం ఏర్పర్చుకునే వ్యోమగాముల నిరంతర విద్యుత్ అవసరాలను సౌరవిద్యుత్ ఏమాత్రం తీర్చలేదు. ఎందుకంటే చంద్రునిపై ప్రతిరోజూ సూర్యకాంతి ప్రసారం కాదు. 14 రోజులపాటు ఏకధాటిగా ఎండకాచి తర్వాత 14 రోజులపాటు మైనస్ డిగ్రీ సెల్సియస్ స్థాయిలో చిమ్మచీకటి నెలకొంటుంది. ఈ చీకటిమయ రోజుల్లో విద్యుత్ అవసరాలు తీర్చే ఏకైక ప్రత్యామ్నాయంగా అణువిద్యుత్‌కేంద్రం నిలుస్తోంది. అందుకే ఎంత ఖర్చయినాసరే వ్యయప్రయాసల కోర్చి చంద్రునిపై న్యూక్లియర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నాసా కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు సైతం పచ్చజెండా ఊపింది. మరో ఐదేళ్లలో అక్కడ అణువిద్యుత్ ప్లాంట్ కలను సాకారంచేయాలని కంకణం కట్టుకుంది.

చిన్నస్థాయిలో మొదలెట్టి

అణువిద్యుత్ కేంద్రంలో ఏవైనా ప్రమాదాలు సంభవించినా అక్కడ శూన్యం ఉంటుంది కనుక రేడియోధార్మికత అంతటా వ్యాపిస్తుందన్న భయం అక్కర్లేదు. థర్మల్, జల, పవన విద్యుత్‌లతో పోలిస్తే చందమామపై అణువిద్యుత్ మాత్రమే ఆచరణ సాధ్యమవుతుంది. సౌరఫలకాలతో సూర్యకాంతిని ఒడిసిపట్టి సౌర విద్యుత్‌ను తయారుచేసినా అది అక్కడి వ్యోమగాముల అవసరాలను ఏమాత్రం తీర్చలేదు. వీటిని పరిగణనలోకి తీసుకుని న్యూక్లియర్ ప్లాంట్ వైపు శాస్త్రవేత్తలు మొగ్గుచూపుతున్నారు. తొలుత కేవలం 100 కిలోవాట్ల విద్యుత్‌ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నెలకొల్పనున్నారు. భూమి మీద అయితే ఇదే 100 కిలోవాట్ల విద్యుత్‌తో 80 గృహాల విద్యుత్‌అవసరాలు తీర్చొచ్చు. దశలవారీగా ప్లాంట్‌ను విస్తరించి గణనీయమైన స్థాయిలో విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తారు.

సమస్యలెన్నో..

జల, థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లతో పోలిస్తే అణువిద్యుత్ ప్లాంట్‌కు పెద్దగా భూవిస్తీర్ణంతో పనిలేదు. కానీ చంద్రుని మీదకు ఈ మొత్తం అణువిద్యుత్ వ్యవస్థ ఉపకరణాలను మోసుకెళ్లాలంటే చాలా చాలా కష్టం. పైగా ఇవి రాకెట్‌లో తరలించేంత తేలికగా ఉండాలి. అత్యధిక బరువులను ఇప్పుడున్న రాకెట్లు అస్సలుమోయలేవు. ఒకవేళ అధిక బరువులను మోసుకెళ్లేలా వ్యోమనౌకలను డిజైన్‌చేసి రూపొందించినా అవి అంత బరువును మోస్తూకూడా జాగ్రత్తగా చంద్రునిపై ల్యాండ్ కావాల్సి ఉంటుంది. ఏమాత్రం తేడా వచ్చి అది క్రాష్ ల్యాండ్ అయినా వేలకోట్ల రూపాయల నష్టం ఖాయం. భూమిపై అయితే అణువిద్యుత్ కేంద్రాన్ని ఎంతో మంది సాంకేతిక నిపుణులు తీరిగ్గా, నిశితంగా తనిఖీచేసి నిర్మిస్తారు. చంద్రునిపై ఈ ప్లాంట్‌ను నిర్మించాలంటే కార్మిక సిబ్బంది దొరకరు. ఉన్న ఆ కొద్దిపాటి వ్యోమగాములే అణుప్లాంట్ ఉన్నతాధికారుల అవతారమెత్తి ప్లాంట్‌ను బిగించాల్సి ఉంటుంది. అణువిద్యుత్ ప్లాంట్ నుంచి అత్యధిక స్థాయిలో వేడిమి వెలువడుతుంది. దానికి చల్లబరిచే కూలింగ్ వ్యవస్థలను ఏర్పాటుచేయాలి. వాటిని కూడా భూమి మీద నుంచే ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. ఇదంతా ఎంతో శ్రమ, వ్యయంతో కూడిన వ్యవహారం. శూన్యస్థితిని తట్టుకునేలా వినూత్న రీతిలో ప్లాంట్‌ను డిజైన్ చేయాల్సి ఉంటుంది. రేడియోధార్మిక వ్యర్థాల పారబోత, ప్లాంట్ పాడైతే రిపేర్లు వంటి ఎన్నో అవరోధాలు అక్కడి హఠాత్తుగా స్వాగతం పలుకుతాయి.వీటిని తట్టుకుంటూనే ప్లాంట్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. ట్రంప్ హయాంలో నాసాకు అంతరిక్ష పరిశోధనా బడ్జెట్‌లో భారీ కోత పెట్టిన నేపథ్యంలో ఇతర మార్గాల్లో ఆదాయం సమకూర్చి ఈ ప్రాజెక్ట్‌ను సఫలీకృతం చేయాల్సి ఉంది. ఇన్ని బాలారిష్టాలను దాటుకుని ప్లాంట్ ఏర్పాటు సుసాధ్యమైతే జాబిలిపై మానవనివాసం ఎలాంటి జంజాటాలు లేకుండా హాయిగా సాగుతుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో రూడీ జోరు

క్లబ్ ఎన్నికల్లో రూడీ ప్యానెల్ ఘన విజయం

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ ఢిల్లీలోని 'కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా'పై 25 ఏళ్ల ఆధిపత్యాన్ని కొనసాగించారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీకే చెందిన ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి సంజీవ్ బాల్యాన్‌పై రూడీ 100 ఓట్ల తేడాతో విజయం సాధించారు. క్లబ్ పాలకవర్గానికి మంగళవారం జరిగిన ఎన్నికల ఫలితాలను బుధవారం తెల్లవారుజామున ప్రకటించారు. బాల్యాన్‌కు 291 ఓట్లు రాగా, రూడీకి 391 ఓట్లు వచ్చాయి. అతని ప్యానెల్‌లో ఒక సభ్యుడు మినహాయించి 11 మంది కార్యనిర్వాహక సభ్యులు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈ క్లబ్‌లో 1,295 మంది ప్రస్తుత, మాజీ ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. 680 కంటే ఎక్కువ చెల్లుబాటు అయ్యే ఓట్లు పోలయ్యాయి. ఇది అత్యధిక ఓట్లు పోలైన ఎన్నికల్లో ఒకటిగా నిలిచింది. రూడీ బిహార్‌లోని సరన్ నుంచి ఐదోసారి లోక్‌సభకు ఎంపికయ్యారు. కొత్త కార్యవర్గంలో బీజేపీ, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీతో సహా వివిధ పార్టీల సభ్యులున్నారు. గెలుపొందిన అనంతరం రూడీ బుధవారం మీడియాతో మాట్లాడారు. 'పార్లమెంటేరియన్లకు, ఓటు వేయడానికి వచ్చిన వారందరి విజయం ఇది. నేను 100 కంటే ఎక్కువ ఓట్లతో గెలిచి ఉండవచ్చు. కానీ అందరూ పార్టీలకతీతంగా ఓటేశారు. నా ప్యానెల్‌లో అన్ని పార్టీలు, స్వతంత్ర ఎంపీలున్నారు. రెండు దశాబ్దాలుగా నేను చేసిన పనులకు, ప్రయత్నాలకు ఇది ఫలితం' అని అన్నారు.

ఇప్పుడు ఈసీని ప్రయోగిస్తున్నారు

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకే బీజేపీ జిమ్మిక్కులు

విరుచుకుపడిన ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్

పాట్నా: ప్రత్యర్థులపై సీబీఐ, ఈడీ లాంటి దర్యాప్తు సంస్థల ప్రయోగాలు పనిచేయడం లేదని తేలాక బీజేపీ ఇప్పుడు ఈసీని ప్రయోగిస్తోందని ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఆరోపించారు. రాబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అధికారం కట్టబెట్టడానికే ఈసీ ఈ ద్రోహానికి పాల్పడుతోందని విమర్శించారు. పాట్నాలో జరిగిన విలేకరుల సమావేశంలో తేజస్వి యాదవ్ బీజేపీపై విరుచుకుపడ్డారు. ఎన్నికల సంఘం ఇలాగే ద్రోహం చేయాలని నిర్ణయించుకుంటే తాము ఎన్నికలను బహిష్కరించడానికి కూడా వెనుకాడబోమని మరోమారు స్పష్టం చేశారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించడానికి ఈసీ నిస్సంకోచంగా ప్రయత్నిస్తోంది. ప్రత్యర్థులను బెదిరించడానికి సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖ వంటి ఏజెన్సీలన్నింటిని ప్రయోగించిన బీజేపీ.. ఇప్పుడు రాజ్యాంగ బద్ధమైన ఈసీని తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటోంది. ఈ ఆటలో భాగంగా ఈసీ చాలామంది ఓటర్లకు ఒకటి కంటే ఎక్కువ ఓటరు గుర్తింపు కార్డులను అందిస్తోంది. గతేదాది నేను విజయ్ కుమార్ సిన్హా కేసును బయటపెట్టాను. ఈ రోజు ముజఫర్‌పూర్ మేయర్ నిర్మలా దేవీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆమె రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అయినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు' అని తేజస్వి అన్నారు. ఇంత వివాదం నడుస్తున్నా ఈసీ ఎప్పుడూ మీడియా ముందుకు రాకపోవడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మీడియాతో మాట్లాడరు, బీహార్ ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడరు, చివరకు ఇప్పుడు ఎన్నికల సంఘం కూడా వారినే అనుసరిస్తున్నట్లు అనిపిస్తోందని తేజస్వి వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజాస్వామ్యం తీవ్ర ప్రమాదంలో పడినట్లు కనిపిస్తోందన్నారు. ఆగస్టు 17న రోహ్తాస్ జిల్లాలో ప్రారంభమయ్యే ఓటర్ల హక్కు యాత్రలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి పాల్గొంటానని ఆయన స్పష్టం చేశారు. గుజరాత్ నుంచి వచ్చిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిఖూభాయ్ దల్సానియా బీహార్‌లో ఓటరుగా నమోదు చేసుకోవడంపై తేజస్వి అభ్యంతరం వ్యక్తం చేశారు.

మేయర్‌కు రెండు ఓటర్ ఐడీలు..

నోటీసు జారీ చేసిన ఈసీ

పాట్నా: బిహార్‌లోని ముజఫర్‌పూర్ మేయర్, బీజేపీ నేత నిర్మలా దేవికి ఎన్నికల సంఘం(ఈసీ) బుధవారం నోటీసు జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వేర్వేరు పుట్టిన తేదీలతో రెండు ఓటర్ ఐడీ కార్డులు కలిగి ఉండడంపై ఈ నెల 16వ తేదీలోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అంతేకాకుండా నిర్మలా దేవి బంధువులైన మనోజ్ కుమార్, దిలీప్‌కుమార్‌లకు ఈసీ నోటీసులు జారీ చేసింది. వారిద్దరికీ ఒకే అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రెండు ఓటర్ ఐడీలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. నిర్మలా దేవికి, ఆమె బంధువులు రెండు చొప్పున ఓటర్ గుర్తింపు కార్డులు కలిగి ఉన్నట్లు తొలుత ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు.

బిహార్‌లో ఓటు అధికార్ యాత్ర

17న రాహుల్, 'ఇండియా'కూటమి సారథ్యంలో..

న్యూఢిల్లీ: బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై ఇప్పటికే పార్లమెంట్ వేదికగా ఉద్యమిస్తున్న విపక్షాల 'ఇండియా'కూటమి ఇప్పుడు బిహార్‌లో ఉద్యమబాటలో పయనించనుంది. ఓటు అధికార్ యాత్ర పేరిట రాష్ట్రంలో ఆగస్టు 17వ తేదీన ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సారథ్యంలో 'ఇండియా'కూటమి పార్టీల నేతలు ఈ యాత్రను ముందుండి నడిపిస్తారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం వెల్లడించారు. బుధవారం బిహార్‌లోని ససారమ్‌లో యాత్రకు సంబంధించిన సన్నాహక ఏర్పాట్లను స్వయంగా విపక్షాల 'ఇండియా'కూటమి పార్టీల నేతలతో కలసి చర్చించానని వేణుగోపాల్ చెప్పారు. సెప్టెంబర్ ఒకటో తేదీన పట్నాలోని గాంధీమైదాన్‌లో భారీ ర్యాలీ చేపట్టి యాత్రకు ముగింపు పలుకుతామని ఆయన వెల్లడించారు.

సురేశ్ రైనాపై ఈడీ ప్రశ్నల వర్షం

న్యూఢిల్లీ: చట్టవ్యతిరేక బెట్టింగ్ యాప్‌ల కోసం ప్రచారంచేసిన ఉదంతంలో మాజీ భారతీయ క్రికెటర్ సురేశ్ రైనాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బుధవారం ఎనిమిది గంటలపాటు విచారించి ప్రశ్నల వర్షం కురిపించింది. సెంట్రల్ ఢిల్లీలోని ఈడీ ఆఫీస్‌కు ఉదయం 11 గంటలకు వచ్చిన రైనా రాత్రి 8 గంటలకు వెళ్లిపోయారు. మనీలాండరింగ్ నిరోధక (పీఎంఎల్‌ఏ) చట్టం కింద అధికారులు రైనా వాంగ్మూలాన్ని నమోదుచేసుకున్నారు. క్రీడాసంబంధ బెట్టింగ్ యాప్ అయిన 1 Xbet కోసం రైనా ప్రమోట్ చేశారని ఈడీ ప్రధానంగా ఆరోపిస్తోంది. యాప్ తరఫున ఎవరు మిమ్మల్ని కలిశారు? ఎవరు మీకు ప్రమోషన్ ఫీజు చెల్లించారు? నగదు, డిజిటల్ రూపంలో ఎంత చెల్లించారు? ఏఏ రాష్ట్రాల్లో ఏ తరహా ప్రమోషన్ చేశారు? ఇది చట్టవ్యతిరేక యాప్ అని మీకు ముందే తెలుసా? అంటూ పలు రకాల ప్రశ్నలు సంధించి సమాధానాలను రాబట్టింది. బెట్టింగ్ యాప్‌ల మోసాలకు సంబంధించిన ఈ కేసులో ఇప్పటికే ఈడీ గూగుల్, మెటా ప్రతినిధులను పిలిచి ప్రశ్నించింది. భారత్‌లో ఆన్‌లైన్‌బెట్టింగ్ యాప్‌ల మార్కెట్ విలువ ఏకంగా100 బిలియన్ డాలర్ల మార్క్‌ను దాటడం గమనార్హం. ఇది ఏటా 30 శాతం వృద్ధితో మరింతగా విస్తరిస్తోంది. భారత్‌లో 22 కోట్ల మంది ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను వినియోగిస్తున్నారు. వారిలో సగం మంది సాధారణ యూజర్లుగా కొనసాగుతున్నారు. వందలాది ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ప్లాట్‌ఫామ్‌లను మూసేయాలంటూ 2022 ఏడాది నుంచి 2025 జూన్‌దాకా 1,524 సార్లు ఉత్తర్వులు జారీచేశామని కేంద్రం ఇటీవల లోక్‌సభకు తెలిపింది.

రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు రాష్ట్ర జాబితాలోని అంశాలేన్ని?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత రాజ్యాంగం దేశంలో సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. రాజ్యాంగంలో ఎక్కడా సమాఖ్య అనే పదాన్ని ప్రయోగించచపోయినా.. భారతదేశం సమాఖ్య రాజ్యమే. ఎందుకంటే సమాఖ్య మౌలిక లక్షణాలన్నీ భారత సమాఖ్యలో ఉన్నాయి. సమాఖ్యలో అత్యంత ముఖ్య లక్షణం అధికార విభజన. రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య చాలా విస్తృతమైన, స్పష్టమైన అధికార విభజన జరిగింది.

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య మూడు రకాల సంబంధాలను పొందుపర్చారు.

1. శాసన సంబంధాలు (Legislative Relations)–11వ భాగం, ప్రకరణ 245 నుంచి 255
2. పరిపాలనా సంబంధాలు (Administrative Relations)– 11వ భాగం, ప్రకరణ 256 నుంచి 263
3. ఆర్థిక సంబంధాలు(Financial Relations) – 12 భాగం, ప్రకరణ 264 నుంచి 300

కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన సంబంధాలు

భాగం 11లోని ప్రకరణలు 245 నుంచి 255 వరకు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న శాసన సంబంధాలను పొందుపరిచారు. శాసన సంబంధాలు అంటే పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు ఏయే అంశాలపై చట్టాలు చేయవచ్చో వివరించే ప్రక్రియ.

ప్రకరణ–245: కేంద్ర పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల చట్టాల భౌగోళిక పరిమితులు:

- పార్లమెంట్ రూపొందించే చట్టాలు దేశంలో అన్ని ప్రాంతాలకు,అన్ని సంస్థలకు వర్తిస్తాయి. ఇవి ఇతర దేశాల్లో నివసిస్తున్న భారతీయులకు కూడా వర్తిస్తాయి(ప్రకరణ 245(2)). ఈ అధికారాన్నే 'Extra Territorial Legislation' లేదా 'సీమాంతేతర చట్టాలు' అంటారు.
- రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాలు ఆ రాష్ట్ర భూభాగాలకు మాత్రమే వర్తిస్తాయి. వీటికి సీమాంతేతర చట్టాల పరిధి లేదు.

పార్లమెంట్ చట్టాలపై పరిమితులు:

- పార్లమెంట్ చేసిన చట్టాలు కొన్ని ప్రాంతాలకు.. ముఖ్యంగా కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలి, డామన్–డయ్యూ ప్రాంతాలకు వర్తించవు. వీటి పరిపాలనను రాష్ట్రపతే నేరుగా నియంత్రిస్తారు. పరిపాలన ఆదేశాలను రాష్ట్రపతి జారీ చేస్తారు. ఇవి పార్లమెంట్ చట్టాలతో సమాన ప్రతిపత్తిని కలిగి ఉంటాయి.
- రాష్ట్రాల్లోని కొన్ని షెడ్యూల్డ్ ప్రాంతాలకు కూడా పార్లమెంట్ చట్టాలు వర్తించవు. ఈ ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తారు. అసోం గవర్నర్‌కు ఆ రాష్ట్రంలోని స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లా మండలి (Autonomous District Council)కి సంబంధించి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.
- మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాల్లో స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లాలపై రాష్ట్రపతికి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

ప్రకరణ–246: కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన: కేంద్ర,రాష్ట్రాల మధ్య అధికారాలను మూడు జాబితాల్లో విభజించారు. వీటికి సంబంధించిన వివరాలను ఏడో షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

జాబితాలు

కేంద్ర జాబితా (Union List) ప్రకరణ 246 (1): రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ప్రారంభంలో ఈ జాబితాలో 97 అంశాలున్నాయి. తర్వాత ఈ జాబితాకు 2ఎ, 92ఎ, 92బి, 92సి అంశాలను చేర్చారు. 33లో ఉన్న అంశాలను తొలగించారు. ప్రస్తుతం ఇందులో వంద అంశాలున్నాయి.

జాబితాలోని ముఖ్యాంశాలు: దేశ రక్షణ, అంతర్జాతీయ వ్యవహారాలు, బ్యాంకింగ్, కరెన్సీ, అణుశక్తి, బీమా, ప్రసారాలు, వైమానిక, నౌకా సర్వీసులు మొదలైన జాతీయ ప్రాముఖ్యం ఉన్న విషయాలను కేంద్ర జాబితాలో పొందుపరిచారు. కేంద్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలను రూపొందించవచ్చు, సవరించవచ్చు, రద్దు చేయవచ్చు.

రాష్ట్ర జాబితా (State List) ప్రకరణ 246(3): రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు ఇందులో 66 అంశాలున్నాయి. ప్రస్తుతం 61 అంశాలు మాత్రమే ఉన్నాయి. ఈ జాబితాలోని ఎంట్రీ 11, 19, 20, 29, 36లోని అంశాలను ఉమ్మడి జాబితాలోకి మార్చారు.

జాబితాలోని ముఖ్యాంశాలు: శాంతి భద్రతలు, పోలీస్, వ్యవసాయం, నీటిపారుదల, స్థానిక సంస్థలు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, జైళ్లు, గ్రంథాలయాలు, మార్కెట్లు, వడ్డీ వ్యాపారం తదితర స్థానిక ప్రాముఖ్యం ఉన్న అంశాలను ఈ జాబితాలో పొందుపరిచారు.

ఉమ్మడి జాబితా (Concurrent List) ప్రకరణ 246(2): ప్రారంభంలో ఈ జాబితాలో 47 అంశాలు ఉండేవి. ప్రస్తుతం 52 ఉన్నాయి. ఈ జాబితాలో ఎంట్రీ నంబర్ 11ఎ న్యాయపాలన, సబార్డినేట్ కోర్టుల వ్యవస్థీకరణ, 17ఎ అడవులు, 17బి వన్యప్రాణుల సంరక్షణ, 20ఎ జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ, 25 సాధారణ విద్య, సాంకేతిక విద్య, 33ఎ తూనికలు, కొలతలు.

పై అన్ని అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలోకి చేర్చారు. అందువల్ల ఉమ్మడి జాబితాలోని అంశాలు 47 నుంచి 52కు పెరిగాయి.

కేంద్ర, రాష్ట్ర శాసనాల మధ్య వైరుధ్యం

ఉమ్మడి జాబితాలోని అంశాలపైన పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేయవచ్చు. అయితే కేంద్ర శాసనానికి, రాష్ట్ర శాసనానికి మధ్య వైరుధ్యం ఏర్పడితే.. అంతిమంగా కేంద్ర శాసనానికే ఆధిక్యత ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మినహాయింపు ఉంటుంది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని అంశాలపై రాష్ట్రపతి పూర్వానుమతితో రాష్ట్ర శాసనసభ చట్టం చేసి, ఇదే అంశంపై పార్లమెంట్ కూడా చట్టం చేస్తే.. పార్లమెంట్ చేసిన చట్టం రాష్ట్ర శాసనసభ చేసిన చట్టానికి విరుద్ధమైతే, రాష్ట్ర శాసనసభ చేసిన చట్టమే చెల్లుబాటవుతుంది.

కేంద్ర, రాష్ట్ర చట్టాల వివాదాల పరిష్కారానికి సంబంధించిన సూత్రాలు (Doctrines)

కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజనకు సంబంధించి వివాదాలు తలెత్తితే.. వాటిని పరిష్కరించడానికి సుప్రీంకోర్టు కొన్ని న్యాయ సూత్రాలను అవలంబిస్తుంది. ప్రతి సూత్రానికి అంతర్గతంగా ఒక పరమార్థం ఉంటుంది. వాటిని కింది విధంగా వివరించవచ్చు.

డాక్ట్రిన్ ఆఫ్ పిత్ అండ్ సబ్‌స్టాన్స్: సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన జరిగిన సందర్భాల్లో ఒక నిర్ణీత అంశం లేదా చట్టాన్ని ఒక జాబితాలో పొందుపరుస్తారు. ఆ జాబితాలో పొందుపరిచిన అంశం, మరో జాబితాలో పొందుపరిచిన అంశాన్ని సందర్భానుసారం కొంత వరకు అతిక్రమించినా, ఆ చట్టాలను రద్దు చేయరు. అలాంటి సందర్భాల్లో ఆ అంశంలోని సారాంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. దీన్నే 'పిత్ అండ్ సబ్‌స్టాన్స్' అంటారు. ఉదాహరణకు, మనీ లెండింగ్ (రుణం ఇవ్వడం) అనే అంశం రాష్ట్ర జాబితాలో ఉంది. దీనికి సాక్ష్యంగా ఆధారంగా రాసే ప్రామిసరీ నోటు అనే అంశం కేంద్ర జాబితాలో ఉంది. మనీ లెండింగ్‌ను నియంత్రిస్తూ రాష్ట్రం చేసిన చట్టం సందర్భానుసారం కేంద్ర జాబితాలోని ప్రామిసరీ నోటు అనే అంశంలోకి చొరబడ్డా.. రాష్ట్రం తన శాసనసభ పరిధిని అతిక్రమించిందనే నెపంతో న్యాయస్థానం ఆ చట్టాలను కొట్టివేయదు. ఎందుకంటే ఆ చట్టంలోని ప్రధాన సారాంశం రాష్ట్ర జాబితాలోనే ఉంది. అనుకోకుండా ఆ చట్ట పరిధి కేంద్ర జాబితాలోకి విస్తరించినా.. ప్రధాన ఉద్దేశం రాష్ట్ర జాబితాలోని అంశాన్ని నియంత్రించడమే అవుతుంది. కేంద్ర, రాష్ట్రాలు తమ పరిధులను అతిక్రమించాయనే సమస్య ఉత్పన్నమైనప్పుడు న్యాయస్థానం'పిత్ అండ్ సబ్‌స్టాన్స్' సూత్రం ప్రకారం తీర్పులు చెబుతుంది. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సదరన్ ఫార్మాస్యూటికల్ వర్సెస్ కేరళ ప్రభుత్వం (1981), స్టేట్ ఆఫ్ రాజస్థాన్ వర్సెస్ చావ్లా కేసుల్లో స్పష్టీకరించింది.



డాక్ట్రిన్ ఆఫ్ కలరబుల్ లెజిస్లేషన్: కేంద్ర రాష్ట్రాల అధికారాల విభజన ఉద్దేశం రెండింటి మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తకుండా చూడటం. అయితే శాసన శాఖ తన పరిధిలో లేని అంశాలను ఉన్నట్లుగా ఊహించుకుని దురుద్దేశపూర్వకంగా చట్టాలు చేస్తే, అలాంటి చట్టాలను కలరబుల్ లెజిస్లేషన్ అంటారు. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం.. ప్రత్యక్షంగా చేయలేని పనిని పరోక్షంగానూ చేయకూడదు (You can not do indirectly what you can not do directly i.e. no person who has no title can not transfer it to others) ఉదాహరణకు 'రైల్వేలు' కేంద్ర జాబితాలో ఉంది. ఆ అంశాలపై రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేస్తే, ఆ చట్టాలు కలరబుల్ లెజిస్లేషన్ అవుతాయి.

డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ: రిపగ్నెన్సీ అంటే ఇష్టం లేకపోవడం లేదా అసంబద్ధం అని అర్థం. ఒక చట్టం ఒక పనికి అనుమతించి, మరో చట్టం ఆ పనికి అనుమతిని నిరాకరిస్తే దాన్ని అసంబద్ధం లేదా డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ అంటారు. ఉమ్మడి జాబితాలోని అంశాలపై పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు చేయవచ్చు. రెండింటి మధ్య వివాదం ఏర్పడితే అంతిమంగా కేంద్ర చట్టమే చెల్లుబాటవుతుంది. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు రెండూ పరస్పర విరుద్ధమైతే, డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ ప్రకారం ఆ చట్టాల చెల్లుబాటును నిర్ణయిస్తారు.

ఉదాహరణకు హత్య నేరానికి ఐ.పి.సి. 302 ప్రకారం శిక్ష పడుతుంది. బాల నేరస్థులకు సంబంధించి ఒకవేళ ఆ రాష్ట్రం ప్రత్యేక చట్టం చేసి ఉంటే, ఆ రాష్ట్ర చట్టం ప్రకారం వారిని విచారించి శిక్షించాల్సి ఉంటుంది. అలాంటి చట్టాలకు సి.ఆర్.పి.సి.లో మినహాయింపు ఉంటే రాష్ట్ర చట్టాలే చెల్లుబాటు అవుతాయి.

డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్: రెసిడ్యూరీ అంటే మిగిలిపోయిన భాగం అని అర్థం. మూడు జాబితాల్లో ప్రస్తావించని అంశాలను అవశిష్ట అధికారాల పేరుతో కేంద్రానికి ఇచ్చారు. కాబట్టి అవశిష్ట అధికారాలపై చట్టం చేసే అధికారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికే ఉంటుంది. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం కేంద్ర ప్రభుత్వాన్ని బలోపేతం చేయడమే.

ఉదాహరణకు పార్లమెంట్ అవశిష్ట అంశాలకు సంబంధించి పార్లమెంట్ సంపద పన్ను చట్టం–1957; బహుమతి పన్ను చట్టం–1957; కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్–1952 మొదలైన చట్టాలను రూపొందించింది. ఇవి డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్‌లోకి వస్తాయి.

డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆస్తులపై పరస్పరం పన్నులు విధించుకోడానికి మినహాయింపు ఉంది. దీన్ని డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్ అంటారు. ప్రకరణలు 285, 287, 288, 289లో వీటిని ప్రస్తావించారు.

ప్రకరణ 247 ప్రకారం.. కేంద్ర జాబితాలో పొందుపరచిన అంశాలకు సంబంధించి అదనపు న్యాయస్థానాలను ఏర్పాటు చేసే అధికారం పార్లమెంట్ కలిగి ఉంటుంది.

అవశిష్ట జాబితా (Residual List) ప్రకరణ 248(1): అవశిష్ట జాబితాలోని అంశాలపై పార్లమెంట్ మాత్రమే చట్టం చేస్తుంది. అవశిష్ట జాబితా అంటే కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో ప్రస్తావించని అంశాలు.

ప్రకరణ 248 (2) ప్రకారం.. రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో లేని అంశాలకు పన్ను విధించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.

అమెరికా, ఆస్ట్రేలియాలో అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు ఇచ్చారు. కెనడాలో అవశిష్ట అధికారాలు కేంద్రానికి ఇచ్చారు. భారత ప్రభుత్వ చట్టం –1935 ప్రకారం అవశిష్ట అధికారాలను ఆనాటి గవర్నర్ జనరల్‌కు ఇచ్చారు.

ప్రకరణ 249 (1) ప్రకారం.. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా రాజ్యసభ 2/3 వంతు సభ్యుల మెజారిటీతో ఒక తీర్మానం చేస్తే.. ఆ తీర్మానాన్ని లోక్‌సభ కూడా ఆమోదిస్తే ఆ అంశంపై పార్లమెంట్ చట్టాలను రూపొందిస్తుంది. ఆ విధంగా రాష్ట్ర జాబితాలో అంశాలపై పార్లమెంట్ చేసిన చట్టాలు ఒక సంవత్సరం వరకే అమల్లో ఉంటాయి (ప్రకరణ 249(2)). అవసరమైతే తీర్మానం ద్వారా మరో ఏడాది వరకు పొడిగించవచ్చు. గడువు ముగిసిన తర్వాత, ఆరు నెలల వరకు మాత్రమే అలాంటి చట్టాలు అమల్లో ఉంటాయి. తాత్కాలికంగా కేంద్ర జాబితాలోకి బదలాయించిన అంశం తిరిగి రాష్ట్ర జాబితాలోకి చేరుతుంది.

ప్రకరణ 250 (1) ప్రకారం.. దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి (ప్రకరణ 352) అమల్లో ఉన్నప్పుడు, పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశాలపై శాసనాలను రూపొందిస్తుంది. అలాంటి శాసనం అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నంత కాలం చెల్లుబాటవుతుంది.

ప్రకరణ 250(2)ప్రకారం.. అత్యవసర పరిస్థితి ఎత్తేసిన ఆరు నెలల తర్వాత ఆ చట్టాలు రద్దవుతాయి.

ప్రకరణ 251 ప్రకారం.. ప్రకరణలు 249, 250 అనుసరించి పార్లమెంట్ రాష్ట్ర జాబితాలో చేసిన చట్టాలకు, అంతకుముందే రాష్ట్రాలు వాటి జాబితాలో చేసుకున్న చట్టాలకు వైరుధ్యం ఏర్పడితే.. పార్లమెంట్ చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది.

ప్రకరణ 252 (1) ప్రకారం.. రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు ఉమ్మడి ప్రయోజనార్థం రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేయమని కోరితే.. అలా కోరిన రాష్ట్రాలకు వర్తింపజేస్తూ రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలు రూపొందిస్తుంది.

ఉదాహరణకు ఎస్టేట్ సుంకం చట్టం–1955; ప్రైజ్ కాంపిటీషన్ చట్టం–1955; వన్యప్రాణి సంరక్షణచట్టం–1972; జలకాలుష్య నివారణ చట్టం–1974; పట్టణ, ఆస్తుల పరిమితి చట్టం–1976; మానవ అవయవాల మార్పిడి చట్టం–1994 మొదలైన చట్టాలను పార్లమెంట్ రూపొందించి రాష్ట్రాలకు వర్తింపజేసింది.

ప్రకరణ 252(2) ప్రకారం.. పైన పేర్కొన్న విధంగా రూపొందించిన శాసనాన్ని సవరించే లేదా రద్దు చేసే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది.

ప్రకారణ 253 ప్రకారం.. అంతర్జాతీయ ఒప్పందాల అమలు కోసం అవసరమైన శాసనాలను రూపొందించే అధికారం పార్లమెంట్‌కు ఉంది. ఈ ఒప్పందాల అమలుకు రాష్ట్రాల చట్టాలు అవరోధాలుగా ఉంటే వాటిని పార్లమెంట్ సవరించవచ్చు.

ఉదాహరణకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక అవసరాల రక్షణ చట్టం–1947; జెనీవా ఒప్పందం చట్టం–1960; హైజాకింగ్ వ్యతిరేక చట్టం–1982 లాంటి చట్టాలను పార్లమెంట్ రూపొందించింది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని వైరుధ్యాలను తొలగించడం, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి రాష్ట్ర విధానసభలు రూపొందించిన శాసనం విరుద్ధంగా ఉంటే, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి ఆధిక్యత ఉంటుంది.

ప్రకరణ 255 ప్రకారం.. కొన్ని చట్టాలను రూపొందించే సమయంలో రాష్ట్రపతి, గవర్నర్‌ల పూర్వానుమతి అవసరం. ఒకవేళ అలాంటి చట్టాలను వీరి పూర్వానుమతి లేకుండా రూపొందిస్తే అవి చెల్లవు అని చెప్పే అధికారం రాష్ట్రపతి, గవర్నర్‌లకు ఉండదు. వారి అనుమతి తీసుకోవడమనేది కేవలం ప్రక్రియకు సంబంధించిందే కానీ, వారి అధికారాలకు చెందింది కాదు.

ఇతర భాగాల్లోని ప్రకరణలు (18వ భాగం)

ప్రకరణ 352 ప్రకారం.. జాతీయ అత్యవసర పరిస్థితి సమయంలోనూ కేంద్రం రాష్ట్ర జాబితాలో చట్టాలు చేయవచ్చు.

ప్రకరణ 356 ప్రకారం.. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినప్పుడు రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ రాష్ట్ర శాసనసభ తరఫున చట్టాలను రూపొందించవచ్చు.

కరగండా బొగ్గు క్షేత్రం ఏ దేశంలో ఉంది?

భారతదేశం - ఖనిజ వనరులు

వజ్రాలు: ప్రపంచంలో ప్రస్తుతం వజ్రాల ఉత్పత్తిలో రష్యా, బోట్స్‌వానా, కాంగో, కెనడా దేశాలు మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో నిల్వలు,ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్,ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాలను ఆక్రమించాయి. కింబర్లైట్ శిలాస్థరాల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

గనుల విస్తరణ:

- మధ్యప్రదేశ్ – కేన్ నది ఒడ్డున ఉన్న పన్నా.
- ఆంధ్రప్రదేశ్ – అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్ కింబర్లైట్, కృష్ణా నదిలోయ.
- కేరళ – కోజికోడ్.

అభ్రకం (మైకా): మైకా ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఎలక్ట్రికల్ ఇండస్ట్రీలో ఇన్సులేటర్‌గా, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీలో మైక్రో చిప్స్ రూపంలో, గ్లాస్ ఇండస్ట్రీలో గట్టితనం కోసం దీన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఇది హైడ్రోసిలికేట్ల రూపంలో భూపటలంలో మూడు రూపాల్లో లభ్యమవుతుంది. అవి:

1. **మస్కోవైట్ (పొటాష్ మైకా):** శ్వేత వర్ణంలో ఉంటుంది. దీన్నే 'రూబీ మైకా' అంటారు. ఇది అత్యంత నాణ్యమైంది.
2. **ఫ్లోగోవైట్:** పసుపు రంగులో ఉంటుంది. దీన్నే 'మెగ్నీషియా మైకా' అంటారు.
3. **బయొటైట్:** నలుపు వర్ణంలో ఉంటుంది.

గనుల విస్తరణ:

- బిహార్ – గయ.
- జార్ఖండ్ – కోడెర్మా, హజారీబాగ్, సింగ్భమ్, పాలమావు.
- ఆంధ్రప్రదేశ్ – నెల్లూరు (గూడూరు).
- తెలంగాణ – ఖమ్మం.

బెరైటీస్ (ముగ్గురాయి): బెరైటీస్ నిల్వలు, ఉత్పత్తిపరంగా భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగంపేట, అనంతరాజుపేట (కడప జిల్లా) ప్రాంతాలు వీటికి ప్రసిద్ధి చెందాయి. ఈ ఖనిజం బేరియం ఆక్సైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని ముడి చమురును వెలికితీయడంలో కందెనగా, వైద్య అవసరాలకు ఉపయోగిస్తారు.

గనుల విస్తరణ:

- ఆంధ్రప్రదేశ్ – కడప. - తెలంగాణ – ఖమ్మం.

ఆస్‌బెస్టాస్ (రాతి నార): సిమెంటు రేకులు, తాళ్లు, పెయింటింగులు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ల తయారీలో ఆస్‌బెస్టాస్‌ను ఉపయోగిస్తారు. వీటి నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ గనుల్లో పనిచేసే కార్మికులు 'ఆస్‌బెస్టోసిస్' అనే ఊపిరితిత్తులకు సంబంధించిన కేన్సర్‌కు గురవుతున్నారు.

సున్నపురాయి: సున్నపురాయిని 75 శాతం సిమెంట్ పరిశ్రమల్లో, 16 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో ఉపయోగిస్తారు. భారతదేశంలో నిల్వలపరంగా కర్ణాటక, రాజస్థాన్; ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

డోలమైట్: దీన్ని 90 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో, 4 శాతం ఎరువుల పరిశ్రమల్లో వాడుతున్నారు. దీని ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

గ్రాఫైట్: పెన్సిళ్లు, ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీలో దీన్ని వాడతారు. దీని నిల్వల విషయంలో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత్‌లో దీని ఉత్పత్తిలో ఒడిశా, జార్ఖండ్, తమిళనాడు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఇతర లోహ, అలోహ ఖనిజాలు

జింక్: ఇది సల్ఫైడ్ల రూపంలో లభ్యమవుతుంది. గాల్వనైజేషన్ ప్రక్రియలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్ ప్రథమ స్థానంలో ఉంది.

సీసం: ఇది 'గెలీనా' అనే సల్ఫైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని కేబుల్ కవర్లు, పెయింట్ల తయారీలో, రబ్బర్ తయారీకి చెందిన 'వల్కనైజేషన్' ప్రక్రియలో ఉపయోగిస్తారు. ప్రపంచంలో నిల్వలు, ఉత్పత్తి పరంగా ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది. న్యూ సౌత్ వేల్స్, క్వీన్స్‌లాండ్‌లోని బ్రోకన్ హిల్స్ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా లభ్యమవుతోంది.

భారతదేశంలో సీసం నిల్వలు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ (కర్నూలు, గుంటూరు), తెలంగాణ (నల్గొండ,ఖమ్మం),బిహార్,ఒడిశా రాష్ట్రాల్లో ఉన్నాయి.

తగరం: మలేషియాలో దీని ఉత్పత్తి ఎక్కువగా ఉండగా స్మెల్టింగ్ ఇండస్ట్రీ ఎక్కువగా సింగపూర్‌లో ఉంది. భారత్‌లో దీని నిల్వలు జార్ఖండ్ (హజారీబాగ్), బిహార్ (గయ), ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నాయి.

వెండి (సిల్వర్): అర్జంటైట్ రూపంలో క్వార్ట్జైట్ శిలాస్థరాల్లో బంగారంతో కలిసి లభ్యమవుతుంది. దీన్ని ఎలక్ట్రో ప్లేటింగ్, ఫొటోగ్రఫీ, పారిశ్రామిక రసాయనాల తయారీలో ఉపయోగిస్తారు. దీని నిల్వలు రాజస్థాన్ (జువార్)లో ఎక్కువగా ఉన్నాయి. కర్ణాటక (కోలార్), ఆంధ్రప్రదేశ్ (కడప, గుంటూరు, కర్నూలు), జార్ఖండ్ (రాంచీ, హజారీబాగ్) ప్రాంతాల్లోనూ వీటి నిల్వలు ఉన్నాయి.

టంగ్‌స్టన్: రాజస్థాన్‌లోని 'డేగనా' ప్రాంతంలో ఉన్నాయి.


నికెల్: ఒడిశాలో ఎక్కువగా లభిస్తోంది.

కోబాల్ట్: రాజస్థాన్, కేరళలో దీని నిల్వలు అధికంగా ఉన్నాయి.

ఉప్పు: గుజరాత్ దీని ఉత్పత్తికి ప్రసిద్ధి.

రాతి ఉప్పు: మండి (హిమాచల్ ప్రదేశ్)లో అధికంగా లభ్యమవుతోంది.

కియొనైట్: జార్ఖండ్‌లో అధికంగా లభిస్తుంది.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జాగ్రఫీ

జిప్సం: రాజస్థాన్‌లో దీని నిల్వలు అధికం.

ఇంధన ఖనిజాలు

మండే స్వభావం ఉన్న ఖనిజాలు,పునరుత్పత్తి చెందని సాంప్రదాయ ఇంధన వనరులు (బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు) ఇంధన ఖనిజాలకు ఉదాహరణ. ఇవి ప్రధానంగా హైడ్రోకార్బన్లు.

బొగ్గు: దీన్నే నల్ల బంగారం అంటారు. ఇది దేశంలో ప్రధానంగా రెండు భౌమ కాలాలకు చెందిన అవక్షేప శిలాస్థరాల్లో లభ్యమవుతోంది. అవి:

1) **గోండ్వానా బొగ్గు:** దేశంలో లభ్యమయ్యే బొగ్గులో 90 శాతం ఈ రకానికి చెందిందే. ఇది ఎక్కువగా దిగువ గోండ్వానా యుగానికి చెందిన అవక్షేప శిలాస్థరాల్లోని దామోదర్ లోయ(జార్ఖండ్ –దామోదర్),సోన్(మధ్య ప్రదేశ్),మహానది (ఒడిశా), గోదావరి (ఆంధ్రప్రదేశ్), వార్ధా(మహారాష్ట్ర)లో నిక్షిప్తమై ఉంది. ఇది అత్యంత నాణ్యమైన బొగ్గు.

2) **టెర్షియరీ బొగ్గు:** ఇది ఎక్కువగా తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, అసోం, జమ్ము–కశ్మీర్‌లోని ద్వీపకల్ప, ద్వీపకల్పేతర ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

బొగ్గులోని కర్బన శాతాన్ని అనుసరించి దీన్ని 4 రకాలుగా వర్గీకరించారు. అవి..

1. **ఆంత్రసైట్:** అత్యంత నాణ్యమైన బొగ్గు. ఇందులో 90–95 శాతం కార్బన్ ఉంటుంది. జమ్ము–కశ్మీర్‌లో మాత్రమే కొద్ది పరిమాణంలో లభ్యమవుతోంది.
2. **బిట్యూమినస్:**ఇందులో 85–90శాతం కార్బన్ ఉంటుంది. దేశంలో ఎక్కువగా లభ్యమయ్యే రకం ఇది. దీని వినియోగం కూడా ఎక్కువే.
3. **లిగ్నైట్ (బ్రౌన్‌కోల్):** 30–40 శాతం కార్బన్ ఉంటుంది. దీని నాణ్యత తక్కువ. తమిళనాడులోని నైవేలి ప్రాంతంలో 90 శాతం నిల్వలు ఉన్నాయి.
4. **పీట్:** కార్బన్ 10 శాతం మాత్రమే ఉంటుంది. ఇది కర్ర నుంచి బొగ్గు ఏర్పడటంలోని మొదటిదశ. దీన్నే కొయ్య బొగ్గు అని కూడా అంటారు.

భారత్‌లో 285 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. వీటిలో 200 బిలియన్ టన్నులు బిట్యూమినస్, మిగిలినవి లిగ్నైట్ రకానికి చెందినవి. బొగ్గు నిల్వల్లో జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, తెలంగాణ; ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వరుసగా మొదటి స్థానాల్లో ఉన్నాయి.

దేశంలో ప్రధానమైన గోండ్వానా బొగ్గు గనులు

జార్ఖండ్ – జారియా, బొకారో, డాల్టన్‌గాజ్.
పశ్చిమ బెంగాల్–రాణిగంజ్,గిరిధి,కరన్ పురా, డార్జిలింగ్.
ఛత్తీస్‌గఢ్– కోర్బా, బీరమ్‌పూర్, చిరిమిరి, హస్‌డో–అరండ్, తాతాపాని– రామ్‌కోలా.
మధ్యప్రదేశ్– సింగ్రౌలి, సొహాగ్‌పూర్, ఉమారియా.
మహారాష్ట్ర – చందా, వార్ధా, కంప్టీ, భాండర్.
తెలంగాణ – సింగరేణి, కొత్తగూడెం, తాండూరు, పాల్వంచ.

టెర్షియరీ బొగ్గు గనులు:

తమిళనాడు – నైవేలి జయమ్ కొండ చోళాపురం, మన్నార్ గుడి, హిమాచల్ ప్రదేశ్, చంద్రలోయ.
అసోం – మాకుమ్, జెంజి, నజీరా, జయపూర్.
రాజస్థాన్ – బికనీర్.
ఉత్తర ప్రదేశ్ – నామ్‌చిక్, నాంరూఢ్.

బొగ్గు ఉత్పత్తిలో చైనా, యూఎస్ఏ, భారత్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

విస్తరణ:

యూఎస్ఏ: పెన్సిల్వేనియా నుంచి అలబామా వరకు ఉన్న అపలేచియన్ ప్రాంతం, కెంటకీ, పశ్చిమ వర్జీనియా.
ఉక్రైన్: డొనెట్స్క్ ప్రాంతం.
రష్యా: కుజ్‌నెట్స్క్ బేసిన్ .
కజకిస్థాన్: కరగండా.
జర్మనీ: రూర్ లోయ.
ఆస్ట్రేలియా: న్యూసౌత్‌వేల్స్.

పెట్రోలియం: దీన్నే ముడి చమురు, రాతి నూనె, క్రూడాయిల్, బంగారుద్రవం అని కూడా అంటారు. ఇది ప్రధానంగా అవక్షేప శిలల నుంచి లభ్యమవుతుంది. ప్రపంచంలో మొదటిసారిగా పెట్రోలియం బావిని 'పెన్సిల్వేనియా'లో కనుగొన్నారు. పెట్రోలియం నిల్వలు, ఉత్పత్తి, ఎగుమతుల్లో సౌదీ అరేబియా ప్రథమస్థానంలో ఉంది. దీని వినియోగంలో యూఎస్ఏ మొదటి స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో చైనా, జపాన్, ఇండియా ఉన్నాయి.

భారతదేశంలో మొదటగా అసోంలోని 'మాకుమ్' ప్రాంతంలో ముడి చమురును గుర్తించారు. 'దిగ్బాయ్' ప్రాంతంలో దీన్ని ఉత్పత్తి చేశారు. దేశంలో చమురు నిక్షేపాల అన్వేషణ, వెలికితీత కోసం 1957లో 'డెహ్రాడూన్'లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ (ONGC)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది విదేశాల్లో చమురు నిక్షేపాలను వెలికితీయడానికి OVL (ONGC Videsh Ltd.) అనే సంస్థను ఏర్పాటు చేసుకుంది. ఇటీవల రష్యాలోని 'శకాలిన్' క్షేత్రంలో పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం ముడి చమురు ఉత్పత్తిలో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో ఉండగా, గుజరాత్ రెండో స్థానంలో ఉంది.

ముడి చమురు బావుల విస్తరణ:

మహారాష్ట్ర: ముంబై–హైలోని పొన్న, ముక్త, గాంధార, హీరా బావులు, శాలిశెట్టి, బస్సైన్.

గుజరాత్: అంకలేశ్వర్ (జవహర్‌లాల్ నెహ్రూ ముడి చమురు బావి), నవ్‌గావ్, ధోర్కా కలోల్, కోసాంబ (వీటన్నింటినీ కలిపి గాంధార క్షేత్రం లేదా కాంబే బేసిన్ అంటారు), ఖంబట్ బేసిన్‌లోని అలియాబాట్, కచ్ ప్రాంతంలోని కలోల్, మేసిన్.

అసోం: దిగ్బాయ్, నహర్ కాటియా, మొరాన్, హంగ్రీజన్, సిబ్ సాగర్, రుద్రసాగర్.

తమిళనాడు: కావేరి బేసిన్‌లోని నారీమనం, కోవెల్‌పూల్.

త్రిపుర:మూమ్‌బాగ,బారాముర,దేవ్‌టమూరు.

ఏపీ: కేజీ బేసిన్‌లోని రవ్వ, లింగాల.

సహజవాయువు: భారతదేశంలో మొదటిసారిగా సహజవాయువును హిమాచల్ ప్రదేశ్‌లోని జ్వాలాముఖి వద్ద కనుగొన్నారు. సహజవాయువును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడానికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (GAIL)ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ నిర్మించిన పైప్ లైన్లలో ప్రముఖమైంది – HBJ పైప్‌లైన్. ఇది గుజరాత్‌లోని హజీరా నుంచి మధ్య ప్రదేశ్‌లోని బీజాపూర్ మీదుగా ఉత్తర ప్రదేశ్‌లోని జగదీష్‌పూర్ వరకు ఉంది. ప్రస్తుతం దీన్ని ఉత్తర ప్రదేశ్‌లోని దుబ్రాల వరకు (1750 కి.మీ.) పొడిగించారు.

విస్తరణ:

1. అసోం, త్రిపుర
2. కాంబే బేసిన్ (గుజరాత్)
3. బాంబే హై
4. కేజీ బేసిన్ కైకలూరు, పాసర్లపూడి (ఆంధ్రప్రదేశ్)
5. కావేరి బేసిన్ (తమిళనాడు)
6. రాజస్థాన్‌లోని తానోట్

అణు ఇంధన ఖనిజాలు

ఇవి శక్తిని వికిరణ రూపంలో వెదజల్లే అస్థిర కేంద్రక పదార్థాలు. యురేనియం (పిచ్‌బ్లెండ్), థోరియం (మోనోజైట్), జిర్కొనియం, ఇల్మనైట్, టిటానియం వీటికి ఉదాహరణ.

యురేనియం: దేశంలో యురేనియం నిల్వలు ఎక్కువగా జార్ఖండ్ (జాదుగూడ), బిహార్ (గయ), ఆంధ్రప్రదేశ్ (కడప జిల్లాలోని తుమ్మలపల్లి), తెలంగాణ (నల్గొండ జిల్లాలోని పెద్ద అడిశర్లపల్లి), రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత ప్రాంతాల్లో ఉన్నాయి.

థోరియం: ఇది ఎక్కువగా కేరళ, విశాఖ తీర ప్రాంత ఇసుక రేణువుల్లో లభ్యమవుతోంది.

ఇల్మనైట్, టిటానియం ఎక్కువగా విశాఖ తీరంలో లభిస్తోంది. జిర్కొనియం కేరళ తీరంలో; లిథియం జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

మాదిరి ప్రశ్నలు

1. నాణ్యత ఆధారంగా ఇనుప ధాతువు రకాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ. మాగ్నటైట్ బి. హెమటైట్
   సి. లియొనైట్ డి. సెడరైట్
   1) డి, సి, బి, ఎ 2) సి, డి, బి, ఎ
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, బి, డి
2. అల్యూమినియం భూ పటలంలో ఏ రూపంలో లభ్యమవుతుంది?
   1) పెరైట్ 2) బాక్సైట్
   3) మాగ్నసైట్ 4) శుద్ధలోహం
3. కోర్బా బొగ్గు గనులు ఎక్కడ ఉన్నాయి?
   1) మధ్యప్రదేశ్ 2) జార్ఖండ్
   3) ఛత్తీస్‌గఢ్ 4) ఒడిశా
4. సఖాలియన్ చమురు క్షేత్రం ఉన్న దేశం?
   1) అమెరికా 2) ఉక్రైన్ 3) చైనా 4) రష్యా
5. కరగండా బొగ్గు క్షేత్రం ఏ దేశంలో ఉంది?
   1) కజకిస్థాన్ 2) జర్మనీ
   3) ఉక్రైన్ 4) జాంబియా
6. సింగరేణి బొగ్గుగనులు ఉన్న రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
   3) తెలంగాణా 4) ఒడిశా
7. మార్గేరీటా బొగ్గు నిక్షేపాలు ఉన్న ప్రాంతం?
   1) మేఘాలయ 2) అసోం
   3) మణిపూర్ 4) త్రిపుర
8. ఒడిశాలోని సుకిండా దేనికి ప్రసిద్ధి?
   1) కాపర్ 2) క్రోమైట్
   3) బాక్సైట్ 4) బొగ్గు

సమాధానాలు

1) 1; 2) 2; 3) 3; 4) 4; 5) 1; 6) 3; 7) 2; 8) 2.

టీవీకి కంటికి మధ్య కనీసం ఎంత దూరం ఉండాలి?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. మైటోకాండ్రియా మాత్రికలో జరిగే శ్వాసక్రియ చర్యల వలయాలను విశదీకరించిన వారెవరు?
   1) సర్‌హాన్స్ క్రెబ్స్ 2) బెన్సన్
   3) మెల్విన్ కాల్విన్ 4) ష్వాన్
2. అయోడిన్ చర్య దేన్ని కనుగొనడానికి ఉపయోగపడుతుంది?
   1) కాంతి 2) గ్లూకోజ్
   3) పిండి పదార్థం 4) కార్బన్ డై ఆక్సైడ్
3. తేనెటీగలు తేనె పట్టును దేని కోసం నిర్మించుకుంటాయి?
   1) మకరంద సేకరణ
   2) జాతి (సంతానం) ఉత్పత్తి కోసం
   3) రక్షణ 4) ప్రైవసీ
4. వర్గం అనే వర్గీకరణ అంతస్తును ప్రవేశ పెట్టిన వారెవరు?
   1) లిన్నెయస్ 2) హెకెల్
   3) హైమన్ 4) విట్టేకర్
5. స్పంజికల్లో కణాంతర జీర్ణక్రియ ఏ కణాల్లో జరుగుతుంది?
   1) ఆర్కియోసైట్స్ 2) కాలర్ కణాలు
   3) పినాకోసైట్స్ 4) అమీబోసైట్స్
6. కిందివాటిలో సమవిభజన ఉపయోగం కానిది?
   1) క్రోమోజోముల సంఖ్య స్థిరంగా ఉండటానికి తోడ్పడుతుంది
   2) జీవుల్లో పెరుగుదల కోసం దోహద పడుతుంది
   3) గాయాలు మానడానికి తోడ్పడుతుంది
   4) పాత కణాల నుంచి కొత్త కణాలు ఏర్పడటానికి దోహదపడుతుంది
7. సామాన్య సూక్ష్మ దర్శినిని కనుగొన్న వారెవరు?
   1) జకేరియస్ జాన్సన్ 2) రస్కా
   3) నాల్ 4) లీవెన్ హాక్
8. కిందివాటిలో క్లోరోప్లాస్టులు లోపించిన కణాలేవి?
   1) జంతుకణాలు 2) శైవలాలు
   3) శిలీంధ్రాలు 4) 1, 3
9. కిందివాటిలో సౌరశక్తిని వినియోగించుకో గలిగినవి ఏవి?
   1) ఉత్పత్తిదారులు 2) వినియోగదారులు
   3) విచ్ఛిన్నకారులు
   4) ద్వితీయ వినియోగదారులు
10. జీవి మనుగడకు అవసరం కాని క్రియ ఏది?
    1) శ్వాసక్రియ 2) ప్రత్యుత్పత్తి
    3) ప్రసరణ 4) విసర్జన
11. టోనోప్లాస్ట్ కలిగిన కణాంగం ఏది?
    1) మైటోకాండ్రియా 2) గాల్జి సంక్లిష్టం
    3) రిక్తిక 4) కణత్వచం
12. వ్యాధులు సంక్రమించినప్పుడు తయారయ్యే ప్రతిరక్షకాలు అనేవి..?
    1) ప్రోటీన్ నిర్మాణాలు
    2) ప్రోటీనేతర నిర్మాణాలు
    3) కార్బోహైడ్రేట్ నిర్మితాలు
    4) సెల్యులోజ్ నిర్మితాలు
13. పెద్ద వృక్షాల్లో నీటి ప్రసరణ జరగడానికి తోడ్పడే ప్రక్రియ ఏది?
    1) బాష్పోత్సేకం
    2) విసరణ, ద్రవాభిసరణ
    3) వేరు పీడనం, బాష్పోత్సేకం
    4) వేరు పీడనం
14. కిందివాటిలో సేంద్రీయ పదార్థం కానిది?
    1) కొవ్వు పదార్థం 2) విటమిన్లు
    3) పిండి పదార్థం 4) డీఎన్ఏ
15. ఏ మొక్కలో దారు నాళాలు నీటి ప్రసరణలో చురుగ్గా పాల్గొంటాయి?
    1) టెరిస్ 2) ఫైకస్
    3) పైనస్ 4) ఏదీకాదు
16. ఏ మొక్కల్లో రెసిన్ నాళాలు కనిపిస్తాయి?
    1) టెరిడోఫైట్‌లు 2) శైవలాలు
    3) బ్రయోఫైట్‌లు 4) వివృత బీజాలు
17. అంతర్జాతీయ ఆహార దినోత్సవం ఏ రోజున నిర్వహించుకుంటారు?
    1) అక్టోబరు 10 2) అక్టోబరు 26
    3) అక్టోబరు 16 4) అక్టోబరు 24
18. 'మింగడం' అనేది ఏ రకమైన చర్య?
    1) నియంత్రిత 2) అనియంత్రిత
    3) అసంకల్పిత 4) ప్రతీకార చర్య
19. ప్రౌఢ మానవుని నోటిలో ఉండే కుంతకాల సంఖ్య?
    1) 8 2) 4 3) 6 4) 2
20. వినడంలో పాత్ర వహించే లోపలి చెవి నిర్మాణం ఏది?
    1) పేటిక 2) కర్ణావర్తం
    3) అర్ధవర్తుల కుల్యలు
    4) యూస్టాషియన్ నాళం
21. మానవుడికి చీకటిలో వస్తువులన్నీ బూడిద రంగులో కనిపించడానికి కారణమైన కణాలేవి?
    1) దండాలు 2) కోనులు
    3) దండాలు, కోనులు
    4) పైవేవీకాదు
22. రోమాలు, గోర్లు, గిట్టల రూపంలో జీవులకు రక్షణ కలిగించే కణజాలం ఏది?
    1) ఉపకళ 2) అస్థి
    3) ఎడిపోస్ 4) కార్టిలేజ్
23. రసభరితమైన పొలుసు ఆకులను కలిగి ఉండే మొక్కలో కనిపించే భూగర్భ కాండ రూపాంతరం ఏది?
    1) దుంప 2) కొమ్ము
    3) లశునం 4) మొగ్గలు
24. 'అవిసీనియా' మొక్కలో ప్రధాన వేర్లను కాకుండా వాయుగత వేర్లను తొలగిస్తే ఏమవుతుంది?
    1) కిరణజన్య సంయోగక్రియ జరగదు
    2) నత్రజని స్థాపన ఆగిపోతుంది
    3) బాష్పోత్సేకం ఆగిపోతుంది
    4) శ్వాసక్రియ ఆగిపోతుంది
25. ఒక విద్యార్థి తనకు దొరికిన మొక్క కాండం నుంచి అనేక వేర్లు సమాన పరిమాణంలో ఉండటాన్ని గమనించాడు. అది కిందివాటిలో ఏ మొక్క అయి ఉండవచ్చు?
    1) వేరుశనగ 2) కంది
    3) మొక్కజొన్న 4) చిక్కుడు
26. కిందివాటిలో జన్యు వ్యాధికి ఉదాహరణ?
    1) డిఫ్తీరియా 2) హీమోఫిలియా
    3) టెటానస్ 4) రేచీకటి
27. రక్తంలో సహజ రక్త స్కందక నివారిణి?
    1) హీమోలైసిన్ 2) హిరుడిన్
    3) హెపారిన్ 4) సోడియం సిట్రేట్
28. కింద పేర్కొన్న ఏ చేపల్లో అంతర అస్థి పంజరం మృధులాస్థితో నిర్మితమై ఉంటుంది?
    1) టీలియోస్ట్ 2) రోహు
    3) వల్లగో అట్టు 4) షార్క్
29. కణంలోని జీవ పదార్థంలో నీటి శాతం?
    1) 90-95 2) 85-90
    3) 70-80 4) 30-40
30. నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక ప్రమాణం ఏది?
    1) డెండ్రాన్ 2) నెఫ్రాన్
    3) న్యూరాన్ 4) ఆక్సాన్
31. ఎర్ర రంగు గులాబీ పసుపురంగు కాంతిలో ఎలా కనిపిస్తుంది?
    1) తెలుపు 2) ఎరుపు
    3) పసుపు 4) నలుపు
32. కంటి చూపుపై ప్రభావం పడకుండా ఉండాలంటే టీవీకి కంటికి మధ్య కనీసం ఎంత దూరం ఉండాలి (మీటర్లలో)?
    1) 1.5 2) 2.5 3) 5.5 4) 0.5
33. మొక్కలు నీటిని, ఖనిజ లవణాలను పీల్చుకునే విధానం గురించి తెలుసుకోవాలనుకునే విద్యార్థి దేన్ని అధ్యయనం చేయాలి?
    1) ప్లాంట్ మార్ఫాలజీ
    2) ప్లాంట్ ఫిజియాలజీ
    3) ప్లాంట్ ఇకాలజీ
    4) ప్లాంట్ ఎంబ్రియాలజీ
34. కిందివాటిలో లైకెన్లలో కనిపించే జీవనం, అందులో పాల్గొనే జీవులు వరుసగా?
    1) పరాన్న జీవనం - శైవలం, శిలీంధ్రం
    2) సహజీవనం - శైవలం, బ్రయోఫైట్
    3) పూతికాహారం - శైవలం, శిలీంధ్రం
    4) సహజీవనం - శైవలం, శిలీంధ్రం
35. నిస్సల్ కణికలు కలిగిన కణాలేవి?
    1) న్యూరాన్లు 2) నెఫ్రాన్లు
    3) ఇసినోఫిల్స్ 4) లింఫోసైట్లు
36. శరీరం మొత్తం బరువులో మెదడు బరువు సుమారుగా ఎంత శాతం?
    1) 13 2) 5 3) 2 4) 8
37. మానవుని సామాన్య రక్తపీడనం 120/80. ఇందులో పై సంఖ్య దేన్ని సూచిస్తుంది?
    1) డయాస్టోలిక్ పీడనం
    2) సిస్టోలిక్ పీడనం
    3) ఊర్ధ్వ పీడనం 4) రక్తపోటు
38. పత్రం ద్వారా కొత్త మొక్కలను ఏర్పరిచే మొక్క ఏది?
    1) చేమంతి 2) కరివేపాకు
    3) రణపాల 4) గడ్డి
39. ఒక పుష్పాన్ని పరిశీలిస్తే అందులో రక్షక, ఆకర్షక పత్రావళి మాత్రమే ఉన్నాయి. అయితే అది ఏ రకమైన పుష్పం?
    1) ద్విలింగ 2) అసంపూర్ణ
    3) ఏకలింగ 4) సంపూర్ణ
40. కొబ్బరిలో తినే భాగం ఏ స్థితిలో ఉంటుంది?
    1) ఏకస్థితిక 2) ద్వయస్థితిక
    3) త్రయస్థితిక 4) బహుస్థితిక
41. కణ విభజనలో ద్విగుణీకృతం అయ్యేవి?
    1) రైబోజోములు 2) గాల్జీ సంక్లిష్టం
    3) క్రోమోజోములు 4) క్లోరోప్లాస్టులు
42. 'టానిన్స్' అనే పదార్థాల ఉపయోగం ఏమిటి?
    1) పాలను నిల్వ చేయడానికి వాడతారు
    2) తోళ్లను శుద్ధి చేయడానికి వాడతారు
    3) ఆల్కహాల్ తయారీలో ఉపయోగిస్తారు
    4) జున్ను తయారీలో వినియోగిస్తారు
43. 'నీలి విప్లవం' అనేది వేటి ఉత్పత్తికి సంబంధించింది?
    1) పాలు 2) కూరగాయలు
    3) తేనెటీగలు 4) చేపలు
44. కిందివాటిలో డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు కనుగొన్నది ఏది?
    1) టెట్రాసైక్లిన్ 2) పెన్సిలిన్
    3) ఇన్సులిన్ 4) వ్యాక్సినేషన్
45. ఒక తరం నుంచి మరో తరానికి లక్షణాలు సంక్రమించే విషయం గురించి తెలియజేసే శాస్త్రం ఏది?
    1) పిండోత్పత్తి శాస్త్రం 2) జన్యు శాస్త్రం
    3) సూక్ష్మజీవ శాస్త్రం
    4) జీవ సాంకేతిక శాస్త్రం
46. మానవుని జీర్ణ వ్యవస్థలో కిందివాటిలో ఏ పదార్థం జీర్ణం కాదు?
    1) ప్రోటీన్లు 2) కార్బోహైడ్రేట్లు
    3) కొవ్వులు 4) సెల్యులోజ్
47. కాడ్‌లివర్ నూనెలో అధికంగా ఉండేది?
    1) విటమిన్-బి 2) ప్రోటీన్లు
    3) విటమిన్-ఎ 4) విటమిన్-సి
48. ఇందిరాగాంధీ జూ పార్క్ ఎక్కడ ఉంది?
    1) ఏలూరు 2) గుంటూరు
    3) నెల్లూరు 4) విశాఖపట్నం
49. ఎడారి మొక్కల్లో ఆహారాన్ని తయారు చేసే భాగం ఏది?
    1) పత్రం 2) వేరు
    3) కాండం 4) ఫలం
50. అగ్‌మార్క్ ప్రయోగశాల మనరాష్ట్రంలో ఎక్కడ ఉంది?
    1) కాకినాడ 2) విజయవాడ
    3) గుంటూరు 4) అనంతపురం
51. బొద్దింకలో రక్తాన్ని హృదయంలోకి పంపడానికి ఉపయోగపడే నిర్మాణాలేవి?
    1) వాయు నాళ కండరాలు
    2) పక్షాకార కండరాలు
    3) హృదయ కండరాలు
    4) ఉరః కుహర కండరాలు
52. కిందివాటిలో ఏ జీవిలో చర్మం శ్వాసాంగంగా ఉండదు?
    1) బొద్దింక 2) వానపాము
    3) జలగ 4) సాలమాండర్
53. కిందివాటిలో శరీర కుహర ద్రవం కలిగిన జీవి ఏది?
    1) అమీబా 2) పారమీషియం
    3) వానపాము 4) వర్టిసెల్లా
54. పీయూష గ్రంథిలోని తమ్మెల సంఖ్య?
    1) 4 2) 3 3) 2 4) 5

సమాధానాలు

1) 3;	2) 3;	3) 4;	4) 2;
5) 4;	6) 1;	7) 4;	8) 4;
9) 1;	10) 2;	11) 3;	12) 1;
13) 3;	14) 4;	15) 2;	16) 4;
17) 3;	18) 1;	19) 1;	20) 2;
21) 1;	22) 1;	23) 3;	24) 4;
25) 3;	26) 2;	27) 3;	28) 4;
29) 2;	30) 3;	31) 4;	32) 2;
33) 2;	34) 4;	35) 1;	36) 3;
37) 2;	38) 3;	39) 2;	40) 3;
41) 3;	42) 2;	43) 4;	44) 1;
45) 2;	46) 4;	47) 3;	48) 4;
49) 3;	50) 3;	51) 2;	52) 1;
53) 3;	54) 2.		

Indian Financial Network is the..

BANK EXAMS

BANKING AWARENESS



Model Questions

1. The Reserve Bank's affairs are governed by a central board of directors. The board is appointed by the Government of India in keeping with the Reserve Bank of India Act. It is Appointed/ nominated for a period of....
   a) 6 years b) 5 years
   c 4 years
   d) 3 years e) 2 years
2. As per SEBI guidelines, in a Book Building process the cap in the price band
   a) should be at least 10 per cent of the floor price
   b) should not be more than 20 per cent of the floor price
   c) should not be more than 30 per cent of the floor price
   d) no limits e) none
3. ______ is a short term security (7 days to 365 days) issued by a corporate entity (other than a bank), at a discount to the face value?
   a) Commercial Paper
   b) Certificate of Deposit
   c) Non-convertible Debenture
   d) Treasury Bill
   e) None of the above
4. Who is the chairman of NITI Ayog ?
   a) Narendra Modi
   b) Arvind Pangaria
   c) Mangu Singh
   d) Anupam Srivastava
   e) Ashok Kumar Roy
5. The Nai Manzil Scheme is designed as an integrated education and training programme that provides youth from minority communities skills needed for different tasks in a rapidly changing world. It also provides them trade related training in which of the following areas:
   a) Manufacturing
   b) Engineering c) Services
   d) Soft skills e) All the above
6. Indian Financial Network [INFINET] is the...
   a) Communication backbone for the Indian Banking and Financial sector
   b) Association of the employers of the banking and financial sector
   c) Closed user group network of SBI and its subsidiaries
   d) All of the above
   e) None of the above
7. In Mutual Funds, A close ended fund means:
   a) The corpus is of fixed size with a definite redemption period
   b) Listing on stock exchanges provides easy liquidity
   c) The market price is always below the Net Asset Value
   d) All of the above
   e) None of the above
8. Which of the following is correct statement in respect of debit cards
   a) Debit card facility is provided to those having savings bank account/current account holders
   b) This facility is not extended to cash credit/loan account holders
   c) It is an unsecured credit facility
   d) Debit card is issued to all the persons who visit the branch
   e) a and b
9. In the term IPO, what do you mean by "P"?
   a) Provisions b) Public
   c) Private d) Prudent
   e) Pension
10. The Overall Priority Sector Lending Target to be increased to ______ by Foreign Bank with more than 20 Branches by 2018?
    a) 60 percent of adjusted Net Bank Credit
    b) 40 percent of Adjusted Net Bank Credit
    c) 32 percent of adjusted Net Bank Credit
    d) 25 percent of adjusted Net Bank Credit
    e) 30 percent of adjusted Net Bank Credit
11. When it comes to scheduled commercial banks, which out of the following is not true?
    a) Nationalised banks
    b) Regional Rural banks
    c) Foreign banks
    d) Private sector banks
    e) Local area banks
12. Which amongst the following is called as mother of deposits?
    a) Current account
    b) Fixed deposit
    c) Recurring deposit
    d) Savings bank
    e) Reinvestment deposit
13. "Micro Finance" is a ______ of banking services?
    a) Introduction stage
    b) Saturation stage
    c) Research stage
    d) Decline stage
    e) None of the Above
14. Which amongst the following is not term deposits issued by commercial banks?
    a) Current account
    b) Fixed deposit
    c) Recurring deposit
    d) Reinvestment deposit
    e) All the above
15. What is the main purpose of Open market operations?
    a) A fiscal device which assists Government borrowing
    b) A monetary measure to regulate quantity of money in circulation and the cash reserves of the commercial banks
    c) A measure to counteract extreme trends in business
    d) A measure to influence the balance of payments position
    e) None of the above
16. What is the full form of MSME?
    a) Mini, Small and Medium Enterprises
    b) Micro, Small and Medium Enterprises
    c) Mini scale Marketing Enterprises
    d) Medium Scale Marketing Enterprises
    e) None of the above
17. A customer is required to maintain adequate balances in his/her accounts in order to use his ____ card in the merchant establishments?
    a) Smart Card b) Credit Card
    c) Add-on Credit card
    d) Debit Card
    e) None of the above
18. Which of the following are the latest guidelines issued by the RBI in respect of opening new branches in villages?
    a) To open more brick and mortar branches in villages where there are no banking facilities and population is more than 5,000.
    b) Banks to submit a roadmap on how many branches they will be opening by 31 March 2017.
    c) The roadmap by end of January 2016.
    d) BCBF Model to be discontinued
    e) Only a, b, c
19. Name the financial instrument which is/are issued for short term (up to one year) borrowing by RBI on behalf of the Government of India?
    a) Treasury Bills
    b) Commercial Paper
    c) Certificate of Deposit
    d) Non-convertible Debenture
    e) Only b & c
20. KYC (Know Your Customer) norms were implemented in the Indian banking system in 2002 as per the directive of ?
    a) SEBI b) RBI c) IBA
    d) IRDA e) None of these
21. Often, we read in the newspapers that several Indian companies are taking the FCCB route to raise capital. What does the term FCCB stand for?
    a) Foreign Currency Convertible Bond
    b) Foreign Convertible Credit Bond
    c) Financial Consortium and Credit Bureau
    d) Future Credit and Currency Bureau
    e) None of these
22. ATM cards are issued to a person who maintains any of following accounts with the bank
    a) saving bank account
    b) current accounts
    c) term deposits
    d) loan or cash credit accounts
    e) either a or b
23. A commercial paper is
    a) A paper issued by Reserve Bank of India an trade and commerce
    b) An unsecured money market instrument issued in the form of promissory note
    c) A document issued by IDBI for seeking refinance facility from Reserve Bank India
    d) All of the above
    e) None of the above
24. Which of the following would fall under the category of retail banking?
    a) Home Loans b) Credit Cards
    c) Personal Loans d) Car Loans
    e) All of these
25. Who decides how much quantity of the coins to be minted?
    a) Reserve Bank of India
    b) Central Government
    c) Finance Ministry
    d) Both RBI and Central Government decide
    e) None of the above
26. What are the components of Foreign Exchange Reserves?
    a) Foreign currency assets,
    b) Gold,
    c) Special Drawing Rights
    d) Reserve Position in the IMF
    e) All the above
27. The chairman of Regional Rural Bank is appointed by _____?
    a) State Government
    b) Reserve Bank of India
    c) Central Government
    d) Sponsoring bank in consultation with NABARD
    e) None of the above

KEY

1) c	2) b	3) a
4) a	5) e	6) a
7) d	8) e	9) b
10) b	11) e	12) d
13) a	14) a	15) b
16) b	17) d	18) e
19) a	20) b	21) a
22) e	23) b	24) e
25) b	26) e	27) d